13 భారతీయ భాషల

# తొలి కతలు



# తొలి కతలు

సంకలనకర్తలు

**స.వెం.రమేశ్**

**ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు**

**తొండనాడు తెలుగు రచయితల సంగం**

# తొలి కతలు
TOLI KATALU

© తొండనాడు తెలుగు రచయితల సంగం

విడుదల : **జనవరి, 2014**

ప్రతులు : **1000**

అట్ట అలంకరణ : **కె.రమేష్, తిరుపతి**
డిటిపి : **ఎం.గిరివర్మ, తిరుపతి**

వెల : **రూ. 150/-**

ప్రతులకు : **అన్ని ముఖ్యమైన పుస్తక కేంద్రాలు మరియు**
**ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు**
**20-3-131/ఎ1, శివజ్యోతినగర్,**
**తిరుపతి - 517 507.**

ముద్రణ : **సాయిబాండ్ ప్రింట్ సిస్టమ్స్ ప్రైవేట్ లి., చెన్నై**
**ఫోన్:+91 9380515095**

# తొలికతల సేకరణకు తోడుపడినవారు

మధురాంతకం నరేంద్ర, తిరుపతి

స.రఘునాథ, శ్రీనివాసపురం, కర్నాటక

కమలాలయన్, చెన్నై, తమిళనాడు

ఓట్ర పురుసోత్తం, కాటుపాకం, తమిళనాడు

తుర్లపాటి రాజేశ్వరి, బరంపురం, ఒడిశా

చాగంటి తులసి, విజయనగరం

ఎన్.భక్తవత్సలరెడ్డి, ఎం.డి.పుత్తూరు, చిత్తూరు జిల్లా

పూదోట శౌరీలు, బోధన్, నిజామాబాద్ జిల్లా

మల్లవరపు విక్రమాదిత్య, బెంగుళూరు

కళ్లేపల్లి భాస్కరరావు, శ్రీకాకుళం

గూడూరి మనోజ, మహబూబ్‌నగర్

బి.తిరుపతిరావు, కుప్పం

ఎన్.పుండలీక్‌నాయక్, పణజి, గోవా

జె.లక్ష్మిరెడ్డి, డిల్లీ

నంద్యాల నారాయణరెడ్డి, హోసూరు

వాసిరెడ్డి నవీన్, హైదరాబాదు

అడపాల సుబ్బారెడ్డి, హైదరాబాదు

పద్మిని రంగరాజన్, హైదరాబాదు

ఎన్.వేణుగోపాల్, హైదరాబాద్

జి.వి. నాగేశ్వరరావు, విశాఖపట్నం

**వీరికీ వీరితోపాటు అనువాదకులకు కూడా మప్పిదాలు.**

# తొలి కానుపు

'కతా కతా..నువ్వెప్పుడు పుట్టావు?' అనడిగితే, పక్కున నవ్వింది కత. పగలబడి నవ్వింది కత. పడీ పడీ నవ్వింది కత. మూతి ముడుచుకుని, 'ఎక్కడ పుట్టావో చెప్పు?' అన్నా. ఎర్రిబాగులోడా..అన్నట్టుగా చురుగ్గా చూసింది కత, నా చేతిలోని పెన్నూ కాయితాలని జాలిగా చూస్తా. 'పోనీ గానీ, ఎవురికి పుట్టావో అదన్నా చెప్పు?' అన్నా. ఈ తూరి, కోపంగా చూసింది కత. కొర కొరా చూసింది కత. 'అనగనగా.. అంటా నీకు కతలు చెప్పిన అవ్వనడుగుపో' అనింది విసురుగా. 'మా యవ్వ ఇప్పుడేడుండాది అడిగేదానికి..' అన్నా. 'అయితే, సందేళ సందేళ నిన్ను సంకనేసుకోని, అద్దో సందమామలో అవ్వ పిలగాడికి బువ్వ పెడతావుండాది చూడు అంటా కత చెప్పి నిన్ను మరిపించి అన్నం తినిపించిన మీయమ్మ నడుగు' అనింది కత. 'అమ్మ గూడా ఎల్లిపాయనే ఈ నడమే' అన్నా నిట్టూరస్తా. 'పోనీ, యాపచెట్టుకింద ఎండ పూట ఎన్నెన్ని కతలు చెప్పినాడు మీ చెంగన్న.. ఆయన్ననడుగుపో' అనింది దయగా. 'యాడ చెంగన్నా.. ఎప్పటి కతా..' అన్నా, ఇంకేమన్నా చెప్పు అన్నట్టుగా. సందర్భాన్ని బట్టి కత చెప్పే సమాది రవణయ్యనీ, కతలగంప అని అందురూ అనే మాదిగ పేరమ్మనీ, దెయ్యం కతలే చెప్పే బయపిత్తులోడు ముక్కుతిమ్మడినీ..ఇట్టా ఎందు రెందురినో గుర్తు చేసింది కత. 'ఎవురెవురి కతో నాకెందుకు గానీ..నీ కతేందో చెప్పు ముందు' అని తగులుకున్నా వదలకుండా. 'నీకు అమ్మంటే పిచ్చి కదా.. మీయమ్మకి అమ్మెవురు?' అనడిగింది. 'చెంచురత్నమ్మ' అన్నా టక్కున. 'చెంచురత్నమ్మకి అమ్మె వురు?' అనడిగింది. 'పేరు తెలీదు, కానీ ఉండేవుంటాది గదా' అన్నా. 'ఆ ఉండే ఉండిన అమ్మకి అమ్మెవురు? ఆయమ్మకి అమ్మెవురు? అసలుకి ఈ బూమండలం మింద తొట్టతొలి అమ్మెవురో కనుక్కోని రాబో..అప్పుడు చెప్తా నా కత' అని నా కళ్ళలోకి లోతుగా చూసింది కత. దిక్కూ దిశా తెలీక తికమకగా చూశా, అప్పుడు నవ్వింది కత. విరగబడి నవ్వింది . మళ్ళీ మళ్ళీ నవ్వింది. నవ్వీ నవ్వీ నవ్వులోనే మాయమై పొయ్యింది కత.

అవును గదా, అమ్మలగన్న అమ్మ ఎవురూ అని కనిపెట్టే పని ఏ నరమానవుడికైనా సాధ్యమయ్యేదేనా? తొలి అమ్మ మాదిరే గదా, తొలి కతా! ఏదన్నా ఒక గీత గీసుకుంటే తప్ప తొలి అని దేన్నయినా అనుకోలేంగదా. కతలకి సంబంధించినంత దాకా ఆ గీత అచ్చు మిషను. అచ్చులోకి వచ్చిన కాణ్ణుంచీ దొరికిన కతల్నే తొలి కతలని అనుకుంటా ఉన్నాం. అనుకుని ఎతుక్కుంటా ఉన్నాం. ఎతుక్కుని ఏరుకుంటా

ఉన్నాం. ఏ దేశాన అయినా, ఏ భాషలోఅయినా ఇదే తీరు. మొరసునాడనీ, తొండనాడనీ, హొూసూరనీ..యాడాడ కతలో ఏరి కూర్చి పుస్తకాలేసే పనిలో ఉండేటపుడు చేతికొచ్చింది ఒక పుస్తకం. 'తొలి తెలుగు కథ – ఏడు అభిప్రాయాలు' దాని పేరు. గురజాడ దిద్దుబాటా, బండారు అచ్చమాంబ ధన త్రయోదశా ఏది తొలి కత అని ఇప్పటికే చాలా కొట్లాట జరిగిపొయ్యింది తెలుగులో. ఈ పుస్తకం బుర్రలో దూరి రొద పెడతా ఉండాది. 1910 లేదా 1902, తొలి కత ఏదైనా ఎనిమిదేళ్లే వారా. తెలుగులో కత ఇంత ఎనకబడి మొదులయ్యిందేందబ్బా? అయినా, ఆ రెండు కతల్లో గూడా ఆ భాషేంది సామీ గులకరాళ్ళు నవిలినట్టు అని బాధ కలగతానే ఉండింది. అప్పుడు తెలిసింది తాతాచారి కతల గురించి. నెల్లూరు నుంచి ఈతకోట సుబ్బారావు, తాతాచారి కతలు జెరాక్సు చేసి పంపించాడు. బంగోరే వేసిన పుస్తకం కాపీ అది. 1855లోనే తాతాచారికతల పుస్తకాన్ని బ్రౌన్ దొర అచ్చేయించినాడు. ఈ కతలు మనం మాట్లాడుకున్నంత తేలిగ్గా ఉండాయి. అయితే, తాతాచారి స్వయంగా ఈ కతలు రాయలేదు. తాతాచారి చెప్పిన కతలన్నిట్నీ గుర్తు బెట్టుకుని బ్రౌన్‌దొర ఇంకెవురి దగ్గరో రాయించి అచ్చేయించినాడు. ఓహో, ఇందుకన్నమాట వీటిని మొదుటి కతలు అనలేదనుకుంటా ఉండంగానే, వాసిరెడ్డి నవీన్ చెప్పినాడు, దిద్దుబాటు కన్నా ముందరే అరవై అయిదు కతలుండాయి తెలుగులో అని. అసలికి, బండారు అచ్చమాంబ రాసినవే ధన త్రయోదశి కన్నా ముందుటి కతలుండాయని మెహబూబ్ బాష బయటపెట్టినాడు. తెలుగులో తొలికత చుట్టూరానే ఇంత కత నడస్తా ఉండాది కదా, మన దేశంలోనే వేరే వేరే భాషల్లో తొలి కతలు ఏ మాదిరిగా ఉండాయి? మనకన్నా ముందొచ్చినాయా, తర్వాతనా? అనే దాని మీదకి మనసు మళ్ళింది. అప్పుడు మొదులైంది, తండ్లాట. ఎందురికో ఫోన్‌లు చేసి, ఎందురితోనో నేరుగా మాట్లాడి, వెంటబడి, వేధించి, విసిగించి, కోపం తెప్పించి పన్నెండు కతలు కువ్వ బోసినాం. ఏది తొలి కత అనే గొడవ తెలుగులో ఉన్నంత గంగనాగోలగా వేరే భాషల్లో ఉన్నట్టు లేదు. మరాఠీలో, తమిళంలో, మలయాళంలో, హిందీలో, బెంగాలీలో కూడా తొలి కత ఏదనే దాని మింద వాదాలు నడిచినా, వాళ్ళకి వాళ్ళే కొన్ని గీతలు గీసుకుని ఇదీ మా భాషలో తొలి కత అని ఒప్పందానికి ఒచ్చేసినారు. ఈ లెక్కన చూస్తే, మన దేశంలో తొట్ట తొలి కత పుట్టింది 1870లో. సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఉర్దూ భాషలో రాసిన 'గుజారుహా జమానా' కతని తొలీదని అనుకోవాలి. 1884లో రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన 'ఘాటీర్ కథ' నే బెంగాలీలు, వాళ్ళ భాషలో తొలికత అనేసుకున్నారు. 1890లో మరాఠీ భాషలో హరినారాయణ్ ఆప్టే రాసిన 'దహా రూపాయాంచీ ఫేడ్' ని తొలి కతగా చెప్పుకుంటా ఉండారు. అయితే, మరాఠీలో దీనికన్నా ముందే ఒక దళిత రచయిత కత రాసాడనే వాదనా ఉండాది. ఆ కత జాడ దొరకలేదు. మలయాళంలో 1891లో తొలి కత అచ్చయితే, ఒడియాలో 1898లో

తొలి కత వచ్చింది. కన్నడ, గుజరాతీ, తెలుగు, హిందీ, తమిళ భాషల్లో 1900 తర్వాతే తొలి కతలు వచ్చాయి. కొంకణి, తుళు భాషల్లో 1933 దాకా కత లేదు. కాశ్మీరీలో 1955లో గానీ తొలి కత రాలేదు. అంటే అప్పటి దాకా ఇక్కడ అమ్మలూ, అవ్వలూ, తాతలూ పిలకాయలకి కతలే చెప్పలేదని కాదు. చెప్పిన కతలు అచ్చుకాలేదు. అచ్చయినా సాహితీ ప్రపంచం గీసుకున్న గీతల్లోకి అవి ఒదగలేదు. అసలీ గీతలు తొలీగా గీసుకున్నది మనం కాదు, ఐరోపాలో, అమెరికాలో చిన్నకత అనే మాట 1700 ఆఖర్లోనే వాడుకలోకి వచ్చింది. పిట్టకతలు అనే మాట మన జానపద సాహిత్యంలోనూ ఉన్నా, ఇంగ్లీషులో పోస్తేనే కదా తీర్థం! 1790..1830 నడుమనే ఈ దేశాల్లో చిన్న కతలు ప్రచారంలోకి వచ్చినాయి. ఇంగ్లండులో వాల్టర్ స్కాట్ రాసిన 'ది టూ డ్రోవర్స్' 1827లో అచ్చయింది. అమెరికాలో 1837లో నెతానియేల్ హాతరాన్ రాసిన 'ట్వైస్ టోల్డ్ టేల్స్' తో చిన్న కతల దుమారం మొదులైందని అంటారు. చార్లెస్ బ్రోకెన్ బ్రౌన్ 1805లోనే చిన్న కతలు రాసినా, 1819లోనే వాషింగ్టన్ ఇర్వింగ్ రాసినా హాతరాన్‌తోనే చిన్నకతల గురించి మాట్లాడుకోవటం పెరిగింది. 1832..1849 నడమ ఎడ్గార్ ఎలెన్ పో కతలు వచ్చాకే, ఇవి గదా చిన్న కతలంటే అన్నారు. జర్మనీలో 1810లోనూ, ఫ్రాన్స్‌లో 1829లోనూ తొలి కతలు వచ్చినాయని అంటారు. 1860 నుంచీ రష్యాలో చెహోవ్ చిన్నకతల యుగం మొదులైంది. తొలి రోజుల్లో జానపద, నీతి, డిటెక్టివ్ కతలు అందరికీ నచ్చినాయి. బతుకు సమస్యలు, మనుషుల నడుమ సంబంధాలు వంటివి ఆ తర్వాత కతలుగా మారాయి. ప్రపంచ యుద్ధాల తర్వాత చిన్నకత మరింత ముదురుపాకాన పడింది. కావ్యాలూ, నవలలూ వీర విహారం చేసే దినాలలో.. మొదులుబెడితే ఒకే తూరి చదివేయగలిగిన కతలు జనానికి బలే నచ్చినాయి. పత్రికలు వీటిని బాగా అచ్చేసేవి. తొలి దినాల్లో నూరు పేజీల కతని కూడా చిన్న కత అనే అనేవాళ్లు. ఇంతకీ ఈ కతల వెనకుండే కతంతా ఆడా ఈడా పోగేసి తెలుసుకునిందే. ఇదంతా తెలుసుకున్నాక అనిపించిందేమంటే, ఐరోపాలోనో, అమెరికాలోనో పుట్టినా చిన్న కత అదే మాదిరి గుణాలతో మన దేశంలోకి అడుగు పెట్టడానికి ఎక్కువ కాలమేం పట్టలేదని. 1840ల్లో ఎడ్గార్ ఎలన్ పో రాసిన కతలనే అచ్చమైన కతలుగా అనుకుంటారు. 1870 నాటికే మన దేశంలో తొలి కత అచ్చయిపొయ్యింది. ఇంగ్లీషోళ్ళ పాలన వల్లే మనకు ఈ కతలు బిన్నా వచ్చేసినాయి. చిన్నతనంలోనే మొగుడికి దూరమైన అమ్మాయి, గంగలో తనువు చాలించిన కతని ఒక రేవు చెప్పినట్టుగా రవీంద్రనాథ్ ఠాగూర్ 1884లోనే రాశాడు. ఇరవై నాలుగేళ్ళ తరువాత వచ్చిన తమిళ కతకీ, ఈ బెంగాలీ కతకీ పోలికలుండాయి. మాట తప్పిన మొగుడ్ని పల్లెత్తు మాట అనకుండా నీట మునిగి ఆత్మహత్య చేసుకున్న అమ్మాయి కతని గుంట కట్ట మీదుండే రాగిమాను చెబుతాది. ఇది ఠాగూర్‌కి కాపీ అని తమిళనాట కొంత గొడవ జరిగినా, కానే కాదని ఆ


తరువాత తేల్చేసినారు. ఇంటి పెద్ద చావుతో స్మశానంగా మారిన గ్రామ కరణం కుటుంబం కతని ఒడియాలో ఫకీర్ మోహన్ సేనాపతి 1898లోనే మనసుకి పట్టుకునే మాదిరిగా రాశాడు. చేసిన పని తలుచుకుని చింతపడుతున్న దొంగ కతని మలయాళంలో వేంగయిల్ కున్హిరామన్ నయనార్ 1891లో రాసినాడు. ఒక్కో కతదీ ఒక్కో తీరు. ఈ కతల్లో మరీ లేటుగా వచ్చిన కత కాశ్మీరీ భాషలో. 1955లో అఖ్తర్ మొహియుద్దీన్ రాసిన మేజికల్ వెబ్ తొలి కాశ్మీరీ కత. కాలానికి తగిన కత ఇది. ఈ కతని మాత్రమే ఇంగ్లీషులో నుంచి తెలుగులోకి తెచ్చుకోవాల్సి వచ్చింది. మిగతా కతలన్నీ నేరుగా ఆ భాషల నుంచే తెలుగులోకి వచ్చినాయి. ఈ కతలన్నీ పోగేసుకున్నాక కొంచం దిగులూ కలిగింది. కొంచం సంతోషమూ వేసింది, అమెరికా, ఐరోపా దేశాల కతేమోగానీ మన దేశంలో గూడా తొలీగా వచ్చిన కతల్లో మంచి మంచివి ఎన్నో ఉండాయి. ఇంక, దిగులెందుకంటే..కత నడిపే తీరులో, కతకి ఎన్నుకున్న విషయంలో, కత చెప్పే భాషలో తొలి తెలుగు కతలు ఎనకబడే ఉండాయికదా అని. సాహిత్యాన్నీ, చరిత్రనీ తెలంగాణలో మళ్ళీ లోడి బయటకి తీసుకుంటా వుండారు గదా, అదే మాదిరిగా తెలుగులో గూడా తొలి తెలుగు కతల కోసం వెతుకులాట ఇంకా లోతుగా జరిగితే, మంచి కతలే దొరకతాయనే ఆశగా ఉండాది. ఈ మాదిరిగా ఇన్ని భాషల కతలనీ ముందేసుకోని తలబోసుకుంటా ఉంటే, 'అబయా..' అంటా వచ్చి పలకరించింది కత. ఎళ్ళిపోయిన అమ్మ, ఎనక్కొచ్చి నిద్దర మంచం కాడ నిలబడి పిలిచినంత సంతోషం కలిగింది.

**ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు**

# ఇదీ వరుస...


| | | | |
|---|---|---|---|
| గడచిపోయిన కాలం | ఉర్దూ | **సయ్యద్ అహ్మద్ ఖాన్** – | 9 |
| రేవు కథ | బెంగాలీ | **రవీంద్రనాథ్ ఠాగూర్** – | 15 |
| పది రూపాయల బాకీ తీర్పు | మరాఠీ | **హరినారాయణ్ ఆప్టే** – | 21 |
| వారసత్వం | మలయాళం | **కున్హిరామన్ నయనార్** – | 39 |
| రేవతి | ఒడియా | **ఫకీర్‌మోహన్ సేనాపతి** – | 45 |
| కమలాపురం హోటల్లో | కన్నడ | **పంజె మంగేశ రాయ** – | 59 |
| శాంతిదాసు | గుజరాతీ | **అంబాలాల్ దేశాయ్** – | 69 |
| ధనత్రయోదశి | తెలుగు | **భండారు అచ్చమాంబ** – | 81 |
| కుంభమేలాలో చిన్నకోడలు | హిందీ | **బంగ మహిళ** – | 95 |
| గుంటకట్ట రాగిమాను... | తమిళం | **వ.వే.సు. అయ్యర్** – | 107 |
| దిద్దుబాటు | తెలుగు | **గురజాడ అప్పారావు** – | 121 |
| మాఅమ్మ ఎక్కడికి పోయింది | కొంకణి | **శణై గోయబాబ** – | 127 |
| పెండ్లికూతురు కాదు.... | తుళు | **కె.విఠల్ హెగ్డె** – | 133 |
| మాయపొర | కశ్మీరి | **అఖ్తర్ మొహియుద్దీన్** – | 147 |

**ఉర్దూ కత**
**1870**



# గడచిపోయిన కాలం

## గుజారుహా జమానా

**సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్**

డిల్లీలో 17 అక్టోబరు 1817లో పుట్టినారు. 19వ శతాబ్దంలోని భారతీయ ముస్లిం మేధావిగా, సామాజిక కార్యకర్తగా పేరు గడించినవారు. ప్రజలలో బాగా పలుకుబడి కలిగిన ముస్లిం నేతగా వీరికి గుర్తింపు ఉండేది. అయితే ఈయన స్వాతంత్రోద్యమాన్ని శంకించేవారు. పైగా ముస్లింలంతా బ్రిటిష్ ప్రభుత్వం పట్ల రాజభక్తితో ఉండాలని పిలుపునిచ్చేవారు. ముస్లింల ఐక్యత కోసం అభివృద్ధి కోసం తపించిన వారు ఈయన. భారతీయ ముస్లిములందరూ ఉర్దూను తమ భాషగా తీసుకోవాలని సూచించినారు. ఏకభాష వలన ముస్లింల నడుమ ఐక్యత ఏర్పడుతుందని అనేవారు. 'ఇండియా అనే అందమైన పెళ్లికూతురికి ఒక కన్ను హిందువయితే మరొక కన్ను ముస్లిం' అనే అభిప్రాయంతో అందరి అభివృద్ధినీ కాంక్షించేవారు. అయితే హిందీ-ఉర్దూ వివాదం తరువాత వీరి దృష్టి కేవలం ముస్లిం సమాజానికే పరిమితమయింది. ఆ తరువాత వీరే ద్విజాతి వాదాన్ని మొట్టమొదటగా లేవనెత్తినారు. పాకిస్తాన్ నిర్మాతల ముగ్గురిలో ఒకరయినారు అహ్మద్‌ఖాన్ గారు. ముస్లింల విద్య కోసం 1875లో ముహమ్మదన్ ఆంగ్లో - ఓరియంటల్ కాలేజ్‌ను నెలకొల్పినారు. ఇదే ఇప్పటి అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ. ఎన్నో చారిత్రక గ్రంథాలూ, జీవిత చరిత్రలూ, రాజకీయ మత పరమైన వ్యాసాలూ వీరి కలం నుంచి వెలువడినాయి. వీరు రాసిన కతలు ఎనిమిది సంకలనాలుగా వెలువడినాయి. మార్చి 27, 1898లో అలీఘడ్‌లో కన్నుమూసినారు అహ్మద్‌ఖాన్ గారు.

ఏడాది చివరి రోజు. ఒక ముసలివాడు చీకటిలో ఒంటరిగా కూర్చుని ఉన్నడు. భయంకరమైన చీకటి. ఆకాశంలో మబ్బులు ఉరుముతున్న చప్పుడులు. పెద్దపెద్ద గాలులు. శరీరమూ మనసూ వణుకుతున్నయి. మనసులో బాధగా అనిపిస్తున్నది.

ముసలివాడు చాలా విచారంగా ఉన్నడు. ఆ విచారము చీకటిగా ఉన్నందుకు కాదు. ఒంటరిగా ఉన్నందుకు కాదు. ఉరుములూ పెనుగాలుల వలన కాదు. ఏడాది చివరి రోజు అయినందుకు కూడా కాదు. అతను తన గడిచిన కాలాన్ని యాది చేసుకుంటున్నడు. ఎంత యాది చేసుకుంటున్నడో అంత విచారం పొందుతున్నడు. మొహంపైన చేతులు పెట్టుకున్నడు. కళ్లలో నుండి కన్నీళ్లు కారుతున్నయి.

గడిచిన కాలం అతని కళ్లముందు కనిపిస్తున్నది. తన పది పన్నెండేళ్ల వయసు అతనికి యాదికి వస్తున్నది. ఆ చిన్న వయసులో అతనికి ఏ విచారమూ లేదు. ఏ ఆలోచనా లేదు. డబ్బు నగలు వంటివాటికి బదులుగా మిఠాయిలు తినాలని అనిపిస్తుండేది. తల్లి తండ్రి అక్క అన్న అందరూ గారాబం చేసేవారు. సెలవు దొరుకుతుందనే సంతోషంలో పుస్తకాలను చంకన వేసుకుని బడికి వెళ్లేవాడు. బడి ఆలోచన రాగానే తనతోపాటు చదువుకున్నవాళ్లు యాదికి వస్తున్నరు. ఆ ఆలోచనలతో మరీ విచారంగా అయిపోతున్నడు. 'ఒక తీరున గడిచిన సమయం! హాయిగా గడిచిన కాలం! నేను నిన్ను చాలా కాలం తరువాత యాది చేసుకుంటున్నను'.

మళ్లీ అతను తన యౌవన కాలాన్ని యాది చేసుకున్నడు. ఎరుపు కలిసిన తెల్లటి తన మొహం, అందమైన శరీరం, నిండైన కళ్లు, తెల్లని హారంలాగా పండ్లు, ఆశలతో నిండిన మనసు, సంతోషంతో నిండిన మనసు అతనికి యాదికి వస్తున్నయి.

తల్లీ తండ్రీ చెప్పిన సలహాలు యాదికి వస్తున్నయి. మంచిపనుల గురించీ దేవుని ప్రార్థన గురించీ వాళ్లు చెప్తుంటే "దానికోసం ఇంకా చాలా సమయం ఉంది" అనేవాడు అతను. ముసలితనం వస్తుందనే ఆలోచనే అతనికి ఎప్పుడూ రాలేదు. అతనికి యాదికి వస్తున్నయి. అందుకనే విచారపడుతున్నడు. 'నేను అప్పుడే సమయాన్ని వృథా చేసుకోకుండా మనసు తనివిదీరేలాగా మంచి పనులు చేసి, ఇక చనిపోతే కూడా విచారం లేకుండా ఉండేవాడిని. అయ్యో! సమయం గడిచిపోయింది. ఇప్పుడు ఇక ఏమీ చేయలేను. నేను చాలా సమయాన్ని వృథా చేసిన'.

ఇది అనుకుంటూ అక్కడ నుండి లేచిండు. అట్లాగే కుంటుకుంటూ కిటికీ దగ్గరకు వచ్చింది. కిటికీ తెరిచిండు చూస్తే రాత్రి అట్లాగే భయంకరంగా ఉన్నది. చీకటిగానే ఉన్నది. ఉరుముల చప్పుళ్లలో మనసు నలిగిపోతున్నది. గాలి విపరీతంగా ఉన్నది. చెట్ల ఆకులు గాలికి భయంకరంగా ఊగుతున్నాయి. కొన్ని చెట్లు పడిపోతున్నాయి. అప్పుడు అతను అరిచి 'అయ్యో అయ్యో నా గడిచిన యౌవనం కూడా ఇట్లనే భయంకరంగా ఉన్నదే. ఇట్లనే ఈ చీకటి రాత్రిలాగనే ఉన్నదే' అని అనుకుంటూ మళ్లీ తన చోటుకు వచ్చి కూర్చున్నడు.

అప్పుడు అతనికి మళ్లీ తన తల్లి తండ్రి తమ్ముడు చెల్లెలు దోస్తులు యాదికి వచ్చినరు. వాళ్లంతా చనిపోయి మట్టిగా మారిపోయినరు. తల్లి తనను ప్రేమగా దగ్గరకు తీసుకొని కళ్లలో నీళ్లు నింపుకొని నిలబడి ఉన్నది. ఇంక సమయం గడిచి పోయింది. తండ్రి మొహం అతని ముందుకు వచ్చింది. మళ్లీ తనకు నాయన మాటలు వినిపిస్తున్నాయి. "కొడుకా మేము నీ మంచి కోసమే చెబుతున్నము" చెల్లెలూ తమ్ముడూ నోట్లో వేళ్లు పెట్టుకొని నిలబడి ఉన్నరు. వాళ్ల కళ్లలో నుండి నీళ్లు కారిపోతున్నాయి. దోస్తులు కూడా విచారంగా నిలబడి ఉన్నరు. వాళ్లు మళ్లీ మళ్లీ చెబుతున్నరు "ఇప్పుడు మేము ఏమీ చేయలేము" అని.

ఆ సమయంలో అతనికి అప్పటి తన మాటలు యాదికి వస్తున్నాయి. అప్పుడు అతను లెక్కచేయకుండా మాట్లాడేవాడు. తన తల్లి, తండ్రి, చెల్లెలు, తమ్ముడు, దోస్తులతో లెక్కలేనట్లు నడుచుకునేవాడు. తల్లికి వేదన కలిగించుడు, తండ్రి మాటలను వినకుండా చెల్లెలినీ తమ్ముడినీ లెక్కచేయకుండా దోస్తులకు సాయపడకుండా ఉండుడు యాదికి వస్తున్నాయి. ఈ అన్ని ఆలోచనలతో అతని మనసు వేదనతో నిండిపోయింది. అతను పెద్దగా ఏడుస్తూ 'మంచి సమయం గడిచిపోయింది. సమయమంతా గడిచిపోయింది. ఇప్పుడు ఏమి చెయ్యాలె' అని ఆరాట పడుతున్నడు.

అతను గాబరాగా కిటికీ దగ్గరకు పడుతూ లేస్తూ పోయిండు. కిటికీని తెరిచి చూస్తే గాలి నిలిచి ఉన్నది. ఉరుముల చప్పుడు కొంచెం తగ్గింది. కానీ రాత్రి అట్లనే చీకటిగా ఉన్నది. అతని గాబరా కొంచెం తగ్గింది. అతను మళ్లీ తన చోటులో వచ్చి కూర్చున్నడు. అంతలో అతనికి అతని మలి వయసు యాదికి వచ్చింది. అతను చెడ్డపనులు మానుకుని మంచి పనులవైపు వచ్చిన సమయం అది. అప్పుడు ఉపవాసాలు, నమాజ్‌లు, హజ్, జకాత్, బీదలకు అన్నం పెట్టుడు, మసీదులు కట్టించుడు, బావులు తవ్వించుడు యాదికి వచ్చి మనసు కుదుట పడింది. తను ఆ సమయంలో ఆదుకొన్న బిచ్చగాళ్లు, సాధువులు, ఇంకా ఎవరెవరికి సేవలు చేసిండో వాళ్లందరినీ ఇప్పుడు తన సాయం కోసం పిలుస్తున్నడు. అయినా మనసు తృప్తి పడుత లేదు. అతను చూస్తున్నడు. తను చేసిన పనులు తనతోనే ముగిసిపోయినయి.

ఆకలితో ఉన్నవారు ఇంకా అట్లనే ఆకలితోనే ఉన్నరు. మసీదులు కూలిపోయినయి. అడవులు నాశనం అయిపోయినయి. బావుల్లో నీళ్లు ఎండిపోయినయి. బిచ్చగాళ్లూ సాధువులూ అతని మాటను పట్టించుకుంటలేరు, సాయంగా వస్తలేరు. అతని మనసు మళ్లీ గాబరాగా అయిపోయింది. అతను ఆలోచిస్తున్నడు. 'నేను ఏమి చేసిన. శాశ్వతం కాని వస్తువులపై మనసు పెట్టుకున్న. ఈ ఆలోచన నాకు ముందుగానే ఎందుకు రాలేదు. ఇప్పుడు నా చేతులలో ఏమీ లేదు. అయ్యో మంచి సమయాన్ని పోగొట్టుకున్న. ఎందుకు పోగొట్టుకున్నను.'

అతను గాబరాగా కిటికీ దగ్గరకు పరుగెత్తిండు. కిటికీ తలుపులను తెరిచి చూస్తే ఆకాశం మామూలుగా ఉన్నది. పెనుగాలులు తగ్గినయి. మబ్బులు తగ్గినయి. చుక్కలు పుట్టినయి. చుక్కల వెలుతురులో చీకటి కొంచెం తగ్గింది. తన మనసు కుదుట కోసం అతను ఆకాశంవైపు చూస్తున్నడు. అప్పుడు అతనికి ఆకాశం నడుమన ఒక వెలుతురు కనిపించింది. ఆ వెలుతురులో ఒక అందమైన పెళ్లికూతురు కనిపించింది. అతను రెప్పవేయకుండా ఆమెనే చూస్తున్నడు. అట్లనే చూస్తుంటే ఆ పెళ్లికూతురు అతనికి దగ్గరగా వచ్చింది. ఇంకా దగ్గరగా వచ్చేసింది. అతను రెప్పవేయకుండా ఆమెనే చూస్తున్నడు. అతను ఆమె అందాన్ని చూసి ఆశ్చర్యపోయిండు. మంచి మనసుతో ప్రేమతో "నీవు ఎవరు?" అని ఆమెను అడిగిండు. "నేను ఎప్పటికీ నిలిచి ఉండే పుణ్యాత్మను" చెప్పింది ఆమె. అతను మళ్లీ అడిగిండు "ఏమి చేస్తే నేను నిన్ను పొందగలను?" అని. "మంచి పనులు చేస్తే పొందగలవు" చెప్పింది ఆమె. "నువ్వు చెబుతున్న మంచిపనులను ఎట్లా చేయాలె?" అడిగిండు అతను. "చాలా సులభం, కానీ చాలా కఠినం కూడా. ఎవరైనా సరే దేవుడు చెప్పినట్లుగా మనుషులకు మంచి చేయాలె. ఇతరులు చేస్తున్న మంచి పనులకు తోడుపడాలె. లోకంలో చివరివరకూ ఉండేది ఏదీ లేదు. మానవత్వం ఒక్కటే చివరి వరకూ ఉంటుంది. మనుషుల కోసం చేసే మంచి పనులే తరతరాల వరకూ వాళ్ల వంశంలోని వాళ్లకు మంచి అండగా నిలుస్తయి. నమాజ్, రోజ, హజ్, జకాత్‌లు, చేసినతనితో పాటే తీరిపోతయి. చావుతోటే మనం సంపాదించుకున్నవన్నీ నాశనం అయిపోతయి. కానీ మనిషికోసం చేసే మంచి పనులు మాత్రమే చివరి వరకూ మిగులుతయి. నేను మనుషులందరిలోని మంచి కోసం పనిచేస్తను" అని ఆ పెళ్లికూతురు మాయం అయిపోయింది. ఆ ముసలివాడు మళ్లీ తన చోటుకు వచ్చి కూర్చున్నడు.

మళ్లీ అతను తన గత జీవితాన్ని యాది చేసుకున్నడు. తన ఏబై అయిదేళ్లలో ఏ మనిషి కోసం కూడా మంచిపని ఏదీ చేయలేదు. ఏపనైనా తన కోసమే చేసుకున్నడు. మంచి పనులు ఏవైనా చేసినా అవి తన సొంతానికి, దేవుడిని సంతోషపెట్టనీకే కానీ మానవత్వంతో ఏదీ చేయలేదు.

తన గురించి ఆలోచించుకుని, ఒక మంచి పెళ్లికూతురితో మాట్లాడినది తెలుసుకుని, తన గడిచిన జీవితాన్ని తలచుకుని ఇంక ఏమీ చేయలేనే అని విచారించిండు. అప్పుడు బాధతో 'అయ్యో! ఆ కాలం! నిన్ను మళ్లీ నేను కలువగలనా! అయ్యో! నేను పదివేల దీనార్లు ఇస్తను. ఒకవేళ గడిచిపోయిన కాలం మళ్లీ వస్తే నేను ఏమైనా చేయగలను' అనుకుంట పెద్దగా గాలి పీల్చుకున్నడు. కింద పడిపోయిండు.

కొంచెం సమయం గడిచినట్లయింది. అప్పుడు తన చెవులలో తియ్యటి మాటలు వినిపించినయి. తన ప్రియమైన తల్లి తన దగ్గరే నిలబడి ఉన్నది. తనను దగ్గరకు తీసుకుని కౌగలించుకున్నది. తన తండ్రి కూడా అతనికి కనిపించిండు. తన చిన్నారి తమ్ముళ్లు చెల్లెలు తన చుట్టూ నిలబడి ఉన్నరు. అతనిని దగ్గరకు తీసుకున్న తల్లి అనింది "ఎందుకు కొడుకా నువ్వు కొత్త ఏడాది రోజున ఏడుస్తున్నవు? నువ్వు ఎందుకు పరేశాన్ అవుతున్నవు? లే మొహం చేతులూ కడుక్కో, కొత్త బట్టలు వేసుకో, కొత్త ఏడాదిలో సంతోషంగా ఉండు. నీ తమ్ముళ్లూ చెల్లెలూ నీ కోసం ఎదురుచూస్తున్నరు". ఆ మాటలు విని అతను లేచిండు. అప్పుడు అతను 'నేను ఒక కల కన్న. కలలో నేను ముసలివాడిని అయిపోయిన' అనుకుని తన కలనంతా తల్లికి చెప్పిండు. అదంతా విన్న అతని తల్లి "కొడుకా నువ్వు ఇక అట్ల చేయకు. ఆ ముసలివాడిలాగా స్వార్థం చూసుకొనద్దు. మంచి పనులను చేయుమని నీ పెళ్లికూతురు నీతో అనింది" అని బదులు చెప్పింది.

తల్లి మాటలను విన్న ఆ పోరగాడు మంచంపై నుంచే దూకి, సంతోషంగా ఇట్లా అరిచిండు. "ఇదే నా బతుకులో మొదటి రోజు. నేను ఎన్నటికీ ఆ ముసలి వాడిలాగా తప్పుడు పనులు చేయను. మనుషుల కోసం మంచి పనులనే చేస్తను. నేను తప్పనిసరిగా ఆ పెళ్లికూతురినే పెళ్లాడుతను. ఆమె రూపం ఎంతో మంచిగున్నది. ఆమె తన పేరును మంచి నడవడిక అని చెప్పింది. ఓ దేవుడా! ఓ దేవుడా! నాకు తోడుగా ఉండు. ఆమీన్.

ఓ నా మంచి పౌరులారా, నా దేశపు పిల్లలారా, మనవాళ్ల మంచికోసం మనం కృషి చేయాలె. ఎన్నటికీ ఆ ముసలి వాడిలాగా స్వార్థాన్ని చూసుకోవద్దు. ఏ పౌరుడైనా మన అందరి మంచికోసం మంచి పనులను చేయాలెనని దేవుడిని వేడుకుంటున్నను. ఆమీన్!




**నూర్జహాన్ బేగం:**

ఫోను: 9912670259

సొంతవూరు నిజామాబాద్ జిల్లా బోధన్. ఇక్కడే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉర్దూ పండితులుగా పనిచేస్తున్నారు. ఉర్దూ, తెలుగు నుడులలో పుస్తకాలను చదవడం, పిల్లలకు కతలు చెప్పడం, పాటలు పాడడం వీరికి మక్కువయిన పనులు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారు వేసిన ఏడవ తరగతి బడిపిల్లల ఉర్దూ వాచకంలో ఈ కత ఉందని తెలియచేయడమే కాక, వెనువెంటనే తెలుగులోకి మార్చి పంపినారు వీరు. మొట్టమొదటిసారిగా వీరు అనువదించిన కత ఇది.

**బెంగాలీ కత**
**1884**



# రేవు కథ
## ఘాటీర్ కథ

**రవీంద్రనాథ్ టాగూర్**

బెంగాల్ ప్రెసిడెన్సీలో కలకత్తాలో 7 మే 1861న పుట్టినారు. 19వ శతాబ్దం మధ్య కాలంలో జరిగిన భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఒక ప్రతీకగా వెలిగిన టాగూర్, ఆధునిక సాహిత్య ప్రక్రియలన్నింటినీ బెంగాలీలోకి తీసుకొచ్చినారు. 100 కతలు, రెండు డజన్ల నవలలు, 25 నాటకాటు, రెండు వేల కవితలు, ఆత్మకథ, సాహితీ విమర్శ, యాత్రా కథనాలు వంటి అనేక రచనలు వీరి కలం నుంచి వెలువడినాయి. రాశిలోనే కాక వాసిలోనూ మిన్న అనిపించుకొన్నాయి. ఇవే కాక రవీంద్రుడు రెండువేల చిత్రాలు గీసినారు. సంగీతంలో మూడు తాళాల సృష్టికర్త. రవీంద్రుని పేరుతో సంగీత ప్రక్రియ ఒకటి బెంగాల్‌లో మొదలయింది. పిల్లల కోసం వందలాది కతలనూ, తాత్విక వ్యాసాలనూ, జ్ఞాపకాలనూ కూడా రాసినారు. అనువాదకుడు. పూర్తి పాశ్చాత్య విధానంలోకి పోతున్న విద్యా విధానానికి ప్రత్యామ్నాయంగా భారతీయ విలువలతో కూడిన విద్య కోసం శాంతినికేతన్ అనే విశ్వవిద్యాలయాని నెలకొల్పినారు.

కథకుడిగా టాగూర్, మొపాసా చెకోవ్ టాల్‌స్టాయ్‌ల వంటి ప్రపంచ కథానికా నిర్మాతల వరుసలోని వారు. కవితాత్మకమైన కథలనూ గల్పికలనూ సామాజిక ప్రయోజనం కోసం, వాస్తవ జీవితాల నుంచే తీసుకొని రాసినారు. కథానిక అనే పాశ్చాత్య ప్రక్రియకు భారతీయతను నేర్పిన వాడు రవీంద్రనాథ్ టాగూర్. వీరి గీతాంజలికి 1913లో నోబెల్ పురస్కారం లభించింది. భారతదేశపు జాతీయ గీతమైన 'జనగణమన..'తో పాటు, బంగ్లాదేశ్ జాతీయ గీతమైన 'అమార్ సోనార్ బంగ్లా' కూడా వీరి కలం నుంచే వెలువడినాయి. చిత్తూరు జిల్లా మదనపల్లిలో అనిబిసెంట్ గారు నెలకొల్పిన బి.టి. కళాశాలకు తొలి ఛాన్సలర్‌గా ఉన్నారు. ఇరవై మూడేళ్ల వయసులో టాగూర్ గారు రాసిన తొలికత ఈ 'రేవు కథ'. ఎనిమిదేళ్ల వయసులోనే గీతాలను రాసినారు. కలకత్తాలోనే 7 ఆగస్టు 1941లో కనుమూసినారు.

గంగానదిలోని నీళ్లు గట్టుమీదకు వచ్చి మట్టిని కౌగిలించుకుంటున్నాయి. ఉదయాన్నే వీస్తోన్న చల్లగాలికి ప్రాణం లేచివస్తోంది. దూరంగా మామిడి చెట్లు కనిపిస్తున్నాయి. చెట్లకి కట్టేసిన పడవలు నీటి ప్రవాహానికి ఊగిసలాడుతున్నాయి. వయసులో ఉన్న యువతిలా నది పరుగులు పెడుతోంది. శరత్‌కాలపు ఉదయపు రవి కిరణాలు నీటిపైన పడి నది అందంగా నవ్వుతున్నట్టు ఉంది. మరికొన్ని కిరణాలు చెట్లపై పడి కొత్త అందాల్ని ఇస్తున్నాయి. పక్షులు కిలకిలారావాలతో ఎగురుతున్నాయి. నీటి జల్లులు మీద పడుతున్నాయి. భట్టాచార్య చిన్న బిందెను తీసుకుని స్నానానికి వచ్చాడు. అమ్మాయిలు మంచినీళ్లు తీసుకోడానికి వచ్చారు. చక్రవర్తి ఇంట్లోని ఓ వృద్ధురాలు గంగాస్నానం చేసి పైన బట్ట కప్పుకుంది. ఆమె చలికి వణికిపోతోంది. అయినాసరే చేత్తో జపమాల పట్టుకుని జపిస్తోంది.

ఊహతల్లి బిందె తీసుకుని వచ్చింది. నీటిలోని ఆకులను అటూ ఇటూ జరిపి నీళ్లు తీసుకుంటోంది. ఆకులు రెండువైపుల నుంచీ మళ్లీ వస్తున్నాయి. చిన్నప్పుడు అక్కడే పిల్లలతో కలిసి ఆడిన ఊహతల్లి ఇప్పుడు తన కూతురితో కలిసి నీళ్లు తీసుకెళ్లడానికి వచ్చింది. గట్టుమీద పిల్లలు అల్లరి చేస్తుంటే వద్దని వారిస్తోంది ఊహ. ఆమెను చూస్తుంటే చిన్నప్పటి ఆమె తల్లిని చూసినట్టుగానే ఉంది.

నదికి దగ్గర్లో చాలా ఇళ్లు ఉన్నాయి. ఇంటి చుట్టూ ప్రహరీలా గెడకర్రలు కట్టారు. ఆ కర్రలకు ఆవులు కట్టేశారు. అక్కడే తుమ్మ చెట్టు ఉంది. దాని కింద వారానికోసారి సంత జరిగేది. ఇప్పుడు అక్కడ ఘోష్ వాళ్ల ఇల్లు వచ్చింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లన్నీ నా చిన్నప్పుడు చిన్నచిన్న మొక్కలు. ఇప్పుడు వాటి వేర్లు కూడా కనిపిస్తున్నాయి. అప్పట్లో వాటి వేర్లు చిన్నపిల్లల చేతివేళ్లలా నాజూగ్గా ఉండేవి.

నదిలోని అలల్లా పాత సంగతులన్నీ మదిలో మెదులుతున్నాయి. వయసుపైబడినా నేనింకా బలంగానే ఉన్నాను. ఒంటరిగా ఇలా నది ఒడ్డున కూర్చుని పాత సంగతులన్నీ నెమరువేసుకోవడం నాకెంతో ఇష్టం. నా జ్ఞాపకాల్లో ఎప్పటికీ కొత్తగా నిలిచిపోయేది కుసుమ్... నాలాగే తనకూ నీళ్లంటే ప్రాణం. నాలాగే కాదేమో... నాకంటే తను గంగమ్మను ఎక్కువగా ప్రేమిస్తుంది. కుసుమ్ నది ఒడ్డున నించుంటే ఆమె నీడ నీళ్లలో పడేది. దాన్ని పట్టుకోవాలని ఆమె తాపత్రయపడేది. అందం... అమాయ

కత్వం... అల్లరిల కలబోత కుసుమ్. తూనీగలా ఎప్పుడూ పరుగులు పెడుతూనే ఉంటుంది. నీళ్లలోకి దిగి ఆటలాడుతూనే ఉంటుంది. కుసుమ్‌ని ఆమె స్నేహితురాళ్లు ఖుషీ, రాక్షసీ అని ఆటపట్టిస్తుంటారు. గంగమ్మనూ ఆమె ఒడిలో ఆటలాడే కుసుమ్‌నూ చూసి ఆనందించడం నా జీవితంలో ఒక భాగం అయిపోయింది. నేను ఏమైనా ఆలోచించడం, రాసుకోవడం, సేదదీరడం అన్నీ నది ఒడ్డునే ప్రశాంతంగా కూర్చుని చేస్తుంటాను. ఈ మధ్య ఏదో తెలియని వెలితిగా ఉంది. అవును... కుసుమ్ ఈ మధ్య రావడమే మానేసింది. అందుకేనేమో నది పరిసరాలన్నీ ఒక్కసారిగా గంభీరంగా మారిపోయాయి. కొన్ని రోజుల తర్వాత తెలిసింది ఆమెకు పెళ్ళై అత్తారింటికి వెళ్లిపోయిందని. అత్తగారి ఊరిలో గంగలేదు. అక్కడ కుసుమ్‌కు అంతా కొత్తగా ఉందట. పద్మాన్నీ నీళ్లనూ వేరు చేసినట్లుగా ఉంది కుసుమ్ పరిస్థితి. స్నేహితురాళ్లు చెప్పుకుంటుంటే కుసుమ్ సంగతులు నేనూ వినేవాడిని. క్రమంగా వాళ్లూ కుసుమ్‌ని మర్చిపోయారు. అలా ఏడాది గడిచిపోయింది.

అప్పట్లో కుసుమ్ రేవుకు వస్తుంటే పట్టీల శబ్దం ఒకపాటలా వినిపించేది. నీటి గలగలలు వినిపించేవి కాదు. ఇప్పుడు ఆమె నడుస్తుంటే ఎలాంటి శబ్దమూ లేదు. ఎందుకంటే ఎనిమిదేళ్లకే ఆమె నుదుట సింధూరం చెరిగిపోయింది. విదేశాల్లో పనిచేసే భర్త ప్రమాదంలో మరణించడంతో కుసుమ్ విధవగా మారింది. గతిలేక పుట్టింటికి తిరిగివచ్చింది. భర్తతో కలిసి వున్నది రెండు మూడు రోజులు మాత్రమే. అత్యవసర పనులు ఉండటంతో పెళ్ళైన వారం రోజులకే విదేశాలకు వెళ్ళిపోయాడు భర్త. ఒకరోజు ఉత్తరం ద్వారా భర్త చనిపోయాడనే సమాచారం వచ్చింది. కుసుమ్ తిరిగి గంగానది ఒడికి చేరింది. అప్పటికి స్నేహితురాళ్లందరి పెళ్లిళ్లూ అయిపోయి వారంతా అత్తారిళ్లకు వెళ్లిపోయారు.

కుసుమ్ ఓరోజు రేవుకు వచ్చి మోకాళ్లలో తలపెట్టుకుని కూర్చుంది. గంగానదిలా ఆమె కూడా నిండుగా ఉంది. నాసిరకం తెల్లచీరకట్టుకుని ఉంది. ముఖమంతా విషాదంతో నిండిపోయింది. నదిలో నీళ్లు వేగంగా ప్రవహిస్తున్నాయి. ఖుషీ రాక్షసీ అని ఆమెను స్నేహితురాళ్లలా వెక్కిరిస్తున్నట్టు ఉన్నాయి. ఇప్పుడు ఆమె కాళ్లకు పట్టీలు పెట్టుకోకపోయినా నాకెందుకో ఆ శబ్దం ఇంకా వినిపిస్తోంది.

అలా పదేళ్లు గడిచిపోయాయి. చిన్నపిల్లలా మంచినీళ్లు తెచ్చుకోడానికి నదికి వచ్చిన ఆమె ఇప్పుడు అందమైన యువతిలా తయారైంది. శీతాకాలం కావడంతో ఓ రోజు ఉదయం మంచు కురుస్తోంది. ఈలోగా ఒక సన్యాసి వచ్చి శివాలయంలో బస చేశారు. మంచినీళ్ల కోసం వచ్చిన ఆడపిల్లలు శివాలయానికి వెళ్లి స్వామికి నమస్కరిస్తున్నారు. అతడు తల్లిలా స్త్రీల యోగక్షేమాలు కనుక్కునేవాడు. స్వామీజీ దగ్గరకు మగపిల్లలూ ఎక్కువగానే వస్తున్నారు. ఆయన చేతిలో ఎప్పుడూ భగవద్గీత

ఉండేది. శాస్త్రాల మీద చర్చలూ జరుగుతుండేవి. కొందరికి మంత్రోపదేశం చేసేవాడు. సాక్షాత్తు శివుడే ఇలా వచ్చాడని కొందరు భక్తులు నమ్మేవారు. క్రమం తప్పకుండా సంధ్యావందనాలు చేసేవాడు స్వామీజీ.

ఓ రోజు తుమ్మ చెట్టుకింద సంత జరిగింది. అక్కడి పనివాళ్లు సాధువును చూడ్డానికి వచ్చారు. అప్పుడు కుసుమ్ వాళ్ల అత్తగారి ఊరి నుంచి కూడా కొంతమంది వచ్చారు. వాళ్లంతా జపం చేసుకుంటున్న సాధువును చూసి ఆశ్చర్యపోయారు. అతడు అచ్చం కుసుమ్ భర్త లాగానే ఉన్నాడు. ఒడ్డూ పొడవూ ముక్కూ అచ్చం కుసుమ్ భర్తలాగానే ఉందని అనుకున్నారు. అవునని కొందరూ కావని కొందరూ తర్జనభర్జనలు పడ్డారు. కుసుమ్ తప్ప అందరూ అతడిని చూశారు.

ఓ పౌర్ణమి రాత్రి కుసుమ్‌కు నిద్రపట్టక మెల్లగా నది ఒడ్డుకు చేరుకుంది. వెన్నెల నీటిమీద పడి ఎంతో ఆహ్లాదంగా ఉంది. దీర్ఘంగా ఆలోచిస్తున్న కుసుమ్, అలికిడి వినిపించడంతో తల తిప్పి చూసింది. అప్పుడే గుడిలోనించి బైటికి వచ్చిన సాధువు అక్కడ ఓ స్త్రీ కూర్చోవడం చూసి తప్పుకుని వెనక్కు వెళ్లబోయాడు. అతడిని చూసిన తత్తరపాటుతో ఆమె నెత్తిమీద ఉన్న ముసుగు కిందికి జారిపోయింది. వెన్నెల వెలుగులో ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు ఆశ్చర్యంగా చూసుకున్నారు. ఎందుకో తెలియదుగానీ పూర్వజన్మలో ఇద్దరికీ పరిచయం ఉన్నట్టు అనిపించింది. ఓ గుడ్లగూబ వాళ్లమీద నుంచి ఎగురుకుంటూ వెళ్లిపోయింది. కుసుమ్ కంగారుగా కొంగును నెత్తిమీదకు లాక్కుంటూ సాధువుకు నమస్కరించింది. ఆయన 'నీపేరేంటి' అని అడిగాడు. 'కుసుమ్' అని చెప్పి మెల్లగా నడుచుకుంటూ వెళ్లిపోయింది. సన్యాసి నా పక్కనే చాలా సేపు కూర్చున్నాడు. ఆ తర్వాత గుడిలోకి వెళ్లిపోయాడు.

అప్పటి నుంచీ కుసుమ్ రోజూ వచ్చి సాధువు ఆశీర్వాదం తీసుకునేది. ఆయన చెప్పేది శ్రద్ధగా వినేది. నది నుంచి నీళ్లు తెచ్చి ఆలయం శుభ్రం చేసేది. పూలు కోసుకొచ్చేది. మెల్లగా ఆమె ఆలోచనా విధానం మారిపోయింది. ఇదివరకూ ఏదో పోగొట్టుకున్నట్టుగా ఉండే ఆమె ముఖం ఇప్పుడు ప్రసన్నంగా మారిపోయింది. మానసికానందం పొందింది. ఆమె ఆనందంగా ఉండటంతో ప్రపంచం నాకూ ఎంతో అందంగా కనిపించింది.

ఆ తర్వాత కొన్ని రోజులకే నా ఆనందం ఆవిరైంది. ఆమె నది దగ్గరకు రావడం లేదు. గుడికి రావడం లేదు. సాధువు దగ్గరకూ రావడం లేదు. ఏమైందీ నాకూ అర్థం కాలేదు. కొన్ని రోజుల తర్వాత ఇద్దరూ కలిశారు. 'పిలిపించారా?' అడిగింది కుసుమ్. 'అవును... దైవసేవను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నావ్' అని ప్రశ్నించాడు సాధువు. దాపరికం లేకుండా భయపడకుండా మనసులోని మాటను చెప్పమన్నాడు.

దాంతో ఆమె కలవరపడింది. కాస్త కంగారుపడింది. ఏడుస్తూ అతడి పాదాల దగ్గర కూర్చుండిపోయింది. అశాంతికి కారణం చెబితే... శాంతి మార్గం చూపిస్తానన్నాడు.

'నేను సరిగ్గా చెప్పలేను. కానీ మీరు అర్థం చేసుకుంటారనుకుంటాను. నేనో కలగన్నాను. ఓ పురుషుడు నా కుడిచేతిని తన ఎడమచేతిలోకి తీసుకుని జీవితాంతం తోడుగా ఉంటానన్నాడు. కానీ అర్థంతరంగా వదిలి మాయమైపోయాడు. కానీ అతడే తిరిగి మళ్లీ ప్రత్యక్షమయ్యాడు. ఓ సాధువుగా నా దగ్గరికి వచ్చాడు. ఆ సాధువులో నా భర్తే కనిపిస్తున్నాడు. నా కల చెదిరినా ఆ అనుభూతి నన్ను వదలడం లేదు. మిమ్మల్ని ఇదివరకటిలా భక్తిగా చూడలేకపోతున్నాను. అందుకే రావడం లేదు. ఆ రోజు నుంచీ అశాంతి దూరం కావడం లేదు. అంతా అంధకారం అయిపోయింది' అంది కన్నీళ్లతో. 'కలలో కనిపించింది ఎవరో చెబితే సాయం చేస్తాను' అన్నాడు సాధువు. 'చెప్పలేను' అంది ఆమె. 'నీ మంచికే చెబుతున్నా. చెబితే నీకు సాయం చేస్తా'నన్నాడు సాధువు. 'అది.. అది... మీరే ప్రభు' అంది కుసుమ్. దాంతో సాధువు స్థాణువయ్యాడు. తర్వాత తేరుకుని మెల్లగా ఇలా చెప్పాడు.

'ఇంతవరకూ నేను చెప్పిదంతా విన్నావు. ఇది కూడా వినాలి. నేను రేపే ఇక్కడి నుంచి వెళ్లిపోతున్నాను. నువ్వు నన్ను మర్చిపోతానని మాట ఇవ్వాలి' అన్నాడు. 'ప్రభూ... అదే చేస్తున్నా' అని ఇక ఏమీ మాట్లాడకుండా అతడి పాదధూళి తీసుకుని తలకు రాసుకుంది. అతడు వెంటనే గుడిలోకి వెళ్లిపోయాడు. 'మర్చిపొమ్మని ఆదేశించారు. తప్పకుండా మర్చిపోతా' అంటూ మెల్లగా నీళ్లల్లోకి దిగింది. ఆ తర్వాత చీకట్లో నాకు ఏమీ కనిపించలేదు. పెద్దగాలి వీస్తోంది. నదిలో ఆడిపాడిన ఆమె జీవితం నదిలోనే ముగిసిపోయింది. కన్నీళ్లను తుడిచి ఆమెను అక్కున చేర్చుకుంది గంగమ్మ. ఆ తర్వాత నేనెప్పుడు రేవుకు వెళ్లినా కుసుమ్ నవ్వుతూ ఆడుకుంటున్నట్టే ఉండేది....




**నరకుల లక్ష్మి**

narakulalakshmi743@gmail.com

నరకుల లక్ష్మిగారు పశ్చిమగోదావరి జిల్లాలోని కొవ్వూరులో పుట్టినారు. పచ్చని పంటచేల నడుమన వీరి బాల్యం గడిచింది. బెంగాలీ ఆయనను వివాహ మాడి కొంతకాలం బెంగాల్లో ఉన్నారు. అప్పుడే బెంగాలీ నుడిని నేర్చుకొన్నారు. ఆ తరువాత బెంగాలీ సాహిత్యాన్ని చదవడం మొదలు పెట్టినారు. వీరికి రవీంద్రనాథ్ టాగూర్ గారి రచనలంటే చాలా ఇష్టం. రవీంద్రుడు రాసిన తొలి బెంగాలీ కతను తెలుగులోకి అనువదించడానికి ఆనందంగా ఒప్పుకొని చేసి పంపినారు. ప్రస్తుతం పాత్రికేయ వృత్తిలో ఉంటూ హైదరాబాదులో కుదురుకొన్నారు.

**మరాఠీ కత**
**1890**



# పది రూపాయల బాకీ తీర్పు

## దహా రూపాయాంచీ ఫేడ్

**హరినారాయణ్ ఆప్టే**

హరినారాయణ్ ఆప్టేగారు మార్చి 8, 1864లో మహారాష్ట్ర, ఖాందేష్ ప్రాంతంలోని పరోలి అనే పట్టణంలో పుట్టినారు. ఆయన పుట్టిన కొంతకాలానికే వారి కుటుంబం ముంబయికి చేరుకొని అక్కడ కొన్నేళ్లు ఉండి 1878లో పుణేకు వెళ్లి కుదురుకొనింది. ఆప్టేగారు చివరివరకూ పుణేలోనే ఉండిపోయినారు. మహారాష్ట్రలోని తొలితరం రాజకీయ నాయకులైన బాలగంగాధరతిలక్, వామన్ శివరామ్ ఆప్టే, వాసుదేవ్ శాస్త్రి, విష్ణుశాస్త్రి, గోపాల్ గణేశ్ అగార్కర్‌లు కలిసి జాతీయతను పెంపొందించే విధంగా, 1880లో 'న్యూ ఇంగ్లిష్ స్కూల్'ను పుణేలో నెలకొల్పినారు. ఆప్టేగారు ఈ బడిలో మూడేళ్లు చదివినారు. తరువాత తిలక్ గారూ అగార్కర్ గారూ కలిసి నెలకొల్పిన ఫెర్గూసన్ కళాశాలలో చదివినారు. ఆప్టేగారు తన కళాశాల కాలంలో మరాఠీ, సంస్కృతం, ఇంగ్లీషు సాహిత్యాలను విపరీతంగా చదివినారు. 1890లో 'కరమణూక్' అనే వారపత్రికను మొదలుపెట్టినారు. ఆప్టేగారు మొత్తం 18 నవలలను రాసినారు. అందులో పది చారిత్రక నవలలున్నాయి. స్త్రీల విద్య కోసం, మరాఠీల అభివృద్ధి కోసం పాటు పడినారు. 1897–1907ల నడుమ మహారాష్ట్రలో ప్లేగు వ్యాధి ప్రబలినప్పుడు ఆప్టేగారు స్వయంగా రంగంలోకి దిగి ప్రజలకు సేవ చేసినారు. వీరి సేవలను గుర్తించిన బ్రిటిష్ ప్రభుత్వం వీరికి 'కేసర్–ఇ–హింద్' అనే పురస్కారాన్నిచ్చి గౌరవించింది. ఆప్టేగారు రాసిన కతలను కొన్నింటిని భారత మాజీ ప్రధాని అయిన పి.వి. నరసింహారావు గారు తెలుగులోకి అనువదించినారు. ఆప్టేగారు రాసిన ఈ తొలికత స్ఫూట్ గోష్ఠి స్రవంతిలోనిది. 1890లో అచ్చయిన కత ఇది. హరినారాయణ్ ఆప్టేగారు మార్చి 3, 1919లో కన్నుమూసినారు.

ఇంట్లోని ఒక్కొక్కరికి చాలా బాధనిపించినప్పటికీ, చేసేదేముంది? గోవింద రావంటే జమదగ్ని అవతారం. ఆయన ముందు ఎవరు మాట్లాడగలరని? వాస్తవానికి పాపం ఆ నోరు లేని, గోవులాంటి ఆమెది ఏం అపరాధమని? మొగుడుమీద కోపం వస్తే పెళ్లాంమీద చూపించినట్టు కాకపోతే. మొగుడనే మనిషి గోవిందరావుకి అంతు లేని నష్టం చేసాడు. సరే, అంతులేని అన్నప్పటికీ అవధుల్లేనంత నష్టమే! అడుక్కుతినే దశకి గోవిందరావుని తీసుకొచ్చి వదిలాడు ఆ మూర్ఖుడు. తన పట్టింపులేనితనంతో అనండి కావలిస్తే వ్యసనాల వలననండి భికాజీపంత్ ఎంత నష్టం చేసాడంటే, అసలు వర్ణించలేమన్నమాట. మొత్తానికి మొత్తం షాహుకారితనమంతా మునిగే దశ వచ్చింది.

బకాయి పుస్తకాలల్లో అన్నీ అవకతవకలు చేసి కూర్చున్నాడు. అందుకని అక్కడ్నుండి తీసి రావుగారు కొత్త గంజ్‌లో పెట్టారు. అక్కడ కూడా చేరిన రెండోరోజో మూడో రోజో ఈ గృహస్థుడు చేసిన అశ్రద్ధ వల్ల అగ్నిప్రమాదం జరిగింది. భికాజీపంత్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోలేకపోయాడు. ఇటు చూస్తే తాకట్టు వస్తువుల లెక్కల్లో వచ్చిన చిక్కుముడి తేలనే లేదు. అంతలోనే ఈ దుర్ఘటన. ఈసారి మాత్రం గోవింద రావు కోపానికి హద్దు లేకుండా పోయింది. భికాజీపంత్‌ని నౌకరీ నుండి తీసివేయడమే కాకుండా మళ్ళీ తన కళ్ళెదుట కన్పడితే ఈ అగ్ని ప్రమాదం జరిగినందుగ్గాను కేసు నమోదు చేసి జైల్లో కూర్చోపెడతానని బెదిరించారు. అంతేకాకుండా నిజం చెప్పాలంటే ఆ జరిగిన అగ్నిప్రమాదంలో భికాజీపంత్ చేయి లేనిదే అది జరిగి ఉండదని గోవిందరావు మనసులో ఉండిపోయింది. భికాజీపంత్ స్వయంగా నిప్పు పెట్టాడని కాదు కానీ గోవిందరావు ఆస్తిపాస్తులను చూసి కన్నుకుట్టిన నలుగురూ ఇదే భికాజీపంత్‌కి కాస్త నిర్లక్ష్యంగా ఉండమని చెప్పి ఒప్పించో, లేదా లెక్కల్లో మోసం చేయించో ఈ నష్టాన్ని చేయించారని గోవిందరావుకీ అతని ఒకరిద్దరి మిత్రులకీ అన్పించింది. తమ దగ్గరే నౌకరీ చేస్తున్న కారణంగా గోవిందరావు తన సంశయ అనుమానాలన్నింటినీ పక్కనబెట్టి, చేస్తున్న నౌకరీ నుండి భికాజీపంత్‌ని తీసి వేయించడం తప్ప ఇంకేం చేయలేదు. అయితే భికాజీ పట్ల మనసులో ఎంత ద్వేషం ఉండి పోయిందంటే, భికాజీ కంటికి కన్పిస్తే చాలు కాలిమంట నెత్తికెక్కేది. భికాజీని ఒక్కసారి నౌకరీ నుండి తీసేసాక ఇంట్లోని చిన్నలకి పెద్దలకి గట్టి తాకీదు ఇచ్చారు. భికాజీతో కానీ, అతని భార్యా ఆరేడేళ్ళ కొడుకులతో కానీ ఎవరు మాట్లాడినా సహించేది లేదని

చెప్పారు. తన ఈ ఆదేశం అక్షరాలా అమలు జరుగుతుందో లేదోనని గోవిందరావే స్వయంగా పరిశీలించి చూసుకునేవాడు! సరూబాయి (భికాజీపంత్ భార్య) దురదృష్టం కొద్దీ – దురదృష్టవశాత్తు అనాలో లేదా అదృష్టంకొద్దీ అనవచ్చునో నాక్కాస్త అను మానంగా ఉంటుంది కానీ – నౌకరీ వదలిన సుమారు ఆరునెలల లోపలే భికాజీపంత్ చనిపోయాడు.

అయితే అతను తన భార్యని జన్మ మొత్తంలో పెట్టిన చిత్రహింసలు ఈ ఆరునెలల్లోనే పెట్టాడు. నౌకరీలో ఉండగా అతడామెని ఏదో తక్కువ హింసించాడని కాదు, హింసిం చడంలో ఏ లోపమూ ఉండేది కాదు, కానీ అపుడు కనీసం ఈ పనికోసం అయిదారు గంటలైనా బయట గడిపినప్పటి సౌఖ్యం ఉండేది. ఇక ఇప్పుడు ఉన్న  నౌకరీ కాస్తా పోయింతర్వాత ఇంటి బయటికి వెళ్ళడం పూర్తిగా మానుకున్నాడు. పైపెచ్చు ఆనాడు కష్టపడి తెచ్చిన డబ్బులతో తిని తిరిగి, ఆమెని నిలుచుంటే తప్పని, కూర్చుంటే తప్పని కొట్టేవాడు. గంజాయి కోసం రోజూ డబ్బులు కావాలని తప్ప వేరే ఏమీ పట్టింపు ఉండేది కాదు. ఇట్లాంటి పరిస్థితుల్లో అలాంటి భర్త చనిపోవడం ఆ అనాథ భార్య దురదృష్టమనాలా లేక అదృష్టమనాలా అన్న ప్రశ్న వస్తే అందులో ఏ ఆశ్చర్యమూ ఉండదు కదా!

భర్త పోయినప్పుడు సరూబాయి మరీ చిన్నపిల్ల కానప్పటికీ సుమారు పాతికేళ్ళ వయసులో ఉంది. కొడుకు ఆరేడేళ్ళ వాడు. వాడి ఉపనయనం కూడా అవలేదు. భికాజీపంత్, గోవిందరావు వాళ్ళింట్లో నౌకరీ చేసినంత కాలం గోవిందరావు భార్యా, అతని పిల్లలూ సరూబాయి కష్టసుఖాలని పుట్టింటివాళ్ళు పట్టించుకున్నట్లుగా పట్టించుకుని సాయం చేసేవాళ్ళు. దాదాపుగా ఆమె సంసారాన్ని నడిపేవారని కూడా చెప్పవచ్చు. వాళ్ళందరికీ సరూబాయి అంటే జాలి వేసేది. ఎవరయితే భికాజీపంత్‌తో మాట్లాడతారో వాళ్లందరికీ అతని భార్యమీద జాలి కలగాల్సిందే. కాని దాంతో లాభమేమి జరగకపోగా నష్టం జరిగేది. పరిస్థితి ఇలా ఉండేది కాబట్టి భికాజీపంత్‌ని నౌకరీ నుండి తీసేసారన్నప్పుడు అతడి పట్ల, తీసేయడం పట్ల ఎవరికీ బాధనపించ లేదు. అయితే అందరికీ అతని భార్యపట్ల దయ కలిగి ఆ నౌకరీ ఏదో పోకపోతే బాగుండునన్పించేది. అలా ఎంత కాలం సాగుతుందని? చివరికి అతడిని తరిమేసే ప్రసంగం రానేవచ్చింది. ఈ విషయంలో ఒక్క చెడు మాత్రం జరిగింది. అదేమంటే భికాజీపంత్ మీద ఒళ్ళు తెలియని కోపం మూలంగా గోవిందరావు అతడి పూర్తి కుటుంబాన్ని కుటుంబ సభ్యులను ద్వేషించసాగాడు. అది అతడు చాలాసార్లు చెప్పాడు కూడాను. సరూబాయికి కానీ, ఆ పిల్లవాడికి కానీ ఎవరూ ఎట్టి సహాయం చేయరాదని, చేసినట్టు తన చెవిలో పడితే తనేం చేస్తాడో తనకే తెలియదని చెప్పి పెట్టాడు. అతడి విలక్షణ తామస గుణాన్ని ఎరిగున్నవాళ్ళు, అనుభవమున్నవాళ్ళు ఎవరూ అతని

మాటను ఉల్లంఘించే ధైర్యం చేయరు. ఇలాంటి పరిస్థితుల్లో గోవిందరావు కుటుంబం లోని అందరికీ అతని కఠోరస్వభావం అంతగా నచ్చనప్పటికీ, అతని ముందు చెప్పే సాహసం ఎవరికీ ఉండేది కాదు.

ఇప్పుడిక్కడ చెప్పినప్పటికీ ఒక్కొక్కసారి నవ్వొచ్చి ఆశ్చర్యమన్పిస్తుంది కానీ నిజానికి జరిగిన విషయమేమిటంటే, భికాజీపంత్ కొడుకు – వాడిని సావ్‌ళ్యా అంటారందరూ – వాడు దారిలో కలిసాడు – వాడితోపాటు గోవిందరావు తమ్ముడి కొడుకు – వాడూ ఎనిమిది తొమ్మిదేళ్ళవాడు, ఈ పిల్లలిద్దరూ దారిలో నిల్చోవడమేమిటి మాట్లాడడమేమిటి ఒకేసారి జరిగాయి. ఆసామి కళ్ళు అప్పటికప్పుడు ఎర్రబడ్డాయి. ఇంటికి వస్తూ వస్తూనే ఆ దొంగవెధవతో మాట్లాడినందుకుగాను పాపం ఆ చిన్నపిల్లవాడిని గోవిందరావు బాగా చితకకొట్టాడు. వాడి పరిస్థితి చూసిన ఇంట్లోని ఆడవాళ్ళు ఎలా ఉండి ఉంటారో అన్నది పాఠకులు వారి వారి అంతరాత్మలని అడగాల్సిందే! పాపం ఆ బీద కుటుంబంతో అందరూ సంబంధం తెంచేసుకున్నారు. ఏం చేయగలరని?

మన ఈ కథ మొదలుకాక ముందటి పరిస్థితి ఇది. సరూబాయి భర్త చనిపోయి రెండు నెలలయింది. ఆమెకి తనవాళ్ళంటూ ఎవరూ లేకపోవడంతో భర్తమరణం తర్వాత తొందరగానే బయటికొచ్చి కాయకష్టం చేసుకోవాల్సి వచ్చింది. ఎక్కడో దూరంగా గ్వాలియర్‌లో ఎవరో దూరపు బంధువు, అత్త కొడుకో* మామ కొడుకో* ఉన్నాడని అతనికి ఉత్తరం రాసింది. నెలా రెండ్నెల్లు ఆ ఉత్తరానికి సమాధానమే రాలేదు. ఆ తర్వాత వచ్చిన ఉత్తరంలో విషయం ఏమిటంటే! నిన్నిక్కడికి రమ్మని డబ్బులు పంపేంత స్థోమత ప్రస్తుతం నాకు లేదు. నీ ఏర్పాటు నువ్వు చేసుకొని ఇక్కడికి వస్తే రా, అవసరమనుకుంటే అప్పు చేయి, నువ్విక్కడికి వచ్చాక ఆ అప్పు కాస్త కాస్తగా తీర్చివేయవచ్చు. కాస్తంతలో చెప్పాలంటే తన పరిస్థితి వివరిస్తూ, తాను ఎందుకు సరూబాయి ఉత్తరానికి తొందరగా జవాబు ఇవ్వలేకపోయాడో వివరిస్తూ, ఎందుకు ఆలస్యమయిందో చెప్తూ, దానిగ్గానూ విచారిస్తూ రాసాడు. దాంతో వెళ్ళడమా, మానడమా అనే మీమాంసలో పడింది. పిల్లవాడి చదువుసంధ్యలకి సంబంధించి అక్కడ ఉన్న వసతులు గురించి చెప్తూ ఆ బంధువుల పిల్లవాడి చదువుకి చిల్లిగవ్వ ఖర్చుపెట్టనవసరం లేదని, పైగా వాడు చదువుకొని బుద్ధిమంతుడయితే వాడే నీ బాగోగులు చూసుకుంటాడని రాయడంతో ఆమెకి అక్కడికి వెళ్దామని అన్పించసాగింది.

---

* అత్తకొడుకు, మామకొడుకు అనే మాటలను ఇక్కడ అత్తే బావు, మేబావు అని వాడినారు. బావు అంటే సోదరుడు. ఆంధ్రప్రదేశ్‌ను ఆనుకొని ఉండే విదర్భ మరాఠ్వాడా ప్రాంతాల వారు మేనరికాలు చేసుకొంటారు. ఈ అలవాటు మిగిలిన మహారాష్ట్రలో లేదు. మేనత్త మేనమామ పిల్లలను సోదరుని వరుసగా భావిస్తారు.

కానీ ఏం చేయగలదు? తల్లీకొడుకులిద్దరికి అయ్యే దారిఖర్చులు లేవాయెను. లేదు లేదన్నా పది, పదిహేను రూపాయలన్నా దగ్గరుండాలి. ఎక్కడ్నుండి తేవాలి? అయిదు రూపాయలు రావాల్సి ఉంది. అప్పుడు చక్కని అవకాశం వచ్చి కూడా అద్దెకివ్వాల్సిన డబ్బు లేకపోవడం వలన, సరూబాయి పోయిన ఈ అవకాశాన్ని కొన్ని రోజుల పాటు తన మనసులోనే ఉంచుకుంది. ఉండనివ్వండి. ముందుకెళ్ళి సాగబోయే మన చిన్నకథ ఈ నిజదృష్టాంతం మీద ఎక్కువగా ఆధారపడుతుంద నుకోండి. కాబట్టి ఇంకిప్పుడు ఇంకేదీ రాయకుండా సూటిగా కథే మొదలుపెడతాను.

గోవిందరావు తాత్యాగారి ఇద్దరమ్మాయిలు కొద్దిరోజులు పుట్టింట్లో ఉండిపోదామని వచ్చారు. చిన్నమ్మాయి లక్ష్మీబాయి మొదటికాన్పుకని వచ్చింది. పుట్టిన బిడ్డకి మూణ్నెల్లు పడ్డాయి. ఇక ఓ వారం పదిరోజుల్లో పిల్లవాడితో సహా భర్త దగ్గరికి వెళ్ళే సన్నాహాల్లో ఉంది. పెళ్ళయిన ఆడపిల్లలకి పుట్టింటినుండి అత్తారింటికి వెళ్ళేప్పుడే ఏమేమి తీసికెళ్ళాలో ఏమిటో అన్పిస్తూ అదే ధోరణిలో సాగుతుంటుంది. అమ్మ హృదయం, అడిగినా అడక్కున్నా వాళ్ళకేం ఏం కావాలో అవి ఇస్తూనే ఉంటుంది. ఇచ్చే జాబితా కూడా పూర్తవడానికొచ్చింది. ఇక పెట్టెచీరలు తీసుకోవడం ఉండి పోయింది. ఇద్దరికీ మేలురకం పదిహేను పదిహేను రూపాయల మంచిచీరలు తీసుకోవాలనుకున్నారు. గోవిందరావు అయితే, ఆ పల్లెటూళ్ళో మంచిచీర ఎక్కడ దొరుకుతుంది? దగ్గర్లోని పేట నుండి తెప్పించుదామని అనుకున్నారు. దీంతోపాటు తండ్రీకూతుళ్ళకు, చీరలకి బదులుగా డబ్బే రొక్కంగా ఇస్తే బాగుంటుందనే సలహా తల్లి నుండి వచ్చింది. లక్ష్మీబాయి తల్లితో అదే విషయం చెప్పుకొచ్చింది. మనసుకి నచ్చిన చీర ఆ ఊళ్ళో దొరకనయితే దొరకదు, వేరే ఊర్నుండి తెప్పించే బదులు ఎవరి ఊళ్ళల్లో వాళ్ళు తీసుకుంటే సరిపోతుందనుకున్నారు. ఈ మాట నిన్న పొద్దుటది. రెండవ రోజు ఏదో మంచి ముహూర్తాలున్న రోజు అని లక్ష్మీబాయినీ పసిపిల్లవాణ్నీ దైవదర్శనానికని పంపడం జరిగింది. గుళ్ళోకి వెళ్ళాక అక్కడ సరూబాయి కనపడింది. లక్ష్మీబాయికి సరూబాయి మీద మొదట్నుండీ ఇష్టమే. ఇద్దరూ మంచి స్నేహితురాళ్ళనుకోండి! లక్ష్మీబాయి సరూబాయికన్న ఓ నాలుగయిదేళ్ళ చిన్నది. తండ్రి కఠిన ఆజ్ఞ తెలిసినప్పటికీ సరూబాయి దీనావస్థ చూసింతర్వాత లక్ష్మీబాయి మనసు కరిగిపోయింది, వెళ్ళి మాట్లాడింది. అంతేకాదు, రెండు గంటలు అక్కడ కూర్చుని, సరూబాయిని కూర్చో బెట్టుకొని ఆమె దురదృష్టపు ఖర్మని, ఆ కథని ఒక్కసారి పూర్తిగా విన్నది. ఆ కథలో తన దగ్గర పది పదిహేను రూపాయలు లేని కారణంగా ఇక్కడే ఉండిపోవాల్సి వచ్చిందనీ, దాని మూలంగా పిల్లవాడి విద్యాభ్యాసాలకు గొంతునులమాల్సి వచ్చిందనీ చెప్పుకొచ్చిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనుకుంటాను.

అన్ని మాటలకూ ఓ తుది ఉండాల్సిందే, అట్లాగే ఒకరికొకరు తమ వేదనలను చెప్పుకొన్నాక ఆ స్నేహితురాళ్ళ హితవచనాలు ఒక దగ్గర ముగియాల్సిందే. ఆ

వరసలోనే ఈ లక్ష్మీ సరస్వతుల సంవాదం కూడా ముగిసి తమతమ ఇళ్ళకు బయలుదేరారు. ఎన్నో రోజులుగా మనసును తొలిచివేస్తున్న దుఃఖాన్ని ఆత్మీయురాలి దగ్గర కక్కేసిన తర్వాత సరూబాయి మనసు కాస్త కుదుటపడింది. కానీ సరూబాయి దగ్గర కేవలం పది పదిహేను ఇరవై రూపాయలు లేకపోవడం వల్ల అంత పెద్ద నష్టం జరగడం లక్ష్మీబాయి మనసుకి చాలా బాధనిపించింది. ఇట్లాంటి సమయం లోనైనా నిస్వార్థంగా, తండ్రి ఆజ్ఞని పక్కనబెట్టి ఆ డబ్బును సరూబాయికివ్వాలనే ఆలోచన ఆమె మనసులోకి మాటిమాటికీ రాసాగింది. తండ్రి ఎలాగూ శ్రీమంతుడే, చీరకిస్తానన్న పదిహేను రూపాయలు కాక కావాలంటే మరో పదిహేను రూపాయలు కూడా ఇవ్వగలడు. కానీ ఇది భికాజీపంత్ కుటుంబానికి సంబంధించిన విషయమై కూర్చుంది. అసలే తండ్రికి ఆ కుటుంబం మీద విపరీతమైన కటాక్షం, ఇక డబ్బులిచ్చే మాటెక్కడ? ఇదంతా తెలుసును కనకే లక్ష్మీబాయి నిన్నటిరోజు తల్లి సూచించిన విధంగా చీరకి ఇచ్చే పదిహేను రూపాయలు తీసేసుకుని దాన్ని సరూబాయికి ఇచ్చేయాలని నిర్ణయించుకుంది.

లక్ష్మీబాయిది పరోపకారపు గుణం, ఈ సద్విచారం మనసులోకి రాగానే దాన్ని అమలు చేయాలని నిశ్చయించుకుంది. అనుకున్నదే తడవు రేపు అత్తారింటికి వెళ్ళా లనగా తండ్రి ఇచ్చే డబ్బు తల్లి దగ్గర్నుండి తీసుకొని వెళ్ళి సరూబాయికి ఇచ్చింది. ఇంత డబ్బు చేతికి అందడం చూసుకున్నాక సరూబాయి, సావ్‌ళ్యాల ఆనందానికి అంతులేకపోయింది. వాళ్ళ ఆనందం చూసి లక్ష్మీబాయి మనసు కరిగిపోయింది. పరోపకారం ఎంత చిన్నదయినప్పటికీ అదిచ్చే ఆనందం అవర్ణనీయం.

**రెండవ ప్రకరణం**

క్రిందటి ప్రకరణంలో చెప్పిన విషయాలు గడిచిపోయి అప్పుడే ఇరవై ఏళ్ళు అయింది. ఇరవై ఏళ్ళు పాఠకుల్లారా! ఇరవై ఏళ్ళు అనే నాలుగక్షరాలు రాయడానికి ఈవిధంగా అవకాశం వచ్చిందంటారా? కానీ ఇరవై ఏళ్ళ కాలం ఎంత అగాధమైనది? ఒకసారి వెళ్ళిన ప్రదేశానికి తిరిగి మళ్ళీ ఇరవై ఏళ్ళ తర్వాత వెళ్తే ఎన్నెన్ని మార్పులు కన్పిస్తాయి మీకు? ఇరవై ఏళ్ళ ముందట గుడిసెను చూసిన చోట, ఎవరికి తెలుసు, మీకు పెద్ద గొప్పవాళ్ళ భవనమో, లేదా ఒక అందమైన గుడినో కన్పడవచ్చును. అలాగే ఒకప్పుడు పెద్దభవంతి స్థానంలోనే దానికి సంబంధించిన శిథిలాలు పిల్లీకుక్కల మూత్రస్థానాలుగా మారి కన్పడవచ్చును. ఇదిలా ఉండనిస్తే ఎవరయితే మీ సమ వయస్కులో, ఒకవేళ వాళ్ళింకా బ్రతికి ఉన్నట్టయితే మీలాగే వాళ్ళూ ముసలి పండుల యారని మీ దృష్టికి వస్తుంది. ఎవర్నయితే మీరు వాళ్ళ బాల్యావస్థలో చూసారో వాళ్ళంతా ఇప్పుడు యుక్తవయస్కులయి మిమ్మల్ని అసలు గుర్తుపట్టలేరు. మీరూ వాళ్ళను గుర్తించలేరు. అప్పుడు మేము మా రాతకోతల ములికిని సిహాయి (ఇంకు)లో

ముంచి మా కథలో ధడేలున ఇరవై ఏళ్ళు ముందుకు లాగగలం. అదే విధంగా ఇంకిప్పుడు మా కథల్లోని వ్యక్తుల మధ్యంతర స్థితిగతుల గురించి కూడా ఇక్కడ రాయడం అవసరం. అయితే ముందట్లాగా ఒక్కోకళ్ళ గురించి వర్ణిస్తూ కూర్చోవడం కంటే ఒక్కసారిగా మా పాఠకులను తీసికెళ్ళి లక్ష్మీబాయి ఇంట్లో వదిలేస్తే సరి– లక్ష్మీబాయి, ఆమె పిల్లలు, భర్త – వాళ్ళ పరిస్థితుల్ని వాళ్ళే చూస్తారు.

ప్రస్తుతం ఇంట్లో లక్ష్మీబాయి ఒక్కర్తే ఉంది. సుమారుగా నలభై– నలభై రెండేళ్ళ వయసులోకొచ్చింది. నలభైయవ పడిలో స్త్రీలకు స్థూలకాయం వస్తుంది. లక్ష్మీబాయికీ వచ్చింది. ఆమె నల్లటి కురుల్లో అక్కడక్కడ ఒక్కో వెంట్రుక రాగిరంగుకు వస్తూ వస్తూ నెరిసి తెల్లగా కన్పిస్తున్నది. మొహంలో దుఃఖపు ఛాయలు, కష్టాల్లో ఉన్నట్టుగా తెలుస్తున్నది. తిరిగి మా పాఠకులను ఆమె ముందుకు తీసికెళ్ళే ఈ రోజు ఆమెకు మరింత ఉద్విగ్నభరితమయినది. గడిచిన ఇరవై సంవత్సరాల్లో ఆమెకి ఆరేడుగురు పిల్లలు పుట్టి దక్కకుండా పోయారు. దాంతో మనసులోని ఉద్విగ్నత మొహంలో చోటు చేసుకుంది. ఇది చాలదన్నట్టు గత వారంరోజులుగా ఆమె మరింత ఉద్విగ్ను రాలయింది. ఏదయితే మనం చెప్పుకున్నామో ఆ ఒకే ఒక్క పిల్లవాడు మాత్రం బ్రతికాడు. ఇక వాడి మీదే తల్లిదండ్రులు ప్రాణాలన్నీ పెట్టుకున్నారని చెప్పనక్కరలేదను కుంటాను. వాడి మీదనే వాళ్ళ ఆశలన్నీ పెట్టుకున్నారు. లక్ష్మీబాయి భర్త పెన్షన్ వయసులోకొచ్చేసారు. తీసుకున్నారు. తీసుకున్నారనేకంటే ప్రభుత్వం అతనిని పెన్షన్ తీసుకునేలా చేసిందని చెప్పడం ఇక్కడ అనువుగా ఉంటుంది. ఇక ఆ పెన్షన్ అంతా కలుపుకొని యాభై రూపాయలు చేతికొస్తుంది. అయితే పై అధికారి అనుగ్రహం ఉండడంతో (పెన్షన్‌తో పాటుగా), వాళ్ళ అబ్బాయికి పరీక్షలూ ప్రతిఫలాల పట్టింపూ లేకుండా వాళ్ళ ఆఫీసులో తిజోరీ క్లర్క్‌గా నలభై ఏళ్ళవాళ్ళు చేయాల్సినుద్యోగం వీళ్ళ కొడుకుకు ఇచ్చాడు. దాంతో పెద్దగా కష్టమూ లేదనే చెప్పాలి. కానీ గత వారం రోజులుగా విశ్వనాథుడి చిత్తం కాస్త తిరిగినట్టుగా ఉంది. ప్రవర్తన మారి కసురు బోతుతనం వచ్చినట్టుగా అన్పిస్తున్నది. పట్టి నాలుగుముద్దలు తినడం లేదు. రాత్రిళ్ళు వేళకి ఇంటికి రావడం లేదు. రాత్రి పన్నెండు, ఒంటి గంట వరకు బయటి తిరుగుళ్ళు, తల్లి పొరపాటున ఎక్కడికెళ్ళావింతసేపు అంటే విపరీతంగా కోపం తెచ్చుకోవడం లేదా 'నీకెందుకు నేనెక్కడికెళితే' అనే సమాధానం. ఈ పరిస్థితుల్లో ఎంత తల్లి అయినప్పటికీ, వీటన్నిటి నుండి తాను దూరంగానే ఉండాలన్పించింది లక్ష్మీబాయికి. కానీ వారం మీద వారం అదే పరిస్థితి కొనసాగడంతో, పూర్వంలాగా కొడుకు ఉత్సాహంగా ఉంటాడన్న నమ్మకం సన్నగిల్లడంతో లక్ష్మీబాయి తల్లిమనస్సు బాగా కష్టపెట్టుకుంది. విశ్వనాథ్ ప్రవర్తన పూర్వం ఎప్పుడూ ఇలా లేదు. సరళ స్వభావం, మాతృపక్షపు పిల్లవాడు అతను. కేవలం గడిచిన పదిహేను రోజుల్లో ఏం జరిగిందో కానీ అతని స్వభావం యెకాయెకిగా మారిపోయింది. మునుపటి వర్చస్సూ

తేజమూ లేదు, మాతృభక్తి ఎప్పుడో కొడిగట్టింది. తండ్రి కళ్ళల్లో పడడమే మానేసాడు. ఏదో పెద్ద దుష్కారణం. ఆప్తులని, ఇష్టులని తప్పించుకొని తిరగసాగాడు. అయినప్పటికీ ఎవరేమన్నా అడిగితే చెప్పక తప్పదన్నట్టు తప్పించుకునే జవాబులు చెప్పేవాడు. అతని మీద ప్రేమ ఉన్న వాళ్ళందరూ ఈ తప్పించుకుని తిరిగే వ్యవహారం గురించి అసంతృప్తి చెందేవారు. దాంతో ఇంకా గుచ్చిగుచ్చి, ప్రేమతోనే అనుకోండి, అతని అసంతృప్తికి కారణాలడిగేవారు. విశ్వనాథ ప్రవర్తనకి కారణం మాత్రం బోధపడలేదు. మొదట్లో తల్లి ఇదేంటని అడిగినప్పుడు ఏదో జారుడు సమాధానాలు చెప్పేవాడు. తర్వాత విషయం తెల్సుకుందామని అడిగినట్టుగా అడిగితే పొడి పొడిగా, ఆ తర్వాత కఠినంగా జవాబు చెప్పాడు. అది విన్నప్పటి నుండి ఆ తల్లి మనసు దుఃఖంతో మునిగిపోయింది. తర్వాత్తర్వాత అతడిని ఏదైనా ప్రశ్నించాలన్నా ఆ తల్లికి భయం వేయసాగింది. భర్తతో గట్టిగా అడిగించవచ్చునంటే పనిమీద భర్త ఊరెళ్ళాడు. ఆయన వెనకాల పిల్లవాడి ప్రవర్తన హఠాత్తుగా ఇలా మారిపోయింది. దాంతో ఈ వారం రోజులుగా విపరీతమైన దిగులుతో సగం అయిపోయింది.

తల్లిహృదయం కొడుకు తిరస్కారాన్ని కూడా పట్టించుకోకుండా రెండు మూడుసార్లు మనసును దిట్టపరచుకుంది. ఎంతయినా మళ్ళీ విశ్వనాథ్‌ని ప్రశ్నించకుండా ఉండ లేకపోతున్నది. అందుకే తిరిగి మళ్ళీ ప్రశ్నించినప్పుడు మొదటిసారి కన్నా ఎక్కువ తిరస్కారంగా మాట్లాడాడు కొడుకు. చివరికి చేసేదేం లేక, మామూలు ఆడవాళ్ళందరి లాగా ఆమె కూడా మనసులోనే కుళ్ళిపోసాగింది. ముందుముందు ఇంకేం చేయాలో ఆవిడకేం తోచలేదు.

## మూడవ ప్రకరణం

ఎకాయెకిగా విశ్వనాథ్ ప్రవర్తన ఇలా మారడానికి ఏమి కారణమయుంటది. స్వతహాగా నువ్వు మొహంతో తల్లి కనుసన్నల్లో మెలిగే ఈ కుర్రవాడి ప్రవర్తన ఎందుకిలా మారిపోయింది? ఏం జరిగి ఉంటుంది? ఏది జరిగినప్పటికీ తనకెంతో ప్రియమైన సాదాసీదా బోళా మనిషి అయిన తన తల్లికి చెప్పకూడనిది ఏమిటయుంటుంది? చెప్పడానికి సిగ్గనిపించి చిత్తానికి ఖేదమనిపించిందా! అతడి మనసులో దూరి చూడగలమా? లేకపోతే పొద్దుట్నుంచి సాయంకాలం వరకు అతడి వెనకే ఉండి రోజంతా అతడేం చేస్తున్నాడో గమనిద్దామా అంటే విశ్వనాథ్ తన గదిలో గడియ వేసుకొని మరీ ఒక్కడే ఏదో రాసుకుంటూ కూర్చున్నాడాయె. ఇక మనం అక్కడికీ వెళ్ళి చూద్దాం అతని గూఢ రహస్యాలు ఏమయినా అర్థం అవుతాయేమో!!

సగం సగం రాసిన కాగితాలని ముందేసుకొని రెండుచేతుల్తో తలపట్టుకొని కూర్చుని ఉన్నాడు. విశ్వనాథ్ మొహం మీద అంతులేని దుఃఖపు ఛాయలు. ఎదురుగా

ఉన్న ఒక ఉత్తరం మీద అతని చూపంతా నిలిచి ఉంది. ఆ ఉత్తరంలో అంతగా ఏం రాసి ఉందో చూద్దాం రండి!

మహారాజశ్రీ శ్రీధర్‌పంత్ ఫడ్‌కే, ముంబాయి గారికి....

మీరు వెళ్ళిన దగ్గర్నుండి రూపాయల సంగతి పక్కకి పెడితే ఒక చిన్న ఉత్తరం ముక్క కూడా లేదు. నాకు మెడకు ఉరి పడ్డట్టుగా ఉంది. ఎలాంటి సమయంలో ఎప్పుడెలా వస్తుందో చెప్పలేం. అదీకాక ఎల్లుండి పై అధికారులు కొత్తవాళ్ళు వస్తున్నారు. ఛార్జ్ తీసుకునేప్పుడు ఏమవుతుందోనని గాభరాగా ఉంది. దయచేసి నా గౌరవం కాపాడండి. లేకపోతే....

ముందు ఇంకేదో రాద్దామనుకున్నట్టు తోస్తుంది. రాయడం పక్కన పెట్టి, ఇదివరకు చెప్పినట్టుగా, విశ్వనాథ్ తల పట్టుకొని కూర్చున్నాడు. కొద్దిసేపలా కూర్చుని, ఏదో గుర్తొచ్చినట్టు ఒక్కసారిగా లేచాడు. గదిలోనే అటూ, ఇటూ తిరగసాగాడు. ఆ నడిచే వేగంలో అతని మనసులోని ఆలోచనావేగం కానరాసాగింది. ఆ ఆలోచనలు మనసులో ఆగకుండా, అతడి నాలుక మీదకి వస్తున్నాయా అన్నట్టు అతను తనలో తాను కాకుండా పైకి గట్టిగా మాట్లాడుకోసాగాడు.

చాలు. చాలిక. ఇంతకు మించి గత్యంతరం లేదు. ఎల్లుండి పొద్దటి వరకు మనియార్డర్‌లో డబ్బులు రాకపోయినట్టయితే వెంటనే అనుకున్న పద్ధతి అమలు చేయాల్సిందే. ఆఖరి వరకూ వస్తుందన్న ఆశ ఉంచుకోవాలి కాబట్టి వస్తుందనుకోవాలి, అంతే కానీ గడిచిన ఇన్ని రోజులుగా ఒక్క ఉత్తరం ముక్క కూడా రాయని ఆ గృహస్తుడు ఖచ్చితంగా లుచ్చా వెధవనే. నన్ను నాశనం చేయడానికే వాడింతా చేసాడు. అంతేకాక ఇప్పుడీ భయంకరమైన సంకటంలో వేసాడు. అరే ఆ కౌషల్‌తో ఎంత మోహంలో పడ్డాను. అమ్మని, ఎప్పుడూ ఒక శబ్దంతో అయినా నొప్పించని అమ్మని ఇప్పుడు ఎంత నొప్పిస్తున్నాను. హతాశురాలయి ఏమీ చేయలేక తనలో తాను ఏడ్చుకుంటుంది పాపం. అదీ నా ఎదుట నేను చూస్తూండగా! నా వెనకబడి ఇదంతా తెల్సుకొని పాపం ఆ పిచ్చితల్లి జన్మంతా ఏడ్చేదానికన్నా, ఇప్పుడు ఏడ్వడం మంచిది. ఈ భయంకరమైన అనర్థం తనకి తెల్సి గుండె పగలడం కన్నా ఇది ఉత్తమం. ఇదే సరయింది అన్పిస్తుంది నాకు. ఆ నిష్కళంకమైన తల్లి ముందు నా ఈ కళంకితమైన మొహం చూపడానికి కూడా నాకు సిగ్గవుతుంది. కానీ ఏం చేయను? ఇలా చేయడం తప్ప, ఆ సంగతులన్నీ దాచి పెట్టడం తప్ప వేరే దారి లేదు. కానీండి. ఎల్లుండి కల్లా ప్రతిఫలాలు వస్తాయి, అప్పుడు ఈ నా ఉత్తరం ద్వారా జరిగిన సంగతులన్నీ ఒక్కసారిగా తనకి తెలిసిపోయి, తన సౌఖ్యపు రోజులు అంతరించిపోతాయి. ఆ గడ్డురోజులు తనకి అలవాటు కావాలంటే ఇప్పుడీ తిరస్కారపు అనుభవం కావాల్సిందే! అరే, పాపం ఆ తల్లితండ్రుల మీద ఎంత కష్టం వచ్చి పడింది? మొత్తం వంశానికే మచ్చ

తెచ్చిన నేను అసలెందుకు పుట్టాను? నా వెనుక పుట్టిన వాళ్ళందరూ పోయినట్టే నేనూ పోయుంటే ఈ లోకానికి భారం తగ్గేది కదా! పిచ్చి తల్లితండ్రులు మరో ఏడుపు ఏడ్చి ఊర్కునేవారు. ఇప్పటి ఈదుఃఖం కంటే ఆదుఃఖమే నయమనుకునేవారు. ఛ... ఇంక వద్దు. ఆ ఉత్తరం ఏదో ఇప్పుడే పూర్తి చేస్తాను. ఇవాళ్టి పోస్ట్‌లో పంపాల్సిందే ఎల్లుండి లోపు అతని ఉత్తరం, డబ్బు వస్తే సరే సరి. బతికిపోతాం. అమ్మకి ఏమీ తెలియకుండా, చెప్పకుండా గడిచిపోతుంది. నేను తిరిగి మునుపటిలా సంతోషంగా ఆజన్మాంతం సుఖంగా ఉండవచ్చును. అమ్మని సుఖంగా ఉండేట్టు చూసుకోవచ్చును. లేకపోతే, పాపం అమ్మ.....

ఇట్లాంటి ఆలోచనలతో నిండిన బుర్రతో విశ్వనాథ్ మళ్ళీ పెద్ద పెద్ద అంగలతో గదంతా తిరగసాగాడు. కాస్తంత సమయం గడిచిపోయింది. మళ్ళీ అతడు వెళ్ళి ఇంతకు ముందు కూర్చున్న దగ్గరే కూర్చున్నాడు. తను రాసిన ఉత్తరాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. చదివి చూసుకున్నాడు, ఎక్కడ ఏ విషయం దగ్గరైతే వదిలాడో అక్కడ్నుండి తిరిగి రాయడం మొదలు పెట్టాడు. కొంతసేపటి దాకా బరబరా రాస్తుండిపోయాడు. తిరిగి పూర్తి ఉత్తరాన్ని చదివి చూసుకుని మళ్ళీ రాయడం మొదలు పెట్టాడు. ఒక గంట సేపు ఈ కార్యక్రమం సాగుతూనే ఉంది. చివరకి పాపం అతడి ఆ ఉత్తరం రాయడం ముగిసినట్టుగా ఉంది. ఉత్తరం రాసిన కాగితాలని కవర్లో పెట్టి వెనువెంటే దానిమీద చిరునామా రాసి లేచాడు. బట్టలు మార్చుకుని బయటపడ్డాడు. పోస్టాఫీసుకెళ్ళి ఉత్తరాన్ని డబ్బాలో వేసాడు. వెంటనే తిరిగి ఇంటికి వచ్చి, మళ్ళీ ఏదో రాస్తూ కూర్చున్నాడు. అది నాలుగు గంటలపాటు సాగింది. ఎన్నోసార్లు రాస్తూ రాస్తూ ఆగాడు, రాసిన ఒకటీ అరా కాగితాలు చదివిచూసి చింపేసాడు. ఎగశ్వాస తీసుకుంటూ అటూ ఇటూ తిరిగాడు. వెళ్ళి పూర్వపు స్థానంలో రాసుకునే చోట కూర్చున్నాడు. ఇదలా సాగుతూనే ఉంది. చివరకి మూడు కాగితాలు సుమారుగా రాసింతర్వాత వాటిని చేతిలోకి తీసుకుని అటు ఇటూ తిరుగుతూ చదివి చూసుకున్నాడు. తిరిగెళ్ళి కూర్చుని రాయడానికి సన్నద్ధుడయాడు. మొదటిభాగం బహుశా కరుణరసంతో నిండి ఉండి, పాఠకులకు కన్నీరు తెప్పించేదిగా ఉన్నట్టుంది. విశ్వనాథ్ ఒకచేత్తో కారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ రెండోచేత్తో అదేపనిగా రాస్తూ పోతున్నాడు. కూర్చున్న దగ్గరి నుండి లేవలేదు. ఒక చేత్తో ఉబికి వస్తున్న కన్నీళ్లను తుడుచుకొంటున్నాడు. క్షణక్షణానికీ నిట్టూర్పులు విడుస్తున్నాడు. రాయడం మాత్రం సాగుతూనే ఉంది. చివరికి రాసేదేదో పూర్తయినట్టుంది. ఆరు కమ్మలు అయినట్టున్నాయి. రెండుమూడు సార్లు ఆ ఆరు పేజీలను చదివిచూసుకున్నాడు. తర్వాత ఒక విచిత్రమైన తరహాలో కవరు తయారు చేసుకున్నాడు. అందులో రాసిన కాగితాలని వేసి కవరుని అంటించి ఒక పెట్టెలో పెట్టాడు. ఇంత చేసింతర్వాత తనకి కొంచెం ఊరటలాగా అన్పించినట్టు అయింది. అదే గదిలో పచార్లు చేయసాగాడు. మనసెలాగో అయి నానా తరహాల

ఆలోచనలు రాసాగాయి. పచారీలు కొట్టికొట్టి అలసినట్టుగా అయింతర్వాత చివరకి వచ్చి మంచం కాళ్ళకట్ట దగ్గర ఒళ్ళు వాల్చాడు. వెంటనే నిద్రాదేవి తన సుఖపాశంలోకి అతడిని తీసుకుంది. పాపం అతడికి కనీసం ఆ నిద్రాసమయంలో అయినా ఆ మనోవేదన నుండి విముక్తి కలుగుతుంది.

**నాలుగవ ప్రకరణం**

విశ్వనాథ్‌వాళ్ళ ఆఫీసుకు కొత్తగా రావల్సిన పై అధికారి దీపావళికి రెండు రోజుల ముందు వచ్చి కొత్త ఛార్జ్ తీసుకోవాల్సింది. అంతకుముందున్న అధికారి ఏమీ పట్టించుకునేవాడు కాదు. పని చేసేవాడూ కాదు. దాంతో అతడి క్రింద పనిచేసే గుమాస్తాల కందరికీ పండగలా ఉండేది. దాంతో విశ్వనాథ్‌కి ఆ పై అధికారుల కనుసన్నల్లో మెలగాల్సి వచ్చేది. ప్రత్యక్షంగా మోహంలో పడే ప్రసంగం వచ్చేదాకా అందరూ శూరవీరులే. కాని మోహాకర్షణ ఎదుటుండి, దాని గుప్పిట్లో పడకుండా తప్పించుకునే శూరులు ఎంతమంది ఉంటారని! పాపం విశ్వనాథ్ రెండవ తరహాలోకి రానివాడు. దాంతో ఎవరు తనమీద తప్పుపెట్టినా ఊర్కొనేవాడు. అయితే తానలాంటి వాడిని కాదని, ఆలోచించి మరీ ఆరోపించాలని, లేకుంటే అది కుదరదని ముక్కు సూటిగా చెప్పలేక పోయేవాడు. విశ్వనాథ్ చేతిలోదేమో తిజోరీ పనాయె. పైగా శ్రీధర్‌పంత్ ఫడ్క్యా లాంటి నీచులు అతడికి ఆశ పెట్టడానికి గాలం వేసేందుకు తయారుగా ఉండిరి. ఇంకేం! శ్రీధర్‌పంత్ లక్షమాటలు చెప్పి విశ్వనాథ్ మనసుకి గాలం వేసి, మూడువందల రూపాయలు తిజోరీ నుండి తీసి శ్రీధర్‌పంత్‌కి మూడు రోజుల కోసం ఇచ్చేట్టు చేయగలిగాడు. పాపం విశ్వనాథ్ భోళా మనిషి. ఆ పచ్చితనంలో అదీ ఎదుటివాడి మాయమాటల్లో పడి – వాడి మాటలు విని తన ఆధీనంలోని తిజోరీ నుండి మూడువందలు తీసి వాడికిచ్చాడు. డబ్బు శ్రీధర్‌పంత్ చేతిలో పడింది. ముంబాయికి వెళ్తూనే ఆ డబ్బు పంపుతానని, ఆ తర్వాతే తను ముందుకు వెళ్ళి తన ఊరికెళతానని కల్లబొల్లి మాటలు చెప్పి శ్రీధర్‌పంత్ విశ్వనాథ్ మెళ్ళో ఉరితాడు వేసాడు. మూడురోజులు పోయి వారం తిరిగింది, పక్షం గడిచింది. ఊరు పెద్దదే కాబట్టి తిజోరీలు బాగానే ఉండేవి కాబట్టి ఇదే తిజోరీ నుండి డబ్బు తీసే అవసరం పడలేదు. దీనివల్ల పాపం విశ్వనాథ్ ఇప్పటివరకు తప్పించుకోగలిగాడు. ఇప్పుడిక తప్పించుకోవడం కుదరదని అతడికి తెల్సిపోతూ ఉంది. వచ్చే పై అధికారి ఛార్జ్ తీసుకోవడంతోటే పనులన్నీ పరీక్షించడం తథ్యం. అప్పుడు బాకీ వసూళ్ళ లెక్క చూసుకునేప్పుడు తక్కువయిన డబ్బు లెక్కకి రానే వస్తుంది. వెంటనే చేతికి సంకెళ్ళు, మన యాత్ర జైలు వైపు. ఈ తరహా ఆలోచనలతో విశ్వనాథ్ భయపడి హతాశు డవుతున్నాడు. పై నిష్ఠుర నిజాన్ని చెప్పేసాక ఇప్పుడు పాఠకులకు విశ్వనాథ్ ప్రవర్తనలోని మార్పుకి కారణం అర్థం అయిందనుకుంటాను.

శ్రీధర్‌పంత్‌కి ఉత్తరం వేసిన మరురోజు నుండి విశ్వనాథ్ ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. అది లక్ష్మీబాయి దృష్టిలోకి కూడా వచ్చింది. ఆరోజు విశ్వనాథ్ బయటికి ఎక్కడికీ వెళ్ళకుండా, గదిలోనే ఒంటరిగా కూర్చుని, పెద్దగా ఏడ్వడం ఆమె చెవుల్లో పడింది. లక్ష్మీబాయి సర్వేంద్రియాలు పిల్లవాడి చుట్టూనే ఉన్నాయి. విశ్వనాథ్ ఏడుపు వినీ విన్పించగానే లక్ష్మీబాయి అతడి గదిలోకెళ్ళి కొడుకుని గట్టిగా పట్టుకొని నీకొచ్చిన కష్టమేమిటో చెప్పమని అతడి వెనకాల పడింది. చివరకు నువ్వు చెప్పేంతవరకు ఇక్కడ నుండి కదలను, చెప్పకపోతే ప్రాణం తీసుకుంటానని, బెదిరించేంత వరకు వచ్చింది. ఇక దిక్కుతోచని దశలో సరే రేపు తెల్సేదేదో ఇవాళ తెలిస్తే పోయేదేముందని విశ్వనాథ్‌కి అన్పించింది. మొదట్నుండీ జరిగిందంతా తల్లికి చెప్పాడు. అది వినీవినగానే తల్లి అతన్ని సమాధాన పరిచింది. తనవి ఓ రెండు నగలు తీసిచ్చింది. “వెళ్ళు త్వరగా వీటిని తాకట్టు పెట్టి డబ్బు తెచ్చుకో పిచ్చివాడా, ఇదే మాటను పదిరోజుల్నుంచీ చెప్పకుండా దాచుకున్నావా?” అంది. ఈ విషయం ఆమె మనసుని ఎంత నొప్పించిందో తెలియదుకానీ ఆ సమయంలో మాత్రం కొడుకు మనసుని నొప్పించే ఒక్కమాట కూడా అనలేదు. ఇలాంటి దేవతలాంటి తల్లిపట్ల తన దుష్ప్రవర్తన, దానిపట్ల కూడా తనను ఏమీ నిందించని తల్లిని చూసి, విశ్వనాథ్‌కి చాలా బాధనిపించింది. తల్లిని ఇన్ని రోజులుగా కష్టపెట్టినందుకు సిగ్గుపడ్డాడు. దాంతోపాటు మనసులోని గుదిబండలాంటి కష్టాన్ని తల్లితో పంచుకోవడం వల్ల మనసు తేలికయింది.

పైన చెప్పిన తల్లీకొడుకుల సంభాషణ తర్వాత కాసేపటికి విశ్వనాథ్ కచేరీకి వెళ్ళాడు. వెళ్తూ వెళ్తూనే అడుగు పెట్టాడో లేదో దురదృష్టవశాత్తూ అతడి చెవిలో భయంకరమైన ఓ విషయం పడింది. వచ్చే పై అధికారి రేపు కాకుండా ఇవాళ్టి రోజే ఛార్జ్ తీసుకుంటున్నాడన్న విషయం తెల్సింది. ఇది విన్న వెంటనే విశ్వనాథ్ కాళ్ళ క్రింద భూమి కదిలినట్టయింది. చెమట పట్టింది. సాయంత్రం లోపు ఆ మూడు వందలు సర్దేసి ఆ పని చూసుకుందామనుకున్నాడు. కానీ అధికారి ఇప్పటికి ఇప్పుడే ఛార్జ్ తీసుకుంటాడంటే ముందు ఆ డబ్బు కట్టాలి. ఇంత తొందరగా ఎలా కట్టాలో విశ్వనాథ్‌కి తోచలేదు. కచేరీ నుండి పారిపోతే బాగుండుననే ఆలోచన వచ్చింది. ఎక్కడికి పారిపోగలడు? వచ్చిన అధికారి ఇవాళ్టికివాళే మిగిన బాకీ లెక్కలు చూస్తాడని ఏముంది? ఇప్పుడే విన్న వార్త ప్రకారం అతడు ఇవాళ ఇక్కడకి రానయితే వస్తాడు కానీ పని ఇవాళే మొదలు పెడతాడో లేదో, అట్లాంటి పక్షంలో పారిపోతే తనకాళ్ళ మీద తానే కొట్టుకున్నట్టవుతుందనీ విశ్వనాథ్‌కి తోచింది. చివరికి ఏదయితే అది కానివ్వమనే నిర్ణయానికి వచ్చేసాడు. వెళ్ళి తన స్థానంలో కూర్చున్నాడు.

సుమారుగా రెండుగంటల కాలం గడిచింది. ఎప్పటిలాగానే అధికారులంతా వచ్చారు. కొత్త అధికారి మాత్రం రాలేదు. విశ్వనాథ్‌కి కాస్త ధైర్యం వచ్చింది. ఇంకాస్త

సమయం గడిచింది ఇంతలో, "కొత్త అధికారి వచ్చారు, వచ్చారు" అంటూ చప్రాసి వచ్చాడు. విశ్వనాథ్ మొహం నల్లబడిపోయింది నోట్లోంచి మాట రాలేదు. పాపం, ఏం చేయగలడని? మళ్ళీ పారిపోదామనే ఆలోచన వచ్చింది. కానీ ఏ మిషతో పారిపోగలడు? ఇదిలా ఉండగా. అదే కచేరీలో ఓ వృద్ధుడు ఉన్నాడు. అతడు విశ్వనాథ్ చర్యలన్నిటినీ ఓ కంట కనిపెడుతూనే ఉన్నాడు. విశ్వనాథ్ చేతిలో తిజోరీకి సంబంధించి ఏదో జరిగిందని కూడా గ్రహించాడు. లెక్కల సమయంలో అంతా బయటపడుతుందని విశ్వనాథ్ భయపడుతున్నాడని కూడా అతడు గ్రహించాడు. ఆ వృద్ధుడికి విశ్వనాథ్ తండ్రితో మంచి స్నేహం ఉంది. ఏదైనా యుక్తితో విశ్వనాథ్‌కి జరిగిన ఈ కష్టాన్ని తీర్చాలనుకొని అతడిని బయటికి తీసికెళ్ళి అసలేం జరిగిందో నిజం చెప్పమని అడిగాడు. విశ్వనాథ్ మొదట నిజం చెప్పడానికి కాస్త తటపటాయించాడు. కానీ వృద్ధుడు తన మంచికోసమే అడుగుతున్నాడని తెల్సుకొని నిజం అంతా అతడికి చెప్పేసాడు. వృద్ధుడు అంతా వినుకున్నాడు. కాస్తంత సేపు ఆలోచనలో పడ్డాడు. "చివరి వరకు చూద్దాం. ఇవాళ బాకీ లెక్కలు కాకపోతే అదృష్టమే. అవుతాయి అన్పిస్తే ఆ సమయానికి నేను చెప్పిన విధంగా చేయి. అప్పుడు మాత్రం నిజం ఉన్నది ఉన్నట్టుగా చెప్పేందుకు భయపడకు. మాట ముందువెనకా తీసుకోకు" అని ధైర్యం చెప్పాడు. వీళ్ళిద్దరూ ఇలా మాట్లాడుకుంటున్నారో లేదో, ఇంతలోనే ఇద్దరు పై అధికారులు ఇటు గుమాస్తాల వైపుకు వస్తున్నట్టు తెల్సింది. దాంతో విశ్వనాథ్ చెవిలో పడిన పెద్దాయన చివరి వాక్యం "మిగిలిన బకాయినంతా చూసుకున్న తర్వాతే మిగిలిన పని చూసుకుంటాను" అన్న మాట విన్నంతనే గాలి దుమారం వచ్చుండాలి. వృద్ధుడు వెంటనే లేచి ఆ ఇద్దరు అధికారులు కూర్చున్న చోటికి వెళ్ళాడు. అక్కడేం చేసాడో, ఏం చెప్పాడో విశ్వనాథ్‌కి ఏమీ అర్థమవలేదు. అధికారులు వృద్ధుడు అయిదారు నిమిషాల పాటు ఏదో గుసగుసగా మాట్లాడుకున్నది మాత్రం నిజం. కొంత సేపయాక వృద్ధుడు విశ్వనాథ్ దగ్గరికి వచ్చి "అధికారులు నిన్ను వాళ్ళ గదిలోకి పిల్చారు, వెళ్ళు. ఏదడిగినా ఏమీ భయపడకుండా ఉన్నది ఉన్నట్టుగా చెప్పు" అని చెప్తూండగానే అధికారులు బయటికొచ్చారు. విశ్వనాథ్ వైపుకి వెళ్ళారు. విశ్వనాథ్ అవస్థ వాళ్ళ దృష్టికి వచ్చింది. కొత్త అధికారి తనవైపు సంశయంగా చూస్తున్నాడని విశ్వనాథ్‌కి తోచింది. అతను అలా చూసాడా లేదా అన్నది ఖచ్చితంగా చెప్పలేం. కానీ విశ్వనాథ్‌కి మాత్రం అలా అన్పించింది. అధికారి విశ్వనాథ్ వైపుకి తిరిగి, "ఏమయ్యా, మిగులు లెక్కలు అవీ అంతా చూసావా, తియ్యండి అవి చూద్దాం. అంతా సవ్యంగా వున్నాయా లేదా చూద్దాం. లేదా ఆ లెక్క పుస్తకాలు తీసికొని మా ఆఫీసుకి రండి" అన్నాడు.

తర్వాత ఇంతకు ముందటి అధికారి వైపు తిరిగి, "నేనలా లోపలికెళ్ళి కూర్చుని ఇతని బాకీలెక్క పుస్తకాలు అవీ పరిశీలిస్తాను. అంతవరకు మీరు ఇక్కడ పని

చూసుకోండి. నేనొచ్చి మిగిలిన లెక్కలు చూస్తాను" అన్నాడు. విశ్వనాథ్ భయం భయంగా బాకీ పుస్తకాలు తీసుకొని రావుగారి గదిలోకి వెళ్ళాడు. వెళ్ళగానే రావుగారు ఆ పుస్తకాల్లోని లెక్కలు చూడసాగారు. వాటిల్లో ఎక్కడా ఏ తప్పులూ ఉండవు, లేవు. ఆ పుస్తకాల్లోని లెక్కలు చూసుకోగానే రావుసాహెబ్, "సరే మిగిలిన పన్నెండువందల డెబ్భైతొమ్మిది రూపాయల ఆరుఅణాల తొమ్మిది పైసలు మిగిలినాయి. చూడండి, అని సరిగ్గా ఉన్నాయో లేదో" అన్నారు. ఈ వాక్యం వినగానే పాపం విశ్వనాథ్ పరిస్థితి ఏమయి ఉంటుందో, గడగడా వణికిపోయాడు. క్షణంలో సగభాగంలో తనను పోలీసులు తీసుకెళ్తున్నట్టుగా, అందరూ తను చేసిన పనిని థూ, థూ అని ఛీత్కరించుకుంటున్నట్టుగా తెలిపోతుంది అనుకున్నాడు, వంశ ప్రతిష్ఠ ఏమీ మిగలదు. ఫడ్క్యా దగ్గర్నుండి డబ్బు రాకపోతే ఏ పని చేయడానికి భయపడుతూ వస్తున్నాడో – చేయడానికి ధృడనిశ్చయం చేసుకున్నాడో అవన్నీ ఎటెటో అయి, ఏది చేయడానికి వెనకాముందు అవుతున్నాడో అది నెత్తిమీదికొచ్చింది. తనతోపాటు పాపం, కన్న పాపానికి తన తల్లిదండ్రులకూ చివరకు ఈ మచ్చ పడనేపడబోతున్నది, అనుకోగానే విశ్వనాథ్ "రావ్ సాహెబ్" అన్నాడు. ఈ శబ్దం ఉచ్చరిస్తూనే విశ్వనాథ్ నేలమీద పడ్డాడు. రావుగారు ఇదంతా చూసి చకితులయ్యారు. వెంటనే "ఏమిటి, ఏమంటు న్నారు? భయపడకుండా చెప్పండి" అన్నారు. అంటూనే విశ్వనాథ్ని లేవనెత్తారు. తనెలా నీచ సహవాసంతో మోసపోయి ఆ మూడువందల రూపాయల తిజోరీ తీసాడో చెప్తూ మాటిమాటికీ ప్రాణదానం చేయమని అడగసాగాడు. రావుగారు విశ్వనాథ్ని ఆ మనిషి పేరూ, ఊరూ లాంటి వివరాలు అడిగాడు. తర్వాత అక్కడే కూర్చోకుండా జవానుని రమ్మని పిల్చారు. తాళాలు సంబాళించే అతని దగ్గరి నుండి తిజోరీ తాళపు చెవి తీసికొని బయటికి నడిచాడు. ఎంత సేపయినప్పటికీ విశ్వనాథ్ ఏం చేయాలో ఏ విధమైన ఆదేశమూ రాలేదు. చివరికి రావు సాహెబ్ బయటి పనులు చక్కబెట్టుకొని వచ్చారు. విశ్వనాథ్తో ఈసారి కాస్త గట్టిగా, "ఇవాల్టి మిగులు బాకీ చూడడానికి సమయం ఏమీ మించిపోలేదు. చూడండి ఎల్లుండి నేను జాగ్రత్తగా లెక్క చూస్తాను. ఇందులో ఏమాత్రం తప్పు రావడానికి కానీ, అజాగ్రత్తకి కానీ తావుండకూడదు. అందుగ్గానూ మా దగ్గరే తాళం గుత్తి పెడుతున్నాను. మీరింకేం మాట్లాడడానికి వీల్లేదు. రేపు, ఎల్లుండి దీపావళి సెలవులు. అయినప్పటికీ ఫరవాలేదు ఆవలెల్లుండి భావూబీజ్ (పండుగ మూడోరోజు) రోజున లెక్కచూద్దాం. మీరు చెప్పిన విషయం ఎప్పుడూ జరగకూడనిది. మంచిది కాదు. ఒకవేళ అది మీరు చెప్పినట్టుగానే వున్నట్టు అయితే, చూద్దాం, ఏం చేయగలమో, ఒకవేళ మీరు చెప్పిన దాంట్లో అబద్ధం ఉంటే మాత్రం ఏం జరుగుతుందో నేనసలు చెప్పలేను!" అన్నారు. ఇదయాక కచేరీ మూసే సమయమయింది. విశ్వనాథ్కి మనసులో బాగా భయం వేయసాగింది. ఏం జరగనుందో? ఏం చేస్తారో?

రోజులు చింతలో దుఃఖంలో గడిచిపోయాయి. ఇద్దరూ ఓ పదేళ్ళుగా రోగంలో పడినట్టుగా అయిపోయారు. భావూబీజ్ మూడో రోజున వచ్చింది. ఆ రోజు కచేరీకి సెలవు ఉండదు. విశ్వనాథ్ కచేరీకి వెళ్ళాడు. ఇవాళ్టి రోజున తన ప్రారబ్ధం ఏదో ఒకటి జరగబోతుందని అతడికి అన్పించింది. గంట గడిచింది. రెండు గంటలు గడిచాయి. అతడి దగ్గరికెవరూ రాలేదు. రావుగారూ పిలవనంపలేదు. రావుగారు ఏ చప్రాసీని పిలిచినా విశ్వనాథ్‌కి తన గురించే కబురు పంపుతారేమో అన్పించ సాగింది. చూస్తూ చూస్తూ సాయంకాలం అయిపోయింది. కచేరీ మూసేసారు. ఈ ఆసామీ ఇంటికి బయల్దేరాడు. ఏ క్షణంలో కొడుకు గురించి ఏం చెడు వినవలసి వస్తుందోనని లక్ష్మీబాయి భయంతో ఇంట్లో అటు ఇటూ పచారీలు చేయసాగింది. కొడుకు చెప్పిన విషయాలు విన్న తర్వాత లక్ష్మీబాయి కూడా గందరగోళంలో పడింది. ఏం జరుగుతుందసలు? చివరికి సంధ్యదీపం పెట్టింతర్వాత, తల్లీ కొడుకులిద్దరూ తలుపేసుకొని ఒకరి ముందు ఒకరు కూర్చున్నారు. ఇద్దరి మనసుల్లోనూ చెడు ఆలోచనలే తిరుగుతున్నాయి. ఇంతలో ఎవరో గట్టిగా తలుపు తట్టి విశ్వనాథ్‌ని పిలుస్తున్నట్టుగా వినపడింది. ఆ గొంతుని విశ్వనాథ్ వెంటనే గుర్తుపట్టాడు. అది రావుగారి చప్రాసీది. ఆ గొంతు వినగానే విశ్వనాథ గాభరా పడ్డాడు. ఆ చప్రాసి తనను తీసికెళ్ళడానికే వచ్చాడని విశ్వనాథ్‌కి అన్పించింది. “అమ్మా, నీతో నా సంబంధం ముగిసిందమ్మా” అని తల్లిని వాటేసుకున్నాడు ఇంతలో వినవచ్చిన రెండవ గొంతు రావుగారిదిలా గుర్తించి, అదే సంగతి తల్లికి చెప్పాడు. అది వినగానే ఆమె “లేలే, తలుపు తీయి, నేనతని కాళ్ళు పట్టుకుంటాను. కొంగుచాపి నీ క్షేమం అడుగుతాను. ఇంతకన్నా వేరే దారేలేదు” అన్నది. కొడుకు తలుపు తీయడానికి వెళ్తాడా లేదా అని చూడకుండా తలుపు తీయడానికి పరుగున వెళ్తుండగా విశ్వనాథ్ ఆమెని వెనక్కి లాగి, “అమ్మా, అమ్మా, నువ్వు ఇవేవీ చేయవద్దు. నేను తలుపు తీస్తాను ఏదెలా జరిగితే అలా జరగనీ, నువ్విలా దయాభిక్ష అడిగి అతనేమీ పట్టించుకోకపోతే బాగుండదు.” అన్నాడు. అతడింకా ఏదో అనేంతలోగా బయటి తలుపు మీద వచ్చిన వాళ్ళు మళ్ళీ గట్టిగా బాదారు. ఇక తటపటాయిస్తూ కూర్చోవడంలో అర్థం లేదన్పించి విశ్వనాథ్ వెళ్ళి తలుపు తీసాడు. తలుపు తెరవగానే రావుగారు విశ్వనాథ్ వైపు చూసి చమత్కారంగా, “ఏమోయ్, ఇట్లా డీలాపడిపోయావేమిటి? ఇవాళ దీపావళి, ఇంట్లో దీపాలే లేవు అదేంటి” అన్నారు. రావుగారి నోట్లో నుండి ఈ వాక్యాలు విన్న తర్వాత, అతను  ఓ నాలుగడుగులు వేసాడో లేదో వెనక నుండి ఆ తల్లి ఏడుస్తున్న దీనమైన స్వరం వెక్కిళ్ళ మధ్య నుండి రావుగారి చెవిలో పడింది. “రావుసాహెబ్, నా కొడుకుని కాపాడండి, మీ కాళ్ళకి దండం పెడతాను” అంటూ ఆ తల్లి ఒక్కసారిగా అతని కాళ్ళమీద పడింది. అది చూసి, ఆమె మాటలు విని రావుగారి గుండె బరువెక్కింది. అతను ఒక్కసారిగా ఆమె చేయిపట్టుకొని లేపుతూ, “లక్ష్మీబాయి, మీ కొడుకు గౌరవం,

మీ గౌరవం కాపాడడం నా చేతుల్లో ఉండగా మిమ్మల్ని రక్షించనని మీకెలా అన్పించింది? మీరు నన్ను గుర్తు పట్టినట్టుగా లేదు. నేను, మీ సరస్వతీబాయి, – సరూబాయి కొడుకుని మీ ఉపకారం ఎప్పుడూ మరవని వాడిని. లేవండి, మీ విశ్వనాథ్ మీద ఏ ఆరోపణా లేదు. ఆ డబ్బు ఎప్పుడో కట్టేయబడింది. లెక్కంతా కుదిరింది. లేవండి, నాకు అక్కా చెల్లెళ్ళు లేరు. మీతో మంగళహారతి పట్టించుకుందామని వచ్చాను” అన్నాడు.

జరుగుతున్నది కలా నిజమా అన్నది లక్ష్మీబాయికీ, విశ్వనాథ్‌కి అర్థం అవట్లేదు. కల కంటున్నట్టే ఉంది. అది కల కాదని నిజమేనని రావుగారు మూడుమార్లు పదేపదే చెప్పిన తర్వాత ఆ భ్రాంతి నుండి బయటపడి, తమకి వచ్చిన సంకటం దూరమయిందని తెల్సుకున్నారు.

ఒక్కసారి ఈ నిజం మనసుకి ఎక్కింతర్వాత ఇంకేమని చెప్పడం? అడక్కండి. తల్లీకొడుకులిద్దరూ సరూబాయి కొడుకు చేసిన ఉపకారాన్ని పదే పదే తల్చుకున్నారు. అలాగే అతడు కూడా తన తల్లికి లక్ష్మీబాయి చేసిన సాయం మూలంగానే తాను ఈ స్థితిలోకి రాగలిగానని చెప్పి లక్ష్మీబాయిని మరి మాట్లాడనివ్వలేదు. పరస్పర ఉపకారాల గురించి మాట్లాడుకున్న తర్వాత ఇంక ప్రస్తుతం ఏం చేయాలన్న విషయం వచ్చింది. సరూబాయి కొడుకు తన ఇరవై ఏళ్ళ అనుభవాలను వాళ్ళతో పంచుకున్నాడు. గ్వాలియర్‌లో ఎన్ని రోజులున్నదీ, అక్కడ కుదరక ముంబాయికి వచ్చి, అక్కడ వారాలబ్బాయిగా చేరి ఎలా చదువుకున్నదీ చెప్పాడు. చదువులో చురుగ్గా ఉన్నాడు కాబట్టి ఎక్కడా పరీక్షల్లో ఆగడం జరగలేదు. బి.ఏ అయిన వెంటనే రెవెన్యూలో ఉద్యోగం దొరికింది. మెట్టుమీద మెట్టెక్కుతూ ఇప్పుడీ ఉన్నత హోదాలోకి వచ్చాడు. సరూబాయి మాత్రం కాలం చేసింది. వగైరా వగైరాలన్నీ చెప్పుకొచ్చాడు. అతని అనుభవాలన్నీ విన్న తర్వాత విశ్వనాథ్, ఈ డబ్బుతో తాను మోసపోయిన అనుభవం చెప్పుకొచ్చాడు. తనెలా ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడో ఫడ్‌కేకి ఎలాంటి పెద్ద పెద్ద ఉత్తరాలు రాసాడో అన్ని నిజాలనూ చెప్పాడు. అది విన్నాక తన కొడుకు ప్రాణాలెలా మిగిలాయో తల్చుకొని, తనకు పుత్రదానం పెట్టిన రావుగారిని ఆ తల్లి ఎంతో గౌరవంగా చూసుకుంది. అతనూ ఆమె సాయాన్ని తాను గుర్తుంచుకుంటానని చెప్పాడు.

ఇక ముక్తాయింపుగా రావుగారు కోరినట్టు మంగళహారతులు పట్టడం అదీ జరిగింది. అయితే బిడ్డడి పంచప్రాణాలని ఆ హారతిపళ్లెంలో కానుకగా వేసాడని తెలిసిన తరువాత డబ్బుబంగారాల బహుమతుల వర్ణన ఇంకెందుకులెండి ఇక్కడ.



**డా॥ గూడూరి మనోజ**
ఫోను: 9704643240
gmanoja61@gmail.com

వరంగల్‌లో పుట్టి అక్కడే కాకతీయ విశ్వవిద్యాలయంలో చదువుకొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ముప్పయ్యేళ్లు ఉన్నారు. ఇరవైయ్యేళపాటు అక్కడే విద్యాబోధన చేసినారు. పలు పత్రికలలో విమర్శన వ్యాసాలు రాసినారు. ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువాదాలను చేసినారు. ప్రముఖ మరాఠీ నాటకకర్త అయిన సచిన్ కుండళ్కర్ గారి పూర్ణ విరామం, ఫ్రిజ్‌లోని ప్రేమ అనే నాటకాలను తెలుగులోకి తెచ్చినారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రాచ్య లిఖిత భాండాగారం' వారు ప్రచురించిన 'సురవరం వారి సన్నిధిలో' పుస్తకానికి సంపాదకత్వం, 'గురజాడ లెటర్స్' అనే ఇంగ్లీషు పుస్తకానికి సహసంపాదకత్వం వహించినారు. ప్రస్తుతం పాలమూరు విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

**మలయాళ కత**
**1891**



# వారసత్వం

## వాసనా వికృతి

**వేంగయిల్ కున్హిరామన్ నయనార్**

ఉత్తర మలబారు ప్రాంతపు చిరాకల్ తాలూకా వేంగయిల్ నాయర్ కుటుంబంలో 1861లో పుట్టినారు కున్హిరామన్ నయనార్. కేసరి, వజ్రసూచి, వజ్రబాహు అనే కలంపేర్లతో రాస్తుండేవారు వీరు. న్యాయవాద వృత్తిలో ఉండిన నయనార్ గారు 1907లో మలబార్ జిల్లా బోర్డు సభ్యులుగా పనిచేసినారు. 1912లో మద్రాసు శాసనసభకు ఎన్నికయినారు. కేరళ పత్రిక ద్వారా వీరి రచనలు వెలుగు చూస్తూ ఉండేవి. మలయాళంలో పాత్రికేయునిగా, వ్యాసకర్తగా, విమర్శకునిగా, కథా రచయితగా పేరు తెచ్చుకొన్నారు కున్హిరామన్ గారు. వీరిది పెద్ద భూస్వామ్య కుటుంబం. అప్పుడు చిరాకల్ రాజాగారికి 30,000 ఎకరాలు ఉంటే వీరి కుటుంబానికి రెండులక్షల ఎకరాలుండేవి. ఇంత పెద్ద భూస్వామ్య కుటుంబంలో పుట్టినా కూడా, సామాజిక అసమానతలను ఎత్తిచూపే రచనలను చేసినారు వీరు. రచనలలో పదునైన సాంఘిక దృష్టి కలిగిన వారిగా దక్షిణ భారతమంతా పేరుగడించిన కున్హిరామన్ గారు 14-11-1914లో కనుమూసినారు. 1891లో వీరు రాసిన 'వాసనా వికృతి' అనేదే మలయాళంలో తొలికత. ఆ మాటకొస్తే దక్షిణాది నుడులలో కెల్లా తొలి కత ఇదే.

"రాజుగారి శిక్ష అనుభవించిన వారిలో, నాకన్నా దురదృష్టవంతులు వేరెవరూ వుండరు. నాకన్నా బాధలు వున్నవారు, బాధపడేవారు లేరని నేను చెప్పటం లేదు. కాని నాకన్నా బుద్ధి తక్కువ పనిచేసి శిక్షింపబడినవారు, చాలా అరుదు. అదే నా బాధ. దేవుడు కల్పించిన బాధలు అనుభవించటం, విపత్తులని ఎదుర్కోవటం తప్పదు. మనకన్నా మేధాశక్తి గల పోలీసువారి చేతుల్లో ఓడిపోవటం కూడా భరించవలసిందే. కాని నేను వేసిన వలలో నేనే పడిపోవటమే విచారకరమైన విషయం. ఎవరు పన్నిన వలలో వారే పడతామనే విషయం పిల్లలకు కూడా తెలిసివున్నప్పుడు, వలలో పడినందుకు నేను ఎంత బాధపడాలి? అందుకే నాకు బాధ – పరువు పోయిందనే బాధ!

మా ఇల్లు "కొచ్చి" మహారాజుగారి అధికార పరిధిలో వుంది. అడవికి అతి దగ్గరగా వుండే ప్రాంతంలో వుండేది ఇల్లు. ఒకే ఉమ్మడి కుటుంబాల వారైనా, ఒకరి సంతతి తెల్లగానూ, మరొకరి సంతతి నల్లగాను వుండటం మీరు చూసే వుంటారు. మా ఇంట్లోనూ అంతే! కాని తేడా ఒంటి రంగు విషయంలో కాదు, మర్యాదలలో, నడవడిలో, చేసే పనులలో. నాకు గుర్తు వున్నప్పటి నుంచి ఇంట్లో ఒక బృందం మర్యాదస్తులు. మరో బృందం మర్యాద లేనివారు, అభిలషణీయం కాని పనులు చేసేవారు. ఈ తేడా ఈనాడు మొదలైంది కాదు. ఆనాటి నుంచి వున్నదే. రెండో బృందానికి చెందినవాడిని నేను. "ఇక్కండ కురుప్పు", "రామన్ నాయర్" అనే మహానుభావుల గురించి మీరు వినేవుంటారు. "ఇక్కండ కురుప్పు" నాకన్నా నాలుగు తరాల ముందువారిలో నాకు నాన్న వరస. అతని గుర్తు కోసమేనట అతని పేరు నాకు పెట్టారు. మరొకరు నాలుగు తరాల ముందువారిలో నాకు మామయ్య. అందువల్ల "ద్వేదా నారాయణీయ" అని మేల్పత్తూరి బట్టతిరి (మేల్పత్తూరి బట్టతిరి "నారాయణీయం" గ్రంథకర్త) చెప్పినట్లు నాన్న తరపు నుంచి చూసినా, అమ్మ తరపు నుంచి చూసినా, దొంగ కావటానికి వారసత్వపు 'వాసన' వుండేది నాకు. నా వారసత్వపు గొప్పతనం గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే "ఇక్కండ కురుప్పు"కి తాత, "ఇట్టి నంభూతిరి" అని కూడా తెలుసుకోవాలి. "ఇట్టి నంభూతిరి" మాయ మంత్రాలు గురించి తెలియనివారు వుండరు. నన్ను ఆ వారసత్వ ప్రభావం నుంచి దూరంగా వుంచటానికి నా చిన్నప్పుడే కొంత ప్రయత్నం జరిగింది. కాని ఫలించలేదు. ఫలించక

పోవటానికి కారణం ప్రయత్న లోపం మాత్రం కాదని, నా వారసత్వపు వాసనాబలమనే చెప్పాలి. విద్యాభ్యాస విషయంలో నేను బద్ధకస్తుడనని కూడా చెప్పలేరు. నాతో చదివిన వారిలో నాకన్నా తక్కువ బుద్ధిశక్తి గలవారు కూడా వుండేవారు అనేదానికి మా అధ్యాపకుడే సాక్షి. పదేళ్ళలో ముప్పది సర్గల కావ్యం మాత్రం చదివిన మహానుభావు లున్నారు. అయిదారు సర్గలు చదివాను నేను. వ్యాఖ్యానముంటే, మరొకరి సహాయం లేకుండా భావం అర్థం చేసుకోగలిగే పాండిత్యం సంపాదించాను. ఆ మాత్రం పాండిత్యం సంపాదించేలోగా, తల్లిదండ్రుల వారసత్వం వల్ల సంక్రమించిన 'వాసన' వల్ల నాకు చదువు పట్ల ఆసక్తి తగ్గింది. ఇల్లు అడవి దగ్గరే అయినందువల్ల, చిన్నప్పటి నుంచే అప్పుడప్పుడు అడవికి వెళ్ళటం, అడవి జంతువులని ఎదుర్కోవటం వల్ల, భయం అనే పదం, నా నిఘంటువులోనే లేకపోయింది. చాలా చిన్నప్పుడు గోచీలు వగైరాలు దొంగతనం చేసి దెబ్బలు తినేవాడిని. అయినా, బాగా మారింది ఇరువది సంవత్సరాల తరువాతనే. చిల్లర దొంగతనాల నుంచి పెద్ద దొంగతనాల వైపు మొగ్గింది మనస్సు. ఖరీదైన వస్తువులపైపే నా దృష్టి వెళ్ళేది. అలా చాలా సంపాదించాను. దొంగతనాలు రెండు రకాలుగా చెయ్యవచ్చు. ఒకటి నలుగురిని కలుపుకొని చెయ్యటం, రెండు ఒక్కడే వేటకి వెళ్ళటం లాంటిది. నలుగురితో కలసి వేటకి వెళ్తే ఏదో ఒక జంతువు దొరకటం ఖాయం.ఎవరో ఒకరు జంతువుని కాలుస్తారు. పంచుకోవాలి. పంచుకుంటే వచ్చే వాటా తక్కువ. ఒకడే అయితే జంతువు అడుగు జాడలు చూస్తూ వెళ్ళాలి. దొరకటం కష్టం కావచ్చును. స్వయం రక్షణోపాయం చూసుకోవాలి. కాని దొరికినది పంచుకోనవసరం లేదు. అందువల్ల ఒంటరిగా పనిచెయ్యటమే మంచిదని అనిపించింది. నాలుగు తరాల ముందు వరసకి నాన్న అయిన అతనికి ఈ అభిప్రాయముండేది కాదు. అందువల్ల అతడు ప్రాచీనుడే, నేను ఆధునికుడిని.

ఇంటి నుంచి పారిపోయి వచ్చాక అయిదేళ్ళు బయట తిరిగి ఇలా సంపాదించాను. కొత్త పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసారు మహారాజువారు. అప్పటిలో ఒక దొంగతనం చేసాను. 'గంతర్' దొర పరివారానికి అది అస్సలు నచ్చలేదు. దొంగతనం చేసింది, ఒక జమీందార్ ఇంటిలో. ఇంటిగలాయన కొడుకే నాకు తొత్తు. జూదం ఆడేవాడు అతడు. జూదమాడాడి బాగా ఋణగ్రస్తుడయ్యాడు. అప్పుతీర్చే మార్గం కనబడక నా వద్దకు వచ్చాడు. జమీందార్ అయిన తండ్రికి మెలకువ రాకుండా వుండడానికి కొంత మత్తుమందు అతనికి ఇచ్చి మందులో నాలుగోపాలు, పాలలో కలిపి జమీందార్ నిద్రపోయే ముందు ఇవ్వమని చెప్పాను. ఇంటిలో దూరి దొరికినదంతా మూట కట్టుకున్నాను. జమీందార్ తలగడ కింద ఒక నగలపెట్టె వుండేది. అది కూడా సొంతం చేసుకోవాలని జమీందార్ వద్దకు వెళ్ళాను. అతడు లేస్తాడేమోననే భయంతో మెలమెల్లగా అడుగులు వేసాను. కాని అతడు లేవలేదు. ఎలా లేస్తాడు? ఎన్నడూ

లేవని మహా నిద్రలోకి జారిపోయి వున్నాడు జమీందార్. మహాపాపి అయిన కొడుకు తన మనోవాంఛ సాధించటానికి తండ్రి అడ్డు రాకూడదని అనుకొని, ఇచ్చిన మత్తు మందు మొత్తం పాలలో కలిపేసాడట!

దొంగిలించిన నగలపెట్టె మా ప్రియురాలికి ఇచ్చాను. ఆమె అంటే నాకు వల్లమాలిన ప్రేమ. ఆమెకి నేనంటేనూ అంతే. ఒక రాత్రి నగల పెట్టె తెరిచి, ఆ పెట్టెలో నుంచి మల్లెపూవు చెక్కిన ఒక ఉంగరం తీసి నా వేలుకు తొడిగింది ఆమె. అప్పటినుంచి ఆ ఉంగరం అంటే నాకు చెప్పలేనంత ఇష్టం! ఎట్టి పరిస్థితులలోనైనా, ఆ ఉంగరం వేలుమీద నుంచి తీసేవాడిని కాదు.

జమీందార్ ఇంటిలో దొంగతనం జరిగాక పోలీసోళ్ళకు, నా మీద కొంత అనుమానం కలిగింది. వెంటనే, మా పక్క ఊరిలో దేవుని నగలు పోయాయి. మరో రెండు మూడుచోట్ల కూడా పెద్ద దొంగతనాలు జరిగాయి. దొంగని పట్టుకోవటానికి ముమ్మరంగా అన్వేషణ ప్రారంభించారు. దానా దీనా, మా ఊరులో వుండలేని పరిస్థితి ఏర్పడింది నాకు. మదరాసు బయలుదేరాను. మదరాసులో దొంగతనం చెయ్యకుండా, మర్యాదస్తుడిగా జీవించాలని నిర్ణయించుకున్నాను. నా ఆఫీసు మానెయ్యాలనేది నా ఆలోచన. ఆఫీసు లేకపోతే ఉద్యోగులు ఏం చేస్తారు? ఆనందం వెతుకుతూ రోడ్డుమీద తిరుగుతారు. నేను కూడా అదే పనిచేసాను. నెలరోజులు మదరాసులో తిరిగి చూడవలసిన ప్రదేశాలన్నీ చూసేసాను. ఒకరోజు 'గజిలి' వీధిలో తిరుగుతున్నప్పుడు, చాలా అందగత్తె అయిన ఒక వెలయాలు కనబడింది. ఒక దుకాణంలో, సామానుల కోసం నిలబడివున్నారు ఆవిడ. సగం నోరు తెరిచి తమలపాకుల మచ్చలతో నిండిన ఎత్తుపళ్ళు బయటకు పెట్టి ఆమె మోము చూస్తూ నిలబడ్డాడు ఒకడు. ఆ దృశ్యం చూసిన నాకు తమాషా చెయ్యాలని అనిపించింది. దొంగతనం చెయ్యకూడదనే నిర్ణయాన్ని ఒక నిమిషం మర్చి పోయాను. రద్దీలో దూరాను. ఎడం చెయ్యి వాడి పాకెటులో పెట్టాను. ఇలాంటి దొంగతనం చెయ్యాలంటే అర్జునుడిలా సవ్యసాచివై వుండాలి. పాకెట్‌లోని ఒక చిన్న పుస్తకం తీసుకొని తిరిగి బయటకు వచ్చాను.

రాత్రి కలలో కనబడింది ప్రియురాలు. హఠాత్తుగా లేచి, చేతివేలు తడిమి చూసాను. ఉంగరంలేదు! చాలాసేపు ఆలోచించాను. ఉంగరం ఎక్కడ పోయి వుంటుందని చాలా బాధ కలిగింది. ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

మరునాడు, తెల్లవారకముందే లేచి, ముందురోజు తిరిగిన రోడ్లన్నీ తిరిగి చూసాను. కనబడిన కొందరిని ఉంగరం గురించి అడిగాను కూడా. తెల్లవారాక, ముందురోజు వెళ్ళినవారి ఇళ్ళకి వెళ్ళి కనుక్కున్నాను. దొరకలేదు. ఉంగరం కింద

పడివుంటుందని, దొరికినవారు సొంతం చేసుకొని వుండవచ్చని అనుకొని పోలీసు స్టేషన్‌కి వెళ్ళి, ఫిర్యాదు చేసాను. పోలీసోళ్ళ చేతికి ఎలాగైనా ఉంగరం రావచ్చు కదా అని అనుకొని చేసాను ఆ పని.

మరునాడు, మధ్యాహ్నం ఒక పోలీసు మా ఇంటికి వచ్చాడు. అతడు కనబడగానే ఉంగరం దొరికివుంటుందని అనిపించింది నాకు. అతడు ఉంగరం ఇస్తాడని కాసేపు ఎదురుచూసాను. ఇవ్వకపోవటంతో, బహుశా ఏదైనా బహుమతి ఇస్తే కాని ఇవ్వడేమో అనుకొని, అయిదురూపాయిలు ఇచ్చాను. అప్పుడు ఉంగరం తీసాడు. "ఈ ఉంగరం నా చేతికి ఎలా వచ్చిందో తెలుసా" అని అడిగాడు.

నేను స్థంభంలా వుండిపోయాను. నా కళ్ళు తెరిచి చూసినప్పటికే నా ఒళ్ళంతా తనిఖీ చేసి, బేడీలు వేసి పాకెట్టులో వున్నచిన్న పుస్తకం తీసి, బల్లమీద పెట్టేసారు పోలీసోళ్ళు. ఇలాంటి బుద్ధి తక్కువ పని చేసినందుకు నేను సంపాదించింది, ఆరు నెలల కారాగార శిక్ష, పని, రెండు దెబ్బలు. ఆ శిక్ష ముగించి, ఇదిగో ఇప్పుడు బయటకు వచ్చాను. చేతకాని నేను, ఇంకా దొంగతనంలో కొనసాగితే, నా వారసత్వానికి పరువునష్టం. దొంగతనం చెయ్యటం మంచిది కాదని కూడా అందరూ చెప్తున్నారు. అలాగే ఒకసారి నా వృత్తి మార్చిచూస్తాను. ఇంతవరకు చేసిన పాపాల నుంచి విముక్తి కోసం, పాపం చేసే ఆలోచన ఇక మీద రాకుండా వుండటం కోసం గంగా స్నానం, కాశీ విశ్వనాధ దర్శనం చెయ్యాలి. అప్పట్లో సంధ్యాదీపం పెట్టగానే అమ్మమ్మ చెప్తూ వుండేది.

శ్రుతి స్మృతిభ్యాం విహితా వ్రతయః
పునంతి పాపాని లునంతి వాసనాం
అనంత సేవాతు నికృంతతి ద్వయీ
మిత ప్రబో త్వల్ పురుషా బభాషిరే!"

సంతకం

ఇక్కండ కుర్రుప్పు




**ఎల్.ఆర్.స్వామి:**

ఫోను: 9949075859
l.r.swami.visakha@gmail.com

పూర్తిపేరు లక్ష్మణ అయ్యర్ రామస్వామి. కవి, కథా రచయిత. మలయాళం తల్లినుడి అయినా స్వామి గారు ఉద్యోగం కోసం వచ్చి ఆంధ్రదేశంలో స్థిర పడినారు. స్వయంకృషితో తెలుగు నేర్చుకొని తెలుగులో రచయిత అయినారు. ఇప్పటివరకూ వీరివి 200కు పైగా కతలు వివిధ తెలుగు పత్రికలలో అచ్చయినాయి. ఏడు కథాసంకలనాలు వెలువడినాయి. మలయాళం నుంచి తెలుగులోకి 14 పుస్తకాలనూ, తెలుగు నుంచి మలయాళంలోకి 12 పుస్తకాలనూ అనువదించినారు. వీరివి చాలా కథలు హిందీ, ఇంగ్లీషు, కన్నడ, తమిళ, మలయళ నుడులలోకి అనువాదమయినాయి. ఎన్నో పురస్కారాలనూ బహుమతులనూ పొందిన స్వామిగారు విశాఖపట్టణంలో ఉంటున్నారు.

**ఒడియా కత**
**1898**



# రేవతి

## రేబొతి

**ఫకీర్ మోహన్ సేనాపతి**

ఫకీర్ మోహన్ సేనాపతి: ఒడిశా, బాలసోర్ జిల్లాలోని మల్లికాశ్‌పూర్‌లో 13 జనవరి 1843లో పుట్టినారు. ఒడియాలో ఆధునిక సాహిత్యానికి తండ్రి అని పిలుచుకొంటారు ఒడియా ప్రజలు. లక్ష్మణ్ చరణ్ సేనాపతి, తులసిదేవి సేనాపతి గార్లు వీరి తల్లిదండ్రులు. ఫకీర్ మోహన్ తన బతుకునంతా ఒడియా భాషా సాహిత్యాలకే అంకితం చేసినారు. ఇప్పటి ఒడిశా రాష్ట్రం ఆంగ్లేయుల కాలంలో ఎక్కువగా కలకత్తా ప్రెసిడెన్సీలో కొద్దిగా మద్రాసు ప్రెసిడెన్సీలో (గంజాం, కోరాపుట్టి జిల్లాలు) ఉండేది. కలకత్తా ప్రెసిడెన్సీలోని బెంగాలీలకు ఒడియా నుడి అంటే చిన్నచూపు ఉండేది. ఆంగ్లేయ అధికారులకు, ఒడియా నుడి అనేదే లేదనీ అది బెంగాలీ నుడికి మాండలికం మాత్రమేననీ తప్పుగా చెప్పి, బడులలో ఒడియా నుడిని తొలగించినారు బెంగాలీలు. అప్పుడు ఫకీర్ మోహన్ గారు పెద్దఎత్తున పోరాడి ఆ చట్టాన్ని రద్దు చేయించి, తిరిగి ఒడియాను బడులలో పెట్టించినారు. ఒడియానుడి మరువెలుగుకు కారణమయినారు. వీరికి 'వ్యాసకవి' అనే బిరుదు ఉంది. వీరు సంస్కృతం నుంచి ఒడియాలోకి ఎన్నో అనువాదాలను చేసినారు. వీరు 'ఉత్కళ భ్రమణ' అనే పెద్ద కవితనూ కొన్ని కతలనూ రాసినా, ప్రధానంగా నవలా రచయితగా పేరుపొందినారు. 1897 నుంచి 1915 వరకూ నాలుగు నవలలను రాసినారు. 18, 19 శతాబ్దాలలోని ఒడియా సాంస్కృతిక, సామాజిక పరిస్థితులను ప్రతిబింబించిన రచనలు వీరివి. ఒడియా నుడిలో తొలి ఆత్మకథ రాసిన వ్యక్తి కూడా ఫకీర్‌మోహన్ గారే. 1898లో వీరు రాసిన రేవతి కతే ఒడియాలో తొలికత. ఒడియా నుడిలో తొలికతనూ తొలి నవలనూ రాసి ఒడియానుడి ఒడియాజాతి ఎదుగుదల కోసమే బతుకంతా పనిచేసిన ఫకీర్ మోహన్ సేనాపతి గారు జూన్ 14, 1918లో కన్నుమూసినారు.

"ఏమే రేవతీ.... ఏమే రేవీ.... ఏమే అగ్గీ... ఏవేఁ పొయ్యా..."

కటక్ జిల్లా హరిహరపురం పరగణా మధ్యలో ఉన్న ఒక చిన్న గ్రామం 'పాటపురం'. గ్రామంలో అడుగు పెడుతుండగానే ఒక ఇల్లు కనిపిస్తుంది. ఆ ఇంట్లో ముందుకీ, వెనక్కీ కలిపి నాలుగు గదులున్నాయి.

పూరిగడ్డితో నేసిన శాలలో డెంకీ ఉంది. అంగణం మధ్యలో నుయ్యి, బయటికి వీధి ద్వారం, పెరటి వైపుకి పెరటి ద్వారం ఉన్నాయి. వీధివైపు గదిలో సాధారణంగా పన్నులు కట్టటానికి వచ్చేవారు కూర్చుంటారు. శ్యామబంధు, జమీందార్ నియమించిన గ్రామకరణం. అతనికి నెల జీతం రెండు రూపాయలు. ఇది కాకుండా పన్నులు కట్టారా లేదానని ఊళ్ళో తిరిగి అజమాయిషీ చేసినందుకు అదనంగా రెండు రూకలు చేతికందుతాయి. మొత్తం మీద నెలకి 4 రూపాయలు. సంసారం ఒక రకంగా సాగిపోతోంది. ఒక రకం ఏమిటి? చెప్పాలంటే బాగానే వెళుతోంది. ఇంట్లో ఇదిలేదు... అదిలేదు... ఆ పని జరుగలేదు లాంటి మాటలు ఎన్నడూ వినబడేవి కావు. పెరట్లో తోటకూర, బచ్చలి మొదలైన ఆకుకూరలే కాకుండా రెండు మునగచెట్లు కూడా ఉన్నాయి. పశువుల శాలలో పాలు ఇచ్చే రెండు ఆవులు – పాలకీ చిక్కటి మజ్జిగకీ లోటే లేదు. శ్యామబంధు తల్లి – పెద్దావిడ గడ్డీ పేడాతో కలిపి పిడకలు చేసి ఎండపెడుతుంది. పొయ్యిలోకి వంట చెరకు లేదని బాధ లేదు. జమీందార్ మూడున్నర ఎకరాల పొలం వ్యవసాయం చేసుకోవటానికి ఇచ్చాడు. ధాన్యం దిగుబడి ఏం తక్కువకాదు! గ్రామంలో ప్రజలందరూ శ్యామబంధు లాంటి మంచి మనిషి కరణంగా ఉండటంతో సుఖంగా ఉన్నారు. వారందరూ ఆయనను గౌరవిస్తారు. శ్యామబంధు గడప గడపకు వెళ్ళి పన్ను వసూలు చేస్తాడు. అన్యాయంగా ఎవరివద్దా ఒక్క పైసా కూడా తీసుకోడు. ప్రజలు పైకం ఇచ్చి రశీదు కూడా అడగరు. శ్యామబంధు నాలుగు అంగుళాల తాటాకు మీద చిన్న రశీదు రాసి ఇస్తూ ఉంటాడు. అప్పుడప్పుడు జమీందార్ బంట్రోతు అజమాయిషీకి రావడం కద్దు. వాడు వస్తే మాత్రం ఊరికే వెళ్ళడు. చుట్టా లేక బీడీ విలాసంగా పెదాల మధ్య ఉంచుకొని కాలుస్తూ, రెండు పైసలు రొంటిని దోపుకున్న తర్వాతే ఇక్కడ నుంచి కదులుతాడు. శ్యామబంధు ఇంట్లో రోజూ నలుగురు భోజనం చెయ్యాలి. వృద్ధురాలైన ఆయన తల్లీ, భార్య, పదేళ్ళ కూతురు, అమ్మాయి పేరు రేవతి. రోజూ సాయంకాలం శ్యామబంధు వీధి

వైపు వరండాలో కూర్చుని 'కృపాసింధువదనా' భజనని, ఇంకా మరికొన్ని భజనల్ని రాగయుక్తంగా పాడతాడు. దీపం ఉంచే బల్లమీద భాగవతాన్ని ఉంచి – అందులో కొన్ని ఘట్టాలని కూడా ఆయన చదువుతాడు. రేవతి తండ్రి పక్కనే కూర్చుని ఆయన పాడే భజన గీతాలని నేర్చుకున్నది. ఆమె చిన్నారి ముఖం భజన గీతం ఆలపిస్తున్నప్పుడు చూడముచ్చటగా ఉండేది. తండ్రి పక్కన కూర్చుని ఆమె భక్తి గీతాలు ఆలపిస్తుంటే గ్రామ ప్రజలు అక్కడే గుమికూడేవారు. శ్యామబంధుకి రేవతి భజన పాడుతుంటే చాలా సంతోషం కలిగేది! అందుకే ప్రతిరోజూ ఆమెను పాడమని మరి మరి కోరేవాడు. రేవతి కూడా గొంతెత్తి మధురంగా పాడేది!

"హరీ...

ఎవరికి మొర పెట్టుకోను....?

నువ్వే నన్ను కటాక్షించకపోతే ఈ పేద జీవనం

ఇంతటితో సరి....

రక్షిస్తే రక్షించు... లేదంటే లేదు....

నీపాదాలకి నా ప్రాణం అర్పితం...

నా హృదయంతో నీ నామస్మరణ చేస్తున్నా....

నువ్వు లేకుంటే ముల్లోకాలూ శూన్యం....

నీ ప్రేమామృతాన్ని నాకు దానమివ్వు...

తాపాన్ని తీర్చు"

రెండేళ్ళ కిందట పాఠశాలల డిప్యూటీ ఇన్‌స్పెక్టరు ఈ మారుమూల గ్రామాలు పర్యటిస్తున్నప్పుడు ఈ ఊళ్ళో ఒక రాత్రి బస చేశారు. ఆ రోజు గ్రామంలో ప్రముఖు లందరూ వారిలో వారు మాట్లాడుకుని ఇక్కడ ఒక స్కూలు పెట్టాలని ఇన్‌స్పెక్టర్‌కి ఒక వినతిపత్రం రాసి ఇచ్చారు. ఆ విధంగా నేటికి పాటపురంలో అప్పర్‌ప్రైమరీ పాఠశాల ఏర్పాటైంది. ఉపాధ్యాయుడు కూడా విధుల్లో చేరాడు. ఉపాధ్యాయుడి నెల జీతం నాలుగు రూపాయలు. ఇవి ప్రభుత్వం నుండి వస్తాయి. ఇదిగాక ప్రతి విద్యార్థి నెలకి అణా చొప్పున ఇవ్వటానికి నిర్ణయమైంది. ఉపాధ్యాయుడి పేరు వాసుదేవ్. కటక్‌లోని నర్మాల్ పాఠశాలలో అవధానం పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. పేరుకి తగినట్లుగా వాసుది సుందరమైన రూపం – సుందరమైన అంతఃకరణం. వంక పెట్టటానికి వీల్లేని వ్యక్తిత్వం. గ్రామంలో వంచిన తల యెత్తకుండా నడుస్తాడు. సుమారు ఇరవై ఏళ్ళుంటాయి. బాల్యంలో మూర్ఛరోగం రావటంతో తల్లి నుదుటి మీద కొరకంచుతో కాల్చింది. ఆ

మచ్చ ముఖం మీద ఉండిపోయింది. చెప్పాలంటే ఆ మచ్చ అతడి ముఖానికి నప్పింది. చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకొని అనాథయైన వాసుదేవ్‌ని మేనమామ చేరదీసి చదువు సంధ్యలు నేర్పించాడు. వాసుదేవ్ కరణ కులస్థుడు. శ్యామబంధు కూడా అదే జాతి వాడు కావటంతో వాసుదేవ్‌కి ఈ కుటుంబంతో దగ్గరితనం ఏర్పడింది. మార్గశిర మాస గురువారం నాడు శ్యామబంధు యింట్లో పూజా కార్య క్రమంతోపాటు పిండివంటలు పానకం కూడా చేస్తారు. శ్యామబంధు గురువారం ఉదయం పాఠశాలకి వెళ్ళి వాసుదేవ్‌తో 'సాయంత్రం ఇంటికిరా! మీ అత్త పిలుస్తోంది' అని చెప్పి వస్తాడు. రేవతి తల్లికి వాసుని చూస్తే జాలి కలిగేది! అయ్యో తల్లీ తండ్రీ లేని అనాథ... ఇతని తిండీ తిప్పా చూసేదెవరని బాధపడేది. కొసరి కొసరి వడ్డించేది. అలా మెల్ల మెల్లగా వాసు సాయంత్రాలు శ్యామబంధు ఇంట్లో గడిచేవి. రేవతి సంధ్యవేళ తండ్రితో కూర్చుని భజన గీతాలు ఆలపించేది. పురాణాల్లోని ఆ భజన గీతాలు వాసుకి కొత్తగా అన్పించేవి. ఒక రోజు సంభాషణలో శ్యామబంధు కటక్‌లోని ఆడపిల్లల స్కూల్ గురించి విన్నాడు. అక్కడ స్కూల్లో ఆడపిల్లలు చదువూ – కుట్టుపనీ నేర్చుకుంటారని గ్రహించాడు. ఆ రోజు నుంచి శ్యామబంధుకి రేవతిని చదివించాలనే కోర్కె కలిగింది. తన మనసులోని మాటని వాసుదేవ్‌కి తెలిపాడు. వాసు శ్యామబంధుని తండ్రితో సమానంగా భావించేవాడు. శ్యామబంధు నోటి వెంట ఈ మాట రాగానే వాసు 'నేను కూడా ఇదే విషయాన్ని మీకు చెప్పాలనుకున్నా... నాకు మీరు చెప్పారు.' అన్నాడు. తర్వాత ఇరువురూ ఈ విషయమే మాట్లాడుకుని రేవతిని చదివించాలనే నిర్ణయానికొచ్చారు. రేవతి వారి పక్కనే కూర్చుని ఈ మాటలన్నీ విన్నది. రెండంగల్లో లోపలి గదుల్లో పరుగెత్తి తల్లితోనూ, నాన్నమ్మతోనూ 'నేను చదువుకుంటా... చదువుకుంటా' నంటూ చెప్పింది. 'అలాగే... చదువుకుందువు గాని' అన్నది తల్లి... 'చదువేమిటే... ఆడపిల్లకి చదువేమిటి... వంటావార్పూ నేర్చుకో. పిండివంటలు చేయటం.... ముగ్గులెయ్యటం... చల్లచెయ్యటం... వెన్న తీయటం బాగా నేర్చుకో.. చదువేమిటి?' అన్నది నాన్నమ్మ.

రాత్రి వరండాలో మామిడి చెక్కతో తయారు చేసిన పీట మీద కూర్చుని భోజనం చేస్తున్నాడు శ్యామబంధు. రేవతి తండ్రిపక్కనే కూర్చుని భోజనం చేస్తోంది. ముసలమ్మ ఎదురుగా కూర్చుని "అన్నం కొద్దిగా తీసుకురా... పప్పు ఇంకాస్త వెయ్యి... ఉప్పు ఇలా తే...." అంటూ కోడలికి ఆజ్ఞలు జారీ చేస్తూ మధ్యలో కొడుకుతో మాట కలిపింది.

"ఏరా శ్యామ్ రేవీ చదువుకుంటుందా? చదువేంటి? పెళ్ళీ పేరంటం చేసుకుని వెళ్ళే ఆడపిల్లలకి చదువా?" "చదువుతానంటోంది.... చదవనీ... ఝుంకడా పట్నాయక్ ఇంట్లో ఆడపిల్లలు భాగవతం చదువుతున్నారు. వైదేహీ విలాసంలో పద్యాలు చక్కగా

పాడుతున్నారు కూడా...” శ్యామ్‌బంధు అన్నాడు. నాన్నమ్మ తన చదువుకి ఏదో అడ్డు చెబుతోందని రేవతి గ్రహించింది. “పో... నాన్నమ్మా... నువ్వు జోరీగలా నాన్న చెవిలో పోరుతున్నావ్” అంటూ “.... నాన్నా నేను చదువుకుంటాను” అని తండ్రితో గారాలు పోయింది చిన్నారి రేవతి. శ్యామ్‌బంధు ‘సరేలే తల్లీ.... నువ్వు చదువుకుందూ గాని” అన్నాడు. ఆ రోజు సంభాషణ అలాగ ముగిసింది.

ఆ మర్నాడు మధ్యాహ్నం వాసు, సీతానాథబాబు రాసిన 1వ తరగతి వాచకం రేవతికి ఇచ్చాడు. రేవతి సంతోషంగా తండ్రి పక్కన కూర్చుని మొదటి పుట నుంచి చివరి పుట దాకా సంబరంగా తిప్పి చూసుకుంది. అందులో ఏనుగు, గుర్రం, ఆవులు మొదలైన చిత్రాలను చూస్తూ ఆనందపడింది. రాజులు ఏనుగులను గుర్రాలను కట్టేసి సంతోషిస్తారు. కొందరు ఏనుగుల మీదికి, గుర్రాలమీదికి ఎక్కి సంతోషిస్తారు. మన రేవతికి చిత్రాలను చూస్తేనే సంతోషం. రేవతి తల్లి దగ్గరికి పరుగెత్తుకుంటూ వెళ్ళి పుస్తకంలోని బొమ్మలని చూపించింది. తర్వాత నాన్నమ్మ దగ్గరకి కూడా వెళ్ళి చూపింది. నాన్నమ్మ విసుగ్గా ‘ఆఁ... చూసాలే... వెళ్ళు.. వెళ్ళు....” అంది. రేవీ కూడా ఆమెని వెక్కిరిస్తూ వెనుదిరిగింది.

ఇవాళ మంచి రోజు. సిరిపంచమి. రేవతి ఉదయాన్నే లేచి స్నానం చేసి, కొత్త బట్టలు కట్టుకొని, ఇంట్లోకి బయటకి హడావిడిగా తిరుగుతోంది. వాసు వస్తే చదివిస్తాడనే ఆ పిల్ల ఎదురుచూపులు. ముసలమ్మంటే ఉన్న భయం వల్ల విద్యారంభంనాడు చేయవలసిన కార్యక్రమం ఏమీ చేయలేదు. సరిగ్గా ‘ఆరు’ కొట్టగానే వాసు వచ్చి అక్షరాలు దిద్దించే కార్యక్రమం ప్రారంభించాడు. అచ్చులలో హ్రస్వాచ్చులు, దీర్ఘాచ్చులు, అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ ఇలా అక్షరమాలలోని అచ్చులు, హల్లులు మొదలైనవన్నీ ప్రతి రోజూ సాయంత్రం క్రమం తప్పకుండా వచ్చి నేర్పించసాగాడు. రెండేళ్ళలో రేవతి ధారాళంగా వ్రాయనూ, చదవనూ నేర్చింది. ఆమె ‘మధురావ్ చందమాల’ ఏకబిగిన – ఆపకుండా చదివే నేర్పూ సంపాదించింది. ఒక రోజు రాత్రి భోజనాలు చేస్తూ శ్యామబంధూ, తల్లి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ మాటల్ని బట్టి ప్రస్తావించిన విషయాన్ని గూర్చి ఇదివరకే వారు మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది.

**శ్యామబంధు:** ఏం అమ్మా... బావుంటుంది కదా!

**ముసలమ్మ:** ఆ... బాగానే ఉంటుంది... జాతి కనుక్కున్నావా?

**శ్యామబంధు:** ఆ... ఇవాళ్టి వరకూ చేసిందదే... కరణం. జాతివాడే... కాకపోతే.. పేదవాడు! కులం మంచిదికదా!

**ముసలమ్మ:** ధనధాన్యాల గురించి విచారం లేదు. కులం సంగతి బాగా కనుక్కోవాలి! ఇంట్లోనే ఉంటాడుగా!

**శ్యామబంధు:** ఇంట్లో ఉండక ఎక్కడకు పోతాడు? ఎంత ప్రేమ చూపించినా మేనమామా అత్తే కదా!

రేవతి పక్కనే కూర్చుని భోజనం చేస్తోంది. ఈ మాటల మర్మమేమిటో... ఆమె ఏం అర్థం చేసుకుందో ఆమెకే తెలుసు. ఆ రోజునుంచీ ఆమె తీరు వేరుగా కన్పించ సాగింది. తండ్రిముందు వాసు చదువు చెబుతుంటే ఆమెకు సిగ్గుగా ఉండేది. ఏ కారణం లేకుండానే నవ్వేది. వాసు కొన్ని పంక్తులు చదివి, ఏదీ చదువు చూద్దాం అంటే.... ఒకొక్కప్పుడు గుణించుకుని మెల్లగా చదివేది. ఒక్కోసారి అకారణంగానే హీ.... హీ... అని నవ్వేది. చదువుకోవటం పూర్తికాగానే నవ్వుతూ ఇంట్లోకి వెళ్ళేది. ప్రతి రోజూ సాయంత్రం వీధిగుమ్మం వద్ద నుంచుని ఎవరికోసమో నిరీక్షించేది. వాసుని దూరం నుంచి చూసే ఇంట్లోకి వెళ్ళిపోయేది. ఇక అయిదుసార్లు పిలిస్తే గాని బయటకు వచ్చేదికాదు. ఎప్పుడన్నా రేవతి వీధిగుమ్మం దగ్గరకు వస్తే ముసలమ్మ కోపగించుకునేది.

చూస్తుండగానే పంచమి నుండి పంచమి.. రెండేళ్ళు గడిచిపోయాయి. విధాత లీలలో ఎవరికీ అన్నిరోజులూ ఒకే విధంగా వెళ్ళవు. ఫాల్గుణ మాసంలో ఒక రోజున – మిన్ను విరిగి మీద పడినట్లు గ్రామంలో కలరా వ్యాధి పొడసూపింది. గుమాస్తా శ్యామబంధు మహంతికి కలరా సోకిందనే వార్త ఉదయం గ్రామంలో విన్పించింది. మారుమూల పల్లెల్లో కలరా వ్యాధి వచ్చిందంటే ఇండ్ల తలుపులన్నీ మూసేసుకుంటారు. కలరా ముసలమ్మ ఒక పిల్లాడిని ఎత్తుకొని గుమ్మంలో నుంచొని ఉంటుందని అందరూ విశ్వసిస్తారు. తలుపు తీసి బయటికి ఎవరూ రారు. శ్యామబంధు ఇంట్లో ఆడవాళ్ళిద్దరూ ఏం చేస్తారు? పిల్ల భయపడి ఇంట్లోకి, బయటికి పాలుపోక తిరుగుతోంది. వాసుదేవ్ వార్త వినగానే బడి నుంచి హుటాహుటిన శ్యామబంధు ఇంటికి పరుగెత్తాడు. అతడికి భయం లేదు. శరీరం పట్ల విచారమూ లేదు. శ్యామబంధు పక్కనే మంచం మీద కూర్చుని అతడి కాళ్ళూ, చేతులూ మర్దన చేశాడు. నీళ్ళు... కొంచెం... కొంచెంగా ముఖం మీదకి చిలకరించాడు. పగలు మూడు గంటలైంది. శ్యామబంధు వాసు ముఖం వంక చూస్తూ "వా... సూ... రే... బ... నీ..." అస్పష్ట వాక్యాలుచ్చరిస్తూ ఆగిపోయాడు. మరి ఆ గొంతు మూగవోయింది! ఇంట్లో కేకలు మిన్నంటాయి. రేవతి నేలమీదపడి దొర్లసాగింది. గ్రామంలో ప్రజలంతా... ఆహా... అంతా ముగిసి పోయిందని... నిట్టూర్పులు విడిచారు. నిజమే అంతా ముగిసింది! ఎవరున్నారని! ఇంట్లో ఇద్దరు ఆడవాళ్లూ వాసు... నిన్న మొన్నటి పిల్లవాడు! గ్రామంలో వనసెఠి అనే చాకలి వాడున్నాడు! అతడికి సుమారు 55–60 ఏళ్లుంటాయి. ఇవాళైనా – రేపైనా వెళ్ళక తప్పదు! రెండు గావంచాలు తప్పకుండా దొరుకుతాయి. గావంచా నడుముకి బిగించి, గొడ్డలి భుజాన వేసుకుని హాజరయ్యాడు. ఇల్లే గ్రామకరణానిది! అత్తా,

కోడలు, వాసుదేవ్ ఎలాగో కర్మకాండ అయిందనిపించారు. అప్పటి విశేషాలు రాయటానికి నాశక్తి చాలదు. శ్మశానం నుంచి ఇంటికొచ్చేసరికి తూరుపు ఆకాశంపై శుక్రతార గోచరించింది. ఇంట్లోకి ప్రవేశించగానే రేవతి తల్లి నీళ్ళ విరేచనాలకని వెళ్ళింది. అంతే, మధ్యాహ్నం రెండుగంటలకి ఊళ్ళో రేవతి తల్లి మరణవార్త గుప్పుమంది.

కాలం ఎవరికోసమూ ఆగదు – రోజులు గడిచిపోతాయి. కొందరికి పల్లకీ మీద కూడా చిత్రవిచిత్రమైన రంగురంగుల షామియానా ఉంటుంది. కొందరికేమో సంకెళ్ళమీద కూడా కొరడాదెబ్బలు! చూస్తుండగానే ఇట్టే మూడుమాసాలు గడిచాయి. శ్యామబంధు ఇంట్లో ఎప్పుడూ ఆవులుండేవి! పన్ను సొమ్ము బాకీ ఉందని జమీందార్ మనుషులు వచ్చి ఆవులని పట్టుకుపోయారు. మా అందరికీ తెలుసు... శ్యామబంధు జమీందార్ సొమ్మును శివుడి తలమీది నిర్మాల్యంలాగ పవిత్రంగా భావించేవాడు. సొమ్ము వసూలు చేయగానే జమీందార్ కచేరీలో ఆ సొమ్ము జమ చేయందే అతడికి నిద్ర పట్టేది కాదు. శ్యామబంధు పన్నుసొమ్ము జమీందార్‌కి బాకీ ఉన్నాడో లేడో గానీ ఆవులు మాత్రం బాగా పాలిచ్చేవి... ఈ విషయం జమీందార్‌కి ముందు నుండీ తెలుసు! ఇది కాకుండా జమీందార్ సాగు చేసుకోవటానికి ఇచ్చిన భూమిని తీసేసుకున్నాడు.

ఇక రైతు ఎందుకుంటాడు? డోలా పూర్ణిమ రోజున రైతు వెళ్ళిపోయాడు. రెండు ఎద్దులు 7 1/2 రూపాయలకి అమ్ముడు పోయాయి. ఇరువురి కర్మకాండలకి అయిన డబ్బుపోగా మిగిలిన సొమ్ముతో ఎలాగో ఒక నెల గడిచింది. ఆ తర్వాత ఇంట్లో గిన్నెలకి రెక్కలొచ్చాయి. మరో నెల గడిచింది. వాసు డబ్బులేమైనా ఇస్తే నాయనమ్మగానీ, మనుమరాలు గానీ తీసుకునేవారు కాదు! గదిలో మూల గూట్లో పడేసేవారు. దానితో వాసు ఏమీ ఇచ్చేవాడు కాదు. ముసలమ్మ వాసుకి రెండు పైసలిస్తే వాటితోనే సరుకులు తెచ్చి ఇచ్చేవాడు. వాటితోనే వారికి పది రోజులు గడిచేవి. ఇంటిమీద నేసిన గడ్డి పూర్తిగా ఎగిరిపోయింది. మళ్ళీ నేయించాలి. వాసు రెండు రూపాయల గడ్డి కొని పెరట్లో ఉంచాడు. నేయించటం కుదరలేదు. ముసలమ్మ ఇదివరకట్లా రాత్రింబవళ్ళు కూర్చుని ఏడవటం లేదు. సాయంకాలమైతే కూర్చుని ఏడ్వటం మొదలెడుతుంది. ఏడ్చి ఏడ్చి నేల మీద వాలుతుంది. రాత్రంతా అలాగ గడిచిపోతుంది. రేవతి వెక్కివెక్కి ఏడుస్తూ నాన్నమ్మ పక్కనే ఉండేది. ముసలమ్మ కళ్ళకి ఇప్పుడు ఏదీ సరిగ్గా కన్పించటం లేదు. పిచ్చిదానిలా ప్రవర్తిస్తోంది. ముసలమ్మ ఏడుపు తగ్గించి, రేవతిని ఎక్కువగా తిట్టడం మొదలెట్టింది. కుటుంబంలో ఈ దుర్దశకి మూలకారణం అంతా రేవతనే దృఢ నిర్ణయానికి ఆమె వచ్చింది. రేవతి చదువుకోవడం వల్లనే కొడుకు చనిపోయాడు. కోడలు మరణించింది. భూమి – వ్యవసాయం – సమస్తం తుడిచి పెట్టుకుపోయాయి.

ఇంటి ఆవులను జమీందార్ తోలుకుపోయాడు. రేవతి కులనాశిని, దరిద్ర దేవత, సోమరిపోతూను!

ముసలమ్మ తిడుతున్నపుడు రేవతి కండ్ల నుండి కన్నీరు ధారగా స్రవించేది. తర్వాత రేవతి ముసలమ్మ పక్కన నుంచోలేకపోయేది. ఇంట్లో ఏదో ఒక మూలగా, లేదా పెరటి గుమ్మంలోనో చలనం లేని మొద్దులాగ ముఖం చేతుల్లో దాచుకుని కూర్చునేది. ఈ విషయంలో వాసు కూడా దోషే! వాసు ఇంట్లో ప్రవేశించక ముందు రేవతి చదువు మొదలెట్టలేదు కదా! కానీ ఆశ్చర్యకరంగా ముసలమ్మ వాసునేమీ అనేదికాదు. వాసు రాకపోతే ఈ ఇంటి వరండాకి ఆమాత్రం సందడి కూడా ఉండేది కాదు! జమీందార్‌తో సంబంధం ఈ ఇంటికి ఇంకా తెగలేదు. జమీందార్ తాలూకు మనుషులు వచ్చి ఇవాళ ఒక లెక్కా రేపొక లెక్కా అడిగే వారు. వాసు లేకపోతే ఆ తాళపత్రాల రసీదులన్నీ చదివి ఇచ్చేదెవరు? వాసు లేనపుడు ఎవరైనా వచ్చి ఏది అడిగినా ఆమె తెలివిగా సమాధానాన్ని చెప్పేది. రేవతి మరీ ఇంకా చిన్నపిల్ల కాదు! తల్లీతండ్రీ పోయాక ఆ పిల్ల నెవరూ వీధి వాకిట్లో చూడలేదు. కొన్ని రోజులు వెక్కి వెక్కి రోదిస్తూ ఉండేది. ఇప్పుడిక గొంతెత్తి ఏడ్వటం మానేసింది. రాత్రింబవళ్ళూ ఆ కళ్ళు అలాగ వర్షిస్తూనే ఉన్నాయి. ఈ సంఘటనతో ఆమె చిన్నప్రాణం – లోపల ఉన్న చిన్న మనసూ రెండూ ముక్కలైనాయి. ఆమెకి రాత్రీ పగలూ రెండు వొకటే. పగలు సూర్యకాంతి అని లేదు – రాత్రివేళ చీకటి అనీ లేదు. సమస్త విశ్వం ఆమెకు శూన్యమే! ఆమె హృదయమంతా తల్లితండ్రుల రూపంతో నిండి ఉంది. ఆమె కండ్లముందు ఎప్పుడూ రెండే దృశ్యాలు.... అమ్మ ఇక్కడ కూర్చుంది... నాన్న ఇటువైపు నడుస్తున్నారు... అమ్మానాన్నా... మరణించారు... ఇంకెప్పుడూ ఇక్కడికి తిరిగిరారని ఆమె నమ్మలేకపోతోంది! కడుపుకి ఆకలి లేదు.... కంటికి కునుకురాదు! క్షణక్షణం ధ్యాసంతా తల్లిదండ్రులమీదే! నాన్నమ్మ మీద భయంతో భోజనానికి కూర్చుంటోంది. నేలమీద నుంచి లేచి నిలబడటం తక్కువ! శరీరంలో ఎముకలే మిగిలి వున్నాయి. వాసు వస్తేనే కూర్చున్న చోటినుంచి లేవటం కూచోటం! కన్నీరు నిండిన పెద్ద కళ్ళతో వాసుని చూసేది. వాసు తనవంక చూస్తే చిన్న నిట్టూర్పు విడిచి తలకిందికి దించేది. ఒక్కోసారి వాసు పక్కన ఉంటే అతడిని చూస్తూ అలా ఉండిపోయేది. ఆ క్షణం ఆమెకి ఏ స్పృహా ఉండేదికాదు! ఆమె కండ్లనిండా... ఆలోచనల నిండా సర్వం వాసు... వాసుదేవమయం!

శ్యామబంధు మరణించి నేటికి అయిదు మాసాలవుతోంది. జ్యేష్ఠమాసం మధ్యాహ్నం 2 గం॥ల వేళ వాసు వీధి తలుపు తట్టి పిలిచాడు. సాధారణంగా అతడెప్పుడూ ఈ సమయంలో రాడు. ముసలమ్మ మూలుగుతూ వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా వాసు! వాసు "నాన్నమ్మా... డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ హరిహరపురంలో ఉన్నాడు. ఆయన మా బడిపిల్లలందరినీ అక్కడికి తీసుకురమ్మని జాబు వ్రాసి పంపించాడు. నేను రేపు

పొద్దున్నే మా పిల్లలందరిని తీసుకొని బయల్దేరతాను. తిరిగొచ్చేసరికి అయిదు రోజులవుతుంది.” రేవతి తలుపు మూలన నిలబడి వింటోంది... ఉన్నపాటున కుప్ప కూలిపోయింది. దెబ్బలు ఏమీ తగల్లేదు. వాసు ఇద్దరికీ అయిదు రోజులకు సరి పడేటట్లుగా బియ్యం, నూనె, ఉప్పు, వంకాయలు కొని తెచ్చి ఇంటిలో ఉంచాడు. ముసలమ్మకి నమస్కరించాడు. ముసలమ్మ వాసుతో “నాయనా... వేళకి భోజనం చేయటం మానొద్దు. శరీరాన్ని అశ్రద్ధ చేయొద్దు” ఈ మాటలన్నాక పెద్ద నిట్టూర్పు విడిచింది. రేవతి వాసుని తదేక దీక్షతో చూడసాగింది. ఆరోజు ఆమె చూపులో ఏదో మార్పు! అంతకు ముందు వాసు తనవంక చూస్తే తలదించు కునేది. ఈరోజు ఆమెకి ఈ స్పృహ లేదు. వాసును రెప్పవేయకుండా తాను చూస్తున్న భావన లేదు. వాసులో కూడా ఏ కోరికా లేదు... ఇదివరకు వాసుకు ఆమెను కండ్లారా చూడాలని ఉండేది. అయినా చూసేవాడు కాదు! ఇవాళ ఆ నాలుగు కళ్లూ కలుసుకున్నాయి. చూపుల్ని మరలించుకోవటానికి ఇద్దరిలో ఎవరూ సిద్ధంగా లేరు! కాసేపటికి మెల్లిగా వాసు చూపులు మరల్చుకొని– కదిలి వెళ్ళిపోయాడు. వాసు వెళ్ళాక ఆ ఇంట్లో వెలుతురన్నది లేకుండాపోయింది. ఇంటా బయటా అంతా అంధకారం. రేవతి వాసుని చూస్తూ నిశ్చల ప్రతిమలా ఉండిపోయింది. ముసలమ్మ పిలుపుకి ఆమెలో చైతన్యం కలిగింది. కానీ అదే మానసిక స్థితి. ఇంటా... బయటా... అంతా అంధకారం!

రేవతి కూచుని రోజులు లెక్కపెడుతోంది. ఇవాళ ఆరో రోజు. తల్లీతండ్రీ పోయాక ఆమె వీధి ముఖమే చూడలేదు. ఈ రోజు ఉదయం నుంచీ రెండుసార్లు వీధి తలుపు దగ్గరకి వచ్చి, తొంగి చూసి వెళ్ళింది. సాయంకాలం సుమారు ఆరు గంటలవుతోంది. హరిహరపురం నుంచి బడి పిల్లలు తిరిగి వచ్చిన వెంటనే, జనం వాళ్ళలో వాళ్ళు గోలగోలగా మాట్లాడుకోసాగారు. హరిహరపురం నుంచి తిరిగొస్తుండగా గోపాలపురం మర్రిచెట్టుకింద మాస్టారికి కలరా సోకింది. నాలుగుసార్లు నీళ్ళ విరేచనాలయ్యాయి. అర్ధరాత్రి కల్లా ప్రాణం పోయింది. గ్రామ ప్రజలందరూ అయ్యో... అయ్యో.... అంటూ పెద్దపెట్టున రోదించారు. ఒకరు... ఆహా... ఏమిటా రూపం! అంటే మరొకరు ఆహాఁ ఏమిటా ధైర్యం... అన్నారు. మరొకరు వీధిలో ముసిరే ఈగకు కూడా హాని చేయని శాంత పురుషుడమ్మా అని పొగిడారు. మొత్తంమీద ఆబాలగోపాలమూ వాసు మరణానికి దుఃఖిచారు.

రేవతి విన్నది. ముసలమ్మ కూడా విన్నది. ఏడ్చి ఏడ్చి ముసలమ్మ గొంతు బొంగురుపోయింది. ఏడ్చే శక్తిలేకపోయింది. చివరికి లేచి నిల్చుని “ఆహాఁ... ఎక్కడనుంచో ఇక్కడికొచ్చావు నాయనా... బుద్ధిహీనత వల్ల ప్రాణం పోగొట్టుకున్నావ్ కదా” అన్నది. అంటే ఆవిడ దృష్టిలో వాసుకి బుద్ధిలేక రేవతికి చదువు చెప్పటం వల్లనే మరణించాడు. ఆ పని చేయకపోతే అతడు మరణించి ఉండేవాడు కాదు!

ఈమాట విన్నాక రేవతి లోపలి గదిలోకి వెళ్ళి నేలమీద చతికిలపడింది. తర్వాత అంతా నిశ్శబ్దం. ఎక్కడా చిన్న చప్పుడు కూడా లేదు. రోజు గడిచింది మరునాడు పొద్దుటే ముసలమ్మ రేవతి ఎక్కడున్నదో చూడకుండా పెద్దగొంతు పెట్టి "ఏయ్ రేవతీ.... ఏయ్ రేవీ... ఏయ్ నిప్పూ... ఏయ్ పొయ్యీ..." అంటూ పిచ్చిదానిలా అరవసాగింది. కోపంతో రేవతిని తిట్టిపోయటమే ఆమె పని. పక్కవాళ్ళు... వీధి వాళ్ళు... ఈ తిట్లు వినటానికి అలవాటు పడ్డారు. ఎంతసేపూ రేవతిని నిప్పూ, పొయ్యీ అంటూ నిందించటమే! ముసలమ్మ కండ్లకి మరేమీ కన్పించటం లేదు. తడుముకుంటూ, తడుముకుంటూ వెళ్తే రేవతి శరీరం ఆమె చేతికి తగిలింది. వంటి మీద చెయ్యేసి చూసింది. రేవతికి ఉష్ణం. ఒళ్ళు కాలిపోతోంది. స్పృహలేదు. ముసలమ్మ చాలాసేపు కూర్చుని ఆలోచించింది. ఏం చేయాలి? ఎవరిని పిలవాలి?... ఏ దిక్కూ తోచలేదు.... పక్కన ఎవరూ సాయానికి లేరు. ఆ నిస్సహాయత లోనుంచి కోపం పుట్టుకొచ్చింది. చేసుకున్నవారికి చేసుకున్నంత! ఎవరేం చెయ్యగలరు? అన్నది. అంటే నువ్వు చదువుకోవటం వల్లనే జ్వరం వచ్చింది. నేనేం చేస్తాను? అని.

ఒక రోజు గడిచింది. రెండు మూడు నాలుగు అయిదో రోజూ గడిచింది. రేవతి నేల మీద అలా పడుకునే ఉంది. కళ్ళు తెరవటం లేదు. పిలిస్తే జవాబు లేదు. మాటా పలుకూ లేదు. ఆరో రోజున రేవతి ఏదో అస్పష్టంగా మాట్లాడుతోంది. ముసలమ్మ ఆందోళనగా దగ్గరికి వెళ్ళింది. రేవతి వంటి మీద చెయ్యేసి వళ్ళంతా నిమిరింది. కాళ్ళూ చేతులూ చల్లగా ఉన్నాయి. పిలిస్తే ఊ... ఊ... అంటోంది. ఎంతో ప్రయత్నించి కళ్ళు తెరిచి చూస్తోంది. ఏమీ అడగకపోయినా ఏవేవో విషయాలు చెబుతోంది... ఎవరైనా కవిరాజుకి చూపిస్తే 'తృష్ణా దాహరే ప్రలాపస్య.. సన్నిపాతస్య లక్షణా' అని తప్పక చెబుతాడు. ఈ శ్లోకాలన్నీ చదువుతాడు. కానీ ముసలమ్మకి మాత్రం కొద్దిగా సంతోషం కలిగింది. శరీరం వేడిగా లేదు, ఇదివరకు మాట్లాడలేక పోయేది, ఇప్పుడునోరు విప్పి మాట్లాడుతోంది. అప్పుడు కళ్ళు తెరవలేకపోయేది. ఇప్పుడు కళ్ళు విప్పి చూస్తోంది. తాగటానికి నీళ్ళు అడిగింది. ఆరు రోజులై నాలుక మీద ఒక చుక్క నీరు కూడా వేసుకోలేదు. నాలుగు ముద్దలు నోట్లోకి వెళితే పిల్లలేచి కూర్చుంటుంది.

"నువ్వు కాస్త పడుకో! నేను పిడికెడు బియ్యం పడేస్తా" అంటూ ముసలమ్మ ఇవతలకి వచ్చింది. ఏం వండుతుంది ముసలమ్మ? ముక్కుతూ మూలుగుతూ ధాన్యం ఉంచే వెదురుబుట్టలు, కుండా, మండా అన్నీ వెదికింది. పిడికెడు బియ్యం కూడా లేవు. పెద్దగా నిట్టూర్చి కూలబడింది. వాసు అయిదు రోజులకని తెచ్చిన సరుకులు, పది రోజులకి ఎలాగో సరిపోయాయి. ముసలమ్మకి సరిగ్గా చూపుంటే అర్థం చేసుకునేది. ఇంట్లో గిన్నెలు గట్రా మరేం లేవు. చేతికి ఒక చిల్లు చెంబు దొరికితే అది చేత్తో పట్టుకుని హరి షావుకారు దుకాణానికి బయల్దేరింది. హరిషా ఇల్లు

గ్రామం మధ్యలో. హరిషాది పెద్ద దుకాణమేమీ కాదు! బియ్యం, పప్పు, ఉప్పు, నూనె ఉంచుతాడు. ఎవరైనా బయటివారు హఠాత్తుగా వస్తే దుకాణానికి వెళతారు. ఏదైనా అవసరమొచ్చినా ఊరివాళ్ళు వెళ్ళి దుకాణంలో కొంటారు. సరే! ముసలమ్మ చెంబు పట్టుకుని హరిషా దుకాణానికి చేరింది. హరిషా ముసలమ్మ చేతిలోని చెంబు చూడగానే విషయం అర్థం చేసుకున్నాడు. ముసలమ్మ నోటి వెంట ఆమె అభిప్రాయాన్ని వినగానే హరి చెంబును తన చేతుల్లోకి తీసుకుని నాలుగు పక్కలా తిప్పి చూశాడు. ఏమీ లేవు. నా ఇంట్లో బియ్యం లేవు. ఈ చిల్లు చెంబు ఉంచుకొని బియ్యమెవరిస్తారు?

హరి ఇంట్లో బియ్యం లేవని కాదు! ఇవ్వాలనే ఉంది! కాకపోతే చెంబు చవగ్గా కొట్టెయ్యాలని చూస్తున్నాడు.

బియ్యంలేవని హరి అనగానే ముసలమ్మకి నెత్తిమీది వజ్రాయుధంతో మోదినట్లైంది.

"అయ్యో.... ఏం చేస్తాను? పిల్ల ఎలాగో జ్వరం పడి లేచింది. దానికింత ముద్ద పెట్టాలా?" అనుకుంటూ అలాగే కూచుండిపోయింది. సంజె చీకట్లు నలుమూలలా ముసురుకుంటున్నాయి. హరి వంక రెండుసార్లు చూసింది.

"ఇక లాభం లేదులా ఉంది... అమ్మాయి ఎలా ఉందో చూసొస్తాను..." చెంబు పట్టుకుని లేచి నిలబడింది.

"ఆ... ఆ... చెంబు ఇలా ఇవ్వు... ఇంట్లో ఏమున్నాయో చూస్తాను" అన్నాడు హరి.

చెంబు ఉంచుకుని నాలుగుశేర్ల బియ్యం, అర్ధశేరు పప్పు, కొద్దిగా ఉప్పు ఇచ్చాడు.

ముసలమ్మ సంచీ చేత్తో పట్టుకుని - నాలుగైదు చోట్ల కూర్చుంటూ, లేస్తూ మెల్లగా ఇల్లు చేరింది. ఇప్పటివరకూ ముసలమ్మ నోరు విప్పలేదు. మనసంతా పరిపరి విధాలుగా పోతోంది. దుఃఖపు కథ ఎవరికి చెబుతుంది!

ఇంటికి చేరగానే రేవతిని పిలిచింది. రేవతి జ్వరం నుంచి కోలుకుందని ఆమె విశ్వాసం. రేవతి నూతిలోనుంచి నీళ్ళు తోడి ఇస్తే తాను అన్నం వండుతానని ఆమె అనుకుంటోంది. రేవతి పలకక పోవటంతో ఆమె చాలా కోపంతో! ఏయ్ రేవతీ... ఏయ్ రేవీ... ఏమే నిప్పూ... ఏమే పొయ్యా... అంటూ కేకలు పెట్టింది. జవాబులేదు.

ముసలమ్మ హరిషావుకారు ఇంటికి వెళ్ళిన తరువాత నుంచి రేవతికి సన్నిపాత జ్వరం క్రమంగా ఎక్కువైంది. శరీరమంతా భయంకరమైన, దుస్సహమైన నెప్పులు, బాధ... శరీరం నిదానంగా చల్లబడుతోంది. నాలుక లోపలికి లాక్కుపోతోంది... విపరీతమైన దాహం... చల్లటి ప్రదేశానికి వెళ్ళాలనే కోరిక. రేవతి నేలమీద పొర్లుతూ ... పెరటి గుమ్మం వరకూ వచ్చింది. గుమ్మానికి ఆనుకుని చేరగిలబడింది. చీకట్లు

కమ్ముకొస్తున్నారు. గాలి బాగా వీస్తోంది. పెరడంతా చూసింది. తండ్రి కిందటి సంవత్సరం అరటి చెట్టు వేశాడు. ఇప్పుడది గెలతో నిండుగా ఉంది. తల్లి రెండేళ్ల క్రిందట జామ చెట్టు తెచ్చి పాతింది. ఆ రోజు రేవతి పరుగు పరుగున చేదలో నుంచి చెంబుడు నీళ్ళు తెచ్చి, చెట్టు మొదట్లో పోసింది. ఇవాళ జామచెట్టు కొమ్మలతో నిండుగా ఉంది. చెట్టును చూడగానే అమ్మ గుర్తుకొచ్చింది. చివరి క్షణాలలో మనసులో ఇంకేమీ లేవు... సంతోషంగా నిండిన అమ్మ రూపమే మనసును ఆక్రమించింది. సంధ్యా సమయం దాటిపోయి నలుదిక్కులా అంధకారం అలముకున్నది. కళ్ళకు ఏమీ కన్పించటం లేదు, రేవతి ఆకాశం వంక చూసింది. అప్పుడే ఉదయిస్తున్న నక్షత్రాల కాంతులు జగమంతా వ్యాపిస్తున్నాయి. ఏకాగ్రతతో రేవతి నక్షత్రం వంక చూస్తూ ఉండిపోయింది. కనురెప్పలు వాలలేదు. నక్షత్రం ఆకృతి క్రమంగా పెద్దయి చక్రం ఆకారంగా రూపుదిద్దుకుని – మరింతగా పెద్దదవుతూ – ఉజ్జ్వలంగా ప్రకాశిస్తోంది. నక్షత్రాల నడుమ ఆ ఆకృతి ఎటువంటిది? శాంతిదాయిని, ఆనందదాయిని, ప్రేమమయి అయిన తల్లి తన అభయహస్తాన్ని చాచి కౌగిట్లోకి రారమ్మని పిలుస్తోంది. తల్లిహస్తాలు రెండూ శాంతికిరణాల వలె ఉన్నాయి. ఆ కిరణాలు రెండూ వచ్చి రేవతి రెండుకళ్ళనూ తాకి, హృదయంలోకి ప్రవేశించాయి. ఆ అంధకారం నడుమ మరి ఏ శబ్దమూ విన్పించలేదు. కేవలం ఊపిరి సవ్వడే! నిశ్వాస శబ్దమే క్రమంగా అధికమై.... చివరగా "మా... మా..." అనే రెండు అస్పష్ట శబ్దాలే వినవచ్చాయి. తరువాత పెరడు – నిశ్శబ్దమూ నీరవమూ అయింది.

షాపుకారు ఇంటినుంచి వచ్చిన ముసలమ్మ దేక్కుంటూ వెళ్ళి రేవతి జ్వరంతో పడుకున్న చోటుని చూసింది. అక్కడ రేవతిలేదు. ఇల్లు, బయట వరండా, డెంకీశాల అన్నీ వెదకింది. చివరగా జ్వరం తగ్గిపోయి పెరట్లో తిరుగుతోందని భావించింది.

అదే పిలుపు, ఏమే రేవతీ... ఏమే రేవీ... ఏమే అగ్గీ... ఏవే పొయ్యీ... పెరటి ద్వారం దగ్గరగా వెళ్ళి, తడుముకుంటూ వరండా మీద కూర్చుంది ముసలమ్మ.

రేవతి శరీరం ముసలమ్మకి తగిలింది. "ఓహో... ఇక్కడ కూచున్నావా..." అంటూంటే శరీర స్పర్శలో తేడా తెలిసివచ్చింది.

ముసలమ్మకి షాక్ కొట్టినట్లె రేవతి శరీరాన్ని తల నుంచి పాదాల వరకూ తడిమింది. ముక్కు కింద చేయి ఉంచి చూసింది. దిగ్భ్రాంతికి గురి అయిన ముసలమ్మ నోటి వెంట ఒక చిత్రమైన శబ్దం వెలువడింది. వెనువెంటనే వరండా మీద నుంచి ఏదో కిందబడిన శబ్దం.

శ్యామబంధు మహంతి కుటుంబసభ్యులను ఈలోకంలో మరి ఎవ్వరూ తరువాత చూడలేదు. పొరుగింటి వారు రాత్రి మొదటి జాములో చివరగా ఈ మాటలే విన్నారు. "ఏమే రేవతీ.. ఏయ్ రేవీ.. ఏమే అగ్గీ.... ఏమే పొయ్యీ..."

✡

1) డెంకీ: భూమిలో దింపిన పెద్దరోలులో ధాన్యం, బియ్యం, కారం, ఆవాలు మొదలైనవి దంచుకోవటానికి పెద్ద రోకలిని, దానికి పెద్ద పొడుగాటి కొయ్యబల్లను సిద్ధంచేస్తారు. కొయ్యబల్ల మీద కాలు వేసి తొక్కుతుంటే రోకలి ద్వారా అన్నీ కావలసిన విధంగా పొడులవుతాయి.

2) శ్రీ పంచమి: సిరి పంచమి: ఒడిశాలో బడులలో తప్పనిసరిగా సరస్వతి పూజ చేస్తారు. విద్యారంభానికి మంచి రోజు.

3) డోలా పౌర్ణమి: హోలీ – వసంతోత్సవం.



**డా॥ తుర్లపాటి రాజేశ్వరి**

ఫోను:0680-2261783

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు సొంతవూరు. ఒడిశా ప్రభుత్వ విద్యాశాఖలో తెలుగు విభాగంలో రీడర్‌గా పదవీ విరమణ చేసినారు. బరంపురంలో కుదురు కున్నారు. ఒడిశాలో వివిధ తెలుగు సాహితీ సంస్థలతో కలిసి కార్యకర్తగా కృషి చేస్తున్నారు. ఆంధ్రప్రభ వారపత్రికలో 1976లో వచ్చిన 'దీపం వెలిగింది' నవల ద్వారా రచనలను మొదలుపెట్టినారు. నవల, కవిత, కథ, వ్యాసం, అనువాద రంగాలలో వీరివి ఇప్పటి వరకూ 15 పుస్తకాలు వెలువడినాయి. వీరి కవిత్వం పలు భాషలలోకి అనువాదమయింది. రవీంద్రుని 'ఫ్రంట్‌గేదరింగ్' కవిత్వాన్ని 'నివేదన' పేరుతో తెలుగు లోకి తెచ్చినారు. జ్ఞానపీఠ పురస్కారం పొందిన ప్రతిభారాయ్ ఒడియా కతలను తెలుగు చేసినారు. వీటితోపాటు ఎంతో ఒడియా సాహిత్యాన్ని తెలుగువారికి పరిచయం చేసి ఎన్నో పురస్కారాలను పొందినారు.



# కమలాపురం హోటల్లో

## కమలాపురద హోట్లినల్లి

**పంజె మంగేశ రాయ**

దక్షిణకన్నడ జిల్లాలోని బంట్వాళలో 22-02-1874న పుట్టినారు. కన్నడ నుడిలో కథానిక, వ్యాసం, బాలగేయాలు అనే ప్రక్రియలకు తండ్రి వీరు. సీతమ్మ, రామప్పయ్య గార్లు వీరి తల్లిదండ్రులు. వీరు సారస్వత బ్రాహ్మణులు. నేత్రావతి నది ఒడ్డున కొబ్బరి, పోక, పనస, చింత తోపులతో నిండిన బంట్వాళలోనే మంగేశరాయ బాల్యం గడిచింది. వీరు చిరుప్రాయం నుంచే కొంకణి, కన్నడ నుడులలో పాటలు రాయడం మొదలుపెట్టినారు. అయితే వీరు రాసిన కొంకణి పాటలు దొరకలేదు. బంట్వాళలో తొలి చదువులు పూర్తయినాక పై చదువుల కోసం మంగుళూరుకు చేరుకొన్నారు. పెద్దగా డబ్బులున్న కుటుంబం కాకపోవడంతో అతికష్టం మీద బి.ఎ. వరకూ చదివినారు. చదువు కొనసాగుతుండగానే గిరిజాబాయి గారితో పెళ్లి అయింది. ఉపాధ్యాయ పట్టాను పొంది స్కూల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సంపాదించినారు. ఈ పనిలో భాగంగా వీరు తేలికయిన బోధన పద్ధతుల గురించి ఎన్నో వ్యాసాలను రాసినారు. ఉద్యోగంలో ఉంటూనే వీరు రచనలను కొనసాగించినారు. కతలు, గేయాలు, బాల గేయాలు, కథా గేయాలు, దేశభక్తి పాటలు వంటివి ఎన్నో రాసినారు. కన్నడంలో తొలి డిటెక్టివ్ నవల వీరు రాసినదే. తుళు, కన్నడ నుడులలోని జానపద గాథలను వెలికి తీసినారు వీరు. బోధనా పద్ధతులు, వ్యాకరణం మొదలయిన అంశాల మీద పుస్తకాలను రాసినారు. ఇప్పటి కర్నాటక ప్రాంతం మంగేశరాయ కాలంలో అయిదు పాలనా విభాగాల కింద ఉండేది. మంగేశరాయ రచనలు అయిదు ప్రాంతాల కన్నడిగులనూ ఏకం చేయడానికి ఎంతో దోహదపడినాయి. 1934లో రాయచూరులో జరిగిన అఖిల భారత కన్నడ సమ్మేళనానికి వీరే అధ్యక్షత వహించినారు. 1937లో తమ 63వ ఏట న్యుమోనియాతో కన్నుమూసే వరకూ కన్నడనుడి సేవలోనే ఉన్నారు పంజె మంగేశ రాయ.

కమలాపురం ఓడరేవు ఆమని సందె నీరెండలో సొక్కుతా ఉంది. వీరాపురం నుంచి వచ్చి ఒకదానికొకటి ఆనుకొని నిలబడున్న రెండు పడవలు నీటి చిరు అలలమీద కులుకుతున్నాయి. పడవాయన కాలికింద కత్తిపీటను అదిమి పెట్టుకొని, చేతులతో చేపలను కోసి, నీళ్లున్న మట్టిచట్టిలో వేస్తున్నాడు. నడుమనడుమ మీదకొస్తున్న కాకులను తరుముతున్నాడు. కొంచెం దూరంగా జాలరికత్తెలు నడుముల్లోతు నీళ్లలోకి దిగి, బుడుంగున మునకలు వేసి, బురదలోని సీపి చేపలను చేతినిండా జవురుకొని, తమ కోకల కుచ్చిళ్ల సంచులలో నింపుకొంటున్నారు. గట్టుమీదున్న జాలరి కోడెవాడు, నల్లటి ఆ జాలరికత్తెలను ఓరగా చూస్తూ ఏవేవో తలపోస్తున్నాడు. ఎక్కడ చూసినా జనంగోల, బండ్ల చప్పుళ్లు, రేవు కూలివాళ్ల కలకలం. ఇటువైపు కనుమల మీద నుంచి దిగిన కాఫీ మూటలను కడలిలోని నావల దగ్గరకు సాగిస్తున్నారు. ఇదిగో ఇక్కడ పోగుపోసిన బియ్యం మూటలను లెక్కపెడుతూ మందిని అరిచి పిలుస్తున్నాడు ఒక బేరగాడు. అక్కడ బొంబాయి నుంచి వచ్చిన సరుకులను గట్టుమీదకు దించుతు న్నారు. ఇక్కడ సరుకుల పట్టీని రాస్తున్న గుమస్తా ముసలాయన అద్దాల కళ్లను పైకెత్తి చూస్తూ చెవిమీది కలాన్ని అప్పుడప్పుడూ తీస్తూ పారుపత్తెం చేస్తున్నాడు. తెల్లదొర ఒకడు తెల్లపడవ చుక్కానిని పట్టుకొని కడలి లోపలకు పోతున్నాడు. పడవలో అతని బంటు, తుపాకిని చేతపట్టుకొని నిలబడి ఉన్నాడు. ఇటు కొందరు ఇల్లరులు చల్లగాలిని పీలుస్తూ గుమిగూడి తమ అలంకారాలను సవరించుకొంటున్నారు. ఉద్యోగులు ముని మాపు నడకకు వచ్చే పొద్దు ఇంకా కాలేదు. వచ్చినవాళ్లలోని ఒకరిద్దరు మూడుపైసల హోటల్ దగ్గరకు పోతున్నారు. హోటల్లో నైవేద్యం ముగించిన కొందరు మీసాలకు వస్త్రపూజ చేస్తున్నారు. కొందరు చుట్టపొగతో ధూపం వేస్తున్నారు. ఇంకొందరు బీడీని తాగడానికి నిప్పును వెలిగించి దీపారాధన చేస్తున్నారు. అందరూ డబ్బులకు ముందుగానే అర్ఘ్యం ఇచ్చేసినారు.

హోటల్ యజమాని పూర్ణస్వామి అయ్యంగారు. ఈ పేరును కొందరు పొన్నుస్వామి అని కుదించినారు. కొందరు పెణ్ణు(అమ్మాయి)స్వామి అనీ పొణ్సామి అనీ కావాలనే పిలుస్తుంటారు. ఎందుకంటే ఇరవై ఏళ్ల కిందట అయ్యంగారు, ఒక అమ్మాయికోసం ఊరిని వదిలేసి పోయినారు. శ్రీరంగం, తిరుపతి, పూరి, రామేశ్వరం మొదలైన పుణ్యక్షేత్రాలను గిరగిరా తిరిగి, ఎట్లాగో అక్కడ కొద్దిగా డబ్బును గడించి, మళ్లా

కమలాపురానికి వచ్చి, పరోపకారం కోసం ఈ హోటలును ఇక్కడ పెట్టినారు. యాత్రలవలన లాభాలు ఎన్నో ఉంటాయి అంటుంటారు. మన అయ్యంగారే అయినా, దేశదేశాల మిఠాయిల తీరునూ, పలు నుడుల కొద్దికొద్ది పరిచయాన్నీ, అచ్చెరువు కలిగించే సమాచారాలనూ జనం ముందు ఉంచుతుంటారు. ఆయనకు పిల్లాపీచూ లేరు. కానీ నల్లూరు నీలాంబ చిన్నకొడుకు మటుకు ఈయనను 'నాన్నా! నాన్నో!' అని ఎలుగెత్తి పిలుస్తూ ఒకనాటికి రెండుసార్లు డబ్బులు తీసుకొని పోతుంటాడు. సొంతంగా బతకాలనే ఉద్దేశంతో హోటలును నడుపుతున్నానే కానీ, దీనివలన ఉపయోగమేమీ లేదని ఆయన ఏదో ఒక సాకుతో గొణుక్కొంటూ ఉంటాడు. అయినా హోటలుకు వచ్చేవాళ్లు నానాటికీ పెరుగుతూనే ఉన్నారు. ఒక్కపైసా కాఫీని తాగడానికి వచ్చినవాడు కూడా అయ్యంగారి యాత్రా సమాచారాన్ని వింటూ వింటూ, తినిందేదో తెలియకనే జేబులోని డబ్బుల్నంతా సమర్పించుకొని పోతుంటాడు. ఒకరిద్దరు, అయ్యంగారిని వారి సమాచారాల మూటను విప్పేటట్లు చేసి, ఆయన ఆ ఆనందంలో మునిగి ఉన్న సమయాన్ని చూసి, మెల్లగా జారుకొంటుంటారు. వెంటనే అయ్యంగారు ఈ లోకంలోకి వచ్చి, వాళ్ల వీపును పట్టుకొని, డబ్బులు వసూలు చేస్తుంటారు.

మొదట్లో పూర్ణస్వామి గారికి కమలాపురం కోడెగాళ్ల మీద మంచి అనిపించే ఉండేది. ఇటీవల అది మారుతూ వస్తున్నది. చాలా మంది ఖాతాదారులు లడ్డు తినడానికి మారుగా దుడ్డు తినడం మొదలుపెట్టినారు. ఈ రోగాన్ని అడ్డుకోడానికి అయ్యంగారు ఎన్నో ఎత్తులు వేసినాడు. రావలసిన డబ్బులను ముందుగానే పద్దు పుస్తకంలోకి ఎక్కించేస్తారు. ఏవో కారణాలతో దూరప్రాంతాలకు పోయున్న ప్రియ ఖాతాదారులకు క్షేమసమాచారాలను తెలుపుతూ ఉత్తరాలు రాసి చూస్తారు. 'బడుగుల విన్నపం' అని పలకమీద అప్పులవాళ్ల పేర్లను రాసి హోటలు గోడకు వేలాడేస్తారు. చివరకు ఎట్లాగో లెక్కను సరిచేసేస్తారు. ఏళ్లూ పూళ్లూ సాగదీసి ఇచ్చిన అప్పులవాళ్ల పేర్లను లెక్క పుస్తకంలో ఎర్రవన్నె గీతల కింద మరుగు చేసేసినారు.

ఈపొద్దు మాపటేళ హోటల్లో చాలామంది గుమిగూడినారు. కరియూరు శ్యామరాయలు గోదుమరొట్టెను కాఫీ నిండిన గిన్నెలో నానబెడుతూ ఉన్నాడు. మలెనాడు కుప్పణ్ణగారు టీగ్లాసును ముందుంచుకొని, పెదవులతో మెల్లమెల్లగా జుర్రుకొంటు న్నాడు. వీరిద్దరి మీద అయ్యంగారు గుర్రుగా ఉన్నాడు.

అయ్యంగారికి కోపం రావాలని వీరిద్దరూ కుచేష్టలను మొదలుపెట్టినారు. రెండునాళ్లకు ముందు ఈ పుణ్యాత్ములు, హోటల్లో పొట్టనిండా తిని, తాగి, అయ్యం గారిని రేగించి పొయ్యేసినారు. అయ్యంగారు తన సొంత అనుభవాల గురించి కొన్ని మాటలను వచ్చినవాళ్లతో మనోరంజకంగా చెపుతున్నప్పుడు, అయ్యంగారు చెప్పేవన్నీ కల్లబొల్లి మాటలనీ, ఖాతాదారులు ఒళ్లు తెలియకుండా ఎక్కువ తిని, ఎక్కువ డబ్బులు

చెల్లు చేయడానికని అతిశయోక్తులు చెపుతున్నారనీ ఈ మూర్ఖులు జగడమాడినారు. అయ్యంగారు తాను చెపుతున్నవేవీ కల్లబొల్లి కతలు కావని ఈ అధముల తలలకు ఎక్కించాలనుకొన్నాడు. ఈపొద్దు కుప్పణ్ణగారు గొడవకు తెరతీస్తున్నట్లుగా "రాయలూ! అయ్యంగారు రామేశ్వరం కడలిని ఈదిన సంగతి తెలుసా?" అని అడిగినాడు.

పూర్ణస్వామి అయ్యంగారు అవును అన్నట్లుగా కనుబొమలను ముడేస్తూ, లోలోపల ఆనందంతో పొంగిపోయినాడు.

శ్యామరాయ: "అప్పుడు మీతోబాటు ఎవరున్నారు అయ్యంగారూ? ఈ ముప్పు నుంచి మిమ్మల్ని దూరం చేసింది ఆ గుండాచారేనా?"

కుప్పణ్ణ: "అయుండాలి. లేకుంటే మన అయ్యంగారు అండమాన్ దీవులకు పొయ్యేసుంటారు ఏమో?"

అయ్యంగారు ఏమీ మాట్లాడకపోవడం చూసి, శ్యామరాయలు "మీ గుండాచారి గారు ఇప్పుడు ఎక్కడున్నారు?" అని అడిగినాడు.

ఇంతలో ఎవరో ఒకాయన హోటల్లోకి అడుగుపెట్టినాడు. అయ్యంగారు ఏదో పనిమీద లోపలకు పోయుండడంతో, అక్కడున్నవాళ్లు ఎవరూ తెలియకపోవడంతో, వచ్చినతను ఒక నిమిషం అక్కడే నిలబడిపోయినాడు. అయ్యంగారు బయటకు వస్తూనే ఈ వచ్చినతన్ని చూసి ఉబ్బితబ్బిబ్బయినాడు. వచ్చినతను కూడా నవ్వును చూపిస్తూ "ఏమి అయ్యంగారూ? ఎట్లా ఉన్నారు?" అని అడిగినాడు.

అయ్యంగారు వచ్చినతనికి ఎదురుకోలు పలుకుతూ "ఎప్పుడు రాక గుండాచారి గారూ?" అని అడిగినాడు.

ఉన్నవాళ్లు మెదలకుండా వచ్చినతన్ని కళ్లువిప్పి చూస్తూ కూచునున్నారు.

వచ్చినతను "అయ్యంగారూ! ఏమి చెప్పమంటారు! మిమ్మల్ని పదేళ్ల నుంచి వెతుకుతున్నాను నేను. ఇప్పటికి మీ దర్శనమయింది" అంటూ నిట్టూర్చినాడు. అయ్యం గారు కొంచెం ఆలోచించి, "ఆ తరువాత మీరు నేనూ కలుసుకోనే లేదు కదా?" అని నవ్వుతూ కుప్పణ్ణగారిని చూసినాడు.

కుప్పణ్ణ: 'ఎవరిని కలుసుకోవడం?'

అయ్యంగారు లెక్కచేయనట్టుగా "మీరూ నేనూ ఆమీదట కలుసుకోనే లేదు. నేను రామేశ్వరం కడలిని దాటి, మునుగుతున్న పడవకు వీపును ఆనించి తేల్చి, కన్యాకుమారిని తాకిన తరువాత మిమ్మల్ని చూడలేదు. నిజం" అంటూ శ్యామరాయలు వైపు చూపు సారించినాడు.

వచ్చినతను “సరిసరి. ఆనాళ్లన్నీ పోయినాయి. ఇప్పుడు మన మాటలను నమ్మే వాళ్లు ఎవరూ లేరు” అని తననే చూస్తున్న కుప్పణ్ణగారి గురించి అయ్యంగారితో “ఈయన ఎవరు?” అని అడిగినాడు.

కుప్పణ్ణ గారు ఈ అవకాశాన్ని పట్టుకొని మాట్లాడడానికి ముందుకు వచ్చి “ఆచారి గారూ?! మీ పేరును మేము అయ్యంగారి నోటినుంచి నానాడూ వింటుంటాము. మన పూర్ణస్వామి అయ్యంగారు కావేరి మునకలప్పుడు...”

వచ్చినతను “అవునవును!” అని తలెత్తి “ఆయన్ను కాపాడిన గుండాచారినే నేను. నేను లేకుంటే మన అయ్యంగారు అప్పుడు మొసలి నోట్లో పడిపోయి ఉండేవారు. ఏమి అయ్యంగారూ? ఏబై అడుగుల పొడవైన మొసలి ఎక్కడ? మన చిన్నదొక పవిత్ర దర్భ ఎక్కడ? ఈయన ఎవరు!” అని అయ్యంగారిని అడిగినాడు.

అయ్యంగారు లెక్క చేయనట్టుగా “ఆయన దలాల కుప్పణ్ణ. నేను చెప్పేవన్నీ కల్లబొల్లిమాటలనే సంసారి. మనకు ఆయన గొడవెందుకు? ఈ ఊర్లో ఆయన్ని లెక్కచేసేవాళ్లు ఎవరు?” అన్నాడు.

శ్యామరాయ: “ఈయనేనా ఏమిటి గుండాచారిగారు?”

గుండాచారి: కావేరి మునకల్లో మొసలి నోటి నుంచి అయ్యంగారిని విడిపించి, కాపాడిన గుండాచారిని నేనే! మలయాళసీమలో అయ్యంగారు జబ్బుతో మంచం పట్టినప్పుడు, ఆయన్ను కనిపెట్టుకొని ఉండి బతికించిన గుండాచారినీ నేనే! ‘నిన్ను ఎప్పటికీ మరువలేను! నిన్ను ఎప్పటికీ విడువలేను’ అని అయ్యంగారు నాకు మాట ఇచ్చినారు. నేను ఒంటరిగా తిరుగుతున్నప్పుడు, ఎన్నోసార్లు అయ్యంగారిని తలచుకొన్నాను. ఒక్కసారి అయ్యంగారిని చూస్తే, నా అగచాట్లన్నీ తీరిపోతాయని అనుకొనేవాడిని. శ్రీకృష్ణుని దయవల్ల ఈ పొద్దు ఆయన్ను చూసి ధన్యుడనయినాను. “అయ్యంగారూ! అంతా మరచిపొయినారా?”

అయ్యంగారు: “లేదు స్వామీ! నా ఊపిరి నిలిచిందే మీ వలన. మీ ఉపకారాన్ని జన్మంతా మరువలేను. వల్లపడినంత మారు ఉపకారం చేయడానికి అవనుగా ఉన్నాను”

కుప్పణ్ణ: “ఆయన గొంతులో ఊపిరి ఉన్నంతవరకూ మీరు సాయం చేయడమే మారు ఉపకారం”

అంతలో అయ్యంగారి మాట ప్రకారం కాఫీ నిండిన గిన్నెనూ ఫలహారం దొన్నెలనూ తెచ్చిచ్చినాడు నౌకరు. గుండాచారి ఒక కంటిని ఫలహారం వైపూ ఇంకొక కంటిని కూచున్న వారి వైపూ పెట్టి, “దానికంటే సింహళంలో వీరిని మూడు అడవి

ఏనుగులు చుట్టుముట్టినప్పుడు నేను...” అంటా అరపలుకుతో ఫలహారాన్ని చూస్తూ కూచున్నాడు.

తమ ఫలహారాన్ని ముగించి కూచున్న కుప్పణ్ణ, శ్యామరాయలు ఇతని సమాచారాన్ని తెలుసుకోవాలని గుండాచారి దగ్గరకు వచ్చినారు. అయ్యంగారు “తినండి! తినండి!” అనేసరికి, ఈ మాట తననుద్దేశించి అన్నాడనుకొని, కుప్పణ్ణగారు దొన్నెలోకి వేళ్లను ముడిచి, ఎడమ చేత్తో కాఫీ పంచపాత్రను పట్టుకొన్నాడు. శ్యామరాయలు చేతులు కూడా అట్లాగే చేయసాగినాయి. అయ్యంగారు తేలుకుట్టినట్లు మొకం పెట్టినాడు.

నిమిషంలోనే ఫలహారాలన్నీ మాయమయినాయి. గుండాచారిగారు “ఇంకా తనివి తీర లేదు” అని వేసటతో అన్నాడు. అయ్యంగారు అక్కడున్న ఇద్దరినీ వంకరగా చూస్తూ, అరమనసుతో మరికొంత గుండాచారి చేతులకు తెచ్చిచ్చి, “మహానుభావులారా! నేను ఇదివరకు చెప్పిన సంగతులన్నీ పూర్తి నిజాలని ఇప్పుడు నమ్మకం కుదిరిందా?” అని అడిగినాడు.

కుప్పణ్ణ: “ఈపొద్దు ఫలహారంతో మొసలి సంగతి ఒకటి నిజమేనని తెలుసుకొన్నాము - గుండాచారి గారూ! ఇంకా ఎన్నాళ్లు ఉంటారు?”

గుండాచారి: “మన ఋణానుబంధం ఉన్నంతవరకూ ఉంటాను.”

అయ్యంగారికి ఈ మాట రుచించలేదు. గుండాచారిగారు చెయ్యి కడుక్కొని ముక్కుపొడి అడిగినారు. అయ్యంగారు పొడుండబ్బీని ఇచ్చినాడు. గుండాచారి ముక్కుపొడిని చేతిలోకి తట్టుకొని, డబ్బీని శ్యామరాయలు చేతికి అందించినాడు. ఈయన రెండుమూడుసార్లు చేత్తో తీసుకొని చిటికెడు సరిపోదన్నట్లుగా, అరతులం పొడిని ముక్కులోకి చేర్చే బదులుగా తన డబ్బీలోకి చేర్చేసినాడు. అయ్యంగారు కోరలు పెరికిన పాములాగా అలమటించినాడు. చివరకు శ్యామరాయలూ కుప్పణ్ణగారూ మరునాడు వస్తామని ఇద్దరికీ అభయమిచ్చి నడిచినారు.

ఖాతాదారులంతా హోటలు నుంచి పోయినాక గుండాచారులు మీసం తిప్పుతూ “అయ్యంగారూ! నేను చేసింది ఎట్లా ఉంది? ఆ పాపిష్టివాళ్లు మిమ్మల్ని నమ్మేటట్లు చేసినానా లేదా చెప్పండి” అన్నాడు.

అయ్యంగారు: “కొద్దిగా ఎక్కువయింది. నేను చెప్పినంతే చేసుంటే బాగుండేది. నువ్వు ఎక్కువగా బొంకినావు.”

గుండాచారి: “అట్లా చేయడం వల్లనే ఆ పాపులు నమ్మినారు. నేను బొంకితే గోడకు సున్నమేసినట్లు ఉంటుంది. అవి కల్లబొల్లి కూతలని ఎవరూ కనిపెట్టలేరు.”

అయ్యంగారు: "నా ముక్కుపొడినంతా పంచేసి వట్టి డబ్బీని తిరిగిచ్చినావు."

గుండాచారి: "నేను మాటల్లో పడి ఒళ్లు మరచిపోయినాను. మీరు చెప్పిందంతా వదిలేసినాను."

అయ్యంగారు: "అవును, నువ్వు ఎల్లుండి ఆగబోటును ఎక్కి హొన్నూరుకు పోతున్నానని వాళ్లతో చెప్పేసి ఉండాల్సింది."

గుండాచారి: "రేపు చెప్పినా సరిపోతుందిలే. అది ఉండనీ! మనం ఆడిన ఆట ఆ మొప్పెగాళ్ల కళ్లను మూసేసింది."

అయ్యంగారు: "రేపు పొద్దుటినుంచే నువ్వు పోబోయే సంగతిని మెల్లగా చెపుతూ ఉండు. అల్లుడి ఇంటికి పోతున్నానని చెప్పు. ఎల్లుండి పోయేటప్పుడు మన ఒప్పందం ప్రకారం ఒక వరహా ఇస్తాను".

గుండాచారి నవ్వును ఆపి, మాటను ఎత్తుకోబోయేటప్పటికి, ఎవరో హోటలు వాకిట్లో నిలిచి పిలిచినారు. కూతనుబట్టి కుప్పణ్ణగారు అయుండచ్చు అనుకొన్న అయ్యంగారు, "ఈవేళలో ఇక్కడ కాఫీ దొరకదయ్యా!" అంటూ లోపలకు నడిచినాడు. గుండాచారులు కడుపు ఆకలి తీరడంతో అయ్యంగారి పడకను పరచుకొని నిద్రపోయి నాడు. అయ్యంగారు అన్నం తినేసి, శయనించి ఉన్న గుండాచారిని చూసి లోలోపల ఉడికిపోతూ, పళ్లు కొరుకుతూ లోపలకు పోయినాడు.

ఆదివారంనాడు ఆగబోటు కమలాపురం రేవును తాకింది. అయ్యంగారు, ఆగబోటు వచ్చిందని రెండుమూడుసార్లు గుండాచారితో అన్నాడు. గుండాచారి ఆ మాటను చెవిలో వేసుకోనే లేదు. హోటల్‌కు వచ్చినవాళ్లంతా "గుండాచారిగారు ఈ పొద్దు పోతున్నారు" అని తెలుసుకొన్నారు. అయినా గుండాచారి, వచ్చిన వాళ్లతో కోతలు కోసేటప్పుడు తన గురించి ప్రస్తావించడమే లేదు. అయ్యంగారు ఆయన ప్రస్తావనను అప్పుడప్పుడూ తిరగేయాలని చూసినారు. కానీ, అయ్యంగారు హొన్నూరు రథోత్సవాన్ని ప్రస్తావించి కన్నుకొట్టి సైగ చేస్తున్నప్పుడు, గుండాచారి ప్లేగు మందును గురించి మాట్లాడుతున్నాడు. అయ్యంగారు దీనినంతా ఎంతో ఓపికగా సహించినాడు. ఖాతాదారులంతా చీకటి పడినాక తమతమ ఇళ్లకు పోయినారు.

అయ్యంగారు కోపంతో రుసరుసలాడుతూ "దీని అర్థమేమిటి?" అని అరచినాడు.

గుండాచారి మారు పలుకుతూ "దేని అర్థం? పొన్సామీ?" అన్నాడు.

"నన్ను పొన్నుస్వామీ అని పిలువద్దు. రేపు పొద్దున్నే నువ్వు ఇక్కడి నుంచి బయలుదేరాలి, చూడు!" అని గర్జించినాడు అయ్యంగారు.

గుండాచారి: "పోవాలా? ఎక్కడికి పోవాలి?"

అయ్యంగారు: "కావలసిన చోటుకు పో! నువ్వు ఇక్కడినుంచి పోతే చాలు."

గుండాచారి: "అయ్యంగారూ! ఏమేమో మాట్లాడుతున్నారే. నిన్నరాత్రి నిద్ర పట్టలేదా ఏమిటి?"

అయ్యంగారు: "రేపు పొద్దున్నే నువ్వు పోయినావా సరే! లేదంటే, నేనే మెడపట్టి గెంటేస్తాను. నేను చేసిన ఒప్పందం గురుతు లేదా?"

గుండాచారి: "ఏ ఒప్పందం? ఒప్పందమో, వంకాయో! రేపు తలకు నూనె అంటుకొని స్నానం చేయాలనుకొని ఉన్నాను...." అయ్యంగారు కోపాన్ని తట్టుకోలేక, "నువ్వు పోతావా లేదా రేపు? ఆ పనికిమాలిన వాళ్లకు నేను చెప్పేవన్నీ నిజాలని చూపించేందుకు నిన్ను ఒక నాటకం ఆడడానికి ఇక్కడకు పిలిచినాను. ఇక్కడే అంటుకుపోయినావు నువ్వు."

గుండాచారి: "అప్పుడు చేసిన ఉపకారాలనంతా మరచిపోయినారా? మొసలి పట్టుకొన్నప్పుడు నేను ఒక్కడినే నా పవిత్ర దర్భతో...."

అయ్యంగారు: "ఊరికే ఇబ్బంది పెట్టద్దు. నన్ను మొసలి పట్టుకొనిందీ లేదు; గుండాచారి విడిపించిందీ లేదు."

గుండాచారి: "కృతఘ్నతకు హద్దు లేదు. నేను నీ ఊపిరిని కాపాడడం మరచి నావా?"

ఇట్లంతా అని గుండాచారి కన్నీరు తుడుచుకొంటూ చేతులతో తన కళ్లను రుద్దు కొన్నాడు. బయట ఎవరివో మాటలు వినిపించినాయి.

అయ్యంగారు: "ఇదో! 15 రూపాయలు ఇస్తాను. నువ్వు గొడవ చేయకుండా పోతావా?"

గుండాచారి: "అయ్యంగారూ! మీరు ఇప్పుడు పోయి పడుకోండి. రేపు మాట్లాడుకోవచ్చు. నిద్ర లేకపోతే బుద్ధిపోతుంది."

అయ్యంగారికీ గుండాచారికీ గొడవ జరుగుతుందనే సంగతి ఊరంతా అలుముకొనింది. కుప్పణ్ణగారూ శ్యామరాయలూ దీని గురించి అయ్యంగారినే అడిగి తెలుసుకోవాలనుకొన్నారు. కానీ ఇటీవల అయ్యంగారు అప్పు ఇచ్చే సంప్రదాయాన్ని తెగదెంపులు చేసేసి ఉండడంతో, వీరిద్దరికీ అక్కడకు పోయేంత తెంపు రాలేదు. ఆదివారం నాడు ఆగబోటును ఎక్కి పోకపోవడంతో, గుండాచారి ఇంకా మూడు నాలుగునాళ్లు తన హోటలును పీల్చి పిప్పిచేస్తాడని బెదరి, అయ్యంగారు "రేయ్

గుండా! నువ్వు రేపు పోయినావా సరే, లేదంటే నేనే నోరు తెరచి వాళ్లకంతా చెప్పేసి, నిన్ను ఇక్కడినుంచి నెట్టేస్తాను" అన్నాడు.

గుండాచారి: "నేను వచ్చే సోమవారం పోతాను కదా? చేతిలో పైసా లేదు. నువ్వు ఇచ్చే 15 రూపాయలు దారి ఖర్చులకే సరిపోవు. నీ కోసం ఇన్ని కల్లలాడి నేను పాడయినాను."

అయ్యంగారు: "ఇదో! నువ్వు పోతే చాలు" అని, అతని చేతిలో 16 రూపాయలు దురిగినాడు.

సోమవారం 10 గంటలకు గుండాచారులు పోతున్నారనే సమాచారం ఊరిలో పాకి, కుప్పణ్ణగారూ శ్యామరాయలూ హోటలుకు వచ్చినారు. గుండాచారి కదలడానికి అవనుగా ఉన్నాడు.

గుండాచారి వీరినంతా చూస్తూనే "నేను ఎన్నో ఊర్లను చూసినాను. ఎందరో మనుషులను చూసినాను. కానీ దీనంత మంచి ఊరినీ మీ అంత యోగ్యులనూ నేనెక్కడా చూడలేదు."

కుప్పణ్ణగారు గుండాచారితో "మమ్మల్ని మరచిపోవద్దు" అని వేడుకొన్నాడు.

గుండాచారి: "ఈ ముసలితనంలో నేను దిక్కులేక ఊరూరూ తిరిగేటప్పుడు మీ తలపులు ఎప్పటికీ ఉంటాయి. పొట్టకోసం నేను కష్టపడేటప్పుడంతా ఈ హోటలు గురుతులు..."

శ్యామరాయలు: "మీరు కూతురింటికి హొన్నూరికి పోవడం లేదా?"

గుండాచారి మెల్లగా నవ్వుతూ తలను ఆడించి "నాకు కూతురూ లేదు, వియ్యమూ లేదు. ఈ లోకంలో నేను ఒక్కడినే. నావల్ల ఉపకారం పొందిన వారు చాలా మంది ఉన్నారు" అన్నాడు.

ఈ మాటలను వింటూనే అందరూ జాలిగొని అయ్యంగారి వైపు చూసినారు.

కుప్పణ్ణ: "మీరు కూతురింటికి పోతున్నారని అయ్యంగారే మాతో అన్నారు కదా!"

అయ్యంగారు కోపంతో లేచి నిలబడి వంకర మొకం పెట్టినాడు.

శ్యామరాయలు: "అయ్యంగారు మిమ్మల్ని బలవంతం చేసినా కూడా మీరే బయలుదేరడానికి పట్టుపట్టినారని మాతో చెప్పినారు."

గుండాచారి: "వట్టి కల్ల మాట! ఆయన ఒక్కమాట చెప్పుంటే నేను ఇక్కడనే ఉండిపోయుండేవాడిని. నేను ఇక్కడుండడం ఆయనకు ఇష్టం లేదు. నాకు ఒక పూట

పెట్టే తిండే ఆయన కంటికి పెద్దగా తోచింది. నేను హౌన్నూరికి పోతున్నానని ఆయనే మాట పుట్టించినాడు. ఆయన కల్లలాడడం నాకు నచ్చలేదు. కల్లబొల్లి మాటలను కవికట్టి చెప్పినారు. చివరకు నేను అందరినీ వదిలిపోవాలని తీర్మానించుకొన్నాను. అయినా పోయేటప్పుడు మీతో బొంకులాడి పోవడం ఎందుకు?"

ఈ మాటలను విని అందరూ కొయ్యబారిపొయినారు.

గుండాచారి: "నాకు పిల్లాజెల్లా లేరు. నన్ను బయటకు నెట్టేస్తానని అయ్యంగారు గద్దించడంతో నేను పోతున్నాను. ఆయన ఒక్కమాట చెప్తే చాలు ఇక్కడనే ఉండి పోతాను."

గుండాచారి ఇట్లా అని నవ్వుకన్నులతో అయ్యంగారిని చూస్తూ బయటకు నడిచినాడు. అతను ఎక్కడికి పోయినాడో ఇప్పటివరకూ తెలియలేదు. కుప్పణ్ణగారూ శ్యామరాయలూ ఇతను పోయినాక ఇతని కతా కమామీసును తిరగేయడంతో, ఇతను నల్లూరు నీలాంబ తమ్ముడని తెలిసింది. ఇప్పటికీ కొందరు అయ్యంగారి జీవిత చరిత్రను ఆయన ఎదురుగానే వక్కాణించేటప్పుడు, గుండాచారిగారి ఆగమనపు సంగతులను టిప్పణిగా ఇస్తుంటారు.



నెల్లూరు జిల్లా సూళూరుపేటలో పుట్టిన వీరు తెలుగు కార్యకర్తగా ఎక్కువగా తమిళనాడులో పనిచేస్తుంటారు. తెలుగులో కతలనూ వ్యాసాలనూ రాస్తుంటారు. సుమారు 30 వరకూ కతలూ 50కి పైగా వ్యాసాలూ అచ్చయినాయి. ప్రళయకావేరి కథలు, పొరుగు తెలుగు, సజీవ సంప్రదాయంగా వేమన అనే పుస్తకాలు వెలువడినాయి. తమిళం నుంచీ కన్నడం నుంచీ కొన్ని కతలను తెలుగులోకి తెచ్చి వున్నారు. ప్రస్తుత నివాసం తిరుపతి.

**స.వెం.రమేశ్**
ఫోను: 8500548142

గుజరాతీ కత
1900



# శాంతిదాసు

## శాంతిదాస్

**అంబాలాల్ సాకర్‌లాల్ దేశాయ్**

గుజరాత్ ఖేడా జిల్లాలోని అలీనా గ్రామంలో 1844లో పుట్టినారు. గుజరాతీ నుడిలో తొలి కథారచయిత. అంతేకాక అనువాదకుడు, నిఘంటు కర్త, ఆర్థిక శాస్త్రవేత్త, సామాజిక శాస్త్రవేత్త, రాజకీయాలపైనా సాహిత్యంపైనా రాసిన రచయిత కూడా. ఎం.ఎ., ఎల్.ఎల్.బి. చదివినారు. సహాయ ఉపాధ్యాయుడిగా పనిచేసి ప్రధానోపాధ్యాయుడైనారు. 'బాలలగ్న నిషేధ పత్రిక' అనే పత్రికకు సంపాదకునిగా పనిచేసినారు. 1876 నుంచి కాడీ, బరోడా న్యాయస్థానాలలో జడ్జిగా పనిచేసినారు. 1889లో సుప్రీంకోర్టు జడ్జి అయినారు. విరమణ తరువాత 1889 నుంచీ సామాజిక కార్యక్రమాలలో విరివిగా పాల్గొన్నారు. 1900లో దివాన్ బహదూర్ బిరుదును పొందినారు. 1909లో రాజ్‌కోటలో జరిగిన మూడవ గుజరాతీ సాహిత్య పరిషత్‌కు అధ్యక్షత వహించినారు.

దేశాయ్ గారు ఆర్థిక, రాజకీయ, సామాజిక సాహిత్య రంగాల మీద రాసిన కొన్ని వ్యాసాలను వీరి తదనంతరం 1928లో సంకలనంగా తీసుకొచ్చినారు. 'దివాన్ బహదూర్ అంబాలాల్ సాకర్‌లాల్ దేశాయ్‌న భాషానొ అనే లేఖో' (దివాన్ బహదూర్ అంబాలాల్ సాకర్‌లాల్ దేశాయ్‌న భాషానొ ఆనే లేఖో' (దివాన్ బహదూర్ అంబాలాల్ సాకర్‌లాల్ దేశాయ్ ఉపన్యాసాలూ మరియూ వ్యాసాలు) అనే ఆ పుస్తకం గుజరాతీ సాహితీ లోకానికి దారిదీపమై నిలచింది. దేశాయ్‌గారు సంస్కృతం నుంచి గుజరాతీలోకి ఎన్నో అనువాదాలను చేసినారు. ఇంగ్లిష్ – గుజరాతీ నిఘంటువును సంకలనం చేసినారు. గుజరాతీలకు వారి తల్లి నుడి అయిన గుజరాతీలోనే విద్యాబోధన జరగాలని మొట్టమొదట చెప్పినవారు కూడా ఈయనే.

మహాత్మాగాంధీ విదేశీవస్తు బహిష్కరణ పిలుపును ఇవ్వకు ముందే 1900లో విదేశీ వస్తువుల వాడకానికి వ్యతిరేకంగా దేశాయ్‌గారు రాసిన కత ఇది. ప్రపంచీకరణకు ఎదిరింపుగా అనేక భాషలలో కతలు రాయడం తెలిసిందే. అయితే వందేళ్ల క్రితమే ఇటువంటి ఆలోచనతో వచ్చిన తొలి గుజరాతీ కత ఇది.

చారోతర్ ప్రాంతంలో మహెమ్మదాబాదుకి సుమారు పదిమైళ్ళదూరంలో ఒక జమీందారీ గ్రామం ఉంది. ఒకప్పుడు అది స్వతంత్రంగానే ఉన్నప్పటికీ, గత ఏభై డెబ్భై సంవత్సరాలుగా రాజశాసనాలు అమలులోకి వచ్చి, ఆంగ్ల ప్రభుత్వాధీనంలోకి వచ్చింది.

ఆ గ్రామంలో ఐశ్వర్యవంతులు బాగానే ఉన్నారు. సుమారు రెండువందల వరకూ జమీందారీ కుటుంబాలు ఉన్నాయి. మిగిలిన వారు బ్రాహ్మణులు, వైశ్యులు, శూద్రులు, కూలీనాలీ చేసుకుని బ్రతికేవాళ్ళూ. అంతా కాయకష్టం చేసి బ్రతికేవారు. షావుకార్లు లాభాలు తీయడం సంగతి సరే సరి. అప్పులు, బాకీలు లాంటివి సుమారు లేవనే చెప్పాలి. ఊళ్ళో విశాలమైన రచ్చబండ ఉంది. ఒక చక్కని అందమైన హిందూ దేవాలయం ఉంది. ఇంకా అక్కడున్న ధర్మసత్రంలో ప్రయాణీకులూ, సాధువులూ బసచేసి మార్గాయాసం తీర్చుకుంటూ ఉంటారు. అందువల్ల ఆ ఊరికి ఆ ప్రాంతంలో మంచి పేరుప్రతిష్టలు ఉన్నాయి.

ఆ ఊళ్ళో ఉన్న వ్యవసాయదారుల్లో, శాంతిదాస్‌ది అందరికంటే పెద్ద బంగళా. అతని తండ్రికి ఏడుగురు కొడుకులు. ఇప్పుడు వాళ్ళంతా ఎవరిదారిన వారు స్థిరపడ్డారు. శాంతిదాస్‌కి ఆరుగురు సంతానం. వాళ్ళలో అయిదుగురు పెద్దవాళ్ళు రెక్కలొచ్చి, వాళ్ళపనులు వాళ్ళు చూసుకుంటున్నారు. కాని కడగొట్టువాడు, భిఖారీదాస్ మాత్రం నిరుద్యోగిగా మిగిలిపోయాడు. వాడంటే తల్లికి చాలా అభిమానం. వాడు పెద్దవాడై, ఇంగ్లీషు చదువులు చదివి, గవర్నమెంటు ఉద్యోగం చేయాలని ఆమె కోరిక. 'ఏమో! ఆ పైవాడు దయతలిస్తే, వాడు కలక్టరు కాకూడదని ఏముంది. కాలం కర్మం కలిసి వస్తే, ఈ పరగణా అంతా తమకి దాసోహం అంటుంది' అని ఆమె ఉవ్విళ్ళూరేది. కానీ, ఆ ఆలోచన అంత సులువుగా శాంతిదాస్ బుర్రకి ఎక్కలేదు. ఇదంతా జరిగే పనేనా? పదేళ్ళయినా ఇంగ్లీషు నేర్చుకుని పై చదువులు చదవాలి. అందులో ఉత్తీర్ణుడు కావాలి. అలా ఉత్తీర్ణులైన వాళ్ళందరికీ, కలక్టరు గిరీ వస్తుందని మాత్రం ఏముంది? దానికెన్నో అడ్డంకులున్నాయి. ఈ విషయాలన్నీ శాంతిదాస్‌కి అర్థం అయినట్టుగా అతని భార్యకు అర్థంకావు. చెప్పినా ఆమె తెలుసుకోలేదు. పైగా, కడగొట్టు సంతానం అని ఆమెకు వాడంటే అమితమైన గారాం. ఈ వయసులో ఆమెను నిరుత్సాహపరచడం సబబు కూడాకాదు. అంతే కాకుండా, భగవంతుడు

అనుగ్రహించి, కుర్రాడికి అదృష్టం కలిసొస్తే, వాడంతటివాడు కాకూడదా ఏం? అనే స్వార్థచింతన కూడా శాంతిదాస్ మనసులో కలగడంతో, ఆఖరి కొడుకుని ఇంగ్లీషు చదివించడానికే నిశ్చయించుకున్నాడు.

ఓ శుభ ముహూర్తాన భిఖారీదాస్‌ని ఇంగ్లీషు చదువులకోసం అహమ్మదాబాదు పంపించాడు శాంతిదాస్. అప్పుడప్పుడూ మారే ప్రభుత్వపు నియమాలూ, పుస్తకాలూ, పరీక్షలూతో సతమతమౌతూ, ఒక్కొక్కమెట్టూ ఎక్కడం చాలాకాలం పట్టడంతో, శాంతిదాస్‌కి విసుగూ కోపం కూడా వచ్చేవి. అంతేకాక, ప్రతీనెలా తినడానికి రేషనూ, ఫీజుల కోసం, పదీ పన్నెండూ రూపాయలు పంపవలసి రావడంతో, ఇటు పెద్ద కుటుంబాన్ని ఈదుకుంటూ, అవన్నీ సరిపెట్టడం చాలా కష్టమే అయ్యేది శాంతిదాస్‌కి. కాని, ఒకసారి వ్రతం అంటూ చేపట్టాక, అది పూర్తి చేయక తప్పదుకదా! సగం సగం చదువులవల్ల రెంటికీ చెడ్డ రేవడిలా అవుతుంది వాడి బతుకు. ఇలా ఎటూ తేల్చుకోలేని ఇబ్బందితో సతమతమౌతుండే వాడు ఆయన.

ఎట్టకేలకు, ఏడేళ్ళలో మెట్రిక్ పాసయ్యాడనిపించాడు భిఖారీదాస్. ఆ కబురు వినగానే శాంతిదాస్ హృదయం ఆనందంతో పొంగిపోయింది. ఇక తల్లి విషయం చెప్పనే అక్కరలేదు. “నేను చెప్పలేదూ! నాచిన్నకొడుకు మనవంశానికి పేరుతెస్తాడని. డబ్బుంటే సరిపోయిందా! పిసరంత ఖర్చుతో, ఈనాడు నాకొడుకు నాగర్ కుటుంబాల పిల్లలతో సమాన స్థాయికి ఎదిగాడు. అందుకు నాకెంతో గర్వంగా ఉంది” అని తెగ మురిసిపోయింది. ఊరంతా పప్పుబెల్లాలు పంచిపెట్టింది. దేవీమందిరంలో పూజలు చేయించింది. బ్రాహ్మణుల్నీ, స్నేహితుల్నీ పిలిచి విందులు చేసింది. వందమంది బీదలకి అన్నదానం చేయించింది.

భిఖారీదాస్ ఊళ్ళోకి రాగానే, అతన్ని పలకరించడానికి వందలకొద్దీ జనం వచ్చారు. వాళ్ళంతా శాంతిదాస్‌ని మెచ్చుకుంటూ, “మీ అబ్బాయి ఎంతో తెలివైనవాడు. మన ఊరికే గౌరవం తెచ్చిపెట్టాడు. ఇది ఇక్కడితో ఆగడానికి వీల్లేదు. ఇంకా పై చదువులకి వాడిని ముంబాయి పంపించు. డబ్బుచాలకపోతే, పస్తులుండి కాలక్షేపం చేసి అయినాసరే, వాడిని పట్నవాసంలో చదవడానికి పంపితీరాలి” అని ప్రోత్స హించారు.

శాంతిదాస్ ఒక సామాన్య గృహస్తు. పొలం వ్యవసాయం అయితే ఉన్నాయి. కాయకష్టం చేసి పంటలు పండించి, ఉన్నదానిలోనే ఘనంగా బతుకుతున్నమాట నిజమే. కానీ చేతిలో నగదు రూపాయలు ఆడే అవకాశం లేకపోయె. అందువల్ల పిల్లవాడిని ముంబాయి పంపాలంటే, అతని మనసు గిలగిలా కొట్టుకోసాగింది. కాని, బాగా చదువుకునే కుర్రాడినీ, వాడి తల్లి కోరికనీ, ఊళ్ళోవాళ్ళ ఆశీర్వాదాల్నీ

చూసి, వాటికి లొంగిపోక తప్పలేదు శాంతిదాస్‌కి. ఫలితంగా, భిఖారీదాస్ ముంబాయి లో చదువుకోడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ముంబాయి పెద్దపట్టణం. ఖర్చులు ఎక్కువ. తగినంత డబ్బిచ్చి కొడుకుని సాగనంపాలంటే, తనచేతిలో అంత ధనం లేకపోయింది. జీవితంలో మొట్టమొదటి సారిగా, ఊళ్ళో షావుకారు, వనమాలీ దాస్ దగ్గర చేయిచాపి, వందరూపాయలు అప్పు తీసుకున్నాడు.

ఆ డబ్బుతో, భిఖారీదాస్‌ని సాగనంపుతూ, ప్రక్కకి పిలిచి, ఇలా చెప్పాడు. "నాయనా! ముంబాయి ఇంద్రపురి లాంటి పట్టణం. అక్కడ రకరకాల ఆకర్షణలు ఉంటాయి. విలాస వస్తువులుంటాయి. వివిధరకాల మనుషులు ఉంటారు. నేనా సామాన్య కుటుంబీకుడిని. పెద్ద ధనవంతుడనేమీ కాను. నువ్వు హద్దుమీరి ప్రవర్తించనని మాట ఇస్తేనే పంపుతాను. లేకపోతే, ఇంత ఖర్చు పెట్టే స్తోమత నాకు లేదు. ఈ విషయం నువ్వు బాగా గుర్తుంచుకో!"

భిఖారీదాస్ కూడా తండ్రి కాళ్ళమీదపడి, "నాన్నా! నేను ఒక్కపైసా కూడా వృధాగా ఖర్చు పెట్టను. నాకిప్పుడు పద్దెనిమిదేళ్ళు వచ్చాయి. నా బాధ్యత ఏమిటో నాకు తెలుసు" అన్నాడు. తేలికపడిన హృదయంతో ఊపిరి పీల్చుకున్నాడు శాంతిదాస్.

పల్లెటూరినుంచి పట్నం వచ్చిన భిఖారీదాస్‌కి అదొక వింత ప్రపంచంలా తోచింది. ఎక్కడ చూసినా ఆకాశమంత ఎత్తైన భవనాలూ, పరుగులు తీసుకుంటూ నడిచే మనుషులూ. వింతవింత వస్తువులతో నిండిన బజార్లూ. అన్నీ ఎంతో ఆకర్షణీయంగా కనిపించాయి. కానీ, మొదట్లో తండ్రికి తానిచ్చినమాట గుర్తుంచుకుని, చదువు మీద బాగానే శ్రద్ధ వహించాడు అతను. రోజులు గడిచినకొద్దీ ఆ జ్ఞాపకాలు మరుగున పడసాగాయి. కొంచెం కొంచెంగా పట్నవాసపు జీవితానికి అలవాటు పడసాగాడు. తోటి విద్యార్థులతో స్నేహాలు ఎక్కువ కాసాగాయి. తనతో చదువుకునే పార్సీ కుర్రాళ్లు వేసుకునే మెరిసిపోయే బూట్లూ, బట్టలూ చూసి అలాంటివి తనకీ ఉంటే బాగుండుననిపించ సాగింది. ఇలాంటి ఆలోచన మనసులోకి రాగానే దానినెలాగైనా నొక్కి పెట్టాలని విశ్వప్రయత్నం చేసేవాడు భిఖారీదాస్ కాని, అంతిమ విజయం కోరికల గుర్రాలదే అయింది. అప్పుడతని ఆలోచనలిలా ఉండేవి.

"నేను సంవత్సరంలో సుమారు మూడువందల రూపాయల వరకూ ఖర్చు పెడుతున్నాను. దాంట్లో నాలుగైదు రూపాయలు పెట్టి, చక్కని మెరిసే విదేశీ బూట్లు కొనుక్కుంటే పోయేదేముంది? మిగతా కొన్ని చోట్ల ఖర్చు తగ్గించుకుంటే సరి. దానివల్ల నా కోరికా తీరుతుంది. నాన్నకిచ్చిన మాటా దక్కుతుంది."

ఫలితంగా అతనొక శుభముహూర్తాన మంచి బూట్లు కొనుక్కున్నాడు. వాటి నేసుకుని, వెలిగిపోతూ నడిచి "అబ్బ! ఎంత బాగున్నాయో. నాకాళ్ళకి బాగా నప్పాయి" అని మురిసిపోయాడు.

నాలుగు నెలల తరవాత కాలేజీకి సెలవులొచ్చాయి. భిఖారీదాస్ వాళ్ళ ఊరికి వెళ్ళాడు. ఊరకే వెళ్ళాడా! తను కొత్తగా కొనుక్కున్న విదేశీ బూట్లు వేసుకుని మరీ వెళ్ళాడు. అతను పట్నం నుంచి వస్తున్నాడని తెలిసి, ఆఊళ్ళోవాళ్ళూ, పక్కఊళ్ళ వాళ్ళూ, చుట్టపక్కాలూ అంతా అతన్ని చూడడానికి విరగబడి వచ్చారు. ఊరి పొలిమేరల్లోకి రాగానే అతను బండి దిగాడు. దిగేముందు, కాళ్ళకి వేసుకున్న బూట్లు బాగా దులిపి శుభ్రం చేసుకుని మెరిపిస్తూ దిగాడు. అతనూ ఇలా దిగగానే, ఆఁ అని వారికి సమాధానం చెప్తూతూ, హుందాగా, బూట్లు అందరికీ కనిపించేలా నడవ సాగాడు. అతని కంటే అతను వేసుకున్న బూట్లు ఆఊళ్ళో కుర్రకారుని బాగా ఆకర్షిం చాయి. అంతకుముందెన్నడూ అటువంటి బూట్లు ఆ ఊళ్ళో ఎవరూ చూడనుకూడా లేదు. అందువల్ల అదొక పెద్దవింతగా ఉంది అందరికీ.

"వచ్చావా! ఎలా ఉన్నావు?" అంటూ అందరూ కుశల ప్రశ్నలు వేశారు. "ఆఁ ఆఁ".

ఇంటికెళ్ళిన భిఖాభాయ్ రోజూ రెండుపూటలా బైటికి తిరగడానికి వెళ్తూ, తన మెరుస్తున్న బూట్లు వేసుకునేవాడు. శాంతిదాస్ మిగతా కొడుకులూ, కూతుళ్ళూ, వాళ్లపిల్లలూ అంతాకలిసి సమారు పదిహేనూ ఇరవైమంది దాకా ఉంటారు. మూడునాలుగు రోజులు గడిచాయోలేదో, ఇళ్ళల్లో పిల్లలందరూ వాళ్ళవాళ్ళ అమ్మా నాన్నల దగ్గర తమకీ అటువంటి బూట్లు కొనిపెట్టమని పేచీపెట్టసాగారు. తల్లి దండ్రులు వాళ్ళధ్యాస చదువులమీదికి మళ్ళిద్దామని ఎంత ప్రయాసపడినా ప్రయో జనం లేకపోయింది. ఆఖరికి పిల్లలే గెలిచారు. ఈసారి భిఖాభాయ్ ముంబైనుంచి సెలవులకి ఇంటికి వస్తున్నప్పుడు, అలాంటి బూట్లే తెప్పించి పెడతామని చెప్పాకనే పిల్లలు శాంతించారు. ఆ తరవాత భీఖాభాయ్ ఎప్పుడు పట్నం నుంచి ఇంటికి వచ్చినా, ఇరవై ముప్పై బూట్లజతలు మోసుకొచ్చేవాడు. ఇలా రెండేళ్ళు గడిచేసరికి ఊళ్ళో మిగతా అభివృద్ధి మాట ఎలా ఉన్నా, విదేశీ బూటుజతల సంఖ్య మాత్రం పెరిగి, మూడువందల వరకూ చేరుకుంది. ఊళ్ళో యువకులంతా ఉదయం, సాయంత్రం పని ఉన్నా లేకపోయినా, విదేశీ బూట్లు వేసుకుని, అలా పొలానికో, వీధిలోకో పోయి తిరిగి రావడం అలవాటైపోయింది.

ఇలా బలాదూరు తిరుగుతున్న కుర్రకారుని చూసి కొందరు "ఆహా! మెరిసే బూట్లతో ఊరికి కొత్తకళ వచ్చిం" దని పొగిడితే, "ఆఁ! ఇందులో ఏముంది. రాబడిలేని

ఖర్చు. ఇలా అయితే ఊరు త్వరలోనే అడుక్కు తింటుంది" అని తెగడిన వారు మరికొందరు.

ఈ విదేశీ బూట్లు అందానికేగాని, ఆట్టేకాలం మన్నవు. అయిదారు నెలలకే చిరిగిపోయి, ముక్కలు ముక్కలు కాసాగాయి. అందువల్ల ఊళ్ళో వాళ్ళంతా భిఖాభాయ్ వచ్చి వెళ్ళినప్పుడల్లా, వందలకొద్దీ కొత్త బూట్లకి ఆర్డర్లు ఇవ్వసాగారు. ఇలా ఊరంతా కలిసి పాదరక్షలకోసమే నూరేసి రూపాయల వరుకూ ఖర్చు చేయసాగారు.

భిఖారీదాస్ ఎండాకాలం సెలవులకి ఇంటికి వచ్చి ఉన్నరోజుల్లో, ఒకనాడు శాంతిదాస్ వరండాలో మంచంమీద హుక్కా పీలుస్తూ కూర్చున్నాడు. దానిలోంచి 'గుడ గుడ' మని శబ్దం వస్తోంది. ఇంకా ఆ ఊరి పెద్దలు కొందరు అతని చుట్టూ చేరారు. అంతా పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. వనమాలీ దాస్ పారేఖ్ కూడా అక్కడే ఉన్నాడు. శాంతిదాస్‌తో అతనిలా అంటున్నాడు.

"అయ్యగారూ! తమరోసారి ఈ పద్దు పుస్తకం మీద దృష్టి పెట్టాలి."

శాంతిదాస్ అడిగాడు "ఏం?" అని.

"ఏమీలేదు. ఆంకెలా రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. మీకు తెలుసు కదా!"

"అవును మరి! ఒక వ్రతం అంటూ చేపట్టాక మధ్యలో వదిలి పెట్టగలమా? రోటిలో తలదూర్చి, రోకటి పోటుకి భయపడడం దేనికి? అబ్బాయిని ముంబాయి పంపేముందు పరిస్థితి ఎలా ఉండేది?"

"అప్పుడైతే ఏభై వందా ఇచ్చిపుచ్చుకోవడాలుండేవి."

ఇలా సంభాషణ సాగుతూండగానే ఉన్నట్టుండి, ఆ ఊరి చెప్పులు కుట్టేవాళ్ళు పది పదిహేనుమంది దాకా అక్కడ ఊడిపడ్డారు. వస్తూనే శాంతిదాస్ కాళ్ళమీదపడి ఏడుస్తూ, "అయ్యా! మీరే మాకు పెద్దదిక్కు. మీరు తప్ప ఇంకెవరూ మమ్మల్ని రక్షించలేరు" అని ఏక కంఠంతో వేడుకోసాగారు.

శాంతిదాస్‌కి ఇదేమీ అర్థం కాక, "అసలేం జరిగింది? చెప్పండి" అని అడిగాడు.

వాళ్లలో 'సోమలో' అన్న వాడిని వేలితో చూపిస్తూ, "వీళ్లందరిలోకీ, నువ్వు కాస్త తెలివైన వాడివి. అసలు సంగతేంటో నువ్వు వివరంగా చెప్పు. మీ కొచ్చిన కష్టమేమిటి? కన్నతల్లికైనా బాధ చెప్పుకోపోతే ఎలా తెలుస్తుంది?" అన్నాడు శాంతిదాస్.

అప్పుడు సోమలో ఇలా చెప్పాడు. "ఒకటనేముంది. చెప్పుకోవాలంటే మా కష్టాలు చాలా ఉన్నాయి బాబయ్యా! ఏ తప్పూ చేయకుండా శిక్ష అనుభవిస్తున్నాం. మమ్మల్ని

రక్షించడం మీచేతుల్లో ఉంది. మీరే ఏదో ఉపాయం ఆలోచించాలి. మీరు కల్పించుకుంటే తప్ప మా కష్టాలకి అంతూ దరీ కనిపించడంలేదు."

వాళ్ళగోడు ప్రశాంతంగా విన్న శాంతిదాస్, "తప్పకుండా అలానే చేద్దాం. నాచేతుల్లో ఉన్న సహాయం నేను చేస్తాను. అసలేమయిందో చెప్పు ముందు." అన్నాడు.

సోమలో చెప్పసాగాడు. "అయ్యా! మన్నించండి. మాకొచ్చిన ఆపద అలాంటిది. మనూళ్ళో మా కుటుంబాలు ఇరవై వరకూ ఉన్నాయి. ఈ ఊరు పుట్టిన దగ్గర్నుంచీ, మీకు సేవలందిస్తూ మీతోబాటు మేమూ మీ వెనకనే నడుస్తూ వస్తున్నాము. ఈ రోజు వరకూ మేము మీకు చెప్పులు కుట్టి ఇచ్చి, ఒకటీ అరా సెంట్లు భూమి ఉంటే దాన్ని దున్నుకునీ బతుకుతున్నాము. కానీ, గత రెండు సంవత్సరాలుగా మా బీదరికం పెరిగిపోయింది. మా పిల్లలు ఆకలితో మలమల మాడిపోతున్నారు. మన భిఖాభాయ్ బాబుగారు ముంబాయి వెళ్ళినప్పటినుంచీ మా కష్టాలకి అంతులేకుండా పోయింది. ఆయన తన స్వంతానికని ఒకటీ రెండూ విదేశీ చెప్పులు కొనుక్కుని ఉంటే మాకేమీ అభ్యంతరంలేదు. కానీ, ఉన్నట్టుండి మన ఊళ్ళోకి నాలుగైదువందల సీమ చెప్పులు వచ్చేశాయి. ఈ ఊరి ప్రజల కోసం, మేము సంవత్సరానికి సుమారు వందవరకూ చెప్పుల జతలు కుట్టుతూ ఉంటాము. దానివల్ల మాకు ఏభై అరవై రూపాయలవరకూ నికరాదాయం వచ్చేది. ఆ డబ్బుతో మా పది పదిహేను కొంపలు కడుపు నింపుకునేవి. ఇప్పుడీ సీమ చెప్పులొచ్చాయి. మా కడుపు కొట్టాయి. మా చెప్పులు ఎవరూ కొనడం లేదు. ఇక పెద్దల ఇళ్ళలో స్త్రీ–జనం కూడా చెప్పులు వదిలి బూటులు వేసుకోవడం ఆరంభిస్తే, ఆ నాలుగురాళ్ళు సంపాదించుకునే అదృష్టం కూడా మాకు లేకుండా పోతుంది. మా గతి అధోగతే! తినే ఈ రెండు రొట్టెలూ కూడా మాకు కరువౌతాయి. మా బ్రతుకులు ఊళ్ళో ఉన్న ప్రజలమీద ఆధారపడి ఉన్నాయి. కానీ, వీళ్ళంతా విదేశీ వస్తువులు వాడడం మొదలు పెట్టారు. ఆ కారణంగా మాకీ దుర్దశ ప్రాప్తించింది.

ఈ మాయదారి చెప్పుల తయారీ ఏ అహమ్మదాబాదులోనో, ప్రక్కనున్న పట్నవాసంలోనో అయితే, మాలో కొందరం అక్కడికిపోయి, ఆ పని నేర్చుకుని బతికేవాళ్ళం. కాని, ఇదేంటి? ఇది విదేశీ వస్తువు. దీనిని మేము తయారు చేసే ఉపాయం ఏమీ లేదు. ఇది ఇలాగే కొనసాగితే, మా జాతి సర్వనాశనం అయిపోవడం ఖాయం."

గంగకి వెల్లువ వచ్చినట్టు, సోమలో తన హృదయంలోని బాధని వెలువరిస్తూంటే, అతని మాటల ప్రవాహానికి అడ్డం పడి, భిఖారీదాస్ ఇలా అన్నాడు. "నువ్వేమైనా బుద్ధి ఉండే మాట్లాడుతున్నావా? మీ కోసం ఊళ్ళోవాళ్లందరూ బూట్లు వేసుకోవడం మానేయాలా? ప్రతీ మనిషికీ తనకి ఏది నచ్చితే అది కొనుక్కునే హక్కు ఉంది. పట్నంలో, ముంబాయిలో ఆఫీసర్లందరూ ఇలాంటి బూట్లే వేసుకుంటారు. వాళ్లంతా వెర్రివెంగళాయిలని నీ ఉద్దేశమా? ఏ ఊరు నీది? ఎందుకిలా మాట్లాడుతున్నావు?"

సోమలో: "అయ్యా! వారెవరో వేసుకుంటే మాకేమి? ఇక్కడ మా కడుపులు కాలి మేము విన్నవించుకుంటున్నాము."

భిఖారీదాస్: "మీరు ఆకలితో చస్తూంటే ఎవరికి నష్టం? ఇదికాక పోతే మరో వృత్తి ఏదైనా చేసుకోరాదా?"

సోమలో: "మేము పుట్టుకతో చెప్పులు కుట్టుకునే జాతివాళ్లం. మరొక వృత్తి ఎలా చేయగలం"

భిఖారీదాస్: "లోకంలో ఎన్నో వృత్తులు ఉన్నాయి. ఏదో ఒకటి చేసుకుని బతకొచ్చు."

సోమలో: "అంటే మేము కుమ్మరి వాళ్ళలా కుండలు చేసి, దర్జీవాళ్ళలా బట్టలు కుట్టీ లేకపోతే మంగలిపని చేసీ బతకాలనా మీఉద్దేశం?"

భిఖారీదాస్: "అవేమీ రాకపోతే, కూలీనాలీ చేసుకుని బతకండి. అదేమంత బ్రహ్మవిద్య కాదుగదా!"

సోమలో: "మేమెప్పుడూ కులవృత్తిని దాటి పని చేసిన వాళ్ళంకాదు. కూలిపని కాయకష్టంతో కూడుకున్న పని. మాకెలా వీలవుతుంది? మాకెవరూ అలాంటి పనులు ఇవ్వరు."

భిఖారీదాస్: "అలాంటప్పుడు ఈ ఊళ్ళో బతకడమే కష్టమనిపిస్తే, ఊరొదిలిపోయి, మీ అదృష్టాన్ని వెదుక్కోండి."

సోమలో: "ఈ ఊళ్ళో మేము ముప్పై నలభై తరాల నుంచీ ఉంటున్నాము. ఇప్పుడీ ఇళ్ళూ స్థలాలూ వదిలిపెట్టి పొమ్మనడం ధర్మమేనా? అయినా చుట్టరికాలూ, ఇచ్చిపుచ్చుకోవడాలూ, రాకపోకలూ అన్నీ ఇక్కడే అయినప్పుడు, మేము పరాయి ఊళ్ళో కాపురాలు ఎలా చక్కబెట్టుకోగలము? ఇదేమైనా జరిగే పనేనా? అయినా నాకు తెలియక అడుగుతున్నాను చిన్నబాబూ! మన్నించాలి. ఇన్ని నీతులు మాకు నచ్చజెప్తుతున్నావే! ఏం? మీరు కేవలం విదేశీ బూట్లు, చెప్పులు వదిలిపెట్టితే వచ్చే నష్టం ఏమిటట? కొంపలు మునిగిపోతాయా? ఉన్న ఊరిని తల్లిలా కడుపులో దాచుకున్న, ఈ బీదసాదల్ని ఊరు విడిచి పొమ్మనే కంటే ధనవంతుల బిడ్డలు ఆ విదేశీ వస్తువుల్ని కొనకుండా కట్టడి చేసి, మమ్మల్ని ప్రోత్సహిస్తే వచ్చే నష్టం ఏముంది?"

తన కొడుకు చేసే వితండవాదాన్ని ఇంతవరకూ నిశ్శబ్దంగా వింటున్న శాంతిదాస్, ఈ వాగ్వాదం మరెక్కడికి దారి తీస్తుందోననే భయంతో, భిఖారీదాస్‌ని ఉద్దేశించి ఇలా అన్నాడు. "అబ్బాయీ! ఇకనువ్వు అట్టే వాదించకు. యవ్వనపు పొంగులో ఇష్టం

వచ్చినట్టు మాట్లాడి, వాళ్ళని కించపరచడం మంచిదికాదు.” అంతటితో భిఖారీదాస్ వెనక్కి తగ్గాడు.

ఇంతలో అక్కడికి మరో పెద్దమనిషి, జగజీవన్ దాస్ పారేఖ్ వచ్చాడు. “ఏమిటీ? ఏదో తకరారు జరుగుతున్నట్టుగా ఉంది?” అన్నాడు.

శాంతిదాస్ చెప్పాడు. “ఇదుగో! ఈ చెప్పులు కుట్టేవాళ్ళు ఒక పెద్దసమస్యతో వచ్చారు. ఊళ్ళోకి సీమ బూట్లొచ్చి వాళ్ళ కడుపులు కొట్టాయని వాళ్ళ వాదన.”

అదివిని, జగజీవన్‌దాస్, “అవును. ఈ విషయం కొందరు నాకూ చెప్పుకుని బాధపడ్డారు. అంతే కాకుండా ఊళ్ళో కుమ్మరి,కమ్మరి, దర్జీ, మంగలి పనివాళ్ళకి కూడా ఇలాంటి సమస్యలే వచ్చిపడ్డాయి. మనమంతా కలిసి ఆలోచించి ఏదో ఒకటి చేయాలి.” అన్నాడు.

“మీరు సరే అంటే రేపే ఊరిపెద్దలందరమూ సమావేశమౌదాము” అన్నాడు శాంతిదాస్

“సరే! నేను అందరికీ ఈ విషయమై వర్తమానం పంపుతాను. రేపు మనం రామనాథ్ మందిరంలో కలుద్దాం” అన్నాడు జగజీవన్‌దాస్.

అనుకున్న ప్రకారం మర్నాడు మధ్యాహ్నానికల్లా, శాంతిదాస్, అతని అన్నదమ్ములూ, వాళ్లపిల్లలూ, ఇంకా కొందరు మోతుబరులు, జగజీవన్‌దాస్ పారేఖ్, నాథాభాయ్ మోదీ, జుగల్‌దాస్ తలాటీ, తులసీరావమ్ మహెతా వంటి పెద్దలందరూ రామనాథ్ మందిరానికి చేరుకున్నారు. దర్జీ, కుమ్మరి, కమ్మరి వంటి వారు ముందుగానే అక్కడికి వచ్చి కూర్చున్నారు.

ప్రప్రథమంగా చెప్పులు కుట్టేవాళ్ళ తరఫున సోమలో చెప్పినదంతా విన్నారు. భిఖారీదాస్ కూడా అక్కడికి వచ్చినవారిలో ఉన్నాడు. ఇంగ్లీషు చదువుకున్న దానికి నిరూపణగా ఒకపెద్ద ఇంగ్లీషు పుస్తకం చేతిలో పెట్టుకుని వచ్చాడు. లేచినిలబడి, పెద్ద ఉపన్యాసం ఇచ్చేందుకు తయారయ్యాడు.

కానీ వెంటనే అతని తండ్రీ బాబాయిలూ ఏక కంఠంతో, “నువ్వు పట్నంలో ఇంగ్లీషు చదువుకుని వచ్చావని ఇక్కడ అందరికీ తెలుసులే కూర్చో! ముందుగా కాయకష్టం చేసి నాలుగు రాళ్ళు సంపాదించి జీవితం అంటే ఏమిటో తెలుసుకుని, అప్పుడు మాకు బుద్ధులు చెప్పు. తగుదునమ్మా! అని వచ్చాడండి పెద్దమనిషి” అని అతన్ని కూర్చోబెట్టారు.

ఊరి పెద్దలందరూ ఎవరికి తోచింది వారు చెప్పాక, జగజీవన్‌దాస్ పారేఖ్ ఇలా ఒక సుదీర్ఘోపన్యాసం ఇచ్చాడు.

"ఈ విదేశీ బూట్ల కారణంగా మన ఊళ్ళో పదిమంది చెప్పులు కుట్టేవాళ్ళ కుటుంబాలూ, వాళ్ళ ఆదాయమూ మూలనపడ్డాయి. వాళ్ళకి సమయానికి తిండికూడా దొరకని పరిస్థితి వచ్చింది. ఇలా ఒక వృత్తిమీద జీవించేవాడు చితికిపోతే, దాని ప్రభావం దర్జీ, కుమ్మరి వంటి మిగిలిన వృత్తుల వారిమీద కూడా పడుతుంది. ఒకటీ రెండూ రూపాయలు ఎప్పుడైనా అప్పు చేయాలన్నా, షావుకార్లు అప్పివ్వడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. ఇలా గ్రామం గ్రామం అంతా దీని దుష్ప్రభావం ఆవరిస్తుంది. ఇందులో నాకు ఒరిగేదేముందని మీలో ఎవరూ ఆలోచించవద్దు. ఊరంతా బాగుంటేనే మనమూ బాగా ఉంటాము.

నేనీమధ్య అహమ్మదాబాదు వెళ్ళాను. అక్కడకూడా ప్రజలు ఇదే సమస్యతో తలక్రిందులౌతున్నారు. బంగారం నగలు విదేశాలనుంచి తయారై వస్తున్నాయి. అవి కంటికి నదరుగా కనిపించడంతో, మనవాళ్ళు చేసిన వస్తువులకి గిరాకీ పోయింది. కమ్మరి, కుమ్మరి పనులైతే సుమారుగా ఆగిపోయాయనే చెప్పాలి. ఒకళ్ళిద్దరు ఓపిక ఉన్నవాళ్ళు ఇంగ్లీషువాళ్ళ కార్ఖానాల్లోకి పోయి, కూలిపనులు చేసి నాలుగురాళ్ళు సంపాదించినప్పటికీ కత్తులు, కటార్లు, కత్తెరలు వంటివి తయారు చేసే చిన్నకారు కార్మికుల గతి దయనీయంగానే ఉంది. విదేశాలనుంచి కోట్ల రూపాయల విలువైన బట్టలు వస్తున్నాయి. ఆ కారణంగా మన చేతిమగ్గాలు మూతపడ్డాయి. సాలెవాళ్ళు, అద్దకం పనివారు నిరుద్యోగులై మరింత బీదరికం అనుభవిస్తున్నారు. ఇప్పుడు అందరూ విదేశీ పేంట్లు, డ్రస్సులు వేసుకుని తిరుగుతున్నారు. చూడడానికవి ఆకర్షణీయంగానే ఉన్నప్పటికీ, దేశంలోని పనివాళ్ళకీ, వ్యాపారస్తులకీ, తీరని నష్టాన్ని తెచ్చి పెడుతు న్నాయి. దానివల్ల దేశపు పురోగతి దెబ్బతినే అవకాశం ఉంది. ఇదే పరిస్థితి కొనసాగి, ప్రతీ పల్లే పట్టణం ఈ బానిసత్వానికి దాసోహం అంటే, అప్పటికి చాలా ఆలస్యం అయిపోవచ్చు. ఈ ఆపదనుంచి బైటపడాలంటే, నాకొకటే ఆలోచన వస్తోంది. అదేమిటంటే, ముందుగా మన ఊరిని మనం కాపాడుకోవడం."

"అంటే? మీ ఉద్దేశం?" అడిగాడు శాంతిదాస్.

"ప్రస్తుతానికి మనం చేయగలిగిందేమిటంటే, విదేశీ వస్తువు అన్న ప్రతీదానినీ త్యజించడం. దానిమీద వ్యామోహం లేకుండా చేసుకోవడం. ముఖ్యంగా, ఈ రోజు నుంచీ, ఈ విదేశీ బూట్లు వాడడం, కొనడం మానేయాలి. దానివల్ల ప్రస్తుతం మన చెప్పులు కుట్టేవాళ్ళ బ్రతుకులు బాగుపడతాయి."

శాంతిదాస్: "ఏం? భవానీదాస్ భాయ్! ఏమంటారు?"

భవానీదాస్: "అవును అవును అందరూ సుఖంగా బతికే ఉపాయం ఏదో ఒకటి ఆలోచించి ఆచరించాలి."

నాథాభాయ్ మోదీ: “నా అభిప్రాయం కూడా అదే. తుల్సీ భాయ్! మీరేమీ మాట్లాడలేదు.”

తులసీదాస్ మహెతా: “నేను మాత్రం కాదంటనా! పదిమందికీ నచ్చే నిర్ణయం తీసుకోవాలి.”

జగజీవన్‌దాస్ మళ్ళీ ఇలా అన్నాడు. “మనం అనుకుంటే సరిపోయిందా! ఇళ్ళల్లో ఆడవాళ్లనెవరు సంబాళించుకుంటారు? పిల్లలు కాదూ కూడదని పేచీపెడితే ఏమౌ తుంది? వాళ్ళూ, తల్లులూ కుమ్మక్కయితే మనకేది దారి? దీనిని గురించికూడా ఆలోచించండి.”

శాంతిదాస్: “ఆఁ! పిల్లలూ, తల్లులూ! మనమంతా ఒకమాటమీద నిలబడితే, వాళ్ళని అదుపులో పెట్టడం కష్టంకాదు.”

అదివిని అందరూ, “భలే! భలే! బాగుంది. పదండి. ఈ రోజునుంచీ మేము కాని, మా పిల్లలు కాని, విదేశీ బూట్లు కొన్నా, వేసుకున్నా అడుగు.” అని ప్రతిజ్ఞ చేశారు. తరవాత తేలికపడిన హృదయాలతో ఎవరిళ్ళకి వారు వెళ్ళిపోయారు.

క్రమేపీ ఊరు మళ్ళీ యథాస్థితికి రాసాగింది. ప్రజలు దూరదృష్టికలవారు కాబట్టి, సమయం మించిపోకముందే జాగ్రత్తపడ్డారు. మొదట్లో ఇంటింటా కొంత ప్రచ్ఛన్న యుద్ధం జరగక తప్పలేదు. కానీ, శాంతిదాస్ అందరికంటే ముందడుగు వేసి, తన కొడుకు భిఖాభాయ్ చేత విదేశీబూట్ల వాడకం మానిపించి, స్వదేశీ చెప్పులు వేయిం చడంలో సఫలీకృతుడయ్యాడు. అంతే! ఆ తరవాత ఇంటింటికీ ఈ వార్త ప్రాకి, క్రొత్త ఉద్యమానికి అందరూ లొంగిపోయారు. ఇలా అయిదారు నెలలు గడిచేసరికి, చెప్పులు కుట్టేవాళ్ళు పూర్వపు స్థితికి చేరుకోగలిగారు. మిగిలిన జాతుల వాళ్ళు కూడా బాగుపడ సాగారు. ఇదిలా ఉండగా ఒకనాడు, నడియాద్ నుంచి ఆ ఊరి పెద్ద, బారోట్ అక్కడికి ఏదో పనిమీద వచ్చాడు. అతనా ఊరిలో జరిగిన పెద్దమార్పును గురించి తెలుసు కున్నాడు. దానంతటికీ కారణభూతుడు శాంతిదాస్ అని తెలుసుకుని, ప్రత్యేకంగా అతన్ని చూసి పలకరించడానికి వాళ్ళింటికి వెళ్ళాడు.

“బాబూ! మీరు చాలా చక్కని పని చేశారు. దేశం బాగుపడాలంటే మీవంటి దేశభక్తులు ఉండితీరాలి. మంచి సమయంలో కల్పించుకుని, ఊరిని సర్వనాశనం నుంచి తప్పించారు. మీరు చేసిన ఈ త్యాగాన్ని దేశం అంతా హర్షిస్తుంది. మన ఊరి మర్యాదా, మన రాష్ట్రపు గౌరవం నిలబెట్టారు. మీరు ప్రారంభించిన ఈ మహాయజ్ఞం దేశానికి వరప్రసాదం అవుతుంది. ఈనాడు, ఈ విదేశీ వస్తు వ్యామోహం వల్ల చాలా కుటుంబాలు, వృత్తులు నాశనం అయిపోతున్నాయి. వాటిని పునరుద్ధరించ

డానికి ఈ ఉద్యమం ఎంతో దోహదం చేస్తుంది. మీవంటి దేశభక్తులుండబట్టే దేశం ఇంకా ఇలా నిలబడి ఉంది. మీవంశంలో మీవంటి కులదీపకులు ఇంకా ఉద్భవించి, మన దేశ మర్యాద నిలబెట్టాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని వేనోళ్ళ శాంతిదాస్‌ని ప్రశంసించి వెళ్ళాడు.



**పాలెపు బుచ్చిరాజు**

ఫోను: 09825033946

brpalepu@yahoo.co.in

విశాఖపట్నం జిల్లాలోని గునుపూడి స్వగ్రామం. ఉద్యోగరీత్యా ప్రస్తుతం గుజరాత్‌లోని బరోడాలో ఉంటున్నారు. చిన్నవయసులో చందోబద్ధంగా పద్యాలు రాయడంతో మొదలైన వీరి సాహితీ వ్యాసంగం కళాశాల స్థాయికి వచ్చేసరికి వ్యాసరచన, కథా రచనగా వికసించింది. డిగ్రీ చదువుతున్నప్పుడు తాపీధర్మారావు గారి ఆధ్వర్యంలోని నవ్యసాహితీ సమితి నిర్వహించిన కతల పోటీలో మొదటి బహుమతిని అందుకొన్నారు. ఇప్పటివరకూ 55కు పైగా కతలు అచ్చయినాయి. 'గునుపూడి కథలు' అనే కథాసంకలనం, ఒక వ్యాస సంకలనం వచ్చినాయి. గుజరాతీ నుంచి తెలుగులోకి 20 కతలను అనువదించినారు. రాష్ట్రేతరాంధ్రునిగా తెలుగు సాహితీ సేవ చేస్తూ పురస్కారాలను పొందినారు.

తెలుగు కత
1902



భండారు అచ్చమాంబ

# ధన త్రయోదశి

కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులో 1874లో పుట్టినారు. వీరి ఆరో ఏటనే వీరి తండ్రిగారు కన్ను మూసినారు. పదో ఏట, మేనమామగారైన భండారు మాధవరావుతో ఆమెకు పెళ్లయింది. పదిహేడో ఏట నుంచీ కాపురం మొదలు పెట్టినారు. మాధవ రావుకు అచ్చమాంబగారు చదువుకోవడం ఇష్టం లేదు. తండ్రి చనిపోయినాక తన తమ్ముడైన కొమర్రాజు లక్ష్మణరావు పెంపకాన్ని చేపట్టింది అచ్చమాంబ. తమ్ముడితో పాటు తెలుగు, హిందీ, మరాఠి, ఇంగ్లీషు నుడులను చదవడం నేర్చుకొనింది. కొమర్రాజుగారు పై చదువుల కోసం నాగపూర్‌కు వెళ్లిపోగా తరువాత ఆమె సొంతంగానే బెంగాలీ, గుజరాతీ, సంస్కృతాలను నేర్చుకొన్నారు.

చిన్న వయసులోనే కూతురూ కొడుకూ కన్ను మూయడంతో అయిదుగురు అనాథ పిల్లల్ని చేరదీసినారు. ఓరుగంటి సుందరీరత్నమాంబ గారితో కలిసి అచ్చ మాంబ గారు, 'బృందావన స్త్రీల సమాజం' అనే పేరుతో 1902లో మంచిలీపట్నంలో మొట్టమొదటి మహిళా సంఘాన్ని ఏర్పాటు చేసినారు. 1903లో రాష్ట్రమంతా విస్తృతంగా తిరిగి అనేక ప్రాంతాలలో మహిళా సంఘాల ఏర్పాటుకు కృషి చేసినారు.

అచ్చమాంబగారు కతలనూ వ్యాసాలనూ రాసినారు. వారి రచనలన్నీ స్త్రీ సమస్యల మీద సాగినవే. 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అనేది ఆమె రాసిన పేరుగన్న పుస్తకం. ఇందులో ముప్పయి నాలుగుమంది ఆడవారి జీవిత చరిత్రలు ఉన్నాయి. అచ్చమాంబ గారు రాసిన 'ధన త్రయోదశి' కతే తెలుగులో మొదటి కత అని చాలా మంది అభిప్రాయపడినారు.

అచ్చమాంబగారు 18–1–1905న వారి ముప్పయ్యవ ఏట కనుమూసినారు.

ధనత్రయోదశి నాటి సాయంత్ర మేడుగంటలవేళ నెటుచూచినను నానందోత్స వములతో బొంబాయి పట్టణము నిండియుండెను. నాఁడు దీపావళి దినమున నగునంత దీపోత్సవము లేకుండినను బ్రతిగృహము నందును ఆ గృహము యొక్క యాకారమును సౌందర్యమును నితరులకు జూపఁగలిగిన దీపమాలికలు వెలుగుచునే యుండెను. ఎటువిన్నను టపాక్కాయల ఫటఫట ధ్వనులు వినవచ్చు చుండెను. ఇంటింటను పళ్లెరములలో స్వర్ణాలంకారముల నుంచి లక్ష్మీపూజనలను జేయుచుండిరి. కాని, యొక యింట మాత్రమిట్టి యుత్సవ చిన్హములేవియుఁ గానవచ్చుటలేదు. దీనిని ఇల్లనుటకంటెఁ గుటీరమనిన బాగుండును. ఈ కుటీరము గొప్పసాహుకార్ల రెండు మేడల నడుమనుండి చెల్లెలగు లక్ష్మీదేవి యుత్సవముఁజూడ వచ్చిన జ్యేష్ఠాదేవియో యనునటుల నుండెను. ఈ యింటివలన ఆ బజారునకు గల శృంగార మొక్కింత తగ్గినను దీనియందలి పరిశుభ్రతను వ్యవస్థను గనినవారి మనములకు నుల్లాసము గలుగుచుండెనని మాత్రము చెప్పవచ్చును. ఇట్టి గొప్ప పట్టణమునందీ యుత్సవ సమయమునందే ధనికుని వృత్తాంతమును జెప్పక మాకొక దరిద్రకుటుంబ వార్తను జెప్ప మొదలుపెట్టినదని నాప్రియ సోదరీమణులు నాపైఁ గోపగించెదరేమో? అక్కలారా! మీరట్లు విసువక నేను జెప్పఁబోవు కథను సావధానులరై వినినచో మీకీ గృహవార్తయే విశేషయుత్తమయినదని తోఁచకపోదు.

నేనుఁజెప్పిన కుటీరము యొక్క రెండు ప్రక్కలను గొప్ప గొప్ప మేడలుండినటుల నే నిదివరకే చెప్పితిని. వానియందనేక దీపములు వెలిగింపబడియుండెను. అయితే మధ్యగల కుటీరమునందొక్క దీపమే వెలుగుచుండెను. దాని సమీపమునందు విజయ లక్ష్మమ్మ కూలికిఁ గుట్టఁదెచ్చిన పరుల రవికను గుట్టుచుఁ గూరుచుండెను. ఆమె సమీపమున నాఱుసంవత్సరముల బాలికయు మూడు సంవత్సరముల ముద్దు బాలుఁడును గూర్చుండి తమ బాలికలఁ జూపుచుందెలిసియుఁ దెలియని ప్రశ్నలచే దమ తల్లిమనమున కానందము కలుగఁజేయుచుండిరి. విజయలక్ష్మమ్మ సాయంత్రపు వంట చేసి పెనిమిటిరాక కెదురుచూచుచుండెను. ఆమె భర్త వెంకటసెట్టియను వొక గొప్ప సాహుకారు నింట గుమాస్తాగా నుండెను. నేఁడు ధనత్రయోదశి గాన, సెట్టిగారియింట లక్ష్మిపూజకానిదే భర్తరాడని యెఱిఁగిన దగుటవలన నామె పిల్లలకు భోజనములు పెట్టి మైలఁబడి రెవికకుట్టుకొనుచు భర్త యాగమనమున కెదురు

చూచుచుండెను. ఆహా! గ్రామమునందు జరుగుచుండిన యుత్సవము వైపెంత మాత్రమును జిత్తములేక తదేకాయుత్త చిత్తయై పెనిమిటి రాకను గోరుచున్న యావనిత మొగమెంత మనోహరముగానుండెనో? అట్టి స్త్రీలను గన్నులారఁ గనుఁగొన్న వారలకే కాని యితరులకుఁ దెలియనేరదు. ఇట్లామె తన బాహ్యచక్షువులను మాత్రము కుట్టుచున్న రెవిక పైనుంచి యంతశ్చక్షువులతోఁ బెనిమిటి రాకను జూచుచుం గూర్చుండెను. ఇంతలో ముద్దుల బాలుఁడగు నామె కొమారుఁడామెను సమీపించి మెడను గట్టిగాఁ గౌగలించుకొనినందువలన నామె తనమనసును వానివైపునకుఁ ద్రిప్పవలసినదయ్యెను. ఇంతవఱకామె వాఁడడిగిన ప్రశ్నలకెల్ల హూ, యనుచు నేదోయొక జవాబు చెప్పుచుఁ దనపనినిఁ జేసికొనుచుండెను. గాని, బాలుఁడు తన ముద్దుహస్తములతో మెడకు బంధమువేయఁగా నామె వెంటనే కుట్టుపనిని నవతల నుంచి పిల్లవానినిఁ దగ్గిరనుంచుకుని బుజగరించి ముద్దుపెట్టుకుని నన్ను గన్న నాయానా! నీకేమికావలెను? నీవక్కతో నింతవఱకాడుకొనుచుంటివే అట్లే యిఁక కొంచెమాడుకొనుము. నేను పరుల రెవికను గుట్టుచున్నాను. ఇది త్వరగాఁ గుట్టవలెను అనెను. తల్లినోటి నుండి మాట వచ్చిన వెంటనే యాసుగుణవంతుండగు బాలుఁడు లేచి యావలి కరిగెను. ఇంతలోఁ బొరుగింటఁ గాల్చిన చిచ్చుబుడ్డి వెలుగు వానికగుపడి నందున వాఁడు మిక్కిలి సంతోషముతోఁ జేతులతో వెలుతురుఁ జూపుచు గంతులు వేయుచు అమ్మా! అత్తల తమాసాగాయున్నది అక్కతో జూలపోతానని తన ముద్దు మాటలతోఁ దల్లినడిగెను. వాఁడు పోదునన్న స్థలము సమీపమైనందున విజయ లక్ష్మమ్మ వెంటనే బిడ్డను బిలిచి రుక్మిణీ! నీవీరామునినిఁ దీసికొని పొరిగింటనగుచుండిన వేడుక చూసి తీసికొనిరా. భద్రము సుమా దీపము నొద్దకుఁ దీసికొనిపోకు. అచట నెవరితోనేని తగువులాడకు అని చెప్పిపంపెను. వెంటనే యాబాలకులు పొరిగింటి వాకిటికిఁబోయిరి ఇట్లు పిల్లలు పోవుచుండగా వారితల్లి కమితదుఃఖము కలిగి యామె యశ్రుపూర్ణ నేత్రములవారినిఁ జూచుచుండెను. పాపమామెకుఁ దొలిదినము సంగతి జ్ఞాపకము వచ్చినది కాఁబోలు. తొలిదినము వారు టపాక్కాయల పండుగఁగా నెటులనోయామె వారిని సమాధానపరచెను. అప్పటి నుండి యాపిల్లలును మరి తల్లిని నడుగనేలేదు. తుదకు పొరుగింట టపాక్కాయలు కాల్చుచున్నను నడుగక యూరకచూచి వచ్చెదమాయనియడిగిన వారి సద్గుణమును గని యిట్టి మంచి బాలుర కోర్కెలు తీర్చుటకు తగినంత యైశ్వర్యము మనకు లేకపోయెను కదాయని తల్లికి మరింత దుఃఖము హెచ్చెను. ఉండుటకిల్లు మంచిదిలేదని గాని, కట్టుటకుఁ గొప్ప వస్త్రములేదనిగాని పండుగనాఁడు పిండివంటలు చేసికొనుటకు వీలులేదనిగాని యెన్నడును నామెకుఁ జింతకలుగలేదు. ప్రతిదినము నష్టకష్టములతో గడుచుచున్నను నామె సద్గుణవంతుఁడగు భర్త సహవాసమువలన సంతోషముగానే కాలము గడుపు చుండెను. గాని, కడుపునగన్న బిడ్డల కష్టములను దలచుకొని నంతమాత్రమున

నామెకపరిమిత దుఃఖము కలుగుచుండెను. ఆమెతాను విశేషవైభవము ననుభవించిన దగుటవలన దనసంతానమున కిట్టి కష్టములు వచ్చెనని పొక్కుచుండెను. నిజముగా విజయలక్ష్మమ్మయు వెంకటరత్నమును జిన్నతనమునందు చాలా యైశ్వర్య మనుభ వించిరి. కలకలూరు మల్లయ్యయను నొకయగ్రహారీకునకు వెంకటరత్న మొక్కఁడె కొడుకు. అందువలన నాతని వివాహము పదవయేటనే విశేష యుత్సవముతో జరిగెను. తనకొక్క పుత్రుఁడైనందునను తాను గ్రామమునందఱి కంటె నధిక ధనవంతు డనిపించుకొనినందునను మల్లయ్యగారు వివాహనకు విశేషధనము వ్యయపఱచిరి. ఆ వివాహమునకు పదునేనువేల రూపాయిలు ఖర్చయ్యెను. అయ్యెయ్యో వివాహ మునకు పదునేనువేల రూపాయిల ఖర్చయిన దంపతులకిప్పుడు పదునేనువేల రూపా యల కండ్లల్లకగుపడుట బంగారమైంది. అయితే యీ కాలములోఁ గొందఱియగ్ర హారీకుల యగ్రహారములు పాడగుటఁజూచి వారికిది యొక విచిత్రముగా నుండును. మల్లయ్యగారి యగ్రహారమది వఱకే కొంతతాకట్టు పెట్టఁబడియుండెను. అయినను వారియింట జరుగు కార్యములు పూర్వమువలెనే జరుగుచుండినందున దినదినమును నప్పులు హెచ్చుచుండెను. ఇట్టి సమయమున నొక్కగాని యొక్కకొమారుని వివాహము చేయవలసిన సమయము మించిపోవునని తలఁచి యతఁడింకను గొంత ఋణముచేసి వివాహము చేసెను.

ఈ ఋణముల వలననే వెంకటరత్నముగారి కిప్పుడన్నముదొరకుట సహితము దుస్తరమై చిన్నపిల్లల కష్టములకు వారు విచారపడ వలసినంత దుర్దినము వచ్చినది. మల్లయ్యగారి జీవితమునందు మాత్రము ఋణస్తులెవ్వరును విశేషతొందర చేయ లేదు. కాని ఆయన ప్రాణము పోయిన వెంటనే యందఱు నొక్కసారిగా వచ్చి కలదానిలో రూపాయికి నర్ధరూపాయి చొప్పునఁదమతమ బాకీలను దీర్చికొనిరి. పాపము యుక్త వయస్సు రాకమునుపే వెంకటరత్నముగారికి దమపెద్దల చాతుర్యమువలననో తెలివి తక్కువ వలననో గలిగిన ఫలముననుభవింపవలసి వచ్చెను. వెంకటరత్నము మిక్కిలి సద్గుణుండు. ఆయన పసితనమునందగ్రహారీకుల వైభవము ననుభవించినను వార యందుండు దురభిమానము, ఉన్మాదము, సోమరితనము మొదలైన వాయననంటినవి కావు. ఆయనకుఁదగినటుల భార్యయు సద్గుణవతియే దొరికినందునఁదన దరిద్రతకై యొకప్పుడాయనకుఁ జింతగలిగి భార్యయనుకూలతను జూచి దుఃఖము నాచు చుండెను. తండ్రి చచ్చువఱకాయన ప్రవేశపరీక్షయందు మాత్రము కృతార్థుఁడయ్యెను. ఇంకను జదువుకుని విద్యాభివృద్ధి చేసికొనుటకు వయసున్నను ధనములేనందున నాఁతండు వెంటనే యుద్యోగములోఁ బ్రవేశించెను. ఉద్యోగములీ కాలములోఁ దొరుకుటయే మిగులదుర్ఘటము. ఇట్టి స్థితిలో నెటులనో వెంకటసెట్టియనునొక గొప్ప సాహుకారు యొద్ద పదిరూపాయల వేత్నముగల గుమాస్తా గిరి దొరికెను. ఆ పది

రూపాయలతో వారెటులనో దినములు గడుపుచుండిరి. ఇట్టిస్థితిలో వారికిఁ దమ బిడ్డలనుగూర్చి విచారము కలుగుట సహజమే.

విజయలక్ష్మమ్మకుఁ దన బిడ్డల స్థితినిఁ గూర్చి విశేషదుఃఖము కలిగినదని పైనఁ జెప్పితిని. అప్పుడామె కన్నులయెదుట పూర్వపువైభవము నది నాశనమైన విధమును బ్రస్తుతస్థితి వల్లఁ బిల్లలనుభవింపుచున్న కష్టములును గానుపించెను, ఈ సంగతు లన్నియుఁ దలఁపునకు వచ్చినందున నామె దుఃఖము పొరలి పొరలి యాపు కొన శక్యముకాక వచ్చుచుండెను. ఇంతలో రాముని యేడుపామెకు వినఁబడినందున నామె దిగ్గునలేచి పొరుగింటి వద్దికిఁబోయెను. ఆచటికీమె పోవునంత కచట నొకస్త్రీ రామునిం గొట్టుచుండెను! ఆచిన్నవాని తప్పిదము విచారింపగా నచటనొత్తిలేని టపాకాయనొకదాన్ని వాఁడెత్తికొని విరిచి యటనున్న నొకదీపము దగ్గిరపట్టెను. అందు వలన నాదీపమారిపోఁగా నాయింటిపిల్లవాఁడు రామునిఁగొట్టి వానియేడుపు వినఁ బడినఁ దల్లితనను గొట్టునను భయముచే వాడే తనను గొట్టెనని పెద్దపెట్టున నేడువసాగెను. వాని యేడుపు విని వాని తల్లి పరుగెత్తివచ్చి తనపిల్లవానిని రాముఁడే కొట్టెనని తలఁచి వాని సుకుమారతనైనను జూడక గొడ్డును బాదినట్టుల బాదసాగెను. తమ పిల్లలను తామధికముగా గొట్టు తల్లులయినను వారినితరులు కొట్టుచుండగా జూచి సహింపజాలరు. ఇఁక తానెన్నడును బిల్లలనొక దెబ్బయినను వెయ్యని విజయలక్ష్మమ్మ వంటి మాతకుఁ దన పిల్లవానినితరులు గొట్టుచుండగాఁ జూచుట యెంత కష్టముగానుండునో యట్టి తల్లులకేతప్ప యితరులకు దెలియుట కష్టము. ఆ సమయమునందామెకు బట్టరాని కోపమువచ్చెను గాని వివేకవతియగుటచే నాసాధ్వి కోపమునంతను దిగ(మ్రింగి రుక్మిణిని, రాముని దీసుకొని యింటికివచ్చెను. ఆమె గృహమునకు వచ్చిన పిల్లలను బుజ్జగించి సముదాయించెను. గాని యామె తనదుఃఖము నాపుకొనశక్తురాలు కాదయ్యెను. నోరెఱుఁగని తన పాపని నితరులు నిష్కారణముగా దండించుటకుఁ దమ దారిద్రదేవతయే కారణముగదాయని తోఁచి యామెకధికదుఁఖము కలిగెను. ఆమె తనముద్దుపాపని శరీరమునందలి దద్దులను దడవిచూచి కన్నులనుండి బాష్పదారలు గార్పంజొచ్చెను. అప్పుడామెకు సమాధానము చెప్పు వారచట నెవ్వరును లేకయుండిరి. వెంకటరత్నముగారచట నుండినచో నామెకు సమాధానము చెప్పియుందురు. చూడుడు! ప్రస్తుతము సహితము నామెదుఃఖము నాయనయే తగ్గించుటకుఁ గారకుఁడయ్యెను. ఆమె భర్త యలికిడిని వినిన వెంటనే తన దుఃఖమునంతను నడచుకొని సంతోషము ముఖమునం దోపఁజేసెను. ఆహా! విజయలక్ష్మీ! నీ సుగుణములిన్నియని వర్ణింప నాతరమా? పనిచేసియలసి వచ్చిన పతికి నీ దుఃఖము తెలిసినచో విశేషవ్యసనము కలుగునను తలంపుచేఁతగదా నీవు నీదుఃఖమును మ్రింగి సంతోషమును ముఖమునందుఁ దెచ్చుకొని ముద్దుపాపని నెత్తుకొని భర్తనెదురుకొంటివి? ఇట్టి సత్ప్రవర్తనమును స్త్రీలందఱు నవలంభించినచో

మాదేశమునకెంత మేలుకలుగును. వెంకటరత్నము గృహమునకు వచ్చెనుగాని నిత్యమువలె నేఁడాయన ముఖము సంతోషముగా లేక మిగుల చిన్నవోయి యుండెను. ఆయన శరీరమునిండను చెమ్మటపెట్టి యుండెను. నిత్యము నాతఁడు తనకెదురుగా వచ్చిన భార్యను నవ్వుచుఁ బలకరించిగాని, కుమారుని ముద్దిడుకొనిగాని లోపలికిఁ బోవుచుండును. నేఁడా గృహస్థుఁడెదురైన సతీసుతులనూరకఁజూచుచు మౌనముగా లోపలికి వచ్చెను. భర్తనుగాంచిన వెంటనే విజయలక్ష్మి నేఁడధికముగా పనియుండి నందున నలసెనని తలఁచి యావేళ నిత్యముకంటెను శ్రమ విశేషమైనదిగాబోలు, ఏమీ యీచెమట! యని తనపమిట చెఱఁగుతో నాతని చెమటను దుడిచెను. ఇంతలో జంకనున్న పిల్లవానికి నిదుర వచ్చినందున వానింబరుడఁబెట్టవచ్చి యామె భర్తకు దుస్తులు విడచుటలోఁ దోడుపడెను. దుస్తులు విడిచి పత్నిచేతికినిచ్చి యాయనమిక్కిలి చింతాక్రాంతుఁడై యచటనున్న పక్కచుట్టనానుకొని కూర్చుండెను. విజయలక్ష్మియు నాదుస్తులను నియమిత స్థలములనుంచి వచ్చి పతిచెంతఁ గూర్చుండెను. కొంతసేపటి వఱకు భర్తమాటలాడనందున వింతపడి విజయలక్ష్మి యాయనకుఁ దలనొచ్చు చున్నదని తలచి యిదేమి? నేఁడుమాటలాడరు? తలనొప్పిగానున్నదా? యని సమీపమున కరిగి తలపట్టి చూచెను. తలనొప్పిలేదని వెంకటరత్నమనెను. గాని యంతతో నాసాధ్వికి సమాధానముకానందున, తలనొప్పిలేనిచో నేఁడిట్లుదాసీనముగా నుండుటకుఁ గారణమేమి? ఈముఖమింత చిన్నబోయియుండుటకు హేతువేమి! యని భర్తనడిగెను, పత్ని నోటినుండి వచ్చుమాట వినినతోడనే వెంకటరత్నముగారికి మిగుల విచారముకలిగి, నీకు మన యీదుస్థితినిఁ దలచుకొనిన విచారముగా నుండదా? యనియడిగెను. భర్తవాక్యము చెవినబడిన వెంటనే విజయలక్ష్మి గడియ క్రిందటి దుఃఖము జ్ఞాపకమువచ్చి విశేష విచారము కలిగి భర్తకు నట్టిదుఃఖమే యేదయినఁగలిగి యుండునని యూహించి తనదుఃఖమునంతను మహాప్రయత్నమున నాపుకొని, ముఖమునందు సంతోషమంకురింపఁ జేసికొని ఇదేకద! ఇంతమాత్ర మునకు విచారమేల? నాకిందున గూర్చి విచారమేమాత్రమును లేదు, ఆహా! నీవిట్టిదానివే కానిమునుపటి మన వైభవమును బ్రస్తుతపు స్థితియుఁ దలచుకొనినచో నాకు జాలవిచారముగా నుండును. దివ్యమందిరములందష్టైశ్వర్యములనుభవించిన వారికి గుడిసెలో నష్టదరిద్రములననుభవించవలసి వచ్చెనుగదా! నేఁడు లోకులంద అనేక యమూల్యములగు నలంకారములొకచోట నుంచి పూజింపుచుండగా రత్నాభరణములనేకములు దాల్చిన నీ శరీరమున నొక్కబంగారపు గుండయినను బూజించుటకు లేకుండుట చూచి నీకెంత మాత్రము విచారముగానుండదా?

విజ:- నాకెంతమాత్రమును విచారముగానుండదు. మనకు సంపదలేదనిగదా మీరువిచారపడుట, సంపన్నులగు కొందఱికిఁ గల గర్వమును, విచారశూన్యతయుఁ జూచినపుడెల్ల మనస్థితియే నాకునుత్తమమైనదిగాఁ గానుపించుచుండును. ఇట్టిస్థితిలో

మనము సత్యమార్గమును విడువక నడుచుచుండుట వలన మనకగునమితానందము ధనవంతులమైనచోఁ గలుగనేరదు. నేనన్నో తమ ప్రేమయొక్కటి కలిగిన నితరసంపద లేమియు నొకలెక్కగాఁగొనను;

పత్ని పలుకులాలించి వేంకటరత్నము కొంత యులికిపడెను. ఆయన చిత్తము బెదరినట్లు ముఖచర్యకానుపించెను. సత్యప్రవర్తకుఁడగు నాతని ముఖమునందొక విధమైన భయము కానుపించెను. అప్పుడాతఁడు ఱిచ్చవడి భార్యకేమి సమాధానము చెప్పవలయునో తోఁచకయుండి తుదకెటులనో ధయిర్యమవలంబించి ప్రియే! పొడిప్రీతినిఁ దీసికొని నీవేమిచేసెదవు? విజయలక్ష్మి కాయన ముఖమునందుఁ గలిగిన భేదమేమియుఁ దెలియలేదు గాని, పతిమాటవలన నామెకు దుఃఖము మాత్రము కలిగెను. అప్పుడామె మీరిట్టిమాటలవలన నామనసునకు దుఃఖమే గలుగఁజేయు చున్నారు అనెను.

వేంక:- అట్లయిన నేను మాటలాడనులే. నీకు మనపిల్లల దుస్థితిని గూర్చియైనను విచారముగానుండదా? పరుల పిల్లలీదీపావళి పండుగకు మంచిదుస్తులను ధరి యించుకొని మృష్టాన్నములను దిని సాయంకాలమానందముగా టపాక్కాయలను గాల్చుచుండఁగా వారినిఁజూచి మన బిడ్డలు దీనముఖులై యుండఁగా జూచియైనను నీకు దుఃఖముగానుండదా?

విజ:- ఇందుకు దుఃఖమేమి? నాకెంతమాత్రము విచారములేదు సరేగాని నేఁడీ లేనిపోని ప్రసంగములు చేసి విచారించుచు లేని దుఃఖమునేల కల్పించుకొన మొదలు పెట్టితిరి. మనపిల్లలేమయిన మననావస్తువాహనములు తెమ్మని యడిగిరా?

వేంక:- ఇందువలననే కద నా దుఃఖము విస్తరిల్లుట. ఈమాటయని యతఁడొకింత యూరకుండి గద్గదధ్వనితో నేను నీకొకమాట చెప్పినట్టైన నీవు... ఏమిలేదు. అని యాయన నాలుక గరచుకొని యేదోభయంకరమగు సంగతినిఁ జెప్పఁబోయి శంకించు వానివలె ముఖచర్యను జేసెను. విజయలక్ష్మి పాపమాయన చేష్టలనుగని చేష్టలు దక్కియుండెను. కొంతవడికామె తెలివితెచ్చుకొని మీరునాకేమి చెప్పవచ్చితిరియని యడిగెను.

వేంకటరత్నము చర్యను స్థిరపఱచుకొని ఏమియులేదు. పోనివ్వు నీవన్నదే సత్యము. లేనిపోని సంగతులు ముందిడుకొని వ్యసనమేల పడవలెను, అనెను. గాని నట్లాయన ముఖచర్యల వలనఁదెలియుచుండెను. గాని, కపటమేమియుఁ దెలియ లేదు. ఆమె తన భర్త వాక్యములనే నమ్మెను. ఇంతలో నాయన సరె నాకాకలి యైనది. నేఁడు విశేష శ్రమచేయుటవలన విసుకుగానున్నది. త్వరగా భోజనము చేసి పరుండు దము! భర్త నోటినుండి యీ వాక్యములు బయలువెడలిన తోడనే విజయలక్ష్మి

మడికట్టుకొని భర్తకు వడ్డించి యాతఁడు తినిన పిమ్మట తాను భోజనముచేసి యింటిపని దీరినవెనుక పరుండఁబోయెను. అంతకుమునుపే వేంకటరత్నము నిదురపోవు చుండెను. విజయలక్ష్మియు ప్రొద్దుపోయినందున కుట్టుపనిని చేయుచుంగూరుచుండక తానుపరుండెను.

విజయలక్ష్మి కపటహీనయగుటవలన పక్కకిఁజేరిన వెంటనే నిదురపట్టెను. గాని, విచారగ్రస్థుఁడగు వేంకటరత్నము పైకి నిదురపట్టిన వానివలె నభినయించినను నిజముగానాఁటి రాత్రి యాతనికి నిదురపట్టనేలేదు. నాఁటి సాయంకాలమున వేంకటశెట్టి గారింటఁ జరిగిన సంగతియే రాత్రి యాతనికి సుఖనిద్రకు భంగము కలిగించెను.

నాఁటి సాయంకాలము సెట్టిగారింట లక్ష్మీపూజగుటవలన వేంకటరత్నమచట నేయుండి యందుకుఁగావలసిన వస్తువులన్నియు జతపర్చుచుండెను. ఇంతలో నచటి పెద్దగుమాస్తా వేంకటరత్నము నేకాంతముగా నొకచోటికిఁ దీసికొనిపోయి రహస్య ముగా వేంకటరత్నమా! నీవధిక బుద్ధివంతుఁడవని నేను నిన్ను నాకు సహాయునిగాఁ గోరెద నేను నీకుఁ జెప్పుసంగతిని నీవితరులతోఁ జెప్పనని ప్రతిన చేయుము? ఆ ముసలి గుమాస్తా మిక్కిలి మంచివాఁడును నమ్మఁదగినవాఁడును అని యదివఱ కెఱిఁగినవాఁడు గాన, నీవుచెప్పునది యొరులకెఱిఁగింపనని వేంకటరత్నము నమ్మఁ బలికెను. అప్పుడా ముసలి గుమాస్తా వేంకటరత్నమా! నేఁడు లక్ష్మీపూజనమునకై తీసిన యనేకములైన యమూల్యాభరణములను జూచితివా ఇవియొక లెక్కలోనివి కావు. వీనికంటె వేయిరెట్లెక్కువ విలువగలవి వీరి దుకాణమునందున్నవి. ఇది నీవెఱుఁ గనే యెఱుఁగవు గదా? ఈమాటల ధోరణియేమియుఁ దెలియక వేంకట రత్నము అవును, నాకుఁ దెలియుననియెను.

పెద్దగుమాస్తా: ఇది తెలిసినటులనే యీధనమంతయు నానమ్మకముననే యున్న దనియును నీకుఁదెలిసియేయుండును.

వేంకటరత్నము: ఇట్ట విశ్వాసము నాయందుండుట వలననేకదా నేనుతలఁచిన కార్యము నిర్విఘ్నముగా నెరవేరునని నేనుబూనునది.

గుమాస్తామాటలను విని వేంకటరత్నమునకు కొంచెమనుమానము కలిగెను. గాని, యాతఁడింకను నేమిచెప్పునో యని తలంచి వినుటకు నూరకుండెను;

పెద్దగుమాస్తా: ఇంతసంపత్తి లోనిది మనమొకకొంత తీసికొనిన నదియొక తప్పిదము కాదు. అందువలన సెట్టిగారికిని నష్టమురాదు. మనకన్ననో దానివలన మనదరిద్రదేవత తొలఁగిపోవును ఇంత పెద్దగుమాస్తాను నాకేబది రూపాయలేగద జీతము నీకన్ననో పదియే. ఇంత స్వల్ప జీతములో మనకుటుంబములను భరించుట మనకు దుస్తరము

గదా? ఈ సంగతి వెలికివచ్చునన్న భయము నీకక్కరలేదు. ఆపూచీ నాది నేను జెప్పిన యీ సంగతి సంవత్సరాంతములెక్కలకు లోగా కావలెను. సాలాకరింకను రెండేదినములున్నది. నీవేమనియెదవు? పెద్దగుమాస్తా యీమాటలు చెప్పునప్పుడు వేంకటరత్న మునకుఁ గోపమువలనఁ గన్నులెఱ్ఱనగుచుండెను. అందువలన నాతఁడు మాటలమధ్యనే గుమాస్తా నోరుమూయింపవలెనని చూచెను గాని యాయన తన యధికారియు, వృద్ధుఁడునునగుటవలన కోపమును మ్రింగి యూరకుండెను. ఆవృద్ధుని మాటలయిన వెంటనే వేంకటరత్నము నిర్మొగమాటముగా అయ్యా! కృష్ణమూర్తిగారూ? మీరు నన్నిట్లు వేళాకోళముల కడిగినఁజింతలేదు. కాని యిది వాస్తవేయైనచో తమ నిశ్చయము నాకెంతమాత్రము సమ్మతము కానేరదు. మీకు మాటయిచ్చినందునఁ గావలసిన నేనీ సంగతి నితరులకెఱిఁగింపను, అనెను. ఈ దృఢ వాక్యములనువిని కృష్ణమూర్తిగారికిఁగల యుత్సాహమంతయుఁ దగ్గినటులాతని చర్యవలనందెలియు చుండెను. అయినను ధైర్యము విడువక ముసలిగుమాస్తా తియ్యని మాటలవలన వేంకటరత్నమును వశపఱచుకొనఁజూచెను. సెట్టిగారికిఁగల యమిత ధనమును జూసినను వేంకటరత్నము తననిశ్చయమును విడువకుండెను. అంతనా గుమాస్తా తనచాతుర్యమువలన వేంకటరత్నముగారి దరిద్రమును నాతనికిఁ గానుపించునటుల వర్ణించి యాతనిభార్య పిల్లలకందువలనఁ గలుచుచున్న కష్టమును వక్కాణించెను. సదావాణిజ్యములో మెలఁగినిపుణుఁడైన వృద్ధుఁడు తన దరిద్రస్థితిని హృదయ ద్రావకముగా నుడువునప్పుడు వేంకటరత్నము కన్నులనుండి నీరుకారఁ జొచ్చెను. ఆకన్నీటిఁగని గుమాస్తా ఏమి? వేంకటరత్నమా! నేనన్నటులనే నీకుటుంబ స్థితి యున్నదాలేదా?

వేంకటరత్నము: కన్నులు దుడుచుకొనుచు అవును అటులనేయున్నది.

పెద్దగుమాస్తా: అయితే నీ యిష్టము నేనన్నమాటను సమ్మతించవు?

వేంకటరత్నము: ఛీ. కృష్ణమూర్తిగారూ! నాతో మీరిఁక మాటలాడకుఁడు మీమాటల వలన నా మనసేమయినఁ జెడునేమో.

ఆ వృద్ధునకు మనుష్యస్వభావ లక్షణములు చక్కఁగా దెలిసియుండినందున మనుష్యుల మనసొకసారి యించుక దుర్మార్గమువైపునకు దిరిగినచో మరల సన్మార్గము నకుఁ దిరుగుట దుస్తరముగా నీతని సంగతినిఁ గూర్చి కొంత విచారణ చేయుటకు వ్యవధి కలిగించినచో మన కార్యము సఫలీకృతమగునని తలఁచి యాతడు 'మంచిది, అటులనే కానిమ్ము నేనిప్పుడు నీతో మాటలాడను నీవే యీ రాత్రియంతయు నాలోచించికొని ఱేపుప్రొద్దున నాయింటికివచ్చి నీ నిశ్చయమును దెలుపుము. ఈ దినములు దీపావళీదినములు, మీయింట పండుగ కేమియులేకుండును. గాన నీ

నూఱు రూపాయిలనోటును నీకిచ్చెదను. వీనినినక్కఱలేదనక తీసుకొనుము' యని యాతఁడొకనోటును వేంకటరత్నము జేబులో నుంచెను.

దుకాణము నుండి యింటికి వచ్చు త్రోవలో నాగృహస్థుని మనసునందనేక విధముల విచారతరంగములుద్భవింపుచుండెను. వృద్ధుఁడగు నా గుమాస్తా చెప్పిన చొప్పునఁ జేయవలెననా చేయఁగూడదా? యన్న ప్రశ్న యాతని మనమును తొందర పెట్టసాగెను. అట్లు చేయుటవలనఁ దన వంశముయొక్క కీర్తిభంగము కలుగునని యామానవుని యంతరాత్మ తెలుపుచుండెను. ఇంతలోఁ జతురుఁడగు కృష్ణమూర్తి బోధ జ్ఞప్తికివచ్చి యాతఁడనినటులఁ జేయుటకుఁ బురికొల్పుచుండెను. ఇట్టిస్థితిలో వేంకటరత్నమింటికి వచ్చెను. గాన పైనుదహరించినటుల నాతనిస్థితి యుండెను. ఈ సంగతినే భార్యకుఁ జెప్పఁబోయి యతఁడు తడబడి చెప్పకుండెనని బుద్ధిమతులగు చదువరులిదివఱకే గ్రహించియుండెదరు.

ప్రస్తుతమాయనపరుండి కన్నులమూసికొని నిదురఁబోయినవానివలె నభిన యించినను నిదురపట్టక వెనుకనుదహరించినటులాతని మనస్సునందనేక విధముల యాలోచనలు వచ్చుచుఁబోవుచునుండెను. గాని యేమిచేయుటకును నింకను దృఢనిశ్చయము కానందున నిదురరాకుండెను. తుదకు వేంకటరత్నము భార్యకు నిదురపట్టినదని తెలిసికొని యాగదిలో నిటునటు తిరుగుచుండెను. ఆసమయము నందదాటున నాతనికి గుమాస్తా యిచ్చిన నోటు సంగతి తలంపునకు రాఁగా వెంటనే దానినిఁదీసి దీపము వెలుతురున నొకజాముచూచి యాలోచింపుచుండెను. అంత నాతని చిత్తమునందేదో యొక దృఢనిశ్చయమయినటుల ముఖమునందగు పడెను. వెంటనేయాయన 'అవును ఇటులనేచేయవలెను. కృష్ణమూర్తిగారన్నది మనలాభమునకే కద?' ఇంతలోనాతని దృష్టి నిదురించియున్న భార్య ముఖము వైపునకుఁ బాఱెను. గాన గడియక్రిందనాసాధ్వి పలికినపలుకు లాతనికిఁ దలపునకు వచ్చినతోడనే యదివఱకైన నిశ్చయమంతయు మరచి యాపురుషుడు 'నేనట్టి చెడుకార్యము జేసినచో సద్గుణరాశియగు నీమెకు మొగమెట్లు చూపఁగలను? ఛీ. ఇట్టికార్యమే చెయ్యను.' వెంటనే యాతనికామె వెనుక ముందఱ పరుండి నిదురించు చున్న బిడ్డలగుపడి యదివఱకువచ్చిన వివేకమును బాఱఁదోలఁగా నతఁడు, ఈ చిన్న పాపల కష్టములను జూడనోప నిదియునుగాక నేను జేయఁదలంచిన కార్యమి తరులకుఁ దెలియుట సంభవింపదు? అని మరల నాతఁడు నోటును జూచుచుం గూర్చుండెను. ఈ సమయము నందే కారణమువలననో విజయలక్ష్మికి మెలకువవచ్చి లేచినందున నామెనుగని వేంకటరత్నము నిశ్చేష్టితుండై గోడకొరిగెను. ఆయనచేతిలో నున్న నోటు క్రిందపడెను.

విజయలక్ష్మి నిదుర నుండిలేచువఱకామెకీ సంగతులగుపడుట వలన నాసాధ్వి మిగుల నాశ్చర్యమును, విచారమును గలదియై పతిని సమీపించి 'ఇదేమిటి? అర్ధరాత్రి లేచి నేఁడేమిచేయుచున్నారు. సాయంకాలము నుండియేమిటో నాకుఁజెప్పఁగూడదా?' అనునంతలో నాయువిద కచటఁబడియున్ననోటు కానుపించెను. దానింగనిన వెంటనే యామెహృదయము ఝల్లన రోదనస్వరముతో 'అయ్యా! ఈనోటెచటిది దీనినెచటనుండి తాము తెచ్చితిరో నాకుఁజెప్పఁగూడదా? నేఁడన్నియు దుశ్శకునములగానేయున్నవి. మీకు నమస్కరించెదను నాకీ సంగతినించుక వినిపింపుడు.'

వేంకటరత్నము ముదుసలి గుమాస్తా మాటలవలనఁ గొంత తెలివి కలవాఁ డయినందున నాతఁడు తన భార్య మనసును ద్రిప్ప యత్నించెను గాని యాతని ప్రయత్నమువలన లేశమైనను లాభము కలుగలేదు. మీదు మిక్కిలి యాతని మాటలను వినినప్పటినుండియు విజయలక్ష్మి మనమున దిగులొందినందున నామె శరీరము వడఁక సాగెను. కోపాతిశయమువలనఁ గన్ను లెఱ్ఱబాఱి వానిలోనుండి జలమురాఁ దొడఁగెను. అట్టికోపావేశమునందును నామె యితఁడు నాపతి యితనిని దండించుట యుక్తముకాదను సంగతి మఱచినదికాదు. కాని, యిట్టి సమయమున మనముపేక్ష చేసినచో నీతఁడు దుర్నడవడిలోఁ బ్రవేశించి చెడిపోవునుగాన, నట్లుకాకుండఁజేయుట కర్తవ్యమని తెలిసినది గాన నామెయూరకుండక కొంచెమావేశము తెచ్చుకొని ఈనోటు తమరు న్యాయముగా సంపాదించి యుండరని నేనిది వఱకే యనుమానపడితిని. మీరిట్లు చేయుటకు హేతువేమి? నేనెన్నఁడైన నగలకనిగాని బట్టలకనిగాని మిమ్ముల నిబ్బంది పెట్టితినా? పిల్లలయిన నేదేని తెచ్చుటకై కచ్చెచేసిరా? అందువలన మీకీ దుర్బుద్ధి పుట్టెనా? అందువలననే మీకీబుద్ధి పుట్టియుండిన నేను నీపాదాల సాక్షిగాఁ జెప్పెదను. నేనెన్నడిక యడుగను. పిల్లలనేమయిన నడుగనివ్వను. మాయందును గ్రహించి మీరిట్లుచేయవలదు. ఈ సంగతి యొరులెఱుఁగజాలరని మీరనెదరు. గాని సర్వసాక్షియగు పరమేశ్వరుని మోసపుచ్చి మీరీకార్యము చేయఁగలరా? ఇట్లు చేసిన పిదప మీమనసైనను బూర్వమువలె స్వస్థముగా నుండునా? కష్టపడి సంపాదించు కొనిన పది రూపాయలను సుఖముగాఁదినినటుల నీదొంగసొమ్మును దినఁగలమా? దాని మనము ముట్టినపుడెల్ల నిది మీరు విశ్వాసద్రోహమువలన సంపాదించితిమని మనోవేద మనను దెప్పుచుండదా? ఓ పరమేశ్వరా! తంద్రీ ఈ కార్యమును మానుపు టకు నేను శక్తురాలనుగాకున్నాను. నాకీదరిద్రములోఁ గలుగుచున్న పరమానందమిక దొరుకఁజాలదుగదా! యనియామె దుఃఖము నాపుకొనలేక యేడువసాగెను. దానింగని తెలివి తెచ్చుకొని వేంకటరత్నము దుఃఖింపుచున్న తనసతిని దగ్గఱకుఁ దీసికొని యక్కునఁజేర్చుకొని సతీ తిలకమా! నీసద్బోధవలన నా మనమునందలి యజ్ఞా నంధకారము తొలగెను. నేనిఁక దుష్కార్యమెన్నఁటికినిఁజేయను. మనము దరిద్రములో నుండియు సద్గుణముచేత గలుగునానందమునునుభవించెదము. ఆహా! నాకిట్టి

సచ్చరితయగు కాంత లభించినందుననే కదా నేనొక గొప్ప పాపము నుండి విడుదలఁ గంటిని మత్ప్రాణ సమానమా! నీకు విజయలక్ష్మియనిన నామమెంతయుఁ దగియున్నది. నీవు నిజముగా నేడు విజయము బొందితివి. లోకులందఱు లక్ష్మీపూజ చేయుచుండఁగా నాదగ్గిర పూజించుటకు లక్ష్మిలేదని గడియక్రింద నేను జింతింపు చుంటిని నాదగ్గిర నీరూపముతోఁ బ్రత్యక్షలక్ష్మియేయుండఁగా నాకా లోహమ యలక్ష్మితోఁ బ్రయోజన మేమి? నేఁడు నేనీలక్ష్మినే పూజించెదను. అని వేంకటరత్నమా స్వర్ణాలంకార హీనమైన సద్గుణలంకారయగు విజయలక్ష్మినిఁదన మాలింగము చేతంబూజించెను, ఆ సమయ మునందు విజయలక్ష్మికత్యానందము కలిగినందున నామె దేహము తెలియక భర్త భుజముపై నొరిగెను. తాను తనపతిని నిష్కారణముగా తూలనాడితినని యామెకధిక దుఃఖము కలిగెను. కొంతవడికా సాధ్వీమణి తెలివి తెచ్చుకొని మీరట్లు చెయ్యరు గదా? ఇది నిజమేనా?యని యడిగెను. వేంకటరత్నము వెంటనే నిజముఁగా జెయ్యనని మరల యామెను గౌగలించుకొని నమ్మఁబలికెను. అప్పుడామె లేఁచి యాతని పాదములను గట్టిగాఁబట్టుకొనియెను. తన భర్తయేదో యొక గొప్ప సంకటము నుండి విడువఁబడి తనకు లభించినట్లామెకుఁ దోఁచెను. వేంకటరత్నమామెను లేవనెత్తఁగా శుద్ధాంతఃకరణులగు నాదంపతులు మిగతా రాత్రిని సుఖనిద్రలోఁ గడిపిరి.

రెండవ దినము నరక చతుర్దశి యగుటవలన నాకుటుంబీకులు తెల్లవారు జాముననే లేవవలసినవారలైరి. అప్పుడు విజయలక్ష్మి రుక్మిణిచేత భర్తకును గుమారునకును మంగళహారతులిప్పించి మంగళస్నానము చేయించెను. ఇంతలోఁ దెల్లవారినందున వేంకటరత్నము భార్యప్రేమతో తనచేతనుంచిన బెల్లపు ముక్కను దిని దుస్తులను ధరించుకొని మొదట కృష్ణమూర్తిగారింటి కరిగెను. అచటకిఁబోయిన వెంటనే వేంకటరత్నము నోటునాతని ముందరవేసి మీయాలోచనకు నేను సమ్మతింపను దయచేయుఁడని తన పనికిఁనాతను బోవుచుండెను. గాని కృష్ణమూర్తి యాతనినిఁ బోవనియ్యక కూర్చుండఁబెట్టి నేను లోపలినుండి వచ్చు వఱకిచటనే యుండుమని చెప్పియతఁడు లోపలికిఁబోయెను. ఆయన యట్లు చేయుటకు హేతువేమో తెలియక వేంకటరత్నము విచారించుచుండెను. ఇదియునుగాక తొలిదినము వేంకటరత్న మిందులోఁ బ్రవేశించనని చెప్పునప్పటివలె కృష్ణమూర్తి నిరుత్సాహుఁడుగాక ప్రస్తుత మధిక హర్షమునుబొందినటులఁ గానుపించెను. దీనినన్నిటిగూర్చి విచారింపుచు వేంకటరత్న మాగుమాస్తారాఁక కెదురు చూచుచుండు నంతలోఁ దనయజమానుఁడగు వేంకటసెట్టియుఁ కృష్ణమూర్తియుఁ దన దగ్గిరకు వచ్చుచున్నటులాతనికిఁ గనుపించెను. వెంటనే యాజమానునకు నెదురుపోవుటకాతఁడు లేవఁగా నింతలో సెట్టిగారే యాయనను సమీపించి వేంకటరత్నమా శబాసని వీపుతట్టెను. అందుపై సెట్టి వేంకట రత్నమును గని నీవు మిక్కిలి తెలివికలవాఁడవు, పాటువడు స్వభావముగల వాఁడవని

తెలిసికొని యట్లేనీవు సత్యప్రవర్తకుండవవుదువోకావో పరీక్షింపనెంచి నేనీకృష్ణమూర్తి గారికిఁ జెప్పి యిటులఁజేయించితిని. నీవు నాపన్నిన పరీక్షలో నుండియు దుర్ఘటమగు దరిద్రమునుండియుఁ దేరితివి. నిన్ననీమనసొకింత మెత్తనయినటులఁ గానుపించెను, గాని నీదోషముకాదు, నీదరిద్రదేవత దోషమేయగును. చెడుకార్యమె న్నఁడును జేయని వానికంటెను జెడు కార్యము వైపుల కొకింత మనసు తిరిగి వివేకయైనవాఁడే యుత్తముఁడు మొదటి వానిచేత తప్పిదము జరుగును, గాని రెండవ వానిచేత బొత్తిగా తప్పిదమగుటయే సంభవింపదు. నిన్ననీకిచ్చిన నూఱురూపాయలును నీవే వానిని నీయుదాత్త గుణములవలనఁ బడిసితివి. రెండవది నిన్ను నేఁటి నుండియు నిరువది రూపాయిల వేతనమునిచ్చి కృష్ణమూర్తిగారికి సహాయునిగా నుంచెదను. ఇదియంతయు విని వేంకటరత్నమూరకుండజాలఁడయ్యెను. ఆయనకుఁ దనస్తుతి వినుటకు నిష్టములేక తొలిరాత్రి జరిగిన దంతయునచట సవిస్తరముగా వినిపించెను. దానినివిని వేంకటసెట్టి పరమానందభరితుఁడయ్యెను. ఆయన వెంటనే తన భార్యకుఁ జెప్పి విజయలక్ష్మిని బిలిపించి అమ్మా! నీవు నిజముగా విజయలక్ష్మివే. ఇట్టినీవు నాధర్మకన్యకవని మన్నించెను.

నాఁటి నుండి నిజముగా వేంకటసెట్టి విజయలక్ష్మిని స్వకన్యకగా భావింపుచుండెను. వేంకటరత్నమామె నొక దేవతనుగానెంచి ప్రేమింపుచుండెను. ఆదంపతులట్లు తమ ధైర్యము చేతవడిసిన సంపద నధికానందముగా ననుభవింపుచున్నవారు.

✡

హిందీ కత
1906

# కుంభమేలాలో చిన్నకోడలు
## కుంభ్‌మేలామే ఛోటీబహూ

**బంగ మహిళ**

ఈ కథ 'సరస్వతి' అనే ప్రసిద్ధ హిందీ సాహిత్య మాసపత్రికలో 1906లో వచ్చింది. ఈ కథలోని శిల్పం, వస్తువు అన్నీ హిందీ సాహిత్యంలో ఆ కాలాన్ని అతిక్రమించినవిగా ఉన్నాయని విమర్శకుల అభిప్రాయం. హిందీ కథా సాహిత్యంలో ఇరవయ్యవ శతాబ్దపు మొదటి దశకంలో వచ్చిన ఏ కథ కూడా ఈ కథలాగా సామాజిక యథార్థాన్ని ప్రతిబింబించ లేదు. ఇందులో రచయిత్రి బంగమహిళ నివసించిన 'పదరా' అనే ఊరి వాతావరణం, మిర్జాపురీ మాండలికంలోని సహజత, ప్రాంతీయ సామెతల, నానుడుల చమత్కారాలు, సంప్రదాయవాదుల నిరర్థకమైన నమ్మకాల ప్రతిఘటన, ధార్మిక అంధత్వాన్ని నివారించాలనే తపన, వీటన్నింటి ప్రభావాన్ని మానవీయ కరుణతో జోడించే కళ, ఇవన్నీ ఆకాలం నాటి కథల్లో ఎక్కడా కనిపించవు.

ఇరవయ్యవ శతాబ్దపు మొదటి దశకంలోని హిందీ కథారచయితల్లో బంగమహిళ ఒక్కరే ఇతరుల రచనల్లోంచి పూర్తిగా కానీ, అంశికంగా గానీ ఏమీ దొంగిలించలేదని, ఛాయానువాదం చేసిన రచనల విషయంలో కూడా ఆమె మూల రచయితల పేర్లు ఇచ్చిందని, మూల రచయితలు ఆ రచనలకు పెట్టిన పేర్లలో రవంత కూడా మార్పు చేయలేదని విమర్శకుల అభిప్రాయం. హిందీ సాహిత్య చరిత్ర రాసేవారికి ఆమె ఎంతో ప్రామాణికమైన సమాచారం అందించింది. బంగమహిళ అనే కలంపేరుతో రచనలు చేసిన రాజేంద్ర బాలా ఘోష్ గారు డజను వరకూ కతలను రాసినారు. వీరి గురించి ఇంతకుమించి ఏ సమాచారమూ దొరకడం లేదు. వారి ఫోటో కూడా దొరకడం లేదు.

మిర్జాపుర్ సమీపంలో పండేరా అనే ఊళ్ళో రామనారాయణ మిశ్ర అనే గృహస్థు ఉండేవాడు. చలికాలం. ఉదయం ఇంటి యజమానురాలు యింటి ముంగిట కూర్చొని ఎండ కాచుకుంటూంది. ఇంటి పనిమనిషి ఆవుకు మేత వేసే పనిలో ఉంది. యజమానురాలి దగ్గరే ఆమె ఇద్దరు మనవరాళ్ళు, ఒక మనవడు ఆడుకుంటూ ఉన్నారు.

యజమానురాలు ఒక వైపు న్యాయాధిపతి అయి మధ్యమధ్యలో వాళ్ళ తగాదాలు తీరుస్తూ మరో వైపు మాటిమాటికీ పెద్ద కోడలును తొందరగా వంట చేయమని పురమాయిస్తూ కూడా ఉంది.

వంటింట్లో పెద్దకోడలు వంట చేస్తూంది. చిన్నకోడలు ఒక పళ్ళెంలో పోసుకొని బియ్యం ఏరుతూంది. పెద్ద కోడలు, చిన్నకోడలు, యిద్దరూ పిచ్చాపాటి మాట్లాడు కుంటూ ఉన్నారు. చిన్నకోడలు అంది, “అక్కా, ఈ సారి కుంభమేలా చాలా పెద్ద ఎత్తున జరుగుతూందని అంటున్నారు. మనం కూడా వెళ్ళి స్నానం చేసి వస్తాం పద. ఈసారి తప్పితే మళ్ళీ పన్నెండేళ్ళ తర్వాతనే ఈ మేలా జరగబోయేది. అప్పటికి రాజెవరో రౌతెవరో తెలియదు. ఒకవేళ ఈలోగా నేను చచ్చేపోతే ఇంకేముంది? అంతా ముగిసిపోతుంది. మనసులో కోరిక మనసులోనే ఉండిపోతుంది.”

పెద్దకోడలు గట్టిగా నిట్టూర్చి ఇలా అంది, “అయ్యో, ఇది ఎప్పటికైనా అయ్యే పనేనా? మనల్ను ఎవరు తీసుకెళ్తారు? అక్కడ లక్షల మంది చేరతారని విన్నాను. అలాంటప్పుడు మనం అక్కడికి వెళ్ళి రావడమెంత కష్టమో ఆలోచించావా?”

“అరే, నీవే మనసు విరిగే మాట మాట్లాడితే ఇక వాళ్లతో ఏం చెప్పగలం? మనం వెళ్ళాలనుకున్నది ఒక తీర్థయాత్రకు. నీవు గట్టిగా చెప్తే బావగారు తీసుకెళ్ళరా? నా మనసు మాత్రం తప్పక తీసుకెళ్తారనే చెబుతూంది. ఎందుకంటే పిలవందే ఎట్లా వెళ్ళాలి? అని ఆలోచించడానికి చుట్టాలింటికేమీ వెళ్ళడం లేదు కదా! ఇక అక్కడికి చేరే గుంపుల గురించి అంటావా? నీవు చెప్పింది నిజమే. కానీ గుంపులు తీర్థ స్థానంలో ఉండక మరెక్కడుంటారు? కాశిలో విశ్వేశ్వరాలయం దగ్గర అన్నపూర్ణగుడి దగ్గర తక్కువ గుంపులు ఉంటాయంటావా? అయినా దర్శనం చేసుకోడానికి మనమక్కడికి వెళ్ళడం లేదా? అదంతా వదలిపెట్టు. గ్రహణం పట్టినప్పుడు కూడా కోట్ల మంది గుంపు ఉంటుంది కదా. అయినా మనం ఎలా స్నానం చేసి వస్తున్నాం?”

తర్కశక్తితో కూడిన చిన్నకోడలి ఇలాంటి మాటలు విని పాపం, పెద్దకోడలు ఓడిపోయి ఇలా అంది, "సరేలే తల్లీ, నీవు మా మరిదికి అన్నీ చెప్పి ఒప్పించు. అంతా సరిపోతుంది. బయలుదేరేటప్పుడు నన్ను కూడా వెంట తీసుకుపో. ఇక నేను పప్పుకు తిరుగమాత పెట్టాలి. అయ్యో, నీతో మాటల్లో పడి పప్పులో ఉప్పు వేశానో లేదో మరిచే పోయాను." ఇంతలో పనిమనిషి ఒక గంపనిండా పేడ తీసుకొచ్చి అక్కడే నిలబడి ఇలా అడిగింది, "ఏమ్మా, అక్కాచెల్లెళ్ళు ఏం సంప్రదింపులు జరుపుతు న్నారు? ప్రయాగకెళ్ళి స్నానం చేసిరావాలని అనుకుంటున్నారా? అమ్మామ్మా, నేనూ వస్తాను. నన్ను కూడా తీసుకుపొండమ్మా..."

అందుకు కోపగించుకొని చిన్నకోడలు ఇలా అంది, "చచ్చిందానా, ఎందుకే అంత గట్టిగా అరుస్తావు? నీ గొంతు ఎవరైనా పిసుకుతున్నారా ఏం?"

పనిమనిషి గొంతు కొంచెం తగ్గించి బ్రతిమాలుతూ అంది, "అమ్మామ్మా, ఇక అరవనులే, పోయేట్లయితే నన్ను కూడా తీసుకుపోండమ్మా..."

పెద్దకోడలు అంది, "నీవెక్కడి పిచ్చిదానివే మొద్దూ! ఆలూ లేదు, చూలూ లేదు, కొడుకు పేరు సోమలింగం అన్నట్లుంది కథ. ఇక్కడ ఎవరు వెళ్తున్నారని? వెళ్ళినప్పుడు చూద్దం లే. పేడబుట్ట చంకనెత్తుకొని ఇంకా నిల్చొనే ఉన్నావేం. నుగ్గులు చేయడానికి పోకుండా? పో, పో."

పనిమనిషి అక్కడి నుంచి ఎలాగో సాగి పోయింది. కానీ చిన్నకోడలు మనసులో మాత్రం సముద్రంలో పెద్ద అలలు లేచినట్లు అల్లకల్లోలంగా ఉంది. నిన్నటి రోజు ఆమె తన మేనత్త ఇంటికి వెళ్ళి ఉండింది. అక్కడ ఆమె మేనత్త కుటుంబమంతా, వాళ్ల ఇరుగుపొరుగువాళ్ళంతా కూడా కుంభమేలాకు వెళ్తున్నట్లు వినింది. ఇంకే ముంది? చిన్నకోడలుకు ఇక శాంతి ఎక్కడిది? మనసులో ఉబలాటం విపరీతంగా పెరిగిపోయింది. తనూ అక్కడికి వెళ్ళడానికి ఎన్నో ఉపాయాలు ఆలోచించడం మొదలు పెట్టింది, 'అయ్యో, నేనక్కడికి ఎలా వెళ్ళాలి?' అని. ఒక వైపు మంచి మాటలతో ఇంటివాళ్ళను ఒప్పించడానికి ఉపాయాలు ఆలోచించింది. మరో వైపు ఎవరైనా అడ్డం పడతారేమోనని దిగులు పడిపోయింది. ఎవరైనా వద్దంటే మాత్రం చాలా కష్టమైపోతుంది. అలా జరిగితే, కోటి ప్రయత్నాలు చేసినా, మరో పన్నెండు సంవత్సరాల దాకా కుంభమేలా రాదు. ఆమెను లోలోపలే తినేస్తున్న అన్నింటికంటే ఎక్కువ బాధ కలిగించే విషయమేమిటంటే, మేనత్త కూతురు, వదినె, ఇద్దరూ మేలా నుంచి తిరిగి వచ్చి అక్కడి వింతలు విశేషాలూ చెప్పినప్పుడు తను వాళ్ళ ముఖాలు చూసుకుంటూ ఉండాలే అని.

✡

ఇక అమావాస్య రావడానికి మూడు నాలుగు రోజులే ఉన్నాయి. చిన్నకోడలుకు కుంభమేలాకు వెళ్ళి స్నానం చేసిరావాలనే ధ్యాస తప్ప వేరే ధ్యాస లేకుండానే పోయింది. ఒడిలో ఒక సంవత్సరం వయసు పిల్లవాడున్నాడు. పాపం, ఆ పిల్లవాడికిప్పుడు సకాలంలో పాలు కూడా దొరకడం లేదు. ఇక వాడి స్నానపానాల గురించి, సంరక్షణ గురించి చెప్పేదేముంది? ఆరోజు పిల్లవాడి తలకు నూనె, వగైరా పెట్టనే లేదు. కానీ, గబగబా నూనె గిన్నె తీసుకొని అత్త దగ్గరికి వెళ్ళి ఇలా అంది, "అత్తా, ఈ సంవత్సరం నీ కాళ్ళు చాలా ఎక్కువగా పగిలి పోయి ఉన్నాయి. ఇక్కడ కూర్చో, నూనె, మందు రాస్తాను." విని అత్త అనే దేవత తడబడి మనసులో ఇలా అనుకుంది, "అరే, ఈరోజు కోడలుకు ఇంత భక్తి ఎక్కడి నుంచి పుట్టుకొచ్చింది? ఈరోజు సూర్యుడు పడమర నుంచి ఉదయించ లేదు కదా! ఇన్ని రోజులూ, పిలిచినా వచ్చేది కాదు. ఏదో సాకు చెప్పి వెళ్ళి పోతూ ఉండేది. ఈరోజు ఏమైంది? ఏమైతే ఏముందిలే, మంచిదే కదా! ఇలాంటి అవకాశాన్ని వృథా కానివ్వకూడదు." అలా అనుకొని ఆమె ఇలా అంది, "నిజమేనమ్మా. కానీ మీకు ఎప్పుడైనా తీరిక ఉంటే కదా! సరే రా" అని ఆమె కాళ్ళు బారచాపుకొని కూర్చుంది.

చిన్నకోడలు మెల్లమెల్లగా ఆమె కాళ్ళకు నూనె రాయడం మొదలు పెట్టింది. ఇంతలో ఆమె కుమారుడు ఏడ్వడం మొదలు పెట్టాడు. అత్త చాలాసార్లు చెప్పింది. "ఇక చాల్లే వెళ్ళు, ముందు బాబును సముదాయించు. తర్వాత ఈ పని చేయవచ్చు." కానీ చిన్న కోడలు ఆమె మాట వినిపించుకోలేదు. ఆమె కాళ్ళు పిసుకుతూనే ఉండిపోయింది. తర్వాత ఆమాటా, ఈమాటా మాట్లాడుతూ, ఆమె ఇలా అడిగింది "ఏమత్తా, నీవెప్పుడైనా కుంభమేలా సమయంలో స్నానం చేయడానికి వెళ్ళావా లేదా?"

"లేదమ్మా, స్నానం లేదు పానం లేదు. మీ మామకు ఇలాంటివి నచ్చనే నచ్చవు. మనసు నిర్మలంగా ఉంటే అన్ని తీర్థస్నానాలూ చేసినట్టే అని అంటాడు. ఎప్పుడూ ఇంట్లో కూర్చొని రామనామం జపిస్తుండాలి అంతే. ఒకసారి అతి కష్టం మీద మా వదినెతో పాటు ప్రయాగకు వెళ్ళాను. అయితే మేలా సమయంలో కాదు."

"పోనీ, ఈసారి వెళ్ళి స్నానం చేసి రారాదూ? పోతూ మమ్ములను కూడా వెంట తీసుకొని పో"

"అయ్యో తల్లీ మనలనెవ్వరు తీసుకెళ్తారే? మీ మామకు ఆయాసం వస్తుంది. ఈ చలిలో ఆయన బయలుదేరడం జరిగే పనికాదు. హరనారాయణ (పెద్దకొడుకు) ఇంట్లో లేనే లేడు. ఉండినా వాడికి సెలవు ఎక్కడ దొరుకుతుంది? ఇక శివనారాయణ (చిన్న కొడుకు) అంటావా? వాడు ఇంగ్లీషు చదువుకొని పూర్తిగా క్రిస్టియనే అయిపోయాడు. రాత్రింబవళ్ళు దేవతలను, పితరులను పొయ్యిలోనో, కుంపట్లోనో పారేస్తుంటాడు"

ఇంతలో రామనారాయణ మిశ్రాగారు మనవరాలు చెయ్యి పట్టుకొని అక్కడికి వచ్చారు. కోడలు అత్తకు సేవ చేస్తూండడం చూసి నవ్వుతూ ఇలా అన్నారు. "అహో, నీకింతగా సేవ చేయడం జరుగుతూంది, అయినా నీవేమో నా మంచిచెడ్డలు పట్టించు కొనే వాళ్ళెవరూ లేరని అంగలార్చుతూ ఉంటావు."

అందుకు ఆయన భార్య ఇలా అంది. "అదేం కాదులే. విన్నావా? చిన్నకోడలు ప్రయాగ వెళ్తే బాగుంటుందని అంటూంది"

"ప్రయాగా! కుంభమేలా లోనా!! రామ రామ!!! మనలాంటి ఇళ్ళలోని ఆడవాళ్ళకు సాధ్యమయ్యే పని కాదది"

మామగారు అలా అనడం విని చిన్నకోడలు మనసులో చాలా నొచ్చుకుంది. త్వరత్వరగా పని ముగించుకొని తన గదిలోకి దూరిపోయింది. అక్కడ భర్తగారితో ఏమేమి మాట్లాడిందో అది నాకు తెలియదు. కానీ ఆమె సహవాసకత్తెల ద్వారా తెలిసిందేమిటంటే, విసుక్కున్న శివనారాయణ చివరకు "కుంభమేలా, కుంభమేలా అంటూ నా తల తినేస్తున్నావు, కుంభకర్ణుని ప్రేతాత్మ నీ తలపైకి ఎలా వచ్చి కూర్చుందో నాకు తెలియకుండా ఉంది. అంతగా వెళ్ళాలనుకుంటే మీ అన్నతో పాటు వెళ్ళిపో. నా ప్రాణం తీయొద్దు. సరేపో, అక్కడ ఆ చలిలో పిల్లవాణ్ణి చంపేయాలని ఉంటే చంపేయ్" అని అన్నాడని.

"మునుపు పోయిన పిల్లవాడు మీ ఇంట్లోనే పోయాడు కదా, అప్పుడు నేను వాణ్ణి ఎక్కడికైనా తీసుకెళ్ళానా? చావు అనేది వస్తే దాన్ని ఎవరూ ఆపలేరనేది సత్యం"

చివరకు చిన్నకోడలు మేనత్త, ఆమె కుమారుడు ఇద్దరూ ఎంతగానో బ్రతిమలాడిన తర్వాత అతి కష్టం మీద ఇంట్లో వాళ్ళు చిన్నకోడలును వాళ్ళతో పాటు ప్రయాగకు పంపడానికి సమ్మతించారు. ఇక చిన్నకోడలు సంతోషానికి అవధులు లేవు. హడావుడిగా కొంచెం వంట చేసి, సామాను సర్దుకొని, మూటాముల్లె సర్దుకొని బయలుదేరడానికి సిద్ధమైంది. ఆమె మేనత్త కుమారుడు శంకరదయాల్ ఆమెను తీసుకొని పోవడానికి వచ్చాడు. చిన్నకోడలు ఇంట్లో అందరి దగ్గరా వీడ్కోలు తీసుకుంటున్న సమయంలో పెద్దకోడలు ఇలా అంది, "చూశావా, నీవేమో పుణ్యం సంపాదించుకు నేందుకు వెళ్తున్నావు, మేమేమో ఎక్కడివాళ్ళమక్కడే పడి ఉండిపోయాం. వెళ్ళిరా, క్షేమంగా వెళ్ళిరా."

అత్తగారు లల్లూ (చిన్నకోడలి కుమారుడు)ను చంకకెత్తుకొని ముద్దాడుతూంది. ఆమె చిన్నకుమారుడు శివనారాయణ కోసం అందరూ వెదికారు. కానీ అతడెక్కడా కనిపించ లేదు. అప్పుడామె శంకరదయాల్‌తో ఇలా అంది, "చూడు నాయనా,

నీపైన నమ్మకం ఉండబట్టి కోడలిని పోనిస్తున్నా. ఈ పిల్లవాణ్ణి జాగ్రత్తగా చూసుకొనే బాధ్యత నీపైనే ఉంది... నా లల్లూకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదు.”

“ఏమీ పరవాలేదమ్మా, మీరు నిశ్చింతగా ఉండండి. దేన్నీ గురించీ ఏమీ చింత పెట్టుకోకండి. అందరినీ చాలా జాగ్రత్తగా తీసుకెళ్తాను. మా ఇంట్లో వాళ్ళు కూడా అందరూ వెళ్తున్నారు కదా! దేవుని దయవల్ల, మీ ఆశీర్వాదం వల్ల మేమందరం క్షేమంగా తిరిగివస్తాం.”

చిన్నకోడలు వెళ్ళి జట్కా బండిలో కూర్చుంది. ఆమె అత్తగారు మనవణ్ణి ముద్దాడి వాణ్ణి కోడలి ఒడిలో కూర్చోపెడుతూంటే ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

కరుణార్ద్ర స్వరంతో ఆమె ఇలా అంది. “ఏరోజైతే లల్లూ పుట్టాడో, ఆరోజు నుంచి ఎప్పుడూ నా దగ్గరే ఉంటూ వచ్చాడు. ఈరోజు మొదటి రోజు, వాడు నా ఎదుటి నుంచి దూరంగా వెళ్ళిపోవడం. చూడు శంకర్, జాగ్రతగా ఉండాలి మరి!” చిన్నకోడలు వెళ్ళిపోయింది. కానీ పాపం పనిమనిషి అదంతా చూస్తూనే ఉండి పోయింది. చిన్నకోడలు ఆ రాత్రి మేనత్త ఇంట్లోనే ఉండిపోయింది. మరుసటి రోజు అందరూ బయలుదేరి వెళ్ళిపోయారు.

✡

మిర్జాపూర్ రైల్వేస్టేషన్ వెయిటింగు రూములోను, ప్లాటుఫార్మ్ పైనా, చాలా రద్దీగా ఉంది. ఎటు చూసినా మానవ శిరస్సులే కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా మూటలు, ముల్లెలు, సామాన్లు, గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. సమయానికి రైలు తన విశాలకాయంతో వచ్చి నిలబడింది. శంకరదయాల్ చాలా జాగ్రత్తగా అందరినీ తీసుకెళ్ళి రైల్లో కూర్చోపెట్టాడు. వాళ్లతోపాటు భోజన ప్రియుడైన ఒక బ్రాహ్మణదేవుడు కూడా ఉన్నాడు. యాత్రలో వారికి సహాయంగా ఉండడానికి ఆయన మూటాముల్లె తట్టాబుట్టా అన్నీ మోసుకెళ్ళి బండిలో పెట్టేశాడు. రైలు బయలుదేరడానికి ఇంకా కొంచెం సమయం ఉంది. శంకరదయాల్ లల్లూను ఎత్తుకొని ప్లాట్‌ఫార్మ్‌పైన నిల్చొని ఉన్నాడు.

ఇంతలోనే ఊడిపడ్డ శివనారాయణ అన్నాడు. “లల్లూ నీతోపాటు వచ్చినప్పుడు నేనింట్లో లేను. వచ్చింతర్వాత తెలిసింది మీరందరూ వచ్చేశారని. లల్లూను చూడాలని పించి ఉదయం లేవగానే వాణ్ణి చూడడానికి స్టేషనుకు వచ్చేశాను.”

తండ్రిని చూసి లల్లూ గంతులేశాడు. సంతోషం పట్టలేక తండ్రి మెడకు కరుచు కున్నాడు. ఇంతలో మొదటి గంట మ్రోగింది. శివనారాయణ శంకరదయాల్ వైపు (చిన్నకోడలు వైపు) చూస్తూ ఇలా అన్నాడు. “మీరందరూ వసతిగా కూర్చున్నారు

కదా? ఇక అందరికీ నా నమస్కారం. లల్లూ, ఇక నీవు మీ మామ దగ్గరికి వెళ్ళిపో." లల్లూ తండ్రిని ఎందుకు వదిలి పెడతాడు? వాడు పెద్దగా ఏడ్వడం మొదలు పెట్టాడు. శంకరదయాల్ నవ్వుతూ శివనారాయణతో అన్నాడు. "ఇంత గాభరా గాభరాగా నీవిక్కడికి రావడం చూసి ఎవరో హంతకుణ్ణి అరెస్ట్ చేయడానికి వస్తున్నావేమో అని అనుకున్నాను. చివరకు నీవు ఇక్కడ మాకు ఇదిగో వీడితో తంటా తెచ్చి పెట్టావు. రా నాయనా లల్లూ నా దగ్గరికి రా. ఈయన్ను పోనీ, నేను నీకు మిఠాయి ఇస్తాను."

తండ్రి – కొడుకులు ఒకరి వైపొకరు ప్రేమగా చూసుకుంటూ ఉండగానే రైలు రాక్షసికూత పెట్టింది. ఇంతలో వెంట వచ్చిన బ్రాహ్మణదేవుడు వేగిరపాటుతో శివనారాయణతో ఇలా అన్నాడు. "అన్నన్నా, తొందరలో నేను శంకరదయాల్ ఇంట్లో పూజాసామగ్రి, ఒక గిన్నెలో ఇంత మిఠాయీ, కొంచెం పెరుగు మరిచిపోయి వచ్చాను. పోయి అది మా అమ్మకు ఊరికి తప్పక పంపించు. లేకుంటే చెడిపోతుంది."

అగ్గి తింటూ, నీళ్ళు తాగుతూ, పొగ ఎగజిమ్ముతూ, రైలు దడబడ శబ్దం చేస్తూ పరిగెత్తింది, ప్రపంచపు అనిత్యతకు సజీవ నిదర్శనం చూపించిపోతున్నట్టుగా. ఎక్కడైతే కొంచెంసేపు ముందు అంత కోలాహలం వ్యాపించి ఉండిందో, అంత సందడి ఉండిందో, అక్కడ ఇప్పుడు పూర్తి నిశ్శబ్దం రాజ్యమేలింది. ఇక చిన్నకోడలు విశ్రాంతిగా కూర్చొని తన అక్క రామదేవితో ఇలా అంది. "రైల్లో చాలా రద్దీగా ఉంటుంది, కూర్చోడానికి కూడా మీకు చాలా కష్టపడితే గాని చోటు చిక్కదు అని అందరూ భయపెట్టేవాళ్ళు. అదంతా వట్టిదేనన్న మాట. అందరికీ ఇదొక సాకు మాత్రమే నన్ను పోకుండా ఆపడానికి. మా అత్త మహాతల్లి చూడడానికి అమాయకంగా కనిపిస్తుంది. కానీ చాలా మాయలమారిది. చెడుబుద్ధి ఆమె నరనరంలో ఉంది. ఆమె జీవితమంతా బీగాలు, బీగంచెవులూ జాగ్రత్త చేయడంలోను, మా పెద్ద తోడుకోడలు జీవితం వంటా వార్పు చూసుకోవడంలోనూ గడిచిపోతుంది. వీళ్ళు పుణ్యక్షేత్రాలకు వెళ్ళరు, దానం, ధర్మం, పూజా పునస్కారాలు తాము చేయరు, వేరే వాళ్ళను చేయనివ్వరు. వాళ్ళకు ఇదంతా నచ్చనే నచ్చదు!"

✡

ఈ రోజు అమావాస్య. ప్రయాగలో త్రివేణి ఒడ్డున ఈరోజొక అపూర్వమైన దృశ్యం కనిపిస్తూంది. మర్యాద పురుషోత్తముడు రాముడు వనవాసానికి బయలు దేరినప్పుడు మొట్టమొదటగా ఇక్కడే బస చేసిన మాట నిజమైతే, అందువల్లనే కదా ఈ స్థలం మహిమ ఇంత గొప్పగా చెప్పబడుతూంది? అందువల్లనే కదా, ఈ ప్రయాగ హిందువులుగా పుట్టినవారి పవిత్రమైన నోళ్ళద్వారా 'తీర్థరాజు' అని పిలువ బడు తూంది? హిందూ ప్రజలారా! మీరు నిజంగా ధన్యులు! మీ ఈ దృఢమైన మత

విశ్వాసం ధన్యమైంది! ఏ వేళలో అయితే ఇతర మతావలంబులకు రజాయిలో నుంచి ముఖం బయట పెట్టడం కూడా కష్టమనిపిస్తుందో, ఆ వేళ నుంచి సూర్యాస్తమయం దాకా మంచుకంటే కూడా చల్లని నీళ్ళల్లో ఆబాలవృద్ధులు, స్త్రీలు అందరూ సంతోషంతో ఆనందంగా మునకలు వేస్తూ ఉంటారు. హిందూ జాతి ధన్యమైంది! హిందూ సంప్రదాయం ధన్యమైంది! ఓ హిందూధర్మమా, నీ పవిత్ర చరణాల్లో క్షుద్రురాలైన ఈ రచయిత్రి ఒకసారి కాదు, నూరుసార్లు కాదు, వెయ్యిసార్లు కాదు, కోటిసార్లు ఆదరపూర్వకంగా ప్రణమిల్లుతూంది. హిందూ సోదరులారా! మీ దగ్గర ఇక వేరే బలం ఏదీ లేదు. కేవలం ధర్మబలం మాత్రమే ఉంది. భగవంతుడు మీ ఈ ధర్మబలాన్ని చెక్కు చెదరకుండా ఉంచుగాక! ఈ దాసి మనసారా కోరుకునేది అదే.

ఇక త్రివేణి ఒడ్డున ఉన్న ఇసుక కూడా సజీవ రూపం పొందినట్లుంది. దరిద్ర భారతవాసులు పాపం, ఎంత ఆనందంగా త్రివేణిలో స్నానం చేసి అక్షయమైన పుణ్యం మూటకట్టుకుంటున్నారు? కొందరి దగ్గర ఒళ్ళు దాచుకోడానికి ఒక బట్ట ఉంటే, కొందరి దగ్గర అది కూడా లేదు. కొందరి దగ్గర కడుపు నిండా తినడానికి ఉంటే, కొందరి దగ్గర అది కూడా లేదు. అయినా, ఇప్పుడు ఈ పవిత్ర భూమిలో అందరూ సమభావంతో ఆనందం అనుభవిస్తున్నారు.

అసంఖ్యాకమైన ఈ మానవ సందోహంలోనే మునుపు మనకు పరిచయమైన చిన్నకోడలు కూడా కనిపించింది. ఆనకట్ట క్రింద, రద్దీ కొంచెం తక్కువగా ఉన్న చోట అన్న, వదినె, ఆడపడచు, మేనత్తతో సహా లల్లూను ఎత్తుకొని ఆమె నిలబడి ఉంది. ఆమె శంకరదయాల్‌తో ఇలా అంది. “అన్నా, ఈ రోజు లల్లూ ఇంత వరకు ఏమీ తినలేదు. వీనికోసం ఏదో ఒకటి తీసుకురా”. శంకరదయాల్ “సరే, ఉండు ఇప్పుడే తెస్తాను” అంటూ వెళ్ళిపోయాడు.

ఇంతలో విశాలకాయం కలిగిన ఒక ఏనుగుకు ఎందుకోగాని పిచ్చి రేగింది. దానికి పిచ్చి రేగడంతోటే, మేలా అంతటా కలకలం వ్యాపించింది. శంకరదయాల్ లల్లూను ఎత్తుకొని చేతనైనంత వరకు అందరినీ సురక్షితంగా ఉంచడానికి ప్రయత్నించ సాగాడు. గుంపులో నుంచి వచ్చిన ఒక తోపుతో శంకరదయాల్ అమ్మ బోర్లా పడి పోవడంతో ఆమె మోకాలికి పెద్ద దెబ్బ తగిలింది. శంకరదయాల్ లల్లూను చిన్నకోడలి చేతికిచ్చి తాను అమ్మకు పరిచర్యలు చేయడం మొదలు పెట్టాడు.

ఇంతలో సాధువులు అఖాడాస్నానం చేసి వెళ్ళిపోవడంతో సామాన్య ప్రజలు స్నానం చేయడానికి పోలీసులు దారి (ఇంతవరకు మూసి ఉండిన దారిని) తెరిచేశారు. ఇంకేముంది? జన సందోహమనే మహాసముద్రంలో తుఫాను చెలరేగినట్లైంది. అందరి మనసుల్లో అందరి కంటే ముందు మేమే గంగలో మునిగి పుణ్యరాసులు కొల్లగొట్టాలనే

కోరిక తరంగంలా ఉవ్వెత్తున లేచింది. తుఫాను చెలరేగినట్లు ఒకరి మీద ఒకరు పడసాగారు. ఆ తోపులాటలో చిన్నకోడలు తన తోటివారికి దూరమై పోయింది. గుంపులో చిక్కుకుపోయిన ఆమె ఒకసారి పది అడుగులు ముందుకు వెళ్ళిపోతే, మరోసారి పది అడుగులు వెనక్కు వెళ్ళిపోయింది. పాపం ఇప్పుడామె పరిస్థితి చాలా దయనీయంగా తయారయింది. ఇంతలో ఒక పెద్ద తోపుడు రావడంతో లల్లూ ఆమె చేతుల్లో నుంచి విడివడి దూరంగా పడిపోయాడు. చిన్నకోడలు గట్టిగా ఏడ్వడం మొదలుపెట్టింది. పిల్లవాణ్ణి ఎత్తి పక్కనపెట్టమని దీనంగా అందరినీ ప్రార్థించడం మొదలుపెట్టింది. మాటిమాటికీ ద్రౌపదిలాగా "అన్నా అన్నా" అంటూ వేడుకోవడం మొదలుపెట్టింది. కానీ నగారాలు మ్రోగుతున్న చోట పిచ్చుక ఆక్రందనలు ఎవరు వింటారు. ఆ అసహాయురాలు, ఆ దీనురాలు, ఆ అబల మొర ఎవరూ ఆలకించనప్పుడు ఇక ఆమే స్వయంగా పిల్లవాణ్ణి ఎత్తుకోవడానికి వంగింది. వంగడంలో బోర్లా పడిపోయింది. అలా మనుషుల మధ్య క్రింద పడిపోయి కొద్దిగా తల ఎత్తడం కూడా పెద్ద పెద్ద పరాక్రమవంతులైన పురుషులకు కూడా సాధ్యం కాదు. అలాంటప్పుడు పాపం, ఆ అసహాయురాలు ఏం చేయగలుగుతుంది? బాధాకరమైన, కరుణోత్పాదకమైన ఆ దృశ్యాన్ని వర్ణించడం నా కలానికి శక్తికి మించిన పని. సహృదయులైన పాఠకులు, పాఠకురాండ్రు తమంత తామే దీన్ని తెలుసుకోగలరు.

ఇటు శంకరదయాల్ చాలా దుస్థితికి గురి అయ్యాడు. స్నానం, సంధ్య అటుంచి, తిండీ తిప్పలు మరిచి దినమంతా అందరినీ వెదకడంలో పడిపోయాడు. మధ్యాహ్నం తర్వాత రామదేవీ, అతని భార్య, ఇద్దరూ ఏడుస్తూ మొత్తుకుంటూ కోట క్రింద కనిపించారు. తల్లి రామదేవీ మెడలోంచి ముత్యాలహారం ఎక్కడ పడిపోయిందో అంతు చిక్కలేదు. అతని భార్య ముక్కుపుడక ముక్కులోంచి మాయమైంది. దాంతో పాటు ముక్కు భాగం కూడా కొంత మాయమైపోయింది. ఆమె శూర్పణఖ ట్రూ కాపీగా మారిందా అనిపించేట్లు తయారయింది. ఒంటిపైని బట్ట రక్తంతో తడిసి పోయింది. అక్కడ గుడిసెలో పడి ఉండిన తల్లి అరిచి అరిచి చెబుతూంది. "నాయనా, ఎలాగో ఒకలాగు అందరము ఒక చోటికి చేరాం, మరి చిన్నకోడలు ఎక్కడుందో ఏమైందో తెలియడం లేదు. మనతో వచ్చిన బ్రాహ్మణ మహాశయుడు మూటలూ, పెట్టెలు దించడంలో, ఎక్కించడంలోనేమో చాలా హుషారు చూపించాడు. ఇప్పుడు మాత్రం కడుపులో పుట్టిన అగ్గిని చల్లార్చుకోడానికి ముఖం చాటు చేసుకుని గప్‌చిప్‌గా ఎక్కడో కూర్చొని ఉన్నట్లున్నాడు. చివరకు అతడు హల్వా పూరీ రాయుడుగానే తేలిపోయాడు కదా!"

ఇక చిన్నకోడలు ఏమయిందో అని శంకరదయాల్ చాలా భయపడిపోయాడు... ఇలా ఆలోచించాడు, "శివనారాయణ, ఆయన ఇంట్లో వాళ్ళు వింటే ఏమను

కుంటారు? అయ్యో, నేనిప్పుడు ఏ ముఖం పెట్టుకొని వాళ్ళ ఎదుటికి పోగలను? వెళ్ళడానికి నాకు ధైర్యం ఎక్కడి నుంచి వస్తుంది? నీవేమో సలక్షణంగా తిరిగి వచ్చావు, మరి మా కోడలిని ఎక్కడ వదలిపెట్టి వచ్చావు అని వాళ్ళు అడగరా? అప్పుడు నేనే మని జవాబు ఇవ్వగలను? మేము ఆమెను పరాయిదాన్నిగా భావించి వేరుపడి పోయినప్పుడు ఆమె కోసం మేము ఎక్కువగా వెదికి ఉండమనే వాళ్ళంతా భావిస్తారు. ఓ దేవుడా! నేనే పాపం చేశానని, నా తలపైన ఇంత పెద్ద కళంకభారం ఉంచబడు తూంది? అయ్యో! ఆడవాళ్ళ మాటలు విని నేనెంతటి దురవస్థ అనుభవించవలసి వచ్చింది? మృత్యువు వచ్చి నన్ను తన ఒడిలోకి తీసుకుంటే ఎంత బాగుండును? నేనిప్పుడు ఎక్కడికెళ్ళాలి? ఎక్కడ వెదకాలి? ఎక్కడా ఆమె జాడ తెలియడం లేదే!" అని ఆలోచించడం ఆరంభించాడు.

ఈ విధంగా బాధాతప్త హృదయంతో పిచ్చివాడిలాగా అతడు ఒక్కో చోటికి పది పదిసార్లు వెళ్ళి వెదికాడు. ఒకసారి త్రివేణి ఒడ్డుకు వెళ్లి వెదికితే, మరోసారి గుడిసెల లోపలికి వెళ్ళి వెదికాడు, ఒకసారి శవాల గుట్టల్లో వెదికితే, మరోసారి పోలీసువాళ్ల దగ్గర వెదికాడు. చివరకు ఒక ముసలావిడ ద్వారా ఆమె జాడ తెలిసింది. ఎక్కువగా గాయపడినందువల్ల పోలీసువాళ్ళు చిన్నకోడలును ఆసుపత్రికి పంపించారని ఆమె చెప్పింది... విన్న వెంటనే శంకరదయాల్ పరుగు పరుగున అక్కడికి వెళ్ళగానే చిన్న కోడలు ఒక మంచం మీద పడుకొని కనిపించింది. ఎవరో రాతితో పొడిచినట్లు ఆమె రొమ్ముపైన లోతైన గాయం అయింది. శంకరదయాల్‌ను చూడగానే ఆమె గాయం తగిలిన రొమ్ము కొట్టుకుంటూ "నా లల్లూ, నా లల్లూ!" అంటూ పెద్దగా ఏడ్వడం మొదలు పెట్టింది.

"అన్నా, అన్నా, నీవు నా లల్లూను తెచ్చి ఇవ్వు. అయ్యో. నా లల్లూ ఇంతదాకా ఏమీ తిని ఉండడు. వెళ్ళు, త్వరగా వెళ్ళి వాణ్ణి తీసుకురా. వానికి నేను తినిపిస్తాను. చీకటి పడుతూంది. లల్లూ రాత్రికి ఎవరి దగ్గర పడుకుంటాడు? నేను ఏ ముఖం పెట్టుకొని ఇంటికి పోను? లల్లూను చేతుల్లోకి తీసుకోడానికి అత్త ఎదురుగా వచ్చినప్పుడు నేనేమని చెప్పాలి? అన్నా, ఇంకోసారి వెళ్ళి వాణ్ణి వెదుకు. ఇక్కడో, అక్కడో, ఎక్కడో ఒక చోట పడిపోయి ఉంటాడు. ఎత్తుకొని రా వెంటనే"

ఓ అభాగ్యురాలైన చిన్నకోడలా! ఇప్పుడు ఈ భూప్రపంచంలో నీ పిల్లవాడి గుర్తు ఒక్కటి కూడా లేదు. వెన్నలాంటి వాడి కోమలమైన శరీరం లక్షల మంది మనషుల కాళ్ళ క్రింద పడి పచ్చడి అయిపోయింది!

శోక సంతప్తురాలైన ఆ తల్లి వేదనను గురించి, హృదయ విదారకమైన ఆమె ఆక్రందనల గురించి రాసే శక్తి నిష్ప్రాణమైన ఈ కలానికి లేదు. ఈ కథ చదువుతున్న పాఠకుల్లో, పాఠకురాండ్రలో ఎవరైనా కరుణోత్పాదకమైన ఈ దృశ్యాన్ని కళ్ళారా

చూసి ఉంటే, వాళ్ళే పుత్రశోకంతో రోదిస్తున్న ఈ తల్లి హృదయంలోని శోకాన్ని కొంతవరకు అర్థం చేసుకోగలుగుతారు.

ఏడ్చి ఏడ్చి చిన్నకోడలుకు రక్తపు వాంతులు కావడం మొదలైంది. కొంచెం సేపు తర్వాత ఆమె మూర్ఛపోయింది. మరుసటి రోజు టెలిగ్రామ్ అందుకొని శివనారాయణ ప్రయాగ చేరాడు. అక్కడ ఈ దారుణమైన సంఘటన గురించి విని మొదట అతడు చాలా ఏడ్చాడు. చిన్నకోడలు కూడా అతన్ని చూడగానే ముఖం చాటుకొని పెద్దగా రోదించింది. కొంచెం సేపటి తర్వాత శివనారాయణ శంకర దయాల్‌తో ఇలా అన్నాడు. "పుణ్యఫలం మనకు క్షణం ఆలస్యం కాకుండా లభించింది. ఇక ఏదో విధంగా ఆమెను ఇంటికి తీసుకుపోయే ఏర్పాటు చేయాలి." చిన్న కోడలు ఏడుస్తూ ఇలా అంది. "నేనిక ఇంటికి రాను. నా లల్లూ దగ్గరికే వెళ్ళిపోతాను"


చిన్నకోడలును చూసినప్పుడు త్వరలోనే భగవంతుడు ఆమెను లల్లూ వద్దకు పంపిస్తాడనే అనిపించింది.



**జె. లక్ష్మిరెడ్డి**
ఫోను: 09818431620
jlreddy123@yahoo.com

కడపజిల్లా జమ్మలమడుగు సొంతవూరు. డిల్లీలో హిందీ ఆచార్యులుగా పనిచేసి విరమణ పొంది గత 50 ఏళ్లుగా అక్కడే కుదురుకొన్నారు. తెలుగునుంచి హిందీలోకి చాలా కథలనూ నవలలనూ అనువదించినారు. హిందీ నుంచి తెలుగులోకి కూడా కొన్ని అనువాదాలను చేసినారు. కేంద్ర సాహిత్య అకాడెమీ వారి అనువాద పురస్కారాన్ని పొందినారు.

**తమిళ కత**
**1908**



# గుంటకట్ట రాగిమాను చెప్పిన కత

## కుళత్తంగరై అరసమరం చొన్న కదై

**వ.వే.సు. అయ్యర్**

వరగనేరి వేంకటేశ సుబ్రమణ్య అయ్యర్, తిరుచిరాపల్లి జిల్లాలోని వరగనేరిలో ఏప్రిల్ 2, 1881న పుట్టినారు. తమిళ సాహితీలోకం వీరిని తమిళ కథానిక పితామహుడిగా పేర్కొనింది. అయ్యరుగారు వారి తల్లినుడి అయిన తమిళంతోపాటు గ్రీకు, లాటిను, ఫ్రెంచి, ఇంగ్లీషు, సంస్కృత నుడులలో పాండిత్యం గడించిన వారు. ఆయా నుడులలోని కావ్యాలను చదివి ఇంగ్లీషులో ఎన్నో వ్యాసాలను రాసినారు. 1907లో బారిస్టరు చదవు కోసం లండనుకు వెళ్ళిన అయ్యరు అక్కడ సావర్కర్ లాంటి దేశభక్తుల పరిచయంతో స్వాతంత్రోద్యమం వైపు మరలినారు. చదువు పూర్తయినా కూడా బారిస్టరు పట్టాను తీసుకోకుండా బ్రిటిషువారిని ఎదిరించి ఫ్రెంచి వారి ఆధీనంలోని పాండిచేరికి చేరుకొన్నారు. మొదట అతివాదిగా ఉద్యమం సాగించినా క్రమంగా అహింసా మార్గం పట్టినారు. 1922లో తమిళ్ గురుకులాన్ని నెలకొల్పినారు. 1924లో బాలభారతి అనే తమిళ పత్రికకు సంపాదకుడిగా పనిచేసినారు. తిరుక్కురళ్‌ను ఆంగ్లంలోకి అనువదించినారు. 'మంగైయక్కరసి కాదల్' అనే వీరి కతల సంకలనమే తమిళంలో మొట్టమొదటి కతల పుస్తకం. ఆంగ్లంలో ఎన్నో పరిశోధక వ్యాసాలను రాసినారు. వేంకటేశ అయ్యర్, కామాక్షి అమ్మల బిడ్డడైన అయ్యరుగారు చిన్న వయసులోనే జూన్ 4, 1925న కనుమూసినారు.

ఇక ఈ కత గురించి చెప్పాలంటే ఇది అయ్యరు గారు రాసిన రెండవ కత. మొదటిది 'మంగైయక్కరసి కాదల్'. అయితే తమిళ విమర్శకులు ఈ 'కుళత్తంగరై అరసమరం చొన్నకదై'ను తమిళంలో తొలి చిరుకతగా గుర్తించినారు. ఈ కత 1908లో వచ్చింది. అంతకు ముందే 1905లో తమిళ మహాకవి సుబ్రమణ్య భారతిగారు 'తులసీ బాయి' అనే కతను రాసినారు. వారే ఆ తరువాత 'ఆరిల్ ఒరు పంగు' అనే కతను కూడా రాసినారు. కానీ ఇవి ప్రయత్నాలు మాత్రమే అనీ తొలి కత మట్టుకు అయ్యరు గారి ఈ కతేనని తమిళ విమర్శకులు అందరూ ఒప్పుకొన్నారు.

చూడడానికి నేను మానునే. కానీ నా ఉల్లంలో ఉన్నదానినంతా చెప్పాలంటే ఈ పొద్దంతా చెప్పినా కూడా తీరదు. ఈ బతుకులోనే కళ్లారా ఎన్నిటిని చూసి ఉండానో! చెవులారా ఎన్నిటిని విని ఉండానో. మీ అవ్వలకు అవ్వలు దోగాడతా ఆడుకొనడాన్ని ఈ కళ్లారా చూసి ఉండాను. నవ్వతుండారు. అయితే నేను చెపుతున్నదాంట్లో ఆవగింజంత అయినా పొల్లు లేదు. నేను పాత తరి మానును. బొంకడానికని అరవడం లేదు. ఇప్పుడు తొంబయ్యో నూరో ఏళ్లు ఉంటాయి. మీ జేజవ్వల అవ్వలందరూ మన గుంటకట్ట కాడకే చెరవా చెయ్యాగా వచ్చేవాళ్లు. కొందరు బిడ్డల్ని కూడా వెంట బెట్టుకొని వచ్చేవాళ్లు. వాడి వక్కులయి ఉండేవాళ్లు బిడ్డలు. వాళ్లను కట్టమీద వదిలేసి, కోకలను మురికి పొయ్యేటట్టుగా ఉతుక్కొని, పసుపు పూసుకొంటా ముచ్చటగా మునకలు ముగించే వాళ్లు. బిడ్డలందరూ బాలగోపాలుడిలాగా దోగాడతా మల్లె గుబురు దగ్గరకు పోయి మల్లెమొగ్గల్ని చూసి నవ్వేవాళ్లు. ఆ నాళ్లలో ఒక పొగడమల్లె చెట్టు ముత్తెపు పువ్వులను పూస్తా ఆ అంచున ఉండేది.

గుంటకట్టంతా గుమ్మని గుమాళించిపోతుండేది. ఇప్పుడు ఆదుకొనేవాళ్లులేక ఎండిపోయింది. కొందరు పెద్దబిడ్డలు దాని పువ్వులను ఏరుకొని ఆబగా మూచ్చూ స్తుండేవాళ్లు. హూఁ! ఆ నాళ్లనంతా తలుచుకొంటుంటే ఆశగా ఉంది! అయితే ఇప్పుడు నేను మీకు ఆ కాలపు కతలను ఏమీ చెప్పేటట్టుగా లేను. ఉల్లము ఎలమిగా ఉన్న ప్పుడు చెప్తాను. ఏడెనిమిది నాళ్లుగా నాకు రుక్మిణి తలపులే వస్తుండాయి. పదిహే నేళ్లు అయింది. కానీ నాకు నిన్న జరిగినట్టే ఉంది. మీలో ఒక్కరికి కూడా రుక్మిణి ఎవరో తెలియదు. చూడడానికి పసిడి బొమ్మలాగా ఉండేది బిడ్డ. ఆమె నగుమోమును తలచుకొంటుంటే ఆ బిడ్డే ఎదురుగా వచ్చి నిలబడినట్టుంది నాకు. ఆమె నుదుటి సొగసును ఈనాటి వరకూ చూస్తానే ఉండిపోయుండవచ్చు. మాంచి పొడుగ్గా ఉండేది. ఆమె చేతులూ కాళ్లూ తామరతూడుల్లాగా నిడుపుగా ఉండేవి. ఆమె మేనో మల్లెపూవులాగా మెత్తగా ఉండేది. కానీ ఆమె అందమంతా కళ్లలోనే. ఎంత వెడల్పు! ఏమి తేట! ఏమి తెలివి! నలకలు లేని నీలపు నింగి గురుతుకొచ్చేది. ఆమె కళ్లను చూడగానే నల్లకలువలు నిండిన తేటనీటి వాగు గురుతుకొచ్చేది. చూపుల్లో ఎంత అనుగు! ఎంత నెనరు! సోమవార అమవసలలో దేవుని పూజకోసం వచ్చి నా చుట్టూ తిరిగేది. అప్పుడు ఆమె నన్ను చూసే చూపుల్లో ఉండే అనుగును ఏమని చెప్పేది! నా

ఎండిన రెమ్మలు కూడా ఆమె అరిమిలి చూపు తగలతానే చిగురించేవే! అయ్యో, నా రుక్మిణి బంగారా! ఎప్పటికి చూడగలను ఇంక నీవంటి బిడ్డని? ఆమె పసితనం నుండి, ఆమె చివరినాటి వరకూ, ఇక్కడకు రానినాడే లేదు. అయిదారేళ్లప్పుడు అయితే ఎప్పుడూ ఇక్కడ్నే ఆటలాడుకొంటా ఉండేది. ఆ బిడ్డను చూడగానే జవిరి ఎత్తుకొని ముద్దుపెట్టాలని అనుకోని వాళ్లే లేరు, ఎంత అక్కర పని ఉండినా కూడా. మన వేణుగోపాల శాస్త్రి ఉండెనే, ఆయన తెల్లవారేసరికే మునకలు తీర్చుకొని, బిడ్డ చేతి నిండా మల్లెపూలు కోసిచ్చే పొయ్యేవాడు. మన ఆవుదూడలు కూడా, ఎంత మొరటు వయినా సరే, ఆమెను చూసిన వెంటనే మొరటుతనాన్నంతా వదిలేసి ఆమె చిన్నారి చేతులతో నిమిరించుకోవాలని ఆమె పక్కనే కాచుకొని ఉండేవి. బిడ్డలంటే నాకు ఎప్పుడూ ఆశ. అందుకే ఆమె వచ్చిందంటే చాలు, మైమరచిపోయేదాన్ని. ఆమె మీద రవంతయినా ఎండ పడనిచ్చేదాన్ని కాదు. ఆమె కొంచెం అటుగా ఉంటే కూడా నా చేతుల్ని చాపి ఆమెకు గొడుగు పట్టేదాన్ని. నా పెనిమిటి అయిన పొద్దు దేవర మొకాన్ని ఆశతో భయభక్తులతో దర్శనం చేసుకొన్నాక. నాకు బిడ్డ రుక్మిణి గురుతుకొచ్చేది. ఆమె రాకకోసం ఆబగా ఎదురుచూస్తా ఉండేదాన్ని. ఆమె రాగానే నాలో పట్టలేనంత ఎలమి పొంగేది. బిడ్డల్లో వేరిమి చూపకూడదు. అయితే ఇంకెవరు వచ్చినా నాకు ఆమె వచ్చినప్పుడు ఉన్నట్టుగా ఉండేది కాదు. నేను మట్టుకేనా? ఊర్లోని మిగిలిన బిడ్డలు కూడా ఆమె వచ్చినాకనే నిండయిన ఎలమితో ఆటలాడే వాళ్లు. ఆమే వాళ్లల్లో రాణి. అంత ఈడుపు చేవ ఉండేది ఆమెలో. అప్పుడంతా ఆమె తండ్రి అయిన కామేశ్వరయ్యర్ మంచి నిలవరంలో ఉండేవారు. బిడ్డపైన ఆయనకు ఎంతో నెనరు. ఆమెకు ఏం చేయాలన్నా ఆయనకు అలత అనేదే ఉండేది కాదు. అంగడి తెరువులో పట్టుగుడ్డలు కొత్తగా వచ్చుండేది చూస్తేచాలు 'మన రుక్మిణి కట్టుకొంటే అందంగా ఉంటాది' అని వెంటనే కొని తెచ్చేసేవాడు. మేలిమి రవ్వలూ కెంపులూ కలిపి ఆమెకు ఎన్నో నగలు చేయించినాడు. ఆమెకు పదేళ్ల ఈడు అప్పుడు కోలాట పండగకోసమని ఒక పావడనూ పైటనూ కొని పెట్టినాడు. ఆ జాబిలికీ ఆమె అలంకారానికీ ఆమె అందానికీ ఎంత పోలిక! కన్నుల విందుగా ఉండేది నాకు! ఆమె గొంతును గురించి మీకు చెప్పడం మరచినాను. కోయిల ఎందుకు పనికొస్తాది! పసిడి కమ్మి మోగినట్టు పలికేది ఆమె గొంతు. పొద్దంతా వింటుంటే కూడా విసుగు పుట్టదు. పండగలప్పుడే ఆమె పాటను నేను వినుండాను. ఇప్పుడు తలచుకొంటే కూడా ఆమె గొంతు అదే తియ్యదనంతో కమ్మదనంతో నా ఉల్లాన వినబడుతుంది. ఆమెకు ఈడు పెరిగేకొందీ నెనరుతో పెరిగిన ఆమె సొబగును ఏమని చెప్పేది? పసిబిడ్డగా ఉన్నప్పుడే అందరితోనూ ఒద్దికగా ఉండేది. ఆ గుణం నానాటికీ పెరగతా వచ్చింది. నేస్తరాళ్లు వేరు తాను వేరు అనే తలపే ఆమెకు ఉండదు. లేనింటి పడుచయినా ఉన్నింటి పడుచయినా సరే, ఆమెకు నేస్తరాళ్లందరి మీదా ఒకటే కూరిమి.

ఇంకా చెప్పాలంటే మిగిలిన వాళ్లకంటే లేనింటివాళ్ల మీద ఎక్కువ నెనరు చూపించేది. అడుక్కొనేవాళ్లు వస్తే దోసిలి నిండుగా బియ్యాన్ని తెచ్చి వేసేది. కళ్లు లొట్టలు పడిన బిచ్చగాళ్లను చూసి ఆమెకు తెలియకుండానే ఆమె కళ్లు నీళ్లతో నిండిపోవడాన్ని నేను చూసి ఉండాను! మిగిలినవాళ్లకు వేసేదానికంటే వాళ్లకు ఎక్కువగా వేసేది. ఇట్ల ఎంతో దయా జాలీ కలిగిన ఆమెను తలచుకొనేటప్పుడంతా నాకు కరుకయిన ఎండ తరిని దాటుకొన్నాక, మంచి వాన కురిసేటప్పుడు కలుగుతుందే అట్లాంటి వెలకట్టలేని ఎలమి కలుగుతుంది. ఇట్ల కంటికి కన్నుగా నేను చూసుకొంటూ వచ్చిన నా గారాల బిడ్డ గతి ఇట్ల అయిపోవాల్నా! నేను పాపిని. పెట్టుకొన్న ఆశలన్నీ మట్టికొట్టుకుపోవాల్నా! బ్రమ్మదేవుడికి కొంచెం కూడా కనికరం లేకుండా పోయిందే! అయినా బ్రమ్మదేవుడు ఏమి చేస్తాడు, మనుషులు చేసే ఆగడాలకు? రుక్మిణికి పన్నెండేళ్లు నిండేసరికి ఆమె నాయన ఆమెను మన మణేగారయిన రామస్వామి అయ్యర్ కొడుక్కు ఇచ్చి కట్టబెట్టేసి నాడు. పెళ్లి చాలా గొప్పగా జరిగింది. తోడుపొంగలినాడూ మెరవణి నాడూ ఆమె రాకను చూసినాను. కళ్లు చెదిరిపోయినాయి. అంత అందంగా ఉండింది. చెలికత్తెల నడుమన ఉండిన ఆమెను చూసినప్పుడు, మెరుపుతీగలు ఊడిగం చేస్తుంటే మెరుపురాణి మెరుస్తున్నట్టుగా ఉండింది. కామేశ్వరయ్యరు, పెళ్లిపందిరిలో రుక్మిణికి చేయాల్సిన సాంగేలన్నీ చేసినాడు. రుక్మిణి అత్తగారూ మామగారూ ఎంతో తనివి పడినారు. పెళ్లి అయినాక అత్తగారు అప్పుడప్పుడూ రుక్మిణిని తోడుకొని పోయి ఇంట్లోనే పెట్టుకొనేది. ఆమెకు జడవేసి పూలుపెట్టి తనివితీరా చూసుకొనేది. తమ చుట్టాలను చూడడానికి పోయేటప్పుడు రుక్మిణిని వెంటబెట్టుకోకుండా పొయ్యేది కాదు. ఇట్ల అన్ని తీరులుగా జానకి (అదే రుక్మిణి అత్తగారి పేరు), రుక్మిణి మీద తనకుండే ముచ్చటనంతా చూపించేది. అల్లుడు నాగరాజన్ మంచి తెలివిపరుడు. అతను కూడా రుక్మిణిపైన ఎంతో మక్కువగా ఉండేవాడు. ఆ ఊరిలో వాళ్లిద్దరే రూపులోనూ తెలివిలోనూ గుణంలోనూ సరైన జంట అని అనుకోని, మాట్లాడుకోని వాళ్లే లేరు. ఇట్ల ఒక ఏడాది గడిచింది. ఆ ఏడాదిలోనే ఎన్ని మార్పులు! కామేశ్వరయ్యరు చెయ్యి కిందికి వచ్చేసింది. రొక్కాన్నంతా, ఏదో అరవైనాడుల కంపెనీ అంట, దాంట్లో వడ్డికోసం వేసినాడు. మన అయ్యరు డబ్బులు నాలుగుకోట్ల రూపాయిల్నీ అది మింగేసి అరిగించేసుకోవడంతో కామేశ్వరయ్యరు ఒక్కసారిగా లేనోడు అయిపోయినాడు. రుక్మిణికి తల్లి అయిన మీనాక్షమ్మ ఒంటిమీది నగలు మట్టుకే ఆయనకు మిగిలినాయి. పెద్దలు గడించి ఇచ్చి పోయిన ఇంటినీ పొలాల్నీ అమ్మి ఆయన అప్పుల్ని తీర్చాల్సి వచ్చింది. ఇప్పుడు కుప్పుసామి అయ్యరు ఉండాడే కాలవగట్టు అంచున, ఆ ఇంట్లోకి కాపురం వచ్చి చేరినారు. మీనాక్షి కూడా చూడడానికి మహాలక్ష్మిలాగా ఉంటుంది. ఆమె శాంతానికి ఎల్లలే లేవు. ఎంత పెద్ద ఇక్కట్టు వచ్చేసింది. అయినా ఆమె ఉల్లం కొంచెమయినా చెదరలేదు. “ఏదో ఇన్నాళ్లూ నెమ్మదిగా బతికినాము. ఎవర్ని అడిగి

ఇచ్చినాడు ఆ పైవాడు. ఆయన ఇచ్చినదాన్ని ఆయనే తీసుకొన్నాడు. ఇప్పుడు ఏమయింది? ఆయనా రుక్మిణీ ఉన్నంతవరకూ నాకు కొదవ ఏమీ ఉండదు. ఈ తై(పుష్య) నెలలో రుక్మిణికి అక్కర చేసేసి అత్తగారింటికి పంపించేస్తే ఇంక మాకు దిగుల్లేదు. సద్దో అంబలో తాగి ఎప్పటిమాదిరిగానే ఆ పైవాడిని తలచుకొంటా గడిపేస్తాము" అని చెప్పేది. అయ్యోపాపం, ఆమెకు మట్టుకు జరగబొయ్యేది ఏం తెలుసు? కామేశ్వరయ్యరు దగ్గర నుండి కొంచెమయినా రాదు అని తెలస్తానే రామ స్వామి అయ్యరు ఆయనకు దూరం కాసాగినాడు. ఇదివరకు ఆయన అప్పుడప్పుడూ కామేశ్వరయ్యరు ఇంటికి వస్తాపోతా ఉండేవాడు. ఆయన్ని దోవలో ఎక్కడయినా చూస్తే పది నిమిషాలయినా మాట్లాడకుండా పోయేవాడు కాదు. ఇప్పుడేమో కామేశ్వ రయ్యరు దూరంగా వస్తుండడం కనబడగానే, ఏదో అవసరమయిన పనిమీద పోయే వాడిలాగా ఇంకొక పక్కకు తిరుక్కొని విరవిరగా పోతుండాడు. ఇట్ట చేసేవాడు, వాళ్ల ఇంటికి రాకపోకలను కూడా నిలిపివేసినాడని నేను చెప్పకుండానే మీకు తెలిసిపోయి ఉంటుంది. ఆయన పెండ్లాము జానకి కూడా అదే మాదిరిగా మీనాక్షమ్మ దగ్గరకు రావడం నిలిపేసింది. అయితే మీనాక్షమ్మా కామేశ్వరయ్యరూ దీనిని పెద్దగా పట్టించు కోలేదు. సంపద ఉన్నప్పుడు చుట్టంగా చేరడం, అది లేకుండా పోయినప్పుడు బయట వాళ్లలాగా జారుకోవడం. దీన్నంతా కూడా నెయ్యమనాల్నా? అయితే వాళ్లు రుక్మిణి పట్ల కూడా పట్టనట్టు ఉండసాగినారు. ఆ అరవైనాడులు ముంచడానికి ముందు అయితే కొన్ని నెలలుగా ప్రతి శుక్రవారమూ రుక్మిణిని తోడుకొని రమ్మని తమ పని మనిషిని పంపేది జానకి. ఆ పొద్దు రుక్మిణికి జడవేసి, మేనంతా చందనం రాసి సింగారించి, అఖిలాండేశ్వరి గుడికి తోడుకొని పోయి దర్శనం చేయించి, ఆనాటి రెయ్యి తమ ఇంట్లోనే పెట్టుకొని మరునాడు తెల్లవారి ఆమెను వాళ్ల ఇంటికి పంపించేది. అరవైనాల్లోడు మునిగిపోయింది తెలిసినాక వచ్చిన మొదటి శుక్రవారం నాడు 'ఈ పొద్దు నాకు ఇంట్లో పనుంది' అని చెప్పి పంపించింది జానకి. ఆ తరువాత అట్ట చెప్పి పంపడం కూడా లేదు. ఇదంతా చూస్తుండే మీనాక్షికీ కామేశ్వరయ్యరుకూ ఏడుపు పొంగివచ్చింది. రుక్మిణి కూడా మన అత్తగారు మనల్ని ఇంతగా పక్కకు నెట్టేసిందే అని వెత పడింది. ఇట్ట కొన్నాళ్లు గడిచినాయి. ఊర్లోవాళ్లంతా గుసగుసగా మాట్లాడుకొంటా ఉండారు. ఆ గుసగుసలన్నీ ఈ గుంటకట్ట దగ్గరే. అరమాట కొర మాటగా నా చెవిన పడతాయి తప్ప ఏమాటా మొత్తంగా నాకు చేరడం లేదు. ఊర్లో ఎప్పుడూ ఇట్ట ఉండింది లేదు. నా ఉల్లము కలతగా ఉంది. ఈ గుసగుసలన్నీ జరగబోయే ఏదో చెడుకు ఆనవాళ్లు అని నాకు అప్పుడే అనిపించింది. అయితే ఆ చెడు ఎవరికి జరగబోతుందో తెలియలేదు. చివరకు అటూ ఇటూగా దాన్నీ దీన్నీ ఒకటిగా కలిపి చూడగా చూడగా కొద్దికొద్దిగా నాకు తేటపడింది. రామస్వామి అయ్యరూ జానకీ కలిసి రుక్మిణిని పక్కకు పెట్టేసి నాగరాజన్‌కు ఇంకొక పెళ్లి చేయాలని

తీర్మానానికి వచ్చినారు. ఏమి చేసేది. నా ఉల్లమే పగిలిపోయింది. బిడ్డ రుక్మిణిని పక్కకు పెట్టడానికి ఎవరికయినా తెగింపు వస్తుందా? అయ్యోపాపీ! నీ మాదిరిగానే ఆమె కూడా ఒక ఆడదే కదా! అది నిన్ను ఏమి చేసింది. దానిని కంటితో చూస్తే రాయి అయినా మెత్తబడుతుందే! నీ గుండె రాతికన్నా గట్టిదా! కామేశ్వరయ్యరుకూ మీనాక్షికీ మొకాలు వెలవరపోయి ఉండాయి. నాకే ఇట్ట ఉంటే కన్నతల్లిదండ్రులకు ఎట్టుండాల? ఇంక నమ్మకం పెట్టుకోవడానికి మిగిలింది ఆ నాగరాజన్ ఒక్కడే. అతను పేటలో చదువుతా ఉండినాడు. పండగనెల పెట్టేసింది. అతను ఎప్పుడొస్తాడా అని నాళ్లను లెక్కపెడతా ఉండినాను. చివరకు వచ్చి చేరినాడు. వచ్చినప్పుడు మట్టుకే అతని మొకంలో చిరునవ్వు చిందేసింది. తరువాత ఆ ఎలమి మారి వేరయిపోయింది. తల్లీతండ్రీ అతని ఉల్లాన్ని చెడగొట్టడం మొదలుపెట్టేసినారు. నానాటికీ మొకంలో కలత ఎక్కువవుతా వచ్చింది. కరిగించే వాడు కరిగించితే రాయి అయినా కరుగును అంటారే. కలత పడిన అతని మొకాన్ని చూసినప్పుడల్లా నా కడుపు బగీరుమనేది. ఇంక ఏం మిగిలింది? ఈ ఒక్క ఆశ ఉండేది. అది కూడా పోయింది. రుక్మిణి గతి అదోగతి అని అనుకొన్నాను. తై నెల పెట్టింది. బయటకే మాట్లాడుకోవడం మొదలుపెట్టేసినారు. ఎవరో దిగువపక్క పడుచు అంట. ఆమె తండ్రికి నాలుగు లక్షల సొత్తు ఉందంట. కొడుకులు లేరంట. ఈ పడుచు తరువాత చాలా ఏళ్ల ఎడంతో ఇంకొక కూతురంట. రామస్వామి అయ్యరు కుటుంబానికి రెండు లక్షల రూపాయల సొత్తు చేరిపోతుందంట. ఈ మాటలన్నీ నా చెవుల్లో చీలల్లాగా దిగినాయి. కానీ ఏమి చేసేది? తలరాత అనుకొని వింటా ఉండిపోయినాను. ఈ మాట పుట్టినప్పటి నుండీ వెలుతురు పొద్దులో మీనాక్షి బయటకు రావడమే లేదు. పొద్దు పుట్టడానికి ముందుగానే గుంటకాడకు వచ్చి మునిగేసి నీళ్లు ముంచుకొని పొయ్యేది. ఆమె మొకాన్ని చూస్తే కలకబారి ఉండేది. సరయిన కునుకు ఎక్కడిది? కూడు ఎక్కడిది? ఓహో అని గొప్పగా బతికేసి, ఈ పాటుకు గురయినామే అనే దిగులు ఆమె చక్కదనాన్ని చెరిపేసింది. ఇల్లూ వాకిలీ పోయిందనో నగానట్రంతా చేజారి వట్టి పుసుపుతాడు మట్టుకే మిగిలిందనో ఆమె వెతపడింది లేదు. చిలకలాంటి పడుచు ఇంట్లో ఉంటే దానిమీద కొంచెమయినా జాలి చూపించకుండా జానకి తన కొడుక్కి ఇంకొక పెళ్లి చేయాలని అనుకొనిందే అని రెయ్యీ పగలూ కుమలతా ఉంది. ఆమె మొకాన్ని చూస్తే జానకికి కూడా ఉల్లం కరిగిపోతాది. కానీ రాణి లాంటి ఆమె ఎందుకు చూస్తాది. అప్పుడు రుక్మిణి ఎట్ట ఉండేదో, ఏమి తలచుకొనేదో నాకేమీ తెలియదు. ఏమీ ఎరగని బిడ్డ, ఏమి తలచుకొని ఉంటుందో! ఒకవేళ అత్తగారు తనను బొత్తిగా పక్కకు నెట్టెయ్యదులే అనుకొని ఉంటుందా? లేకపోతే అత్తగారి మాటలను నాగరాజన్ ఒప్పుకోడులే అనుకొని ఉంటుందా? ఇంకా అయిదేళ్లయినా నిండలేదే, వాళ్లిద్దరూ జంటగా మన గుంటకట్టమీద ఆటలాడి! పెళ్లి అయినాక కూడా ఎవరికీ తెలియకుండా

ఎన్నిసార్లు ముందుమాదిరిగానే కూరిమితో నాగరాజన్ ఆమెతో మాట్లాడి ఉండాడు! అతను తన చెయ్యి విడువడనే అనుకొని ఉంటుంది రుక్మిణి. అయితే నాళ్లు పోను పోను నాగరాజన్ పెళ్లిమాట ముదరతా వచ్చింది. నాగరాజన్ ఉల్లాన ఏముందనేది మట్టుకు ఎవరికీ తెలియదు. పేట నుండి వచ్చిన నాడు, మామగారికీ అత్తగారికీ మొక్కడానికి వచ్చినాడే అంతే. మరలా అతను రుక్మిణిని తలచుకొని ఉంటాడనడానికి ఆవగింజింత అయినా ఆనవాలు లేదు. అయితే మొదటినాడు అతని మోము నుంచి మరుగయిన ఉల్లాసపు నవ్వుగురుతు మరలా తిరిగి రానేలేదు. ఎవరితోనూ మాట్లాడ కుండా ఎప్పుడూ మొకం మాడ్చుకొని ఉండేవాడు. చివరకు లగ్గం పెట్టుకొనేసినారు. పడుచు ఇంటివాళ్లు వచ్చి లగ్నపత్రికను చదివేసిపోయినారు. అయ్యో! ఆ పొద్దు మేళాల చప్పుడు విని నా అయిదూపిర్లూ అల్లాడిపొయినాయి. కామేశ్వరయ్యరుకు ఎట్ట ఉండుంటుందో? మీనాక్షి ఉల్లం ఎట్ట కొట్టుకొని ఉంటుందో? రుక్మిణి ఎట్ట ఓర్చుకొనిందో? అంతా పైవాడికే తెలిసుండాల. నాగరాజన్‌కు కూడా రవంతయినా జాలీ కనికరమూ లేకుండా పోయిందే అని నేను ఏడవని పొద్దు లేదు. కొన్నేసిసార్లు, ఇట్టంతా చేస్తే వీడు మటుకు బాగుపడతాడా అని కూడా అనుకొనేదాన్ని.... ఇట్ట నా ఉల్లం తడబడి తల్లాడుతుండగా ఒకనాడు, కడుపులో పాలుపోసినట్టుగా ఒక మాట నా చెవిన పడింది. నాగరాజన్‌తోపాటు చదివిన శ్రీనివాసన్ అనే చిన్నోడు నాగరాజన్‌ను చూడడానికి వచ్చినాడు. వాళ్లు గుట్టుగా మాట్లాడుకోవడానికి వేరే చోటు ఎక్కడుంది? మన గుంటకట్టే కదా. ఒకనాడు పొద్దువాలినాక ఏడెనిమిది గంటలప్పుడు అందరూ పొయ్యేసినాక వీళ్లిద్దరూ ఇక్కడకు వచ్చినారు. శ్రీనివాసన్ చాలా మంచోడు. వాళ్ల ఊరు ఏబయి అరవయి రాళ్ల(మైళ్ల)కు అవతల ఉంది. పెళ్లాం ఉండగానే ఇంకొక పడుచుని నాగరాజు పెళ్లాడబోతుండాడని అతనికి ఎవరో రాసినట్టు ఉండారు. వెంటనే తపాలబండి మాదిరిగా పరిగెత్తి వచ్చేసినాడు. గుంటకట్ట దగ్గరకు వస్తానే, తను వినింది చెప్పి, అదంతా నిజమేనా అని నాగరాజన్ని అడిగినాడు అతను. "అమ్మా నాయనా కలిసి తీర్మానించేసినాక నేను కాదంటే మట్టుకు చెల్లతాదా? అదీకాక ఆ పడుచు లక్షణంగా ఉందంట. వాళ్ల నాయన లక్ష రూపాయల సొత్తును ఆమె పేరున రాసిపెట్టి ఉండాడంట. తరువాత తరువాత ఇంకొక లక్ష సొత్తు కూడా వస్తుందంట. సిరి వస్తుంటే కాలు అడ్డం పెట్టడం ఎందుకు?" అన్నాడు నాగరాజన్. ఈ మాటలను వినేటప్పుడు శ్రీనివాసన్ మొకం పొయిన పోకడను ఏమని చెప్పేది? నాగరాజన్ నిలపగానే శ్రీనివాసన్ అందుకొన్నాడు. "ఎన్ని లక్షలు వచ్చినా, ఒక పడుచు పాపాన్ని తలకుపోసుకోవాల్నా? పెళ్లిపందిలిలో మంత్రరూపాన చేసిన ప్రమాణాలను మీర తావా?" అంటా ఎన్నో తీరులుగా న్యాయాన్నీ ధర్మాన్నీ ఎత్తి చెప్పి, రాయి కూడా కరిగేటట్టుగా రుక్మిణి కోసం గొంతుకోసుకొని మాట్లాడినాడు. అతను చల్లగా ఉండాల, మంచిగా ఉండాల, ఏ కొరతా లేకుండా బతకాల అని అడుగడుగునా

నేను అనుకొంటా ఉండినాను. అతను మాట్లాడతానే నాగరాజన్ అతన్ని చూసి "శ్రీనివాసా, ఇంత వరకూ నీతో చెప్పినదంతా ఆటపట్టించడానికే. డబ్బు కోసం నేను ఇంత అగడుకు ఒడిగడతానని అనుకొన్నావా? నా లోపలుండేది ఎవరికీ తెలియకుండా గుట్టుగా పెట్టుకోని ఉండాల అనుకొన్నాను. నువ్వు ఇంత దూరం మాట్లాడేసినాక ఇంక నీ దగ్గర దాపరికం ఉండకూడదు. కానీ దీన్ని నువ్వు ఎవరితోనూ చెప్పకూడదు. వీళ్లంతా తమ పెద్దరికాన్ని వదిలేసి ఇంత కుచ్చితంగా నడుచుకొంటా ఉండేది చూసి వీళ్లకు బాగా తలొంపులు తేవాలని తీర్మానించుకొన్నాను. నేను ఎంతగా వద్దని చెప్పినా మా అమ్మా నాయనా ఒకే పిడివాదంగా ఉండారు. అందుకనే నేను మన్నారు కోయిలుకు పోతాను. అక్కడికి పోయినా ఏమీ కాదు అనే చెపుతుండాను. కానీ బలవంతం చేస్తారు. పెళ్లి పందిట్లో కూచుంటాను. ఏమయినా నేనే కదా పుస్తెతాడును ముడెయ్యాల? ఇంకొకరు ఎవరూ వేయలేరు కదా. అప్పుడు వీలుపడదు అని తెగ్గొట్టి చెప్పేస్తాను. అందరూ మిరపకాయను కొరికిన కోతి మాదిరిగా ఎగురుతారు. రుక్మిణిని తాకిన ఈ చేతులతో ఇంకొక పడుచును తాకుతానని అనుకొంటుండావా?" అని చెప్పినాడు. "కానీ నువ్వు పెళ్లికని పోయేటప్పుడు, రుక్మిణికీ వాళ్ల అమ్మానాయనకూ ఉల్లమంతా ఎట్టుంటుందో తలపోసినావా?" అని శ్రీనివాసన్ అడిగినాడు. దానికి నాగరాజన్ "తలపోసినాను. అయితే అంతా అయిపోయిందని వాళ్లు వేసటతో అల్లాడు తుండేటప్పుడు నేను గబాలని పరిగెత్తి వచ్చి అత్తామామలకు దండం పెట్టి, వెత పడొద్దండీ! నా రుక్మిణిని ఎన్నటికీ వదలను నేను. డబ్బాస పట్టి నోళ్లు అందరికీ పెళ్లి పందిట్లో తలొంపులు చేసేసి ఇక్కడికి వచ్చేసినాను అని అంటుంటే వాళ్లకు ఎంత ఎలమిగా ఉంటుంది. ఆ ఎలమిని చూడాలనే ఇట్ట చేస్తుండాను" అన్నాడు. "అప్పటి వరకూ వాళ్ల ఉల్లం ఎట్ట కొట్టుకొంటుందో తలచి చూడు" అన్నాడు శ్రీనివాసన్. "ఇంక అయిదునాళ్లయినా లేదు. ఈ పొద్దు శుక్రవారం. ఆదివారం నాడు ఇక్కడ నుండి అందరమూ బయలుదేరుతాము. ఆ మరునాడే పెళ్లి. ఆ పొద్దే అక్కడ నుండి బయలుదేరి ఆ మరునాటి తెల్లవారికి ఇక్కడకు వచ్చేస్తాను. అన్నాళ్లు ఓర్చుకోలేరా?" చెప్పినాడు నాగరాజన్. "ఏమోరా అబ్బా. ఇది సరిగా లేదు అనిపిస్తా ఉంది నాకు" అని శ్రీనివాసన్ అంటా ఉండగానే ఇద్దరూ నడవడం మొదలు పెట్టినారు. ఆపైన నాకు ఏమీ వినిపించలేదు. ఆ రెయ్యంతా నాకు కునుకే పట్టలేదు. 'చూసినావా, నాగరాజన్ని తిట్టని తిట్టు తిట్టకుండా తిట్టినావే పాపీ. అతనంత మంచోడు ఈలోకాన ఉండాడా' అని నన్ను నేనే తిట్టుకొన్నాను. ఇంక దిగులు లేదు. అయిదునాళ్లయితే ఏమి? పదినాళ్లయితే ఏమి? నాగరాజన్ పట్టువదలని వాడు. చెప్పినట్టుగానే చేసేస్తాడు. ఇంక రుక్మిణికి ఏ కొదవా లేదు అనుకొని ఆదట పడినాను.

ఆదివారం నాడు వీళ్లంతా మన్నారుకోయిల్‌కు బయలుదేరబోతున్నారని తెలుసుకొన్న ఊరంతా అల్లకల్లోలం పడింది. రామస్వామి అయ్యరునూ జానకినీ

తిట్టుకోని వాళ్లే లేరు. కానీ వాళ్లను పిలిచి ఎదురుగా నాలుగు మంచిమాటలు చెప్పేవాళ్లు మటుకు ఎవరూ లేకపోయినారు. అట్ట ఎవరయినా చెప్పినా వాళ్లు కట్టుబడేవాళ్లు కూడా కాదులేండి. వాళ్లు బయలుదేరేటప్పుడు ఊర్లోనే ఉండి కంటితో చూస్తే కడుపుమంట ఇంకా ఎక్కువ అవుతుందని అనుకొన్న కామేశ్వరయ్యరూ మీనాక్షమ్మా శనివారం నడిపొద్దులోనే బయలుదేరి మనపారైకు పొయ్యేసినారు. ఇంట్లో రుక్మిణికి ఆమె మేనత్త సుబ్బులక్ష్మి తోడుగా ఉంది. శనివారం మాపు అయింది. ఊరు మెల్లమెల్లగా అణగతా ఉంది. గంట తొమ్మిదీ తొమ్మిదిన్నర అయి ఉండచ్చు. నాగరాజన్ ఒంటిగా గుంటకట్ట దగ్గరకు వచ్చినాడు. వచ్చి వేపమాను కింద కూచుని ఏదో తలపోస్తా ఉండాడు. కాసేపటికి దూరంగా ఒక ఆడకూతురి రూపు కనిపించింది. ఆ రూపు గుంటకట్ట దగ్గరకే వస్తా ఉంది. అయితే అడుగుకొకసారి ఆగి వెనక్కి తిరిగి చూసుకొంటా వచ్చింది. చివరకు నాగరాజన్ కూచుని ఉండే చోటుకు వచ్చి నిలబడి నప్పుడే ఆ రూపు రుక్మిణిదని నేను తెలుసుకొన్నాను. నాకు ఎత్తి కుదేసినట్టుగా అనిపించింది. కానీ వెంటనే తేరుకొని ఏమి జరగబోతుందో చూద్దామని కన్నులు తుడుచుకొని ఒన్నింపు(ఏకాగ్రత)గా చూడసాగినాను. అయిదు నిమిషాల వరకూ నాగరాజన్ రుక్మిణి రాకను గమనించనే లేదు. లోతుగా తలపోస్తా ఉండిపొయినాడు. రుక్మిణి కదలకుండా అట్టనే నిలబడి ఉంది. తానుగా తలను పైకెత్తిన నాగరాజన్ రుక్మిణిని చూసినాడు. చూస్తానే కొయ్యబారిపోయినాడు. కానీ వెంటనే తేరుకొని "రుక్మిణీ ఈ పొద్దులో, పైగా ఒంటరిగా నువ్వు ఇక్కడకు రావచ్చా?" అని అడిగినాడు. "మీరు ఉండే చోటులో నేను ఒంటరిని ఎందుకవుతాను" అని మారుపలికింది రుక్మిణి. రెండుమూడు నిమిషాల వరకూ ఎవరూ నోరు తెరవలేదు. ఇద్దరి ఉల్లాల్లోనూ గజిబిజిగా ఉంది. ఎట్ట మొదలుపెట్టాల, ఏమి మట్లాడాల అనేది వాళ్లకు తెలియడం లేదు. చివరికి నాగరాజన్ "ఈ పొద్దులో మనం ఇక్కడ ఉండేది తెలిస్తే ఊరి వాళ్లు ఏదేదో చెప్పుకొంటారు. రా, ఇంటికి పోదాం" అన్నాడు. అప్పుడు రుక్మిణి. "మీతో నాలుగు మాటలు చెప్పుకోవడానికి అనుమతి ఇవ్వండి" అనింది. నాగరాజన్ "చెప్పు" అనగానే రుక్మిణి మొదలుపెట్టింది. "మీ దగ్గర ఏం చెప్పుకోవాల్నో కూడా నాకు తెలియడం లేదు. ఈ మూడు నెలలుగా నా ఉల్లం పడే పాటు ఆ అఖిలాండేశ్వరికి తెలుసు తప్ప మనుషులకు తెలియదు. పేట నుండి మీరు వస్తానే నా కలతలన్నీ తీరిపోతాయి అనుకొన్నాను. అత్తగారూ మామగారు ఏమి చేసినా మీరు మట్టుకు నా చేయిని విడువరని నమ్ముకొని ఉండినాను. కానీ మీరు కూడా నన్ను వదిలేస్తే ఇంక ఎవరిని నమ్ముకొని బతికేది? కంచే చేనును మేస్తే ఆ చేను గతి ఏమయ్యేది? ఇప్పటివరకూ జరిగినదంతా నా ఉల్లాన్ని విరిచేసింది. మీరే దానిని అతికించాలి. లేకపోతే నా మనికి అంతే. అందులో అనుమానమే లేదు" ఈ మాటల్ని అనేటప్పుడు రుక్మిణి కళ్లలో నుండి నీళ్లు కారినాయి. ఈ నాలుగు మాటలనూ అని నిలిపింది. నాగరాజన్

ఏమీ మాట్లాడలేదు. కాసేపు ఎదురుచూసిన రుక్మిణి మరలా నోరువిప్పి "రేపే మీ పయనం పెట్టుకొన్నట్టు ఉండారు. మీరూ పోతుండారు కదా?" అని అడిగింది. నాగరాజన్ సుంతసేపు తలపోసి "అవును. పోదామనే అనుకొంటుండాను" అన్నాడు. అతను అట్ట అంటానే రుక్మిణికి ఏడుపు ఉబికి ఉబికి వచ్చింది. ఒళ్లంతా గడగడ వణికింది. కళ్లు నీళ్లతో నిండిపోయినాయి. కానీ, బయటకు రానీయకుండా పళ్ల బిగువున అదిమిపెట్టుకొని "అయితే మీరు నా చెయ్యి విడిచేసినారు కదా?" అని అడిగింది. అందుకు నాగరాజన్ "రుక్మిణీ నేను నీ చేతిని విడవడమా? ఒక్కనాటికీ జరగదు. కానీ అమ్మానాయనలను తనివిపరచడం కూడా నా గడమ(బాధ్యత) కదా? అయినా నువ్వు దిగులు పడొద్దు, నిన్ను ఎన్నటికీ వదలను" అన్నాడు. రుక్మిణి తట్టుకోలేకపోయింది. "మీరు ఇంకొక పెళ్లి చేసుకోవడం, నేను దిగులు పడకుండా ఉండడం. ఎన్నటికీ నా చేయిని విడవరు. కానీ మీ అమ్మానాయనా చెప్పే వాటి నుండి తప్పుకోరు. నేను చెప్పగలిగింది ఇంక ఏముంటుంది? నా గతి ఇంతేనేమో" అంటా అట్నే కూచునింది.

నాగరాజన్ ఏమీ మాట్లాడడం లేదు. పెళ్లిని ఆపేస్తాను అనే మాట ఒక్కటి తప్ప ఇంకే మాటను చెప్పి రుక్మిణి ఉల్లానికి ఓదార్పును ఇవ్వగలడు? ఆ మాటను అనడానికి అతను ఇష్టపడడం లేదు. అందుకే అతను నోరు తెరిచి ఏమీ మాట్లాడకుండా తన గుండెల్లోని అనుగునూ ఆదరవునూ చేతాకిడితో మట్టుకే చూపించినాడు. ఆమె చేతిని తన చేతులతో తీసుకొని ఒడిలో పెట్టుకొని సుతిమెత్తగా పట్టుకొన్నాడు. పసిబిడ్డను తట్టి ఓదార్చినట్టుగా ఆమె బుజాన్ని నెనరుగా తడిమినాడు. అప్పుడు ఆమె తల వెంట్రుకలు అతని చేతికి తగిలినాయి. వెంటనే బెప్పరపోతా "ఏమిటి రుక్మిణీ, తల ఇట్ట అట్టకట్టుకొని పోయిందే. ఇట్నేనా చేసుకొనేది? నిన్ను ఈవాలకంలో చూడాలంటే నా ఉల్లం ఒప్పుకోవడం లేదే! ఏదీ నీ మొకాన్ని చూపించు. అయ్యో, కళ్లంతా ఎర్రబారిపోయి ఉండాయే! మొకంలోని మెరుపంతా మరుగయిపోయిందే! నా కన్ను వంటి దానివే, ఇట్ట ఉండద్దు. నిన్ను నేను వదిలిపెట్టను అనేది సత్తెంగా నమ్ము. కొంచెం కూడా దిగులు పెట్టుకోవద్దు. నేను నిండుగుండెతో చెబుతుండాను. నిన్ను ఈ నిలవరం(పరిస్థితి)లో చూడలేకపోతుండాను నేను. చిన్నప్పటి నుండీ మన నడుమ ఉండిన ఒద్దికను మరిచిపోయినానని కలలో కూడా అనుకోవద్దు. బాగా పొద్దు పోయింది, రా పోదాం. మనం ఇంకా ఇక్కడ ఉండకూడదు" అంటా ఓదార్చినాడు. రుక్మిణి పైకి లేవనే లేదు. ముసింపు పట్టినదాని మాదిరిగా కూచునే ఉంది. అది చూసి నాగరాజన్ కళ్లు నీళ్లతో నిండిపోయినాయి. అప్పుడు తన లోపల దాచుకొన్న ఆ గుట్టును ఆమెతో చెప్పేద్దామని అతనికి అనిపించినట్టుగా ఉంది. పాపి, చెప్పేసి ఉండచ్చు కదా! కానీ అతనికి అతని ఆటే పెద్దదిగా అనిపించింది. అందుకనే ఆ


గుట్టును బయటపెట్టనే లేదు అతను. కానీ ఈ మాదిరిగా జరగతాదని అతను మట్టుకు ఎందుకు అనుకొని ఉంటాడు? ఇంత ఈడు పైనబడిన నాకే తెలియలేదే. ఆ పొద్దులో అతనికి మటుకు ఎట్ట తెలిసుంటాది? అట్నే దిగులుగా కూచుని ఉండిన రుక్మిణిని నాగరాజన్ మెల్లగా పువ్వును లేపినట్టుగా పైకి లేపి గుండెలకు అదుముకొని "ఏమిటి, ఏమీ మాట్లాడనంటున్నావే రుక్మిణీ, నేనేమి చేసేది?" అని కనికరంతో జాలిగా అన్నాడు. రుక్మిణి తన తలను లేపి అతనిని కళ్లెత్తి చూసింది. ఆ చూపుల్లోని అనిపింపును మీకు ఎట్ట చెప్పేది? వెల్లువలో చిక్కుకొని ఏటిలో కొట్టుకొని పోతుండే ఒకడికి, దూరంగా దుంగ ఒకటి తేలి పోతున్నట్టుగా కనబడితే, అతను దబదబమని ఆబగా దానివైపుకు ఈదుకొని పోయి, అబ్బ బతికినాముర అనుకొంటా దానిని పట్టుకోబోతే, అయ్యో పాపం, అది దుంగ కాకుండా వట్టి చెత్తకుప్ప అయితే అతని ఉల్లం ఎట్ట అంగలార్చి ఉంటుంది. అతని మొకం ఏమయిపోయి ఉంటుంది. అట్ట ఉండింది రుక్మిణి మొకమూ, ఆ మొకంలో కదలాడి కనిపించిన ఆమె ఉల్లమూ. ఎల్లలు లేని వగపు, ఎల్లలు లేని ఇడుముడీ ఆ చూపుల్లో కనిపించినాయి. అప్పటికీ నాగరాజన్ ఏమీ మాట్లాడకుండా ఉండడం చూసిన రుక్మిణి మెల్లగా అతనికి దూరం జరిగి "ఇంక నేను చెప్పగలిగేది ఏమీ లేదు. మన్నార్‌కోవిలుకు పోవడం లేదు అనే మాట మీ నోటి నుండి రావడం లేదు. నేటితో నా తలరాత తీరిపోయింది. నన్ను ఇట్ట విడిచిపెట్టేయాలని మీరు తెగించినాక ఇంకమీదట నేను ఎవర్ని నమ్ముకొని ఎవరి కోసం ఊపిరి నిలబెట్టుకోవాల? మీ మీద నాకు అటమట లేదు, మీ ఉల్లం ఈ పనికి ఒప్పుకొనుండదు. నా తలరాత, నా తల్లిదండ్రుల అగచాటే మిమ్మల్ని ఇదంతా చెయ్యమని చెపుతుండాది. ఇంకమీదట, రుక్మిణి అని ఒకతె ఉండేది. అది మన మీద ఎల్లలు లేని నెనరును పెట్టుకొని ఉండేది. ఊపిరిని వదిలేటప్పుడు కూడా అది నన్నే తలుచుకొంటా ఊపిరిని వదిలింది అని ఎప్పుడయినా తలుచుకోండి. ఇదే నేను మిమ్మల్ని చివరిగా కోరుకొనేది" అంటా నాగరాజన్ కాళ్లమీద పడి కాళ్లను గట్టిగా పట్టుకొని కుమిలి కుమిలి ఏడిచింది.

నాగరాజన్ వెంటనే ఆమెను నేలమీద నుండి పైకి లేపి "పిచ్చిదానా, అట్టంతా ఏమీ చేయకూడదు. నువ్వుపోతే నా ఆవిరి కూడా నిలవదు. అప్పుడు ఎవరు ఎవర్ని తలుచుకొనేది? తుంపర పడతా ఉంది. మిన్నంతా కారు చీకటి అయిపోయింది. ఇంకాసేపటికి కుండపోతగా కురిసేటట్టు ఉంది. రా ఇంటికి పోదాం" అని ఆమె చేతిని పట్టుకొని రెండడుగులు ముందుకు వేసినాడు. మిన్నులో చందమామా చుక్కలూ కనబడడం లేదు. అంతా ఒకటే చీకటి. కాసేపటికి ఒకసారి మొయిలును కత్తితో నరుకుతున్నట్టుగా మెరుపు తీగలు మెరుస్తుండాయి. కానీ వెంటనే గబ్బు చీకటి ముసురుకొంటా ఉంది. నేలంతా గడగడ వణికేటట్టుగా మిన్నును చీలస్తా పిడుగులు పడతుండాయి. గాలి అయితే తిప్పించి మల్లించి కొడతా ఉంది. వాన కురిసే చప్పుడు

దూరం నుండి పెరగతా వచ్చి దగ్గరపడింది. ప్రళయకాలం లాగా ఉండిన ఆ హోరులో రుక్మిణీ నాగరాజూ పోతా మాట్లాడుకొన్న మాటలు నాకు సరిగ్గా వినిపించలేదు. వాళ్లు కూడా ఇంటివైపుకు విరవిరగా పోతా ఉండారు. మెరుపు వెలుగుల్లో రుక్మిణి ఇంటికి పోవడానికి ఒప్పక వెనకడుగులు వేయడం, నాగరాజన్ ఆమెను ముందుకు తీసుకొని పోవడం నా కంటపడింది. వాళ్ల మాటలు కూడా ఒకటి రెండు నా చెవిన పడినాయి. "... ఊపిరి ఉండదు... అమ్మ ఉల్లం తనివితీరా... శుక్రవారం తెల్లవారి... ఆడవాళ్ల... పగిలిపోతుంది... చెప్పదు... పెట్టిపుట్టింది కదా... ఆ పడుచునయినా బాగా చూసుకోండి.. నిండుగుండెలతో దీవిస్తుండాను... ఆనాడు తెలుసుకొంటావు... చివరి దండాలు...వరకూ ఓర్చుకో..." ఈ మాటలే ఉరుముల సందడిలో గాలి సవ్వడిలో వాన చప్పుడులో నాకు వినబడినాయి. వాన కుండపోతగా కురవసాగింది. రుక్మిణీ నాగరాజూ మరగయిపోయినారు. మరునాడు తెల్లవారింది. వాన వెలిసింది. అయితే మిన్ను ఇంకా తేట పడలేదు. మొయిలు నలుపు తొలగలేదు. గాలి అయితే ఓదార్చే వాళ్లు లేక వెక్కెక్కి ఏడ్చే పసివాడిలాగా ఆపకుండా అరస్తానే ఉంది. నా ఉల్లమంతా ఒకటే గజిబిజి. ఎంత ఓదార్చుకొంటున్నా నెమ్మది కలగడం లేదు. ఏమిటిది, ఎంత అణుచుకొన్నా ఎన్నడూ ఎరగనంత ఏడుపు పొగిలిపొగిలి వస్తా ఉందే, కారణం తెలియడం లేదే? అని నాలో నేను అనుకొంటా ఉండేటప్పుడు "ఏమ్మా ఇక్కడొక కోక తేలాడతా ఉంది" అని అరిచింది మీనా.

వెంటనే ఆత్రుతతో ఆ పక్కకు తిరిగినాను. గుంటలో మునగతా ఉండిన ఆడవాళ్లందరూ అట్నే తిరిగి చూసినారు. చూసేసి చెవులు కొరుక్కొంటా గుసగుసగా మాట్లాడుకోసాగినారు. నా అయిదూపిర్లూ నిలిచిపోయినాయి. కోకను చూస్తే అది మీనాక్షమ్మ కోకమాదిరిగా ఉంది. అయ్యో, అమ్మానాయనల గుండెల్లో రాయిని వేసేసి రుక్మిణి వచ్చి గుంటలో పడిపోయినట్టుగా తెలుసుకొన్నాను. అంతవరకే తెలుసు, సొమ్మసిల్లిపొయినాను. మరలా కాసేపటికి కానీ నాకు తెలివి రాలేదు. ఆసరికి గుంట కట్టంతా గుంపుతో నిండిపోయి ఉంది. జానకినీ రామస్వామి అయ్యరునూ ఆడి పోసుకోని వాళ్లు లేరు. ఇంక తిట్టినా ఒకటే, తిట్టకపోయినా ఒకటే. ఊరి నయగారాన్నీ తల్లిదండ్రుల బతుకునూ నా ఎలమినీ అంతా ఒకటిగా చేసి కట్టగట్టుకొని ఒకే నిమిషంలో ఎగిరిపోయిందే నా రుక్మిణి. కింద, ఆ మల్లెగుబురు పక్కనే ఆమెను పడుకోబెట్టింది. ఆమె పసిడి చేతులతో ఎన్నిసార్లు ఆ మల్లెమొగ్గలను కోసుంటుంది! పసిబిడ్డగా ఉండినప్పుడు ఆమె అడుగులు పడని తావు ఈ గుంటకట్టమీద ఎక్కడుంది! ఆమె చేయిసోకని మానో మాకో ఉందా! అయ్యో తలచుకొంటేనే ఉల్లం అల్లాడి పోతుందే. ఆ లేత చేతులు, ఆ సొగసయిన పాదాలు అంతా వాడి వాలిపొయి ఉండాయి. కానీ ఆమె మొకంలోని కళ మటుకు తగ్గనే లేదు. అంతకు ముందు

ఉండిన ఏడుపు గురుతులన్నీ చెరిగిపోయి ఒక రకమయిన అచ్చెరువుగొలిపే శాంతం ఆ మొకంలో పరచుకొనింది. దీన్నంతా కూడా కాసేపు మటుకే చూడగలిగినాను. ఆసరికే "నాగరాజన్ వస్తుండాడు నాగరాజన్ వస్తుండాడు" అనే కలకలం పుట్టింది గుంపులోనుండి. అవును నిజమే, అతను కన్నూమిన్నూ తెలియకుండా దెబగుబ పరిగెత్తి వస్తా ఉండాడు. వచ్చేసినాడు. మల్లెగుబురు దగ్గరకు వస్తానే గుంపును గానీ గుంపులోని తల్లిదండ్రులను గానీ పట్టించుకోకుండా "రుక్మిణీ ఏమి చేసినావే రుక్మిణీ!" అని అరస్తా నరికిన మానులాగా కిందకు పడినాడు. గుంపులోని గోల గప్పని అణిగి పోయింది. అందరూ నాగరాజన్నే చూస్తా ఉండిపోయినారు. చాలా సేపటి వరకూ అతను అట్టనే నేలమీద సొమ్మసిల్లి పడి ఉండినాడు. రామస్వామి అయ్యరు బెదిరిపోయి అతని మొకం మీద నీళ్లు చల్లి వీవనతో విసరతా ఉండగా కడకు అతను తెప్పరిల్లి కళ్లు తెరిచినాడు. కానీ నాయనతో ఒక్క మాటయినా మాట్లాడలేదు. ఊపిరిలేని రుక్మిణి మేనును చూసి "రుక్మిణీ, నా తలపులను తుడిచేసి జూనియట్ లాగా ఎగిరిపొయి నావే. శ్రీనివాసన్ చెప్పినట్టే అయిందే! పాపిని నా వల్లనే కదా నువ్వు ఉసురు తీసు కొన్నావు. నేనే నిన్ను చంపిన పాతకుడిని. నిన్ననే నేను నీతో గుట్టునంతా చెప్పేసి ఉంటే, ఈ పొద్దు మనకు ఈగతి పట్టుండదే! కుసుమ సదృశం... సత్యః పాతి ప్రణయి హృదయం అనే లోతయిన నుడుగును పైపైన చదివినానే తప్ప అందులోని సత్యాన్ని తెలుసుకోలేకపోయినానే! ఇంక నాకు ఏమి మిగిలింది? రుక్మిణీ నువ్వేమో తొందరపడి నన్ను వదిలేసి పోయినావు. నాకు ఇంక సంసారపు బతుకు వద్దు. ఇదిగో సన్యాసం తీసుకొంటాను!" అంటూ ఎవరయినా అడ్డుకోవడానికి ముందుగానే తను కట్టుకొని ఉండే పంచెనూ పైవల్లెనూ పీలికలు పీలికలుగా చింపేసినాడు. అతని తల్లిదండ్రులు నోరే తెరవలేదు. వాళ్లు ఆ వెప్పరపాటు నుండి తేరుకొనే లోపల్నే నాగరాజన్ వాళ్ల కాళ్ల మీద పడి మొక్కేసి ఎవరితోనూ మాట్లాడకుండా గోచిగుడ్డతోనే బయలుదేరి పొయ్యేసినాడు. ఇట్ట తీరిపొయింది నా రుక్మిణి కత. నా అనుగు బిడ్డల్లారా, ఆడవాళ్ల ఉల్లం నొచ్చుకొనేటట్టుగా ఇంక మీదట ఏదయినా చెయ్యాలనుకొన్నప్పుడు ఈ కతను తలుచుకోండి. ఆటపట్టించడం కోసం కూడా ఆడదయి పుట్టినోళ్ల ఉల్లాల ను నలపద్దండి. ఏ ఆట ఏ కర్మను మోసుకొస్తుందో ఎవరు చెప్పగలరు?



**ఓట్ర పురుసోత్తం**
ఫోను: 09626217868
ktpmpurus@yahoo.co.in

తమిళనాడు వేలూరు జిల్లాలోని కాటుపాకం సొంతవూరు. అదే జిల్లాలో రాణిపేటలోని బి. హెచ్. ఇ. ఎల్. లో ఉద్యోగం. ఇంట్లో మాట్లాడుకొనేది తెలుగే అయినా తెలుగు చదువుకొనే అవకాశాలు లేక తమిళమే చదువుకొన్నారు. వీరి 20వ ఏట 'తెలుగువాణి' సంస్థ ద్వారా తెలుగులిపిని నేర్చుకొని తెలుగులో రచయిత అయినారు. పది వరకూ కతలనూ కొన్ని వ్యాసాలనూ ఇప్పటివరకూ రాసినారు. తమిళం నుండి తెలుగులోకి కొన్ని కతలను అనువాదం చేసినారు. ఇటీవల వీరి కృషితో 'తొండనాడు కతలు' అనే కథా సంకలనం వెలువడి పలువురి మెప్పును పొందింది.

తెలుగు కత
1910



# దిద్దుబాటు

**గురజాడ అప్పారావు**

ఆధునిక తెలుగు సాహితీ యుగానికి వైతాళికుడయిన గురజాడ అప్పారావు గారు 1862లో ఎలమంచిలిలో పుట్టినారు. గిడుగు రామమూర్తి పంతులు గారు మొదలుపెట్టిన వాడుక తెలుగు ఉద్యమానికి తమ రచనల ద్వారా వెన్నుదన్నుగా నిలిచినారు. కవి, కథా రచయిత, నాటక కర్తగానే కాక ఉద్యమకారుడు కూడా. తెలుగులో తొలి నాటకమయిన కన్యాశుల్కాన్ని రచించి చిరస్మరణీయుడయినాడు. ముత్యాల సరాలతో కొత్త కవితా రీతుల్ని సృజించినారు. ఆధునిక భావాలను కలిగిన గురజాడ, సమకాలీన సమజంలోని జీవితాల నుంచే తమ రచనా వస్తువును తీసుకొన్నారు.

పూర్ణమ్మ పాటతో సమాజంలోని చెడును కడిగినారు. లవణరాజు కల రచనతో సమాజం ఏ వైపుకు నడవాలో సూచించినారు. నీలగిరి పాటలలో పాటు ఆంగ్లంతో కూడా కవతలను రాసినారు. అయిదు కతలతో తెలుగు కతకు ఒక గొప్ప ఒరవడినీ ఒక గొప్ప ప్రారంభాన్నీ ఇచ్చినారు. అభ్యుదయ కవితా పితామహుడిగా, మహాకవిగా పేరు గడించిన గురజాడ అప్పారావు గారు 1915లో కనుమూసినారు.

"తలుపు! తలుపు!"

తలుపు తెరవఁబడలేదు. ఒక నిమిష మతఁడూరుకొనెను.

గదిలోని గడియారము టింగు మని ఒంటిగంట కొట్టినది.

"ఎంత ఆలస్యము చేస్తిని! బుద్ధి గడ్డి తిన్నది. రేపటి నుంచి జాగ్రత్తగా వుంటాను. యాంటి నా చల్లాపోయి సానిదానిపాట సరదాలో మనసు లగ్నమై పోయినది. ఒక్కపాట సరదాతో కుదురలేదు. మనిషి మీద కూడా సరదా పరిగెత్తుతూంది. లేకుంటే, పోకిరీ మనిషివలె పాట ముగిసినదాకా కూర్చోవడమేమిటి? యేదోవక అవకాశము కలుగఁ జేసికొని దానితో నాలుగు మాటలు ఆడడపు ఆసక్తియేమి? ఇదిగో లెంపలు వాయించు కుంటున్నాను. రేపటి నుంచి మరి పాటకు వెళ్ళను నిశ్చయం. నిశ్చయం... గట్టిగా పిలిచితే కమలిని లేవగలదు. మెల్లిగా తలుపుతట్టి రాముడిని లేపగల్గితినా చడి లేకుండా పక్కజేరి పెద్దమనిషి వేషము వెయ్యవచ్చును."

గోపాలరావు తలుపు చేతనంటగానే రెక్కవిడబారెను. 'అరే యిదేమి!' అనుకొని, రెక్క మెల్లిగ తెరవ, నడవలో దీపము లేదు. అంగణము దాటి తనపడకగది తలుపుతీయ, నందును దీపము లేకుండెను. చడి లేక అడుగువేయుచు మంచముదరికి పోయి కమలిని నిద్రించుచుండెనా, మేల్కొని యుండెనాయని కనుగొన యత్నించెను గాని, యేర్పరింపలేడయ్యె. అంత జేబునుండి అగ్గిపెట్టెతీసి పుల్ల వెలిగించెను. మంచముపైని కమలిని కానరాలేదు. నిశ్చేష్టుడై చేతి నుండి అగ్గిపుల్ల నేలరాల్చెను. గదినీ, అతని మనస్సును కూడ చీకటి క్రమ్మెను. వెఱ్ఱిశంకలును, అంతకు వెఱ్ఱి సమాధానములను మనసున పుట్టుచు గిట్టుచు వ్యాకులత కలుగజేసెను. బుద్ధి తక్కువకు తనయందో, కానరామికి కమలినియందో, ఏర్పరింపరాని కోపావేశమును చీకాకును గలిగెను. నట్టివాకిటికి వచ్చి నిలువ చుక్కలకాంతిని దాసిగాని దాసుఁడుగాని కనబడలేదు. వారికి తగినశిక్ష వురియే యని గోపాలరావు నిశ్చయించెను.

తిరిగి గదిలోనికిపోయి దీపము వెలిగించి గది నలుదెసల పరికించెను. కమలిని కానరాలేదు వీధిగుమ్మముజేరి తలుపు తెరచిచూడ చుట్టకాల్చుచు తలయెత్తి చుక్కల పరీక్షించుచున్న రాముఁడు వీధినడుమ కానవచ్చెను. పట్టరాని కోపముతో వానినిఁజూచి

గోపాలరావు "రామా! రా!" యని పిలిచెను. రాముఁడు గతుక్కుమని చుట్టపొరవైచి 'బాబు' అని డగ్గరెను.

"మీ అమ్మేదిరా?"

"మా యమ్మా? యింటున్నది బాబూ"

"మీ అమ్మకాదురా! బుద్ధిహీనుఁడా! నా భార్య"

అమ్మగారా? యెక్కడుంటారు బాబూ? పడున్నారు"

"యింట్లోనే లేదు!"

రాముఁడిగుండెలో దిగులు ప్రవేశించెను. గుమ్మములో అడుగుపెట్టఁగానే రాముని వీపుపై వీశగుద్దులు రెండుపడెను. 'చంపేస్తిరి బాబూ' అని రాముఁడు నేలకూలఁబడెను.

గోపాలుఁడు సదయహృదయుఁడు. అక్రమ మాచరించితి, ననుజ్ఞానము వెంటనే పొడమి ఆగ్రహావేశము దిగజారి పశ్చాత్తాపము కలిగెను. రాముని చేత లేవనెత్తి వీపునిమిరి పశువువలె నాచరించితినని యనుకొనుచు గదిలోనికి తీసుకొనిపోయెను.

కుర్చీపై కూచుని "రామా! యేమాయెరా?" యని దైన్యముతో ననెను.

"యేటో మాయలావుంది బాబూ"

"పుట్టింటికి వెళ్లియుండునా?"

"అంతవారుకారనా? బాబూ కోపగించితే చెప్పలేనుగాని ఆడారు చదువునేరిస్తే యేటౌతది?"

"విద్యవిలువ నీకేం తెలుసురా, రామా!" అని గోపాలరావు మోచేతులు బల్లపయి నాని వానినడుమ తలయుంచి యోచించుచుండ కమలిని చేవ్రాత నొకయుత్తరము కానవచ్చెను. దానిని చదువసాగెను.

"అయ్యా"

"'ప్రియ' పోయి 'అయ్యా' కాడికి వచ్చెనా?"

"పెయ్య పోయిందా బాబూ?"

"మూర్ఖుఁడా! వూరుకో!"

"అయ్యా! పది దినములాయె. రాత్రులనింటికి మీరాకయే నేనెరుగను. మీటింగులకు బోవుచుంటిమంటిరి. లోకోపకారకరములగు నుద్యమముల నిదురమాని

చేయుచుంటిమంటిరి. మాచెలులవలన నిజమేర్చితిని. నేనింట నుండుటనుగదా మీరు కల్లలు పలుకవలసివచ్చె. నేను పుట్టింటనున్న మీస్వేచ్ఛకు నిర్బంధమును, అసత్యమును అవకాశమునకు కలుగకుండును. మీచే దినదినమును అసత్యమాడించుటకన్న మీత్రోవకు అడ్డుగనుండకుండుటయే, పతి మేలుకోరిన సతికి కర్తవ్యము కాదా? నే నీ రేయి కన్నవారింటికిజనియెద. సంతసింపుఁడు. వెచ్చముగాక యేపాటిమిగిలి యున్నను దయనుంచుఁడు.

ఉత్తరము ముగించి "నేను పశువును" అని గోపాలరావు అనెను.

"అదేటిబాబూ అలా శలవిస్తారు?"

"శుద్ధపశువును!"

రాముఁడు అతిప్రయత్నముచే నవ్వు ఆచుకొనెను.

"గుణవతి, విద్యానిధి, వినయసంపన్నురాలు, నా చెడుబుద్ధికి తగినశాస్తి చేసినది".

"యేటి చేసినారు బాబూ?"

"పుట్టింటికి వెళ్ళిపోయినది - గాని నీకు తెలియకుండా యెలావెళ్ళిందిరా?"

రాముఁడు రెండడుగులు వెనుకకు నడిచి

"నాను తొంగున్నాను కావాల బాబూ! అలకచేస్తే చెప్పచాల్నుగాని బాబు! ఆడదాయి చెప్పకుండా పుట్టినారింటికి యెల్తానంటె లెంపలాయించి కూకోబెట్టాలి గాని, మొగోరి లాగ రాతలూ, కోతలూ, మప్పితే ఉడ్డోరం పుట్టదా? బాబు?"

"ఓరిమూర్ఖుఁడా! భగవంతుఁడి సృష్టిలోకల్లా ఉత్కృష్టమైన వస్తువ విద్యనేర్చిన స్త్రీరత్నమే. శివుఁడు పార్వతికి సగందేహము పంచియిచ్చాడు - యింగ్లీషువాఁడు భార్యను బెటర్ హాఫ్ అన్నాఁడు అనగా పెళ్లాము మొగునికన్న దొడ్డది అన్నమాట బోధపడ్డదా?"

"నాకేం బోదకాదుబాబు" రామునికి నవ్వు ఆచుకొనుట అసాధ్యమగుచుండెను.

"నీ కూతురు బడికి వెళ్లుతున్నదిగదా! విద్యవిలువ నీకే బోధపడుతుంది. ఆమాట అలా వుండనియ్యి కాని, నువ్వో, నేనో వెంటనే బయలుదేరి చంద్రవరం వెళ్ళాలి. నేను నాలుగురోజులుదాకా వూరినుంచి కదలడముకు వీలుపడదు. నువ్వు తాతలనాటి నౌఖరువి. వెళ్లి కమలినిని తీసుకురా. కమలినితో యేమిచెప్పవలెనో తెలిసిందా?"

"యేటా? బాబూ! బాబు నాయీపు పగలేసినారు, రండమ్మా అంతాను".

"దెబ్బలమాట మరచిపో, కొట్టినందుకు రెండురూపాయలిస్తాను తీసుకో. మరి యెన్నడు ఆవూసెత్తకు. కమలినితో గాని తప్పి జారి అనఁబోయేవు సుమా".

"అనను బాబూ"

"నువ్వు చెప్పవలసిన మాటలు చెబుతాను, బాగా విను 'పంతులికి బుద్ధివచ్చింది. యిక యెన్నడూ సానులపాట వినరు. రాత్రులు యిల్లుకదలరు, యిది ఖరారు, తెలిసిందా? మిమ్ములను గెడ్డముపట్టుకుని బతిమాలుకున్నానని చెప్పమన్నారు. దయదలచి ఆయనలోపములు బయలుపెట్టక రెండుమూడు రోజులలో వెళ్లిపోయి రమ్మన్నారు, మీరు లేనిరోజో యుగముగా గడుపుతున్నారు' అని నిపుణతగా చెప్పు తెలిసిందా?"

"తెలిసింది బాబూ"

"యేమని చెబుతావో, నాతో వొకమాట చెప్పు"

రాముఁడు తలగోకుకొనుచు "యేటాయేటా - అదంతా నాకేంతెలదు బాబూ -- నానంతాను -- అమ్మా నామాటినుకొండి -- కాలం గడిపినోణ్ణి. ఆడోరు యెజిమాని చెప్పినట్టల్లా యిని పల్లకుండాలి -- లేకుంటే మా పెద్దపంతులార్లాగ అయ్యగారు కూడా సానమ్మనుంచుగుంతారు మీ శెవులోమాట, పట్టంలోకి బంగార బొమ్మలాంటి సానమ్మవొచ్చింది. మరిపంతులు మనసు మనసులోలేదు. ఆపై మీసిత్తం! అంతాను".

"ఓరివెధవా!" అని గోపాలరావు కోపముతో కుర్చీనుండి లేచి నిలిచెను.

ఊసవలె రాముఁడు వెలికెగసెను.

అంతట మంచము క్రిందనుండి అమృతతనిష్యందిని యగు కలకల నగవును కరకంకణముల హృద్యారావమును విననయ్యెను.

**కొంకణి కత**
**1933**



# మా అమ్మ ఎక్కడికి పోయింది
## మ్హాజీ బా ఖై గేలీ?

**శణై గోయబాబ**

కొంకణి నుడి మరువెలుగుకు తండ్రి వంటివారయిన శణైగోయబాబ్ గారు 1877లో గోవాలోని బిచోలిమ్‌లో పుట్టినారు. వీరి జీవిత కాలంలో ఎక్కువ భాగం ముంబయిలోనే గడిపినారు. వీరి అసలు పేరు వామన్ రఘునాథ్ వర్దే వాలావలికర్.

శణై గోయబాబ్ గారు భగవద్గీతను సంస్కృతం నుంచీ షేక్స్‌పియర్ నాటకాలను ఆంగ్లం నుంచీ కొంకణిలోకి అనువదించినారు. వీటిలో 22 పుస్తకాలు దేవనాగరి లిపిలోనూ 11 పుస్తకాలు రోమన్ లిపి (ఇంగ్లిష్)లోనూ ఉన్నాయి. గోయ్‌బాయ్ గారు ఆధునిక కొంకణి సాహిత్య నిర్మాత. కొంకణిలో మేలిమి వచనాన్ని మొదలుపెట్టి కొనసాగించినాడు. ఆయన చూపిన దారిలోనే ఇప్పటికీ నడుస్తున్నారు కొంకణి రచయితలు. శగైగారు కథలూ జీవిత చరిత్రలూ ఒక నవలా రాసినారు. కేవలం సాహితీ సృజనతోనే వీరు తమ కార్యక్రమాన్ని ఆపలేదు. ఎంతో చరిత్ర పరిశోధన కొనసాగించి పుస్తకాలను వెలువరించినారు. కొంకణి నుడి వ్యాకరణాన్నీ చరిత్రనూ రాసినారు. కొంకణి నుడి ఎదుగుదలను అడ్డుకొంటున్న వారిని తీవ్రంగా ఎదిరించడంలో చాలా సమయాన్ని వెచ్చించినారు. కొంకణి అనేది మరాఠీకి ఒక మాండలికం మాత్రమేననీ ప్రత్యేకమైన నుడి కాదనీ వాదించిన పండితులను తన వాదనా పటిమతో ఎదుర్కొని కొంకణి అస్తిత్వాన్ని నిలిపినారు. 1942లో బొంబాయిలో జరిగిన కొంకణి పరిషత్‌కు రిసెప్షన్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. కొంకణనాడు, కొంకణ నుడి, కొంకణ జాతి వికాసానికి తమ బత్రుకంతా పోరాడిన శణై గోయబాబ్ గారు ఏప్రిల్ 9, 1946లో కను మూసినారు.

పోయిన మాఘపంచమికి బాబుల్యాకు ఐదేళ్ళు నిండి ఆరేళ్ళు వచ్చాయి. వాడు బుజ్జివాడిలా కనబడతాడు కానీ ఎంతో అల్లరి చేస్తాడు. ఇల్లంతా చిందరవందర చేసి ఇంటివాళ్ళ ప్రాణం ముక్కులోకి వచ్చేలా చేస్తాడు.

పిల్లలు పుట్టాలని ఎన్నో వ్రతాలు పూజలు చేసినపుడు బాబ్ల్యా పుట్టాడు. పనిమనిషి, 'శాప్శనై'కి మొదటిసారిగా చెప్పి బహుమతి అడిగింది. సంతోషం పట్టలేక ఆయన తన మెడలో ఉన్న 9 తులాల అష్టదేవి దండను ఆమెకిచ్చేశాడు. ఇంటి ముందుకి వచ్చి పెద్ద కొబ్బరి బోండాన్ని చెట్టు పైనుండి తెంపి ఆమె ఒడిలో పెట్టాడు. సంత అంతా తిరిగి అందరికీ చక్కెర పంచాడు. రాత్రంతా తెలిసినవాళ్ళ ఇండ్లు తిరిగి, తనకు మనవడు పుట్టాడని చెప్పి వచ్చాడు. శాప్శనైకీ ఆయన భార్య ఉమాబాయ్‌కీ ఆ రాత్రి ఆకలి కాలేదు, దప్పిక కాలేదు. పొద్దస్తమానం బాబ్ల్యా బాబ్ల్యా అంటూ రోజులు గడిపేశాడు శాప్శనై.

కోడలు తల్లిగారింటికి వెళితే, రెండవరోజే ఒక మనిషిని పంపించి వెనక్కి పిలి పించేవాడు శాప్శనై. ఆమె ఒకటికన్నా ఎక్కువ రోజులు ఎన్నడూ తల్లిగారింట్లో గడపలేదు.

బాబ్ల్యాకి ఆరవ ఏడు వచ్చిన కొద్ది రోజుల్లోనే ఘోరం జరిగింది. వాడి తల్లి హోనిబాయ్ ఆరోగ్యం క్షీణించి పిచ్చిదయింది. ఆమె పిచ్చిపిచ్చిగా మాట్లాతుంటే బాబ్ల్యా దీనంగా చూడడం మొదలు పెట్టాడు. వాడి అల్లరి ఆగిపోయింది. మారాం మానేశాడు.

తల్లి పిచ్చిని చూసి భయపడతాడేమో అని నాన్నమ్మ ఉమాబాయ్ ఆమెను ఒక గదిలో ఉంచి బాబ్ల్యాని అటుగా పోనీయకుండా తన వద్దే ఉంచుకోసాగింది. ఎన్నో సార్లు ఆ గది దగ్గరికి బాబ్ల్యా పోయి అమ్మా, అమ్మా అని పిలిచేవాడు.

చివరికి ఒకరోజు అర్ధరాత్రి హోనిబాయ్ చనిపోయింది. అప్పుడు బాబ్ల్యా నానమ్మ మంచంలో హాయిగా నిద్రపోతున్నాడు. వాడికి తల్లి చనిపోయిన విషయం తెలియవద్దని నాన్నమ్మ, కోడలి శవాన్ని బయటికి మార్చేసి సూర్యోదయ సమయంలోనే అంత్యక్రియలు పూర్తి చేసింది. హోనిబాయ్ పోయిన తర్వాత ఎంతో దుఃఖించారు తాత, నాన్నమ్మలు. కానీ పిల్లవాడు బాధ పడ్తాడని ఆ దుఃఖాన్ని లోపల దాచుకున్నారు. వాడిని తల్లి గది

దిక్కు పోకుండా ఎంతో జాగ్రత్త పడ్డారు. కానీ మూడురోజుల తర్వాత నాన్నమ్మ కళ్ళు కప్పి వాడు అమ్మగదిలోకి తొంగి చూశాడు. లోపల అమ్మ లేదు. అమ్మ పరుపు లేదు. భయపడి, నాన్నమ్మ దగ్గరికి పోయి "నాన్నమ్మా అమ్మ ఎటుపోయింది?" అని అడిగాడు.

నాన్నమ్మ కుమిలి కుమిలి ఏడ్చి కష్టంగా "నాయనా మీ అమ్మ దేవుడింటికి పోయిందిరా" అని, వాడ్ని అక్కున చేర్చుకుని మరింతగా ఏడ్చింది. వాడికి అర్థం కాలేదు. "మామయ్య ఇంటికి పోయేటప్పుడు పల్లకి వస్తుంది కదా! మరి నాకు నిన్నంతా ఎప్పుడూ పల్లకి కనిపించలేదు. అమ్మ దేంట్లో కూర్చొని పోయింది? ఒక్కతే ఎందుకు పోయింది? నేనూ పోయే వాడ్ని కదా!" అన్నాడు.

వాడి మాటలు విన్న నాన్నమ్మకీ తాతయ్యకీ, ఇంట్లోని వారందరికీ గుండె పగిలిపోయింది. అందరూ గుండెలు బాదుకుని ఏడ్చారు. ఇల్లంతా హృదయ విదారకమైన అరుపులతో నిండిపోయింది. అందరూ ఏడ్వడం చూసి బాబ్యా కూడా భయపడిపోయి ఏడ్వడం మొదలు పెట్టాడు. "ఒరేయ్ అది పోయినా నువ్వు పెరగాలిరా, నువ్వు ఈ ఇంటి దీపానివి. మర్రిచెట్టు పెరిగినట్టుగా నీ వంశం పెరగాలిరా" అన్నది ఏడుస్తూ నాన్నమ్మ.

ఆ రోజు నుండి వాడు మరింత మూగవాడయ్యాడు. వాడికి ఏమీ అర్థం కావడం లేదు. ఎప్పుడూ పరధ్యానంగా ఉండసాగాడు.

హోనిబాయ్ చనిపోయాక 12వ రోజున ఒక ముత్తైదువని పిలిచి ఆమె వాడిన చీరలు, ముంతలు దానంగా ఇచ్చేశారు. అవి ఇస్తుంటే బాబ్యా ఏడ్చి గందరగోళం సృష్టించాడు. "అమ్మ దేవుడింటి నుండి తిరిగి వచ్చినపుడు కట్టుకోవడానికి చీరలు వద్దా? నీళ్ళు త్రాగడానికి ముంతలు వద్దా?"

వాడి మాటలు విన్న అక్కడి వారు ఏడ్వసాగారు. అది చూసి వాడు మరింత గందరగోళంలో పడ్డాడు. అమ్మ మాట ఎత్తగానే అందరూ ఎందుకు ఏడుస్తున్నారో వాడికర్థం కావడం లేదు. "అమ్మమ్మ ఇంటికి అమ్మ వెళితే అందరూ సంతోష పడేవారు. కాని దేవుడింటికి వెళితే అందరూ ఏడుస్తున్నారు ఎందుకో" అనిపిస్తోంది వాడికి.

పన్నెండవ రోజు అయిన తర్వాత అమ్మ ఎప్పుడొస్తుందా అని వాడు ఎదురు చూడసాగాడు. వీధిలోకి ఎప్పుడు పల్లకి వచ్చినా అమ్మ వచ్చిందనే సంబరంతో అందులోకి తొంగి చూసేవాడు. అమ్మ కన్పించక పోయేసరికి దిగాలు పడిపోయి చిన్నమొహం పెట్టుకుని కూర్చునేవాడు.

మూడు నెలలు గడిచాయి. ఒకరోజు నాన్నమ్మను అడిగాడు "నాన్నమ్మా అమ్మ పోయి చాలా రోజులయింది కదా! నువ్వు పల్లకి పంపించడం లేదెందుకు అమ్మను

తీసురావడానికి". "నాకు తెలుసు నువ్వెళ్ళి ఆడుకోరా కన్నా" అన్నది ఆమె. అమ్మ పోయిన నాటి నుండి వాడు ఆటలాడటం లేదు. వాడి ధ్యాస అంతా అమ్మ ఎప్పుడొస్తుందా అనే. "నాకు ఆడుకోబుద్ధి కావడం లేదు. అమ్మను చూడాలని ఉంది" అన్నాడు. విసుగు వచ్చిన నాన్నమ్మ "నువ్విలా చేస్తే నేనే ఒక రోజు పల్లకి తీసుకుని దేవుడి దగ్గరికి వెళ్తాను, అమ్మను తీసుకురావడానికి. నాకు కోపం వస్తోంది" అన్నది. "నువ్వు పోతే నాకెవరున్నారే నాయనమ్మా. రాగ్యా, సక్యాలను పల్లకి ఇచ్చి పంపిస్తే సరిపోతుంది కదా! వాళ్ళే తీసుకు వస్తారు" అన్నాడు.

ఎన్నో రోజులు ఎన్నెన్నో రకాలుగా వాడి మనసును మళ్ళించే ప్రయత్నం చేసింది కానీ రోజులు గడిచే కొద్దీ వాడి ఆత్రం ఎక్కువ కాసాగింది. వాడు పల్లకిని పంపించమని తీవ్రంగా కొట్లాడసాగాడు. ఒకరోజు ధైర్యంచేసి నాన్నమ్మ "ఒరేయ్ నాన్నా, దేవుడి ఇంటికి వెళ్ళినవాళ్ళు తిరిగి రారురా" అన్నది.

"అలా అయితే నువ్వు అమ్మను దేవుడి దగ్గరికి ఎందుకు పంపించావు? పంపించేటప్పుడు నాకెందుకు చెప్పలేదు? కాళ్ళను గట్టిగా పట్టుకునేవాడ్ని" అన్నాడు. వాడి మాటలకు వెక్కి వెక్కి ఏడ్చింది నాన్నమ్మ.

"నేనేమి అన్నా ఏడుస్తావేంటి? నాకు చెప్పు ఆమె మళ్ళీ రాదా? నాకు అమ్మ లేదా? ఏ పనికోసం దేవుడింటికి పోయింది?" నాన్నమ్మ మౌనం వహించింది. "పోనియ్యిరా ఆ మాటలు, నువ్వు మంచోడివి కదా ఆడోకో పో" అన్నది. "అలాక్కాదు నాకు అమ్మ కావాలి. నేనిప్పుడే దేవుడి గదిలోకి పోయి దేవుడ్ని అడుగుతాను, మా అమ్మనెందుకు తీసుకుపోయావని, ఆమెను ఎక్కడ వదిలావు అని, మన పూజగదిలో ఉన్న దేవుడే కదా వాడు!"

పరుగెత్తుకుని పూజ గదిలోకి వెళ్ళాడు. వాడేం చేస్తాడో అని నాన్నమ్మ వాడి వెనుకే వెళ్ళింది. వాడు గదిలోకి పోయి సాష్టాంగ నమస్కారం చేశాడు. లేచి ముక్కున వేలేసుకుని క్రింది పెదవిని పై పంటితో కొరికాడు. "దేవా మా అమ్మను తీసుకుని పోయి చాలా రోజులైంది. నాకు చెప్పకుండా తీసుకుపోయావు. నాకు అమ్మ కావాలి. నీకు తెలియదా? వేరే వాళ్ళెవరూ నీకు దొరకలేదా? నువ్వు ఈ రోజే అమ్మను ఆమె గదిలో వదిలేయి. లేకపోతే రేపేం చేస్తానో చూడు. నేను తాతకు చెబుతా నీకు పూజ చేయొద్దని. అప్పుడు నీకు స్నానం ఉండదు, పువ్వులు ఉండవు, దీపం ఉండదు, వత్తి ఉండదు, బెల్లం కుడక నైవేద్యం లేదు, చక్కెర లేదు, ఏమీ లేదు, ఏమీ లేదు. నువ్వు ఉపవాసం చేయాల్సిందే.

మనవడు దేవుడితో గొడవ పెడుతుంటే ముచ్చటేసింది ఉమాబాయ్‌కి. కానీ వెంటనే దుఃఖం ముంచుకు వచ్చింది. వాడికి తనున్నట్లు తెలియకుండా అక్కడినుండి వెళ్ళిపోయింది.

'నేను దేవుడ్ని భయపెట్టాను. రేపు అమ్మను పంపిస్తాడు వాడు' అనుకుని రోజంతా సంతోషంగా గడిపాడు. రాత్రి నిశ్చింతగా నిద్రపోయాడు, తెల్లారితే అమ్మ వస్తుందని.

తెల్లవారింది, పరుగెత్తుకుని అమ్మ గదిలోకి వెళ్ళాడు.

కానీ అమ్మ కనబడలేదు. వాడు నిరాశ చెందాడు. వాడికి కోపం వచ్చింది. నాన్నమ్మ దగ్గరికి వచ్చి "వీడెలాంటి దేవుడే తల్లీ, నిన్న అన్ని తిట్లు తిట్టానా, అయినా పట్టించుకోలేదు. వాడికి సిగ్గులేదు లేకపోతే వాడు అమ్మను పంపించేవాడు కదా. ఇక నేనేం చేసేది? ఆ దేవుడు వినడు. నాకు అమ్మ కావాలి" అంటూ భూమి మీద పొర్లుతూ ఏడ్వసాగాడు.

వాడ్ని ఎత్తుకుని గుండెలకత్తుకుని "ఇలాంటి పిచ్చిపని చేయకురా నాన్నా, దేవుడింటికి పోయినోళ్ళు తిరిగి రారురా కన్నా" అన్నది దీనంగా.


"మరి నిన్ననే వాడు నాకెందుకు చెప్పలేదు? ఊరుకున్నాడెందుకు? 'మీ అమ్మ నీ దగ్గరికి రాదు' అని కచ్చితంగా చెప్పలేదేమి?" అన్నాడు. "దేవుడు మనుషులతో మాట్లాడడు రా బుజ్జితండ్రీ" అన్నది నాన్నమ్మ.

"మనుషులతో మాట్లాడకుంటే వాడు మనుషుల్ని ఎందుకు తీసికెళ్తాడు? ఏ పనులు చేయిస్తాడు? వాడు అమ్మతో కూడా మాట్లాడడా?" వాడిమాటలకు నాన్నమ్మ మౌనవ్రత అయింది.

"దేవుడు నాతో మాట్లాడకపోతే పోనీ, నాకు తప్పక అమ్మకావాలి. అమ్మ నా దగ్గరికి రాకపోతే నేనే అమ్మ దగ్గరికి పోతాను అంతే" అన్నాడు. నాన్నమ్మ ఏమాత్రం సముదాయించలేక పోయింది. "అమ్మ కావాలి అమ్మ కావాలి" అంటూ వాడు అన్నం మానేశాడు. నీళ్ళు త్రాగడం మానేశాడు. పగలూ రాత్రీ అమ్మ కలవరింతే. తాతయ్య నాన్నమ్మలు సముదాయించలేక పోయారు. చివరికి అమ్మకావాలి అంటూ ప్రాణాలు విడిచాడు.

> "యం యం వాపి స్మరంభావం
> త్యజత్యంత కలేవరం
> తం తమేవైతి కౌంతేయా
> సదా తద్భావ భావితం"


ఎప్పుడూ ఒకే ఆలోచనతో బ్రతికితే, ఆ ఆలోచనల్లోనే వాడు అంతమై పోతాడు.



**కందకుర్తి ఆనంద్**
ఫోను: 9951939737
kandakurthi.anand@gmail.com

నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి వీరి స్వగ్రామం. అదే జిల్లాలోని రెంజల్‌లో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకూ 15 కతలూ అనేక వ్యాసాలూ అచ్చయినాయి. స్థానిక చరిత్ర మీద పరిశోధన చేయడం వీరికి ఎక్కువ మక్కువ. మరాఠీ నుంచి తెలుగులోకి 'చరిత్ర వ్యాసావళి' అనే రెండు పుస్తకాలను అనువదించినారు. ఇంగ్లీషు నుంచి తెలుగులోకి కొంత యాత్రా సాహిత్యాన్ని అనువదించినారు. వీరి తల్లినుడి మరాఠీ. ప్రస్తుతం నిజామాబాద్‌లో ఉంటున్నారు.

**తుళు కథ**
**1933**



# పెండ్లికూతురు కాదు, పెండ్లికొడుకు
## మదిమాళత్తు మదిమాయె

**కె.విఠల్ హెగ్డె**

ప్రముఖ తుళు కథారచయిత కె.విఠల్‌హెగ్డే గారు దక్షిణ కన్నడ జిల్లాలోని మట్టూర్‌లో 1913లో పుట్టినారు. SSLC చదువును పూర్తిచేసి పాత్రికేయునిగా వారి జీవితాన్ని మొదలుపెట్టినారు. 1935లో అంతరంగ అనే పత్రికలో చేరినారు. తరువాత ప్రముఖ కన్నడ దినపత్రిక అయిన నవయుగలో తుళు సాహిత్య అనుబంధ సంచికకు సంపాదకునిగా ఉన్నారు. తుళులో ఒక పుస్తకాన్నీ, కన్నడంలో నాలుగు పుస్తకాలనూ ప్రచురించినారు. అయిదు దశాబ్దాల పాటు పాత్రికేయునిగా పనిచేసినారు. వీరు తుళునాడులో ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు కూడా. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ 'మదిమాళత్తు మదిమాయె' కతే తుళునుడిలో వచ్చిన తొలి కత. ముసలివాళ్లు కూడా వరకట్నానికి ఆశపడి చిన్న అమ్మాయిలను పెండ్లి చేసుకునే దురాచారాన్ని ఖండించిన కత ఇది.

"ఔరా! కాంతుశెట్టి," కొరగశెట్టి మీసం మీద చేయి పెట్టుకొని "ఇలా చేస్తుంటే దీనికర్థం ఏమిటి? ఆ శని కూటమికి ఏమైనా సహాయం చేస్తే ఎలా ఉంటుంది. అలాగైనా వాళ్ళ బాధ తప్పుతుంది" అన్నాడు. "మీ సాయంగీయం వాళ్ళకు అవసరం లేదు. వాళ్ళకి ఏమి అవసరం. వాళ్ళ కన్ను మీ వయస్సు మీదనే ఉంది. ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు. కాళ్ళు పైనపెట్టి తల క్రిందపెట్టినా గానీ మీరు పెండ్లి చేసుకోవడం సాధ్యంకాని పని అంటున్నారా వాళ్ళు? ధాన్యముంటే ఎలుకలు కరువా?" అన్నాడు బ్రోకర్ కాంతుశెట్టి. కొరగశెట్టి మీసం మీది చేతిని తీయక మీసం తిప్పుతూనే ఉన్నాడు. వెండిదారానికి ముత్యాలు పొదిగినట్లు ఉన్న ఆ మీసాలకంటుకొన్న తాంబూలపు నురగల్ని విదిలిస్తూ ఉన్నట్టు కనిపించినప్పటికీ అతను ఏదో పెద్ద ఆలోచన చేస్తున్నాడు.

"నాకు ఇలాంటి పరిస్థితి వచ్చి పడిందా? వెళ్ళిన చోట్లంతా నా మర్యాదను పోగొడుతున్నారు. లోకంలో నాలాంటి మగాడు దొరికితే అమ్మాయిల తల్లిదండ్రులు రెండో, నాలుగో వేలు ఇచ్చి పోటీపడి నాకు వివాహం చేస్తారు. అయ్యో! ఏమిటీ పరిస్థితి" అనుకొంటూ తనలో తానే కుములుతూ ఉన్నాడు. బ్రోకర్ కాంతుశెట్టి ఇలాంటి పిచ్చికి మందు ఇవ్వటంలో సిద్ధహస్తుడు. ఆయన మాట్లాడటం మొదలు పెడితే అందులో నిజమేమిటో, అబద్ధమేమిటో తెలుసుకోలేము. అది రాగుల్ని, ఆవాల్ని కలిపి వేరు చేయడమంత కష్టం. డబ్బు కోసం కైలాసాన్ని చూసే కొరగశెట్టి పగ్గాలు, కాంతుశెట్టి చేతుల్లోనే అదుపులో ఉంటాయి. ఉన్నదీ లేనిదీ చెప్పి, మంచిని చెడుగా చెప్తూ తన పెండ్లి జరగకుండా చెడగొట్టేస్తున్న ఆ పిచ్చి మూక నుండి రక్షించుకోవటానికి ఈ కాంతుశెట్టే మనకు రక్ష అని కొరగశెట్టి ప్రగాఢ నమ్మకం. అందువల్లే కాంతుశెట్టి ఎడమంటే ఎడమే, కుడి అంటే కుడిగానే ప్రవర్తిస్తాడు కొరగశెట్టి. ఈ నమ్మకం ఇంతగా బలపడటానికి కారణమేమిటంటే ఈ పెండ్లి విషయంలో ఆయన్ను బాగా ముందుకు నడిపించిన వాడాయనే. కొరగశెట్టి చేసుకొన్న నాలుగు పెండ్లిళ్ళలో రెండేమో వైభవంగా జరిగాయి. రెండింట్లో గొడవలు పడ్డారు. అలాంటి పరిస్థితుల్లో తనకు బాగా ఉపకారం చేసిన, తనకోసమే కష్టపడిన ఈ బ్రోకర్‌ను కొరగశెట్టి ఎలా మరిచిపోతాడు. ఈసారి కూడా తన కార్యం నెరవేరేటట్లు చేసేవాడు (ఈ మహానుభావుడికి పెండ్లిలో చేయి తడపటమంటే భోజనానికి ముందు చేతులు కడుక్కున్నంత సులభం. పెండ్లిపీట

అంటే భోజనానికి కూర్చునే పీటలాంటిది) కాంతుశెట్టేనని కొరగశెట్టి భావన. "ఏదైనా చేయండి కాంతుశెట్టిగారు, దీంట్లో మనము వెనకబడితే నా కీర్తికి, మీ విజయానికి పెద్ద లోటే చూడండి" అన్నాడు కొరగశెట్టి. "అందువల్ల ఈ విషయంలో ఎంత ఖర్చునా మనమనుకున్నది సాధించి తీరాలి" అంటూ బ్రోకర్ ముఖాన్ని చూశాడు కొరగశెట్టి. అప్పుడు కాంతుశెట్టి "దేనికైనా నేను మర్నాడు వచ్చాక నావల్ల సాధ్యమైనంత వరకు చేస్తా, నేనిప్పుడు బయలుదేరతా"నని అక్కడినుండి వెళ్ళాడు.

## 2

పేర్దళ్ళి అనే గ్రామంలో కొరగశెట్టి పేరు చాలా ప్రసిద్ధంగా వినిపిస్తుంది. దీని కారణంగా ఆయన పేరులో "కొరగ" అనేది పోయి శెట్టి మాత్రం మిగిలింది. పేర్దళ్ళికి చెందిన జనాలు తమ దినసరి పనుల్లో శెట్టి ఇంటికి వెళ్ళడం చాలా సర్వసాధారణంగా ఉండేది. శెట్టి ఇల్లు అంటే ఊర్లో రైతులందరి కూరగాయల ప్రదర్శనశాలలాగ ఉండేది. సంవత్సరానికి ఒకసారి జాతర్లలో కనిపించే దైవాలకంటే కొరగశెట్టి ఎప్పుడూ కనిపించే దైవంలా భాసించేవారు. ఇంట్లో తనకు లేక అలమటిస్తూ తనమామ ఇంట్లో ఉన్నదాంతో మోసంగా పూట గడుపుతున్న వాడి దగ్గర కూడా ప్రతిఫలాన్ని దిగమ్రింగే వ్యక్తి ఈయన. చుట్టుపక్కలవాళ్ళు లేదా మామాఅల్లుళ్ళ మధ్య తగాదాలేమైనా జరిగితే, అర్జునుడిలాగా ఎవరైనా శపథం చేస్తే కలియుగ కృష్ణుడిలాగా ఈ కొరగశెట్టి సారథిలాగా వ్యవహరిస్తాడు. కోళ్లపందెంలో గానీ, ఎడ్లపందెంలో గానీ రెండు ఊర్ల మధ్య తగాదా వచ్చి వారు పోట్లాడుకునే సందర్భాలు వచ్చినప్పుడు, ఈ శెట్టిముఖం కనిపిస్తే చాలు ఒక్కసారిగా తరంగాలు లేని సంద్రంలాగా ఆ తగాదా చల్లారుతుంది. కొరగశెట్టి ముందుకు వెళ్ళిన పంచాయతీలు మున్సిఫ్‌కోర్టుకు వెళ్ళిన వ్యాజ్యంలాగా నత్తనడక సాగుతుంటాయి. ఎందుకంటే పంచాయతిలో శెట్టికి రామయ్య అనే సలహాదారు ఉన్నాడు. న్యాయాన్యాయాల పట్ల, తప్పొప్పుల పట్ల సరిగా విచారిస్తూ, తీర్పు ఇచ్చేదే అయినా అప్పుడప్పుడు మధ్యలో ప్రవేశించి, "ఎవరి న్యాయం వీగిపోదు? న్యాయం సమున్నతమైన"దని చెపుతూ న్యాయాన్ని ఉద్ధరించేవాడు శెట్టి కాబట్టి పంచాయతీలో శెట్టి తీర్పు అంటే రామబాణంలాంటిదని ప్రజల అభిప్రాయం. మనస్తత్వ శాస్త్రం చదివినవాళ్ళు ఎవరైనా శెట్టిని పరీక్షిస్తే అతనికి బుర్ర తక్కువేమోనని అంటారేమోకానీ అతడు చాలా సమర్థుడు అనుకోవచ్చు.

బహిరంగంగా చూస్తే కొరగశెట్టికేమో అరవై, అరవైఐదు సంవత్సరాలుండవచ్చు. అతడు గృహస్థాశ్రమంలో ప్రవేశించి చాలాకాలమైంది. చిన్నవయస్సులోనే ఒక్కడే మగాడు, గ్రామానికి నాయకుడు అనే స్థాయిలో ఉన్న కొరగశెట్టికి అమ్మాయిలను ఇచ్చి వివాహం చేయడానికి జనాలంతా పోటీ పడేవారు. ఆ వయస్సులోనే శెట్టి, పెండ్లిసంతలో పెద్ద మొత్తానికి వేలం అయిపోయాడు. ఆ తరువాత ఏదో ఒక

వ్యాధితో శెట్టి భార్య కాలం చేశాక ఊర్లో జనమంతా కొరగశెట్టికి అమ్మాయినివ్వటానికి ముందుకొచ్చారు. ఈసారి శెట్టి వరకట్నంతోపాటు భారీ ఎత్తుకు చెందిన సాహుకారికి అల్లుడయ్యాడు. ఈ రెండు వివాహాలతో డబ్బులు చేరడం, ఖర్చు పెట్టడం అనేవి అతని జీవితంలో ఎంతో విలువైనవి, మరుపురానివి అయ్యాయి. శెట్టి అన్ని వ్యవహారాలలో దిట్ట అయినా కూడా ఇంత పెద్దఎత్తున లాభం జరిగే వేరొక వ్యాపారమేదీ ఆయనకు తెలియరాలేదు. కానీ ఆ తరువాత ఆయనకు దురదృష్టం పట్టుకొనింది అని చెప్పాలేమో? శెట్టి గ్రహచారదోషం వల్ల ఆయన రెండో పెళ్ళాం కూడా వ్యాధి బారినపడి, (శెట్టి తొక్కిచంపేసినట్లుగా అక్కడక్కడ మాట్లాడుకున్నా! అతని డబ్బు ముందు ఇదంతా నిలుస్తుందా?) ఎలాంటి ప్రయత్నం చేసినా కోలుకోలేక కాలం చేసింది. అటుపిమ్మట శెట్టి చూసేవాళ్ళందరికీ అంత అందగాడిగా కనపడలేదు. “అవునా? అదంతా ఎందుకు? మన పేర్దళ్ళి శెట్టి ఉన్నాడు కదా! వాడితో మాట్లాడి పెళ్ళి సంబంధం నిశ్చయిస్తే పోదా?” అని పెండ్లి సంబంధాలు మాట్లాడేచోట ఎవరైనా ఒకడు నోరువిప్పితే, “ఏం మాట్లాడుతున్నావు నీవు? వాడు పులి పశువుల్ని తినేలాగ భార్యల్ని తింటాడు. బొమ్మెరొత్తు ఇంటివాళ్ళు చాలా ఆశపడి అంతమంచి అమ్మాయిని ఇచ్చారుగదా! సరిగ్గా నాలుగు సంవత్సరాలు కూడా కాలేదు. ఆమె చనిపోయింది. రెండో వివాహం జరిగింది. ఆమెకు వరకట్నంగా నాలుగు వేలో ఐదువేలో ఇచ్చారు. అదేమయిందంటే డబ్బుకట్టలు గొంతుకు బిగించి అమ్మాయిని తీసుకువెళ్ళి బావిలో తోసినట్లయింది. ఇంకాయేమి మనకు ఏమైనా ఎక్కువ మిగిలిపోయిందని ఇమ్మంటావా?” అన్నాడు ఒకడు. “ఒక సామెత ఉంది. డబ్బు ఉంటే పేదవారు పులికైనా అమ్మాయిని ఇస్తారని. ఇట్లా చేయడం మంచిదా?” అని ఇంకొకడు అన్నాడు. రండి పోదాము అని ఒకరు ఒకడుగు ముందుకేస్తే అందరూ ఆబాటలోనే నడిచే స్వభావం కలవారు తుళునాడు ప్రజలు. దానివల్ల కొరగశెట్టికి పెండ్లిచేసి ఇచ్చిన అమ్మాయి మరణిస్తుంది అనే అభిప్రాయం ప్రజలందరిలోనూ ఉండిపోయి భయపడి వెనకడుగు వేశారు.

అయితే కొరగశెట్టి వ్యక్తిత్వానికి అమ్మాయిని ఇవ్వటానికి వెనకడుగు వేసేవాళ్ళలోనే, ఆయనకున్న సంపద, ఆస్తిని చూసి ముందుకు వచ్చి ఇచ్చేవారు లేరని కాదు. అయినా అలాంటి వారికి ఇంకొక భయం ఉంది. వీడు ఎలాంటి మనిషిరా? పోయి పోయి అలాంటి వాడికి పిల్లనిచ్చి కట్టబెట్టే బదులు రాళ్లు కట్టి బావిలో పడేయటం మేలుకదా? అని ఎవరైనా అంటారేమోనని మనసులోనే నిట్టూర్చే వారు. మనశెట్టికి ఇటువంటి అపోహలు ఎక్కువ రోజులు భరించటానికి వీలుకాలేదు. వివాహాలు రెండు జరిగినా బిడ్డల్ని కళ్ళారా చూడలేని శ్రద్ధ బ్రహ్మచారిలాగ ఉన్న శెట్టి, పెళ్ళి లేకుండా ఇంత సుదీర్ఘ యాత్ర చేశాడంటే, ఆయన్ను అలా పక్కకు పెట్టండి. మీలో ఎవరైనా అంతకాలం ఊరకే కూర్చునేవారా?

సొంత వ్యాపారం చేయడం సాధ్యంకాకపోతే వేరొకరి సాయం తీసుకొని అమ్మాలనే మాటొకటి పెద్దవాళ్ళు అనేవారు. కావున బ్రోకర్ కాంతుశెట్టిని పట్టుకొన్నాడు శెట్టి. కాంతుశెట్టి అంటే సామాన్యుడు కాదు. వ్యాజ్యం, గొడవ, తగాదాల్లో కొరగశెట్టి ఎలాంటివాడో పెండ్లి సంబంధాల నిశ్చయంలో కాంతుశెట్టి అలాంటివాడు. ఈసారి ఇది పక్కన పెట్టండి. ఇంతకు ముందు రెండుమార్లు జరిగిన వివాహాల్లో కొరగశెట్టి కాంతుశెట్టి చేయిపట్టుకొని ఈచేతికి ఇంకోచేయి జోడించుమని అడిగి ఉంటే ఆయన సహాయం చేయలేని మనిషికాదు. అయితే మన కొరగశెట్టి బంధువులకు, కుటుంబీకులకు కాంతుశెట్టి కనబడలేదు. తాంబూలం వేసుకొని బయల్దేరిన కొరగశెట్టి వెనుకనే వచ్చి నేను ముందు, నేను ముందు అని వివాహ సంబంధాలు మాట్లాడే తల్లిదండ్రులు ఎంతోమంది ఉన్నప్పటికీ కాంతుశెట్టిలాంటి బ్రోకర్లు అప్పట్లో లేరు. ఇప్పుడు కొరగశెట్టి తన బరువునంతా కాంతుశెట్టిమీద పెట్టి "ఎలా శెట్టీ ఈసారి కొంత గట్టి మనస్సు పెట్టండి. వచ్చే నెలలోపు పెళ్ళి జరిగే లాగా చూడాలి" అని చెప్పడం ప్రారంభించాడు. కాంతుశెట్టికి ఈ పని అనవసరం అనిపించలేదు. ఆయన ఈసారి తను నేర్చుకున్న విద్యను పూర్తిగా చూపించి కొరగశెట్టిని మూడోసారి పెళ్ళికొడుకు అయ్యేలాగా చేసి రెండింతల డబ్బులు కష్టపడి సంపాదించాడు. ఈసారి శెట్టిభార్య ఒక మంచి ఆడబిడ్డకి జన్మనిచ్చింది. చివరికి ఆమె కూడా ముగ్గురు భార్యల లాగానే మరణించింది.

కొరగశెట్టి అంటే విషవృక్షం లాంటి వాడు. ముందు ఇంక ఎవరు మోసపోకుండా జాగ్రత్త పడాలని ఆ ఊరి ప్రజలు ఒకరికి ఒకరు చెప్పుకోవడం ప్రారంభించారు. అతని తలరాత బ్రహ్మ అలా రాశాడు కాబట్టి అతడు ఒక్కడే ఉండాలని, అది తెలియకుండా ముందటి వారు జాగ్రత్తపడకుండా మోసపోయారని, ఇంకా బ్రహ్మతో పోరాటం చేయరాదని, ఆ ఊరిలో ప్రసిద్ధి చెందిన మధ్యవర్తి అయిన నర్సన్నశెట్టి ఊరంతా కొరగశెట్టిని గురించి చెప్పివచ్చాడు. 'నా గురించి ఊర్లో ప్రజలు ఏమనుకున్నా నేను భయపడను. కాళ్ళు విరిగిన లక్ష్మి (డబ్బు) నాతోనే ఉన్నది. అయినా నేను బ్రహ్మతో పోరాడుతాను' అనే ధైర్యంతో కొరగశెట్టి ఉన్నాడు. అప్పుడు కొరగశెట్టికి నోటిలో పండ్లు ఊడుతున్నాయి. గడ్డం మీసాలు తెల్లబడుతున్నాయి. అయినా కూడా పెళ్ళి వాద్యాలు వినివిని అలవాటు అయిపోయింది. ఇప్పుడు ఆ పెళ్ళి వాద్యాలు వినపడక పోయేసరికి కొరగశెట్టికి మనస్సులో ఏదో కొరత ఉండిపోయింది. కొరగశెట్టికి, కాంతుశెట్టి చేసిన సహాయాన్ని ఎంత పొగిడినా తక్కువే. కొరగశెట్టి సంపద ఉన్న వ్యక్తి, అన్నీ ఉన్నవాడు, చాలా గొప్ప వ్యక్తి, ఆయనను మించినవాడు చుట్టూ పల్లెటూళ్ళలో ఎవరూలేరని ఆయన వ్యక్తిత్వాన్ని అన్ని చోట్లా పొగిడారు. ఆయనకు 60 సంవత్సరాల వయస్సు ఉన్నప్పటికీ 16 సం॥రాల అమ్మాయితో నాలుగో వివాహం జరిపించాడు కాంతుశెట్టి. శెట్టికి ఈసారి 5 వేల రూపాయలు వరకట్నంగా ఇచ్చారు. కాంతుశెట్టి తెలివి తేటలకు గర్వకారణం ఏమిటంటే 5 వేలు వరకట్నంగా ఇప్పించడం.

ఇది ఇలా జరుగుతుంటే ఆ ఊరిలో యుక్తవయస్సు యువకులు ఒకరితో ఒకరు ఇలా మాట్లాడుకుంటున్నారు. ఏమిటీ పండు ముసలివాడికి ఐదువేల రూపాయలు వరకట్నం ఇస్తుంటే యువకులైన మాకు ఐదువేల రూపాయలు ఎలా దొరుకుతాయోనని వాళ్ళ మనస్సును ఆలోచింపచేసింది. కొరగశెట్టికి కట్నంగా 5 వేలు నిర్ణయించారు. పెండ్లిరోజు ఒక పళ్ళెంలో శెట్టిగారి అత్త మొత్తం డబ్బులు చెల్లించింది. కొరగశెట్టి విషయంలో ప్రజల అభిప్రాయం ఎలా ఉంటుందో చెప్పాలంటే – మీ వాళ్ళలో ఎవరికో ఒకరికి అతని మీద కోపంగా ఉంటే అవన్నీ మాకు చెప్పాలా అని మీరు అడగవచ్చు – దాని గురించి నేను ఎక్కువ మాట్లాడను. ఇదే సమయంలో తాలుకాలో ముఖ్యపట్టణం అయిన 'మడాలూరు' అనే ప్రదేశంలో "యువకూటమి" పేరుతో ఒక సభ ఏర్పడి అస్పృశ్యత, మద్యపానం వంటి దురాచారాలను తొలగించడానికి, ఖాదీ బట్టల వాడకం గురించి కూడా ఈ కూటమివారు ఊరూవాడా తిరిగి ప్రచారం చేశారు. ముసలివాళ్ళ వివాహం, బాల్య వివాహం లాంటి వాటిని కూడా వారు ఖండించారు. "నేను ఈ తాలూకాలో జరిగే ప్రతి అన్యాయాన్నీ నిలపడానికి పోరాడతాను. అంతేగాక నాతో ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లాగా కలసిమెలసి ఉంటేటట్లు ప్రయత్నిస్తాను" అని రాసిన పత్రంలో ఆ సభలో ఉన్న యువతరం సంతకం చేయాలి. కొరగశెట్టి 70 సం॥రాల వయస్సులో కూడా పెండ్లిపిచ్చిలో ఉన్న విషయం యువకుల సభకు తెలిసింది. వారు ఈ సమస్యను ఎదిరించాలి అని నిర్ణయించుకున్నారు. 65 సం॥రాల ముసలివాడు ఐదవ పెండ్లి చేసుకుని ఒక అమ్మాయి బ్రతుకును నాశనం చేసే అన్యాయాన్ని అరికట్టాలి అనే భగీరథ ప్రయత్నంలో వాళ్ళు ఉన్నారు. "మీరు తెలిసినవాళ్ళు ఇలా చేస్తే సరికాదు. ఈ వయస్సులో పెండ్లి చేసుకుని ఇంకొక అమ్మాయి బ్రతుకును చెడగొట్టాలని మీరు చూస్తారా? మేము మీతో మనవి చేసుకుంటున్నాము, మీరు ఇంకో పెండ్లి చేసుకోవద్దు" అని ఎన్నిసార్లు చెప్పినా ఏమీ ప్రయోజనం కనబడలేదు. ఈ ఉపాయం వ్యర్థంకాగా, వాళ్ళు వెళ్ళిన చోటంతా కొరగశెట్టి చరిత్రను చెప్పి అతనికి పెండ్లి సంబంధం కుదరకుండా చేయసాగారు. బ్రోకర్ కాంతుశెట్టి మన శెట్టిగారి గురించి కొత్త కొత్త రంగులు పూసినట్లు మాటలను చెబుతూ పోతుంటే, వెనకనుంచి యువకులు నలుపురంగు పూసుకుంటూ అతని మాటలను తుడుపు కుంటూ వెళ్ళారు. కొరగశెట్టి, కాంతుశెట్టి ఎలాగైనా వారిచేతులే పైన ఉండాలనే ప్రయత్నంలో ఉన్నారు.

కొరగశెట్టి కుమార్తె అయిన లలితను వినయం, సహనం, తెలివికి ఇంకొక పేరు అని చెప్పవచ్చు. 17 సంవత్సరాల ఆ అమ్మాయి తన గుణంతో రూపంతో తన నాన్నగారిని సంతోష సామ్రాజ్యానికి రాజుగా చేసింది. చిన్న వయస్సులోనే అమ్మను కోల్పోయిన తన ఒకే ఒక కుమార్తె మీద కొరగశెట్టికి ఉన్న ప్రేమ ఇంత అని చెప్పడానికి సాధ్యంకాదు. చాలా డబ్బులు ఉన్నప్పటికీ తనది అని చెప్పుకోవడానికి

కుమార్తె ఒక్కటే మిగిలి ఉంది. ఇలాంటి లలితని చిన్నవయస్సులోనే ఆమె మేనమామ గారు చేరదీసి, తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చి విద్య, సంగీతం, టైలరింగ్ మొదలైనవి నేర్పించి సకల గుణ సంపన్నం అయ్యేలాగా చేశాడు. కొరగశెట్టి తన కుమార్తెను ఎలా మరచిపోతాడు. ఆమెను తన ఇంటికి తీసుకొని వచ్చాడు. లలిత తన నాన్నగారి ఇంటిలో సుఖసంతోషాలతో జీవించసాగింది.

## 3

లలిత మిద్దెపైన ఒక వాలుకుర్చీలో కూర్చొని తన వెంట్రుకల్ని సర్దుకుంటోంది. ఆమెకు సహాయంగా ఎదురుగా గోడమీద అద్దం తగిలించి ఉంది. తన వెంట్రుకల్ని సర్దుకొన్న తర్వాత బల్లమీద ఉన్న “పొసభారత” (కొత్తభారతం) అనే పత్రికను గబగబా చూడటం మొదలుపెట్టింది. ఎందుకంటే హిందూదేశంలో జరిగే బ్రిటీష్ పరిపాలన విషయంగా మెక్‌డొనాల్డ్ లండన్ పరిషత్‌లో చేసిన ఉపన్యాసం ఒకటి ఆ పత్రికలో విరివిగా వస్తూ ఉండేది. అందుకోసం ఆమె పత్రికను చదువుటకు ఉబలాటపడుతోంది. ఆ పత్రికను ఒక్కో పేజీ తిప్పుతూ చూస్తోంది. అయితే ఆమెలో ఉన్న ఆత్రుతకు అడ్డుపడినట్లుగా వేరొక వ్యాసం తటస్థించింది. పెండ్లి అనేది స్వతంత్రమా? లేక పిత్రార్జితమా? అనే ఆ వ్యాసం చదవటం ఆరంభించింది. ఇది ఆ పత్రిక సంపాదకుడు రాసిన వ్యాసం. యువకూటమి ప్రకటిస్తున్న ఆ పత్రికకు కూటమి సెక్రటరీ అయిన మోహన్‌శెట్టి సంపాదకుడిగా ఉన్నాడు. ఆయన రూపురేఖలు, చేష్టలు, ప్రతిభ గురించి లలిత ముందుగానే తెలుసుకొన్నది. తన నాన్నగారి ఐదవ వివాహాన్ని ఆపటానికి మోహనశెట్టి ప్రకటించిన సలహాలు, దానికోసం ఆయన చేసిన సాహసాలు ఆమె మనసులో చాలా దృఢంగా నిలిచిపోయాయి. ఆ ‘పొసభారత’ అనే పత్రికను ఒక అక్షరం వదలకుండా చదవటమంటే ఆమె మనసుకు ఎంతో ఉత్సాహం కలిగేది. “పెండ్లి స్వతంత్రమా? పిత్రార్జితమా?” అనే వ్యాసంలో అమ్మాయి, అబ్బాయిల మధ్య ఉన్న సంబంధం, సహజమైన ప్రేమ, మూఢాచారాలు, వాటిపై వ్యతిరేకత, అమ్మాయిల ఆకాంక్షలను వ్యతిరేకించే తల్లిదండ్రుల విధానాలను చాలా హాస్యాస్పదంగా పొందుపరిచారు మోహనశెట్టి. ఈ అనుభవాలన్నీ లలితకు ఆ వ్యాసాన్ని చదివే తెలుసుకోవాల్సిన అవసరం లేదు. అయితే వ్యాసంలో ముఖ్యంగా కనిపించే రచయిత ఆకాంక్షా అభిప్రాయాలు, ఆమె మనసులోని భావనలు కలగలిసి లలితమనసు అనే పంజరంలో జంట పక్షుల్లాగా ఏకీభవించాయి. లలిత హృదయంలో అపరిమితమైన ఆనందం కలిగి ఆ పత్రికను కిందకు జారవిడిచి ఒక్కసారి గోడమీది అద్దంలో తనను తాను చూసుకొన్నది. ముఖంలో ఏదో పిచ్చెక్కినట్లు అనిపించి వెంటనే పైకి లేచి అటూ ఇటూ ప్రక్కలు చూడడం మొదలు పెట్టింది. అప్పుడు కొరగశెట్టి “నాన్నా! అమ్మా! లలితా ఇటు రామ్మా!” అని పిలిచాడు. “వస్తున్నా!” అని ఆమె మిద్దెపైన నుండి క్రిందకు దిగివచ్చింది.

కొరగశెట్టి తాంబూలం పళ్ళేన్ని పక్కన పెట్టుకొని తాంబూలం వేసుకొని కూర్చొని ఉన్నాడు. లలిత ఆయన దగ్గరకు వచ్చి ఇంట్లోని వరండా స్తంభాన్ని పట్టుకొని నిలబడింది. "ఇటువైపు కూర్చోవా!" అంటూ కొరగశెట్టి పక్కనున్న తాంబూలపు తట్టను తీసివేశాడు. కొరగశెట్టి కుమార్తె వెంట్రుకల్ని నిమురుతూ కొంతసేపు ఆమె కళ్ళలోకి చూశాడు. అప్పుడప్పుడూ తన కుమార్తెను అలా ఆప్యాయతతో చూసేవాడు. అప్పుడు ఆయన మనసులో ఒకలాంటి ప్రేమానురాగం ఉంటుండేది. కానీ ఇదివరకటి కంటే ఈరోజు చూపిస్తున్న ప్రేమలో చాలా అనురాగం నిండి ఉంది. దీనికర్థమేమిటో ఆమెకు తెలియడం లేదు. అప్పుడు కొరగశెట్టి తన ముఖాన్నే తదేకంగా చూస్తున్న కూతురి బుగ్గల్ని తడివి, "నాన్నా! నీకొక పెండ్లికుమారుణ్ణి చూశాను. నీకు సమ్మతమేనా?" అని అడిగాడు. ఆయన ముఖంలో చిరునవ్వు తొణికిసలాడింది. లలిత సిగ్గుతో తలవంచింది కానీ అబ్బాయి ఎవరోననే విషయంలో ఆమె మనసులో ఆవేదన కలిగింది. "నాన్నా! పరందళె కుటుంబానికి చెందిన దూమణ్ణ హెగ్గడె కుమారుడు, నారాయణ ఆ అబ్బాయి పేరు. ఏభై ఏభైరెండు కంటైనర్ల ధాన్యాలు నిండి ఉన్నవాడు. దూమణ్ణ హెగ్గడె కూడా ఒక ఏభైవేలు సహాయం చేస్తాడు. పేదరికమే దరిచేరనివాడు. దైవానుగ్రహం వల్ల ఈ సంబంధం కుదిరితే నా కూతురు అదృష్టవంతురాలే" అని చెప్పిన శెట్టి తన కుమార్తె వైపు చూడసాగాడు. తన కూతురి ముఖంలో సిగ్గునిండిన నవ్వులు కనబడుతున్నాయని అనుకున్నాడో ఏమో కానీ లలిత ముఖం చాలా నీరసంగా, దిగులుగా మారసాగింది. శెట్టి తన తలను పైకి ఎత్తి ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు. తర్వాత "నాన్నా!" అని పిలిచాడు. లలిత 'ఓ' అని పలికి అక్కడి నుండే తల కిందకు వంచి దిగాలుగా నాన్న ముఖాన్ని చూసింది. ఆయన తన కుమార్తె తలను నిమురుతూ "ఏమమ్మా! నేను చెప్పిన మాటలు నీకు సమ్మతంగా లేవా?" అన్నాడు. "నాన్నా! నేను నిజంగా మీ కూతురినే అయితే నా మాటల్ని వినండి. పెండ్లిలో సుఖదుఃఖాలన్నీ అనుభవించేది నేను. దానివల్ల నేను ఏమి ఆశిస్తానో దానిని నెరవేర్చడం మీపని. నేను ఇప్పటివరకు మీ మాటల్ని అతిక్రమించలేదు. ఈ విషయంలో మాత్రం నేను కచ్చితంగా చెప్పేదేమిటంటే మీ కూతురి ముఖంలో ఎప్పుడూ సంతోషం చూడాలంటే నన్ను యువకూటమి సెక్రటరీ మోహనశెట్టికి ఇచ్చి వివాహం చెయ్యండి" అంటూ తల వంచుకొని తండ్రి ముందర వెల్లడించింది లలిత. ఇలా నిర్దాక్షిణ్యంగా మాట్లాడే స్వభావం కాదు ఆమెది. "పెండ్లి పిత్రార్జితమా? స్వతంత్రమా?" అనే పత్రికా వ్యాసాన్ని చదివి ఉండకపోతే ఇలా మాట్లాడి ఉండేది కాదేమో? ఈ విధంగా మాట్లాడితే తన తండ్రికి మనసులో ఎంత బాధగా ఉంటుందోనని ఆమెకు తెలుసు. ఈ మాటలు విన్న కొరగశెట్టికి ఇది ఎక్కడి నుండి వచ్చిన శని అనేది తెలియలేదు. తన అమ్మాయికి ఏమి చెప్పాలో అర్థం కాలేదు. "ఏం చెబుతున్నావు నాన్నా! ఆ బికారికి, ఊరును నాశనం చేసే పనిలో ఉన్న వాడికి నిన్ను ఇచ్చి పెండ్లి చేయాలా! ఎంత పనిచేశావమ్మా!

మనసెట్లా వచ్చింది. ఇలాంటి మాటలు మాట్లాడుతావా? వెళ్ళు, వెళ్ళు లోపలికి" అంటూ శెట్టి తన కూతురుని కాస్త గట్టిగా బెదిరించి వెళ్ళిపోయాడు.

కొద్ది రోజుల్లోనే ఊరంతా గుప్పుమన్న ప్రచారమేమిటంటే "శెట్టి కూతురు లలిత, మోహన్‌శెట్టి మీద మనసు పడింది. అయితే తన విరోధియైన మోహనశెట్టికి తన కూతుర్నివ్వటానికి ఆయనకు ఇష్టం లేదు. పరందళె ఇంటికి చెందిన దూమణ్ణహెగ్డె కొడుకు నారాయణకి ఇచ్చి పెండ్లి చేయటానికి శెట్టి నిశ్చయించాడు. వరకట్నం ఆరువేల రూపాయలు. కొరగశెట్టికి కూడా పెండ్లి కుదిరితే వచ్చే నెలలోనే రెండు పెండ్లిళ్ళూ ఒకేసారి జరుగుతాయి" అని ఊరంతా చెప్పుకుంటున్నారు. ఇంకొక సంతోషకరమైన విషయమేమిటంటే "లలితకేమో సంబంధం కుదిరింది కదా! హా! అది గొప్ప సంబంధం" అని శెట్టి ఇంటికి సరదాగా వచ్చి పోయే ఇరుగుపొరుగు వారు మాట్లాడుతుంటే "హా! ఔనప్పా! పెండ్లి సంబంధం కుదిరినట్టే, మీరంతా సహకరిస్తే వచ్చే నెలాఖరుకే పెండ్లి జరిగిపోవచ్చు" అని శెట్టి మీసాలు రువ్వుతూ గర్వంగా చెప్తున్నాడు. దీన్ని తెలుసుకున్న లలిత ఏదిఏమైనా కానీ మోహన్‌శెట్టిని తప్ప ఇంకొకరిని పెండ్లి చేసుకోనన్న దృఢ నిశ్చయంతో ఉంది.

ప్రతిరోజూ కొరగశెట్టి పెండ్లి విషయం, ఆ ఇంట్లో జరుగుతున్న హడావిడి, మోహనశెట్టిలాంటి యువకూటమి వారు చేస్తున్నపని, వీటిని ఆ తాలూకాలో తెలియని వారెవరూ లేరు. కొరగశెట్టి, లలిత, మోహనశెట్టి అనే మూడు మూర్తులు ఆ కాలంనాటి ఔరంగజేబు, జబ్బరున్నీస, శివాజీ ల్లాగా కనిపించారు! "శెట్టిగారు ఈసారి కాస్త పిసినారితనం చేయకపోతే పదిహేను రోజుల్లోనే పెండ్లి సంబంధం కుదిర్చే పూచీ నాది" అని కాంతుశెట్టి అందరికీ ప్రమాణం చేస్తున్నాడు. ఊరంతా ఇదే వార్త.

ఒకరోజు మోహనశెట్టి తన ఆఫీసులో కూర్చొని చేతులతో బుగ్గల్ని తడుముకొంటూ ఏదో ఆలోచనలో పడ్డట్లుగా ఉన్నాడు. అప్పుడు తపాలా బంట్రోతు వచ్చి ఈయనను పలకరించి ఆరో ఏడో ఉత్తరాలనూ కొన్ని పత్రికలనూ బల్లమీద ఉంచి వెళ్ళాడు. శెట్టి ఆలోచనకి, ఈ తపాలా ఆయన రాక ఎటువంటి ఆంటకాన్నీ కలిగించలేదు. కొంతసేపు అలాగే ఆలోచిస్తూ ఉన్న శెట్టి, నిదానంగా బల్లమీద ఉన్న ఒక్కొక్క పేపర్‌ను, ఉత్తరాన్ని తీసి చదవటం ప్రారంభించాడు. ఒక ఉత్తరంలో ఇలా రాసి ఉంది.

"మోహనా!!!"

"ఈ మూడు అక్షరాలను నేను చెవితో విన్నాను. ఇప్పుడు రాస్తున్నాను. అంతేగాక అవి నా అంతరంగంలో మెదిలినవి. ఒకవేళ మీకు పుట్టినపుడు వేరే పేరు ఉన్నా మీరు నాకు "మోహన" మే. నా హృదయంలో ఈ మూడక్షరాల మూర్తిగా ఉన్నారు కాబట్టి మీరు నాకు చాలా సన్నిహితులయ్యారు. బ్రహ్మ సృష్టించినప్పుడే, మన

సుఖదుఃఖాల్ని అనుభవించమని వెల్లడించినపుడే, మీలో సగం నా తలరాతగా రాశాడని నా నమ్మకం. ఈ సత్యాన్ని నిజం చేయవలసిన పని మీదే. ఇంకా ఎందుకీ రహస్యం. నేను మిమ్మల్ని తప్ప మరొకరిని పెండ్లి చేసుకోనని శపథం చేసుకొన్నాను. ఇందుకోసం నా ప్రాణాల్ని పణంగా పెట్టడానికి సిద్ధపడిపోయాను. దీంట్లో మీకు కూడా భాగం ఉందని గ్రహించినట్లయితే నా సాధక బాధకాల్ని రక్షించే పని మీరు మొదలు పెట్టండి. నా పెండ్లి గురించి నేను సంక్లిష్ట పరిస్థితిలో పడిన విషయం మీకు తెలిసే వుంటుంది. ఇంక మిగిలిన తంతు మీదే."

–ఇట్లు
లలిత

దీన్ని చదివిన మోహనశెట్టి దేహంలో ఒక రకమైన స్పిరిట్ పడినట్లు అయ్యింది. ఆయన అక్కడి నుండి లేచి యువకూటమికి సంబంధించిన ప్రత్యేక సమావేశానికి వెళ్ళాడు. ఆ సమావేశంలో బయటివాళ్ళకి ఎవరికీ ప్రవేశం లేదు. చాలా రహస్యంగా మూడున్నర గంటల పాటు సమావేశం జరిగింది.

## 4

"మనశెట్టి మాటలంటే రామబాణం కాదా? ఇప్పుడు మీకు ఆ మోహనశెట్టి మరియు ఇతరులు కనబడరా?" అని నవ్వుతూ కొరగశెట్టి కాంతుశెట్టిని చూశాడు. "కూటమా గూటమా వాళ్ళకి ముఖం చూపించటానికే సిగ్గుగా ఉంది. ఈసారి కనబడితే వాళ్ళ అంతు తేలుస్తా చూడండి" అని కాంతుశెట్టి చాలా గర్వంగా మాట్లాడాడు. "మాకు కొంత ధనం ఖర్చయ్యింది. అయితే వాళ్ళ పరిస్థితిని చూసినట్లయింది కదా! ఆహాహా ఏమిరా! చాలాకాలం నుండి ఎంతో సంబరం చేసుకొన్నవాళ్ళను చూద్దామంటే ఒక్కరూ కనబడలేదు." అని కొరగశెట్టి చాలా పెద్ద గొంతుతో మాట్లాడాడు. కాంతుశెట్టి కొంత సమయం ఆయనవైపు చూస్తూ "డబ్బు విషయం వదిలేయండి. మనం డబ్బుల్ని సంపాదిస్తాము గానీ డబ్బు మనల్ని సంపాదించదు కదా? దీంట్లో ఓడిపోతే మనం మగవాళ్ళమనిపించుకునే వాళ్ళం కాదు కదా?" అన్నాడు. "నాకు ఈసారి అయినా లలితను పెళ్ళికూతురుగా చూడాలనే భావన ఉన్నది. అదేమో చేయిదాకా వచ్చి నోటికందకుండా పోయే పరిస్థితి వచ్చింది. ఇందులో కూడా వాళ్ళు విజయం సాధించినట్లే కదా" అని కొరగశెట్టి కాంతుశెట్టితో చెప్పినప్పుడు తాను ఓడిపోయిన భావన ఆయనలో కనిపించలేదు. "అవన్నీ ఇక్కడే వదిలేయండి. లలితలాగా ఉండే అమ్మాయికి అబ్బాయిలు దొరకడం కష్టమేమీ కాదు. ఒక వైభవంగా పెండ్లి మెరవణి ఏర్పాటు చేస్తే వివాహం మరునాడే జరిగిపోతుంది. అలాంటప్పుడు అమ్మాయి మోహనశెట్టికి ఎలా చెందుతుంది. వాళ్ళకొక పిచ్చి" అని కాంతుశెట్టి కూడా చాలా పెద్దగొంతుతో నవ్వాడు. "ఇంకొకసారి పెండ్లికిరీటం పెట్టుకునే అవకాశం దొరికితే

ఎలా ఉంటుందా?" అనే నిరీక్షణతో రంగుమారిన గడ్డంమీద చేయి పెట్టుకొని కొరగశెట్టి "అరవై, డెబ్బ ఏళ్ళ వయస్సు ఉన్న ముసలివాళ్ళు ఈ పెండ్లి విషయాన్ని విని నవ్వుతారో ఏమో? ఇదేమి పరిస్థితో, పెండ్లి జూదంలో ముసలివాళ్ళే నెగ్గితే మా పరిస్థితి ఏమిటని మిగిలిన యువకులు ఆందోళన చేయవచ్చు" అని ఆలోచిస్తున్నాడు.

రేపు మధ్యాహ్నం 12 గంIIకు శెట్టి ఇంట్లో పెండ్లి ముహూర్తం జరుగుతున్న సంగతి ఎవరికీ చెప్పవద్దు. కొరగశెట్టి లాంటి 65 ఏళ్ళ ముసలిపీనుగ వరుసగా నలుగురు అమ్మాయిలను పెండ్లి చేసుకొని వారి జీవితాలను బలిచేశాడు. అలాంటి నీచుడు ఇంకో పెండ్లికోసం చేస్తున్న ప్రయత్నం నెరవేరకూడదని, ఆయనకు పెండ్లి కూతురు దొరకకూడదని, మరో అమ్మాయి జీవితం నాశనం కాకూడదని యువకూటమి వారు శెట్టికి వ్యతిరేకంగా ఎంతో ప్రయత్నం చేశారు. కొరగశెట్టిలాగే అనేక పెండ్లిళ్ళు చేసుకోవాలనుకునే ప్రతి ఒక్కరి కోరికల్ని సంపూర్ణంగా తుడిచి వేయాలన్న ప్రయత్నంలో కూడా ఉన్నారు. ఇదిలా ఉండగా లలిత రాసిన ప్రేమలేఖ మోహనశెట్టికి అందింది. అంతకుమునుపే లలితపై మనసుపడి ఉన్నాడు మోహనశెట్టి. ఈ లేఖ అతనిలోని ప్రేమికుణ్ణి లేపింది. లలిత ప్రేమ విషయాన్ని ఆలోచిస్తున్న మోహనశెట్టికి ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న ఉపాయం తట్టింది. వెంటనే ఈ విషయాన్ని కూటమి ముందు చర్చకు పెట్టాడు. 'కొరగశెట్టికి ఒక పెండ్లికూతుర్ని చూపించి, పెండ్లి ముహూర్తాన్ని నిర్ణయించాలి. ఆ పెండ్లిరోజున మోహనశెట్టికి పెండ్లికూతురి వేషం వేసి పంపించాలి. ముహూర్త సమయంలో మోహనశెట్టి పెండ్లికూతురి వేషం తీసి పెండ్లికొడుకులా తయారై లలితని పెండ్లి చేసుకోవాలి' అనే విషయాన్ని యువకూటమి వారు బాగా ఆలోచించి నిర్ణయించుకున్నారు. ఆ మరుసటిరోజు యువకూటమిలో ఒక ప్రకటన చేశారు. "మేము ఇంతవరకూ దుర్మార్గుడైన కొరగశెట్టి అన్యాయంగా చేసుకున్న వరుస పెండ్లిళ్ళను ఆపటానికి చేసిన ప్రయత్నాలన్నీ మీ అందరికీ తెలుసు. అలాగే కూటమిలో ఇతర విషయాలతో తీరికలేక ప్రత్యేకంగా ఈ విషయంపై దృష్టి పెట్టలేకపోయాం. కాబట్టి ప్రజలందరికీ మా విన్నపమేమిటంటే శెట్టి కాటికి కాలుచాపే వయసులో కూడా ఇంకో పెండ్లి చేసుకొని ఇంకొక అమ్మాయి జీవితాన్ని నాశనం చేయటానికి చేస్తున్న రాక్షస ప్రయత్నాన్ని మనమంతా కలిసి నిరోధించటానికి నడుంబిగించాలి" అని ఆ ప్రకటనలో ఉంది. కొరగశెట్టికి మరియు యువకూటమి వారికి మధ్య ఉన్న గొడవలో చివరికి శెట్టి విజయం సాధించాడు. కూటమివారు ఓడిపోయారు. ఊరంతా కొరగశెట్టి విజయానికి జయజయధ్వానాలు చేశారు. కొద్దిరోజుల్లోనే శెట్టికి ఒక పెండ్లి సంబంధం కూడా వచ్చింది. ఆ పెండ్లివారు శెట్టిని పల్లకీ ఖర్చుతోపాటు, రెండువేల రూపాయల విలువైన బంగారాన్ని పెండ్లి కూతురికి ఇస్తే పెండ్లి చేయటానికి మేము సిద్ధమని చెప్పారు. పెండ్లిళ్ళ బ్రోకర్ అయిన కాంతుశెట్టి మూలంగా కొరగశెట్టి ఆ వివాహానికి సిద్ధమయ్యే యోచనలో

ఉన్నాడు. ఆ మరుసటిరోజే కాంతుశెట్టిని ఇంకో ఆడపెండ్లివారు కలిశారు. వారు శెట్టితో మాకు పల్లకీ ఖర్చువద్దు, బంగారం వద్దు కానీ శెట్టి మా ఇంటికి వచ్చి ఒకసారి మా అమ్మాయిని చూడాలని చెప్పారు. వారి అంచనా ప్రకారం ఈ పెండ్లి జరుగుతుందనే భావనలో ఉన్నారు. ఈ విషయమంతా తెలుసుకున్న కొరగశెట్టికి ఒక్కసారిగా తన యౌవనం గుర్తుకు వచ్చింది. కొరగశెట్టి మరియు పెండ్లిళ్ళ బ్రోకర్ అయిన కాంతుశెట్టి ఇద్దరూ కలిసి అమ్మాయిని చూడటానికి వెళ్ళారు. అప్సరసలాంటి ఆమె అందానికి శెట్టి దాసోహమన్నాడు. లేతవయసులో ఇంకా ఇరవై ఏళ్ళైనా నిండని అతిలోకసుందరి ఆ పెండ్లికూతురు. బంగారు రంగులో ఉన్న ఆమె మేనుఛాయకు శెట్టి అబ్బురపడ్డాడు. ఒక్కసారిగా శెట్టి బంగారుపంజరంలో పడ్డానని తెగ సంబరపడి పోయాడు. వెంటనే పెండ్లి ఖాయం చేసుకొని, లగ్నపత్రికని ఇరువర్గాల వారు రాయించుకున్నారు. పెండ్లి సంప్రదాయానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలు ఆ క్షణం నుంచి ఇరు వర్గాల మధ్య ఎంతో వేగంగా జరిగిపోతున్నాయి. పెండ్లిరోజు కొరగశెట్టి ఇంట్లో ఎంతో సందడి వాతావరణం నెలకొంది. కాంట్రాక్టర్‌కి 300 రూపాయలిచ్చి కట్టించిన పెండ్లిమండపం ఇంద్రసభనే మించిపోయింది. మేళతాళా లతో, నర్తకీమణుల నాట్యాలతో కూడిన నర్తనశాలలతో, ఊరేగింపుకు సిద్ధంగా ఉన్న ఏనుగులతో, మిక్కిలి ఉత్సాహంతో హడావుడిగా తిరిగే బంధువులతో, చుట్టాలతో పెండ్లి ఆవరణమంతా ఎంతో కోలాహలంగా ఉంది. అక్కడి ఆడవాళ్ళు ధరించిన చాలా ఖరీదైన పట్టుచీరలు, బంగారు నగలు, ముత్యాల హారాలు, వజ్రవైఢూర్యాలతో ధగధగ మెరుస్తున్న ఆభరణాలు మిగతా వారందరినీ ఆకర్షిస్తూ కళ్ళార్పకుండా తదేకంగా వారినే చూస్తుండిపోవాలన్న విధంగా వారు అలంకరించుకున్నారు. భజంత్రీలు డోలు, సన్నాయిలతో చేసే ధ్వనులు. ఆడవారు ఎంతో ఉత్సాహంగా అటు ఇటు తిరుగుతూ వేస్తున్న కేకల హడావిడికి చెవులు హోరెత్తిపోతున్నాయి. ఇంతలో పల్లకీ రావటాన్ని చూసిన కొరగశెట్టి అక్కడున్న ఆడవాళ్ళకేసి “పల్లకీ వస్తోంది. రండిరండ”ని పిలువగానే ఆడవారంతా తమ పట్టువస్త్రాల్ని నగలని జాగ్రత్తగా సర్దుకుంటూ ఒకరు కలశాన్ని, ఒకరు గంధాన్ని, కుంకుమని, పన్నీరుని, అద్దాన్ని ఇలా తీసుకొని పల్లకీ వైపు నడవసాగారు. ఆ వరుసలోనే లలిత చేతితో హారతిని పట్టుకొని వారితో పాటే ముందుకుసాగింది. ఆ సందర్భంలో లలితను చూసిన రంగక్క అనే ఆవిడ “లలిత కూడా పెండ్లికూతురే, తనని కూడా పెండ్లి పీటలమీద కూర్చోబెడితే రెండు పెండ్లిళ్ళు ఒకేసారి అయిపోతాయి” అని సరదాగా ఉమ్మక్కతో అన్నది. “ఏం చేద్దాం ఒక మంచి అబ్బాయిని చూసి ఘనంగా పెండ్లి చేయాల్సిన బాధ్యత ఉంది. పాపం వాళ్ళమ్మ కమలే గనుక బతికివుంటే తనకు ఈ గతి పట్టేదా?” అని ఉమ్మక్క బాధ పడుతూ లలిత చెంపను మెల్లగా నిమిరింది. కానీ ఆ హడావిడి మధ్య లలితకు గానీ అక్కడ ఉన్న అమ్మలక్కలకు గానీ ఉమ్మక్క, రంగక్క మాట్లాడుకునే విషయాలను విని

విచారించే సమయంగానీ, సందర్భంగానీ అది కాదు. ఇరువర్గాల వారు ఎంతో ఉత్సాహంతో టపాకాయలు పేల్చుతున్నారు. పెండ్లి మండపం ముందు వరుసగా ఇరు వర్గాలకు చెందిన స్త్రీ పురుషులు ఎదురెదురుగా నిలబడి ఉన్నారు. పెండ్లికొడుకు తరపు స్త్రీలు పెండ్లికూతురి తరపు వారికి ఆహ్వానాన్ని పలకటానికి సిద్ధంగా ఉన్నారు. పెండ్లికూతురి తరపు వారిని ఆహ్వానిస్తూ పన్నీరు చల్లటం, గంధం పూయటం, బొట్టుపెట్టడం వంటి పనుల్ని పెండ్లికొడుకు తరపు వారు చేస్తున్నారు. లలిత అందరికీ హారతి ఇస్తున్నది. హారతి అందరూ తీసుకోగా చివరికి మిగిలింది పల్లకీలో కూర్చున్న పెండ్లికూతురు ఒక్కటే. లలిత నిదానంగా పల్లకీవైపు వెళ్ళింది. పెండ్లికూతురికి హారతిని రెండు చేతులతో పైకి పట్టుకొని చూపింది. అప్పుడు పల్లకీలో ఉన్న పెండ్లికూతురు, పల్లకీ ఎదురుగా హారతి పట్టుకున్న పెండ్లికూతురైన లలిత ఇరువురు ఒకరినొకరు ఆశ్చర్యంగా చూసుకుంటున్నారు. పెండ్లికూతురి వేషంలో వచ్చిన మోహనశెట్టిని చూసిన లలిత ఆ వింతకు అబ్బురపడి హారతిచ్చే సంగతిని మరచిపోయింది. ఇరువురు ఒకరినొకరు తదేకంగా చూసుకుంటూ ఆ దృష్టిని మరల్చుకోలేకపోతున్నారు. లలిత ఎంతో కష్టంతో తన చూపుని మరల్చుకున్నది. పల్లకీలో వచ్చిన పెండ్లికూతురికి జరగవల్సిన టీ, ఫలహారం వంటి కార్యక్రమాలు అన్నీ జరిగాయి. దీనితో పెండ్లికూతురి తరపు వారిని ఆహ్వానించే పలకరింపు కార్యక్రమం పూర్తైంది. పన్నెండు గంటలకి పెండ్లి ముహుర్తం.

అమ్మాయిని సిద్ధం చేయండి. పెండ్లి ముహుర్తం ఆసన్నమైందని పురోహితుడు చెప్పాడు. కొరగశెట్టి పట్టుపంచె కట్టుకొని, కోటువేసుకొని, తలపాగ ధరించి, నుదుటికి బాసికం కట్టుకొని పెండ్లిపీటలపై కూర్చున్నాడు. "ఏమిట్రాయిది? అసలిదెక్కడి సంప్రదాయం? పెండ్లికొడుకూ పురోహితుడూ పెండ్లివారంతా సిద్ధంగా ఉంటే, సమయం మించిపోతున్నా ఇంకా పెండ్లికూతుర్ని మాత్రం అలంకరించలేదు. ఎందు కింత ఆలస్యం చేస్తున్నారు" అని జారప్పహెగ్డె కేకలేస్తున్నాడు. పెండ్లికూతుర్ని ఏమి మాట్లాడించినా ఎంత లేపినా కూర్చొని లేవటం లేదు. ఇదేమి కర్మో! అని పెండ్లి వారంతా పెండ్లికూతురి చుట్టూ గుమిగూడారు. మధ్యాహ్నం ఎండకు మాడిపోయి నటువంటి మొహంతో నేనిలాగే చీర మార్చుకుంటానని పెండ్లికూతురు ఒక్కసారిగా పైకిలేచింది. వెంటనే గాంధీటోపీ ధరించిన ఒక వ్యక్తి ఖద్దరు చొక్కా, పట్టుపంచె, శాలువా, టోపీ తీసుకవచ్చి పెండ్లికూతురికి ఇచ్చాడు. ఆ అమ్మాయి చాలా తొందర తొందరగా తన చీర, జాకెట్టు, బంగారం అన్నీ తీసివేసి అతడిచ్చిన చొక్కా, పంచె, టోపీలను ధరించింది. పెండ్లికూతురు కాదు, పెండ్లికొడుకని ఒక్కసారిగా అక్కడున్న వారందరిలో ఒక ఆశ్చర్యం నెలకొంది. కొద్దిసేపు ఎంతో హడావిడి చేసిన యువకూటమి వారు కాసేపట్లో వెంటనే సద్దుమణిగారు. అప్పుడే అక్కడి జనమంతా కొరగశెట్టి కూర్చున్న పెండ్లి పీటలవైపు చూడగా అది ఖాళీగా ఉంది. ఆ క్షణంలో జనానికి


కొరగశెట్టిని చూడటానికి ఉన్న ఆత్రుత లండన్ నుండి అప్పుడే తిరిగి వస్తున్న గాంధీని చూడటంలో కూడా లేదు. పేర్దళ్ళికి చెందిన శెట్టి మాత్రం అక్కడలేదు. సభ అంతా కాస్త శాంతమయ్యాక మోహనశెట్టి మరియు లలితకి వందేమాతర గీతంతో పెండ్లి జరిగింది. తర్వాత మోహనశెట్టి లేచి, యువకూటమి ఉద్దేశం గురించి, ముసలివాళ్ళ పెండ్లిలో జరిగే అన్యాయాన్ని గురించి, లలితకు మరియు తనకు ఉన్న హృదయ సంబంధాన్ని గురించి వివరించాడు. "మేము చేసిన ఈ పని మోసం, దగ, స్వార్థం, కుట్రలాగా కనబడినా అంతర్లీనంగా సత్యం, న్యాయం, త్యాగం ఉన్నాయి. కొరగశెట్టికి మేము చేసిన అవమానంలో వ్యక్తిద్వేషం ఏమాత్రం లేదు. ఇలాంటి ముసలివాళ్ళ దురాశ మేము చేసిన ఈ అవమానంవల్ల కాస్త వెనక్కి పోతుందన్న మంచి ఉద్దేశమే తప్ప ఇంకోటికాదు. ఇదొక పుణ్యకార్యం. దీని ప్రతిఫలమంతా మాకు అన్ని రకాలుగా సహాయ సహకారాలందించిన ఈ ఊరి ప్రజలకే దక్కుతుందనటంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ ఊళ్ళో ఇంతవరకు ఉన్న ఇటువంటి దురాచారానికి అంత్య క్రియలు జరిపిన ఇదే పెండ్లిమండపంలో మాకు పెండ్లి జరిపించిన మీకు మా కృతజ్ఞతలు" అని చెప్పి కూర్చున్నాడు. పెండ్లి చాలా సంబరంగా ముగిసింది. అందరూ చాలా సంతోషంగా గంతులేశారు. మన కొరగశెట్టి ఎక్కడున్నాడో?



**డా॥ బి.ఎస్. శివకుమార్**
ఫోను: 9441330816
shivabharany@yahoo.co.in

వీరు దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరు తాలూకాలోని పాణాజి గ్రామంలో పుట్టినారు. ప్రస్తుతం ద్రావిడ విశ్వ విద్యాలయంలో తుళు విభాగాధిపతి. కొన్ని తెలుగు, తమిళ, మలయాళ కతలను కన్నడంలోకి అనువదించి నారు. వేమన పద్యాలను తుళులోకి అనువదించినారు. ఈ పుస్తకాన్ని ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురించింది. 'ఉదయ' అనే కన్నడ టీవీలో న్యూస్‌రీడర్‌గా, సంపా దకుడిగా కొంతకాలం పనిచేసినారు. కన్నడంలో, సాహిత్య సంబంధమైన అయిదు పుస్తకాలను ప్రచురించి నారు.

**కశ్మీరి కథ**
**1955**



# మాయపొర
## మేజికల్ వెబ్

**అఖ్తర్ మొహియుద్దీన్**

అఖ్తర్ మొహియుద్దీన్ గారు 17 ఏప్రిల్ 1928లో శ్రీనగర్‌లో పుట్టినారు. జీవిత చరమాంకం వరకూ శ్రీనగర్‌లోని లాల్‌బజార్‌లోనే నివసించినారు. అఖ్తర్ మొహియుద్దీన్ గారికి 40కి పైగా రేడియో నాటికలు, ఆరు కథా సంకలనాలు, రెండు నవలలు ప్రచురితమైనాయి. ఆయన అనేక కశ్మీరీ కథా సంకలనాలకు సంపాదకులుగా వ్యవహరించినారు. ఇతర భాషల కథలను కశ్మీరీ భాషలోకి మార్చి నారు. 1990లలో కాశ్మీర్‌లో పెల్లుబికిన స్వతంత్ర పోరాటలలో అఖ్తర్ మొహియుద్దీన్ తన కొడుకును, అల్లుడిని పోగొట్టుకున్నారు. పద్మశ్రీ బిరుదాంకితుడైన అఖ్తర్ సోషలిస్టు. తర్వాత కాలంలో ఆయన వేర్పాటు రాజకీయ సంస్థ హురియత్ కాన్ఫరెన్స్‌లో చేరినారు.

2001లో అఖ్తర్ చనిపోవడానికి ముందర రెండు కథా సంకలనాలను ప్రచురణకు సిద్ధం చేసినారు. అఖ్తర్ మరణానంతరం అవి వెలువడినాయి. వాటిని 1990లలో అజ్ఞాత ప్రాంతంలో చంపబడిన వాలికి ఆయన అంకితమిచ్చినారు. ఈ సంకలనాలలో ఆతంకవాది (తీవ్రవాది), నన్ బీయుర్ (కొత్త జబ్బు) లాంటి కథలలో 1990లో దైనందిన అనుభవాలను చాలా సృజనాత్మకంగా రాసినారు. ఇటీవల వెలువడిన అఖ్తర్ నవల 'జన్మ్మఖ్ పనున్ పనున్ నార్'లో 1980 చివర్లు జరిగిన తిరుగుబాటు గురించి, శ్రీనగర్‌లో పాలకవర్గాల గురించి అధ్యయనం చేసినారు.

అనుకోకుండానే ఆమెను కలలో చూశాను. చూపు నామీద పడగానే ఆమె పెట్టిన పొలికేకకి, నేను ఉలిక్కిపడి లేచాను. ఎవరో నెత్తిమీద పెద్ద కర్రతో బాదినట్టు, నేను ఆమె వైపు ప్రేమానురాగాలతో చూపు సారిస్తుండగా ఆమేదో సొమ్మసిల్లినట్టు, వణుకుతూ ఉంది. నేను ఆమెను ప్రేమతో హత్తుకున్నాను గానీ ఆమెకేమో తన పక్కటెముకలలో ఎన్నో చీలలు గుచ్చుకున్నట్టు మాత్రమే ఉన్నట్టుంది.

జరిగిందేమీ లేదు. ఇంకా చెప్పాలంటే ఏమి జరిగిందో కూడా ఆమెకు తెలీదు. తెలివి తప్పిపోయింది మరి. డాక్టరేమో ఆమె మనోవ్యాధితో బాధపడుతోంది వెంటనే ఆస్పత్రిలో చేర్చాలి అన్నాడు. తెలివితప్పి ఉన్నపుడే ఆమెను చేర్చాము. కొంచెం తెలివిరాగానే, ఆమె కళ్ళు తెరిచి నీలిగి, నావైపు చూసింది. వనదేవత వసంతంలో మొట్టమొదటగా కళ్ళు తెరిచి తనని తాను చూసుకొన్నప్పుడు ఆమె మొకం వెలిగినట్టు ఈమె మొకం వెలుగుతోంది. మెలికలు తిరిగిన ఆమె నల్లటి కురులు పాలవన్నె ఇసుక తిన్నెల నడుమ ప్రవహించే కరివాగులాగా ఉన్నాయి. ఆమె మొకంలో ఒకరకమైన మెరుపు. కరుకైన వేసవిలో పచ్చటి పచ్చిక బయలును కనుగొన్న గొర్రెల కాపరి మొకంలోని నిమ్మళం, సొమ్మసిల్లినా కూడా ఆమె మొకంలో కనిపిస్తోంది.

"ఇంత పొద్దుటే గదికి ఎలా వచ్చావు? నువు రావడాన్ని ఎవరైనా చూసుంటే" అన్నదామె బెదురుగా చుట్టూ చూస్తూ. "ఏ చోటు ఇది? నేనెక్కడున్నాను? నీ టక్కరి తనంతో ఏమార్చి నన్నిక్కడికి తెచ్చి పడెయలేదుకదా!" ఉచ్చులో చిక్కుకున్న కస్తూరి జింకలాగా బెదురుతూ అడిగింది. కంబళి లోపలనే చేతులతో తన నడుం కింద బాగాన్నేదో తడుముకుంటున్నట్టు ఉంది. దొంగ తన ఖజానాని దోచుకుపోతే వెతుక్కుంటున్న పిసినారిలాగా. ఎందుకో తెలీదుగాని ఒక చీదరింపు చూపుతో గావుకేక పెట్టింది. కర్రదెబ్బతిన్న కుక్క వెర్రికేకలాగా ఒళ్ళు జలదిరింప చేసేటట్టుగా ఉంది. నేను దగ్గరకు తీసుకోగానే చిగురుటాకులా వణికిపోతున్న ఆమె నా యెదమీద సొమ్మసిల్లి పోయింది.

"కంగారు వద్దు, ఇది ఒక నరాల జబ్బు. చికిత్సకు కాస్త సమయం తీసుకుంటుంది కానీ ఆందోళన పడాల్సిన అవసరం లేదు" అని డాక్టరు అన్నారు. "కానీ డాక్టర్ ఆమె కోసమే బతికే, నన్ను చూడగానే ఆమెందుకు అలా భయపడుతోంది?" అని అను

కున్నాను. ఇది చాలా నొప్పిస్తున్నది. నా పొలకువ వలన ఆమె ఎంత గాయపడుతోందో ఆమె ఈ ప్రవర్తనతో నేను అంతే గాయపడుతున్నాను. ఉన్నపళాన ఆమెకు కనపడకుండా పోవాలి అనిపించింది, కాని అది నావల్ల అవుతుందా? తలచుకుంటే అన్నీ తెగతెంపులు చేసుకొని ఉండేవాడ్ని, కాని ఆ తెగదెంపులనేవి ఇద్దరు చేతనావస్థలో ఉండే వాళ్ళ నడుమ జరిగే పని కదా. ఇక్కడేమో ఒకరు తెలివితప్పి ఉంటే, ఇంకొకరు చేతలుడిగి ఉన్నాము. అందుకే ఎంత నొప్పిస్తున్నా భరించాల్సి వస్తోంది.

“ఇక్కడ ఉండాలంటే నువ్వు డాక్టరో, నర్సో యూనిఫాంలోకి మారాలి” అన్నది నర్సు.

“అంటే ఆమె నన్ను, నన్నుగా చూడలేదా?” అన్నాను బొంగురు పొయిన గొంతుతో ఉబికే కన్నీళ్ళను ఆపుకుంటూ.

“వెతపడొద్దు, ఆమెకు ఈ పరిస్థితి కొన్నాళ్ళు మాత్రమే. మెరుగవగానే నిన్ను నిన్నుగానే ఒప్పుకుంటుంది” అన్నది నర్సు.

నర్సు ఇచ్చిన తెల్లగుడ్డలు నాకోసమే కుట్టినట్టున్నాయి. వాటిని వేసుకోగానే నా బయటి వేషంతో పాటు లోపల ప్రవర్తనలో కూడా ఏదో మార్పు వచ్చినట్టు అనిపించింది. వార్డులోని మిగతా రోగులు నావైపు గౌరవంగా చూడసాగినారు. పోను పోను నాకు కూడా పని పట్ల శ్రద్ధ పెరగడంతో నా పేరు పెరగసాగింది. ఒకపక్క మందులిస్తూ, ఇంకొక పక్క రోగులకు నాడి చూస్తూ నాలుగు పనుల పైనా చూపు సారించసాగినాను. కొందరికి డాక్టరునై చికిత్స చేశాను. మరికొందరికి నర్సునై సేవలందించాను; మొత్తానికి ఆ పనిలో తనివితీరా మునిగిపోయాను.

ఇదంతా ఓ పక్క జరుగుతుండగానే ఆమె మెల్లగా కోలుకోసాగింది. ఆమింకా నన్ను గుర్తించడం లేదు. నేను కూడా నా పాత తనాన్ని ఆమె ముందు చూపించుకోలేదు. నాకు మిగతా రోగుల్లాగే ఈమె కూడా ఒక రోగి మాత్రమే అన్నట్టుగానే సేవ చేశాను. ఒకరోజు నర్సు “ఆమె నిన్ను గుర్తించడం లేదు, అలాగే నువ్వు కూడా నీ జ్ఞాపకాలని ఆమెతో చెప్పకూడదు. ఆమె కొద్దికొద్దిగా కోలుకుంటోంది, ఆమె భయపడిన సంఘటనను ఒక కలగా అనుకుంటోంది” అన్నది. “ఇదేం కల అయి ఉండొచ్చు” అని అచ్చెరుపోయాను. “అదేం కలనో నాకు తెలియదు, కాని దాని అర్థం మాత్రం తెలుసు” చిరునవ్వుతో అన్నది నర్సు. ఆమె ఒక మత్తు సూదిని ఇచ్చి వెనుదిరిగింది. యూనిఫాంలో నర్సు ఒక తెల్లపావురంలా మెల్లగా తిరుగుతూ ఉంటుంది. ఆమె సున్నితంగా ఉండి పెద్ద పెద్ద నవ్వు కళ్ళను కలిగి ఉంటుంది. ఆమె నిరాడంబరతే ఆమెలో ప్రధాన ఆకర్షణ. నేను థర్మామీటరును చేత పట్టుకుని ఆమె వెనకే వెళ్ళాను. ఎడతెగని ఆలోచనలతో ఈ నర్సుతోనే నా జ్వరం ఎంతుందో చూపించుకోవాలనుకున్నాను.

“కాంపౌండర్ గారూ!” వెనుకనుంచొక గొంతు. అదేదో తెలిసిన గొంతులాగా అనిపించి నన్ను వెనక్కి లాగింది. నా అడుగుల్ని మరల్చి ఆమె పడక దగ్గరికి పోయాను. “కాంపౌండర్ గారు, ఆయన ఇక్కడే ఉండేవాడు. ఆయనేమన్నా మీకు తెలుసా? ఎక్కడున్నాడో కొంచెం తెలుసుకోండి, నాకేమో కంగారుగా ఉంది” అని ఆమె నా గురించే మాట్లాడుతోంది. “అవును ఆయన అమాయకుడు” గబుక్కున అనేశాను.

“అంటే, మీకు ఆయన తెలుసా” కోపంగా అడిగింది. ఎప్పుడు కోప్పడినా ఆమె కనుబొమ్మలు ముడిపడుతుంటాయి. అలాంటప్పుడు నేను ఆ చోట్లో ఒక ముద్దు ఇవ్వగానే మేము సర్దుకొని గొడవలు మర్చిపోతాము. కాని ఇవ్వాళ ఆ పని చేసే తెంపరితనం నాకు లేదు. కాని పాత అలవాట్లు మారుతాయా? నా పెదాలు ఆమె కనుబొమ్మలకు తగలడం, ఆమె మొకం వెలిగిపోవడం జరిగేపోయాయి. “ఆయన అమాయకుడు అని మీకెలా తెలుసు?” కళ్ళు మూసుకుంటూ అన్నది. ప్రశాంతమైన మోముతో చిరునవ్వు నవ్వుతూ నిద్రలోకి జారుకున్నది. చెవులు రిక్కించుకున్నా ఆపై ఏమీ వినపడలేదు. నర్సు వచ్చి ఎగతాళిగా చూస్తూ “ఈ వార్డులో ఇంకా వేరే రోగులు మీకోసం ఎదురు చూస్తున్నారు డాక్టర్” అని నవ్వుతూ వెనుతిరిగింది. నేను పళ్ళికిలిస్తూ ఆమె వెనకే గదిలోకి వెళ్ళాను. ఒకరికొకరం దగ్గర పడ్డాం. నా తెల్ల యూనిఫాం తీయాలనుకుంటే ఆమె వారిస్తూ “ఇదే రోగులకు నెమ్మది కలిగించేవాడిగా నిన్ను చేసింది. దీనిని తీసేస్తే నీ పని అయిపోయినట్లే” అన్నది. ‘ఆమె’ మరియు నర్సు ఈ క్షణంలో నా మదిలో ఒకే రకంగా మెదిలారు. ఇంతవరకూ నేనేదో ఒక మాయలో పడినట్టు, ఒక ఇంద్రజాలంలో తగులుకున్నట్టు నా చూపు మసకబారింది. కాని ఇదంతా అవివేకినైన, అమాయకుడనైన నాకు మాత్రమే. రెండు మాయలూ ఒకటేనన్న విషయం ఇప్పటివరకూ గమనించలేదు.

“డాక్టరు గారూ, ఆమె మీ కంటపడకూడదు, మరే మీరు... మీరు... అబ్బ ఈ యూనిఫాం మీకు ఎంత బాగా అతికిందో?”

డాక్టరుగారు చెప్పినట్టే ఆమె బాగా కోలుకుంటోంది. పొద్దున లేదా సాయంత్రం బయటకి అలా తీసుకెళ్ళడం కూడా మంచిదన్నారు. సాయంత్రం ఒక ట్యాక్సీలో అలా బయటకు వెళ్ళాం. నేను ఆమె చేతిని నా చేత్తో పట్టుకొని, ఆమె తలను నా భుజంపై వాల్చుకున్నాను. “ఎప్పటికీ నాతో ఒద్దిక లేకుండా ఉండొద్దు. ఆ ఆలోచన కూడా చేయద్దు. ఏం చేయగలవో అంత వరకు మాత్రమే చేయగలనని ఒప్పుకో” అన్నది. మామధ్య సాన్నిహిత్యం పెరుగుతూ ఉంది కానీ, ఆ యూనిఫాం తీయడానికి ఒప్పుకునేది మాత్రం కాదు. “అది తీసేస్తే నువ్వు నేనసహ్యించుకొనే ఆ మనిషిలాగా కనిపిస్తావు” అనేది. నా అహానికి దెబ్బమీద దెబ్బ తగులుతూనే ఉండేది. ఎన్నో

తేళ్ళూ జెర్రెలు పాకుతూ ఉన్నట్లుండేది కానీ ఇప్పుడు ఆ భావన నా శరీరంలో ఒక భాగమై పోయింది. ఇదే నన్ను రెంటికి చెడ్డ రేవడి చేసేసింది.

తర్వాత రోజు ఆమె పూర్తిగా కోలుకుంది. ఇక ఇంటికి పోవచ్చన్నారు డాక్టరు. ఆమె హాస్పిటల్ వదిలి వెళ్తూ నాతో "డాక్టరు గారూ, నా కొత్త జీవితాన్ని ఆరంభిస్తు న్నాను, మీరెప్పుడైనా ఇంటికి వస్తూ పోతుంటారుగా. ఆఁ అన్నట్టు ఈ యూనిఫాం మీకు బాగా నప్పింది" అన్నది.

నర్సు నన్నుద్దేశించి "మీరు యూనిఫాంను ఇక్కడే వదిలేయాలి, ఈ ఛాయల్లోకి మళ్ళీ రావద్దు. నా వృత్తే వేరు, మా జాతే వేరు; యూనిఫాంలో లేని వారంటే నాకు అసహ్యం" అన్నది.

గాయపడిన నా అహాన్ని నేను అణచుకున్నాను. నా బుర్రలో సాలెగూళ్ళు గజిబిజిగా అల్లుకున్నాయి. ఇరువైపుల ఆలోచనల జడిలో నేను ఇరుక్కున్నాను. రంగులరాట్నంపై గిరగిర తిరుగుతున్న చిన్నపిల్లలాగా – సాలెగూళ్ళు నన్ను అన్ని వైపులకూ లాగుతు న్నాయి. నాలో నుంచి ఒక పొలికేక బయటికి వచ్చిందని అందరూ అంటారు. కుక్కని దుడ్డు కర్రతో కొట్టి నిద్రలేపినపుడు వచ్చే పొలికేక లాంటిదట అది. నిజం పైవానికెరుక.

నా చుట్టూ అంతా నిశ్శబ్దం, శాంతి. అందరూ యూనిఫాం వేసుకుని నాకు సేవలందిస్తున్నారు. వాళ్ళంతా కొత్త మనుషులు, వేరే జాతి మనుషులు.



**అడపాల సుబ్బారెడ్డి**
ఫోను: 9346814601
acereddy@gmail.com

నెల్లూరు జిల్లాలోని మహమ్మదాపురం అనే గ్రామంలో పుట్టినారు. విజయ నగరం సైనిక పాఠశాల లోనూ మద్రాసులోనూ చదువుకొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో కొంతకాలం పనిచేసినారు. తెలుగు భాషో ద్యమంలో కార్యకర్త. శ్రీలంకలోని తెలుగు సంచారులైన అహికుంటికలను కలిసి వచ్చి వారిమీద వ్యాసాలను రాసినారు. ప్రస్తుతం సినీ నిర్మాణ రంగంలో దర్శకత్వ శాఖలో పనిచేస్తూ హైదరాబాదులో కుదురుకొన్నారు. ఈ కతను కశ్మీరీ నుడి నుంచి ఇంగ్లీషులోకి 'నీరజా మట్టూ' అనేవారు అనువదించినారు. ఇంగ్లీషు నుంచి సుబ్బారెడ్డి గారు తెలుగు చేసినారు.

# తొలి కతలు

| | | |
|---|---|---|
| ఉర్దూ కత | గడచిపోయిన కాలం | సయ్యద్ అహ్మద్ ఖాన్ |
| బెంగాలీ కత | రేవు కథ | రవీంద్రనాథ్ ఠాగూర్ |
| మరాఠీ కత | పది రూపాయల బాకీ తీర్పు | హరినారాయణ్ ఆప్టే |
| మలయాళం కత | వారసత్వం | కుఞ్ఞిరామన్ నయనార్ |
| ఒడియా కత | రేవతి | ఫకీర్‌మోహన్ సేనాపతి |
| కన్నడ కత | కమలాపురం హోటల్లో | పంజె మంగేశ రాయ |
| గుజరాతీ కత | శాంతిదాసు | అంబాలాల్ దేశాయ్ |
| తెలుగు కత | ధనత్రయోదశి | భండారు అచ్చమాంబ |
| హిందీ కత | కుంభమేలాలో చిన్నకోడలు | బంగ మహిళ |
| తమిళం కత | గుంటకట్ట రాగిమాను... | వ.వే.సు. అయ్యర్ |
| తెలుగు కత | దిద్దుబాటు | గురజాడ అప్పారావు |
| కొంకణి కత | మాఅమ్మ ఎక్కడికి పోయింది | శణై గోయబాబ |
| తుళు కత | పెండ్లికూతురు కాదు.... | కె.విఠల్ హెగ్డె |
| కశ్మీరి కత | మాయపొర | అఖ్తర్ మొహియుద్దీన్ |